# విలువల విద్య - జీవన నైపుణ్యాలు

## వాచకం, ఉపాధ్యాయుల కరదీపిక

## 7వ తరగతి

రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ

ఆంధ్రప్రదేశ్, హైదరాబాదు.

# ముందుమాట

మానవులు సంఘజీవులు. తమ మనుగడకోసం అవసరమైన సమాజాన్ని నిర్మించుకొన్నారు. ఈ వ్యవస్థ నిర్వహణకు, కలిసికట్టుగా మనుగడసాధించడానికి, అభివృద్ధి పొందడానికి సరైన అవగాహన, విశ్వసనీయతలు అవసరం. దీనికి సమిష్టితత్వం, పరస్పరాధారిత భావాలు కూడా అవసరం. కాబట్టి మానవ సమాజాలకు జనమెరిగిన ఆమోదయోగ్యమైన ప్రవర్తనా నియమావళి అవసరం. మనం కోరుకొన్న విధంగా మనం ప్రవర్తించలేం. ప్రతి సమాజానికీ దానికి అనుగుణమైన నైతిక నియమావళి ఉంటుంది. ఈ నైతిక నియమాల బహుళత్వానికి కూడా అంతర్లీనంగా కొన్ని ఆమోదిత ఉమ్మడి నియమాలు ఉంటాయి.

నీతిసూత్రాలు మన నడవడికి మార్గదర్శకంగా ఉండే నియమాలు. కాబట్టి పిల్లలుకూడా వాటిని ఆకళింపుచేసుకోవాలి. నైతికాభివృద్ధి అంటే కొన్ని నిబంధనలను అనుసరించడమో లేక ఎవరో ఏర్పరిచిన ఆదర్శ నమూనాల ప్రకారంనడుచుకోవడం మాత్రమేకాదు. నైతికాభివృద్ధి అంటే ప్రతి సందర్భంలోనూ సరైన కారణాన్ని తెల్సుకోగలగడం, విచక్షణతో నిర్ణయాన్ని తీసుకొని దాని ప్రకారం నడుచుకోగల సామర్థ్యం కలిగి ఉండడం. నైతిక చైతన్య అభివృద్ధిలో తాను తీసుకోబోయే నిర్ణయంతో తాను స్థిరంగా ప్రశాంతంగా ఉండగలిగే సామర్థ్యంకూడా ఉంటుంది. "అది నాకలాగే చెప్పారు. కాబట్టి నేను చేస్తున్నాను" అనే భావనకు ఇది విరుద్ధం. అందుచేత ఒక వ్యక్తి తనకు తాను శాంతి సౌఖ్యాలతో, ప్రశాంతంగా, స్థిరంగా ఉండడమే నైతికాభివృద్ధి సారాంశం. ఇందుకవసరమైన నైపుణ్యాలు కలిగి ఉండడమే జీవననైపుణ్యాలు. వీటిలో సమస్యను పరిష్కరించుకోవడం కలసిపనిచేయడం, భావప్రసారంచేయడం, నాయకత్వం వహించడం, ఇతరులతో పరస్పర సంబంధాలను కల్గి ఉండడం వంటివి ముఖ్యమైనవి.

దురదృష్టవశాత్తు నేడు సమాజంలో నైతిక విలువలు పతనమైతున్నాయని ప్రతి ఒక్కరూ భావిస్తున్నారు. మనలో స్వార్థం పెరగడం, దురాశ పెరగడం, అవినీతికి అలవాటుపడడం, నైతిక నియమావళిని ఉల్లంఘించడం, లోభత్వం పెరగడం, నేను నాది వంటి అవలక్షణాలవల్ల వ్యక్తులు తమ జీవితాన్ని సంక్లిష్టం చేసుకోవడంతోపాటు సమాజంలోని వాతావరణాన్ని కలుషితం చేస్తున్నారు. ప్రతి ఒక్కరిలో అశాంతి పెరిగింది. నైతిక విలువల పతనంతోపాటు, పెరిగిపోతున్న ఒత్తిడిని, కనుమరుగైతున్న మానవతా విలువలు, మానవసంబంధాలను గమనించవచ్చు. ఇవన్నీ ఒకరోజులోనో, ఒక సంవత్సరంలోనో వచ్చినవి కావు. మన జీవితాలలో సంయమనం, సమతుల్యత, విచక్షణ లోపించడమే దీనికి కారణం. వాటి స్థానంలో దురాశ, వినిమయవాదం, దోపిడీలు చోటుచేసుకొంటున్నాయి. వాటి నికర ఫలితమే సమాజంలోని అభద్రతాభావం, అపనమ్మకం, విచ్ఛిన్నమైన కుటుంబవ్యవస్థ, విలువలపతనం, సమాజంలో అశాంతి వ్యాపించడం మొదలగునవి.

వీటిని అరికట్టడానికి విద్యను ఒక సాధనంగా భావించి మనం విలువల విద్య, జీవననైపుణ్యాలు అనే అంశాన్ని ఒక ప్రధాన సబ్జక్టుగా పాఠశాల విద్యలో ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు ప్రవేశపెట్టడం ద్వారా పిల్లలు పాఠశాల విద్య పూర్తయ్యేసరికి హేతుబద్ధమైన పౌరులుగా ఎదగడానికి అవసరమైన శిక్షణ పొందుతారు. ఉన్నతమైన విలువలు, వైఖరులు, త్యాగబుద్ధి కలిగి ఉండి సమాజంపట్ల, పర్యావరణంపట్ల, తోటివారిపట్ల సమన్యాయంతో ప్రతిస్పందించే బాధ్యతాయుత పౌరులుగా ఎదగడానికి అవసరమైన పాఠ్యప్రణాళికను (Syllabys) రాష్ట్రవిద్య, పరిశోధన, శిక్షణసంస్థ రూపొందించింది. పిల్లలు స్వేచ్ఛగా మాట్లాడడం, ప్రశ్నించడం, ప్రతిస్పందించడం, విచక్షణతో వ్యవహరించడం చేయగలగాలని రాష్ట్ర

విద్యాప్రణాళిక పరిధిపత్రం 2011లోని రాష్ట్ర దృక్పథం (State Vision)లో పేర్కొన్నారు. వీటిని దృష్టితో పెట్టుకొని రాష్ట్రంలో 1 నుండి 10వ తరగతి వరకు విలువల విద్య, జీవన నైపుణ్యాల పాఠ్యప్రణాళిక రూపొందించారు. అనంతరం తరగతి వారీగా బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణకోసం ఉపాధ్యాయుల కరదీపికలను రూపొందించారు. 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు పెంపొందించాల్సిన 18 ప్రధాన విలువలను గుర్తించి ప్రతి తరగతిలో వీటికి సంబంధించిన పాఠాలను చేర్చారు. అవి, 1) స్వేచ్ఛ, 2) సంతృప్తిగా జీవించడం, 3) శీలనిర్మాణం, 4) జీవన నైపుణ్యాలు, 5) బాధ్యతవహించడం, 6) పొదుపుచేయడం, 7) ఆరోగ్యవిలువలు, 8) సంస్కృతి సంప్రదాయలపట్ల గౌరవం, 9) ఆరోగ్య విలువలు, 10) శాస్త్రీయదృక్పథం, 11) న్యాయం, 12) శాంతి, కలిసిమెలిసి జీవించడం, 12) శ్రమవిలువ, 14) సేవాభావం, 15) సమానత్వం, సోదరభావం, స్త్రీలపట్ల గౌరవం, 16) జాతీయ భావన – దేశభక్తి, 17) లౌకికతత్త్వం – మతసామరస్యం, 18) ప్రజాస్వామ్య విలువలపట్ల గౌరవం. వీటిలో ప్రాథమికస్థాయికి 12 ప్రధాన విలువలు, ఉన్నతస్థాయికి మొత్తం 18 విలువల ఆధారంగా ఒక్కొక్క విలువకు తరగతివారీగా ఉపవిలువలను నిర్ధారించి పాఠాలను పొందుపర్చారు.

విలువలు ప్రధానంగా బోధిస్తే వచ్చేవికావు. ఆచరిస్తే వచ్చేవి. కాబట్టి తరగతి వారీగా రూపొందించిన ఉపాధ్యాయ కరదీపికల్లో సన్నివేశాలు, సంఘటనల ఆధారంగా చర్చించడం, ఆచరించి అనుభవాలు చెప్పడం వంటి కృత్యాలతో కూడిన అభ్యాసాలు ఉన్నాయి. చర్చల ద్వారా వైఖరి నిర్మాణం జరగాలి. ఆచరణ ద్వారా ప్రవర్తనలో మార్పురావాలని ఆశించి పాఠాలను పొందుపరచారు. వీటిని నిర్వహించడం మన బాధ్యత. నిర్వహణతీరుతెన్నులను గురించి "ఉపాధ్యాయులకు సూచనలు" కూడా చేర్చారు. అట్లే విద్యార్థులకు సూచనలు కూడా ఉన్నాయి.

ఎంత మంచి కరదీపికైనా ఉపాధ్యాయుడికి ధీటుగాదు. ఉపాధ్యాయుడు తాను ఆదర్శంగా ఉంటూ విలువలను పెంపొందించడానికి కృషి చేయాలి. ప్రణాళికాబద్ధంగా తరగతి వారీగా రూపొందించిన కరదీపికల ఆధారంగా బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించాలి. మన రాజ్యాంగం పీఠికలో పేర్కొన్నవిధంగా ఉన్నతమైన విలువలు, వైఖరులుకల్గిన హేతుబద్ధమైన పౌరులుగా ఎదగడానికి ఉపాధ్యాయులుగా మనమంతు కృషిచేయాలి. ఈ కరదీపికలోని అంశాలు మీకు కొంతమేరకు దిశానిర్దేశం చేస్తాయి. వీటికే పరిమితం కాకుండా అదనపు అంశాలు కూడా సేకరించవచ్చు. వినియోగించవచ్చు. విలువలతో కూడిన సమాజ నిర్మాణానికి మన ఈ చిన్న ప్రయత్నం గోరంతదైనా ఇది కొండంత వెలుగునిస్తుందనే విశ్వాసంతో ప్రయత్నిద్దాం. ఫలితాలు సాధిద్దాం!

తేది : 30–05–2014 **సంచాలకులు**

స్థలం : హైదరాబాద్. రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణసంస్థ, ఆం.ప్ర., హైదరాబాద్.

**యత్కర్మకుర్వతోఽ స్యస్యాత్, పరితోషాఽం తరాత్మనః**
**తత్ ప్రయత్నేన కుర్వీత, విపరీతం తు వర్జయేత్ – మనుస్మృతి**

**ఏపని చేస్తే అంతరాత్మకు సంతృప్తి కలుగుతుందో, ఆపనులే చేయాలి. దానికి విపరీతమైన పనులు చేయకూడదు.**

## రూపొందించినవారు

**శ్రీ సువర్ణ వినాయక్,** కోఆర్డినేటర్, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు.

**శ్రీ శ్రీనివాసుల రఘురాం,** ఉపాధ్యాయుడు, ప్రా.పా., గ్రంథసిరి, గుంటూరు జిల్లా.

**శ్రీ ఎల్.ఎం.ప్రసాద్,** ఉపాధ్యాయుడు, ప్ర.ఉ.పా., సి.పి.ఎల్, అంబర్‌పేట్, హైదరాబాదు.

**శ్రీ పసుల ప్రతాప్,** ఉపాధ్యాయుడు, ప్రా.పా.గిమ్మ, జైనత (మం), ఆదిలాబాద్ జిల్లా.

**శ్రీ బలగం రామ్మోహన్,** ఉపాధ్యాయుడు, ప్రా.పా., రవీంద్రపూర్, ముథోల్ (మం), ఆదిలాబాద్ జిల్లా.

**శ్రీ నందిగామ కిశోర్‌కుమార్,** తెలుగు పండితులు, జి.ప.ఉ.పా., ఇప్పటూరు, మహబూబ్‌నగర్ జిల్లా.

**శ్రీమతి కె.ఆర్.టి.ఎల్. జ్యోతిర్మయి,** ఉపన్యాసకురాలు, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు.

**శ్రీమతి యు. బుగ్గమ్మ,** ఉపాధ్యాయిని, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు.

**శ్రీమతి వి. స్వర్ణలత,** ఉపాధ్యాయిని, జి.ఉ.పా., పాతపట్టిసం, పోలవరం, పశ్చిమగోదావరి జిల్లా.

**శ్రీమతి అగుదూరి సరళమ్మ,** ఉపాధ్యాయిని, ప్రా.పా., చెర్లోపల్లి, చిత్తూరు జిల్లా.

**శ్రీమతి పల్లి మాధవి,** తెలుగు పండితులు, భారతీయ విద్యాభవన్, ఆత్మకూరి రామారావు పాఠశాల, జూబ్లీహిల్స్, హైదరాబాదు.

**శ్రీమతి జి. సరళాదేవి,** ఉపాధ్యాయిని, ప్రా.పా, గంగాపూర్, మహబూబ్‌నగర్

## సహకరించినవారు

**శ్రీ దోరవేటి చెన్నయ్య,** సూల్ అసిస్టెంట్, జగద్గిరినగర్, రంగారెడ్డి జిల్లా.
**శ్రీ వొజ్జల శరత్‌బాబు,** తెలుగు పండితులు, సీతాఫల్‌మండి, హైదరాబాదు.
**శ్రీ రామక విఠల్‌శర్మ,** ఉపాధ్యాయుడు, కరీంనగర్ జిల్లా.
**డా॥ రమాదేవి,** ఉపన్యాసకురాలు, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు.
**డా॥ దోనేపూడి నరేశ్ బాబు,** తెలుగు పండితులు, జి.ఉ.పా., గోస్పాడు, కర్నూల్ జిల్లా.
**డా॥ గుడిసేన విష్ణుప్రసాద్,** స్కూల్ అసిస్టెంట్, కృష్ణా జిల్లా.
**శ్రీ కలమట సోమేశ్వరరావు,** ఉపాధ్యాయుడు, శ్రీకాకుళం జిల్లా.
**శ్రీ దివ్వెల చిన్నారావు,** తెలుగుపండితులు, విజయనగరం జిల్లా.
**శ్రీ అయ్యగారి శ్రీనివాసరావు,** స్కూల్ అసిస్టెంట్, విజయనగరం జిల్లా.

## విషయనిపుణులు, ఎడిటింగ్

**డా॥ఎన్.ఉపేందర్‌రెడ్డి,**
ప్రొఫెసర్, విద్యాప్రణాళిక విభాగాధిపతి,
ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు.

**శ్రీ సువర్ణ వినాయక్,**
కోఆర్డినేటర్, ఎస్.సి.ఇ.ఆర్.టి.,
హైదరాబాదు.

**శ్రీమతి కె.ఆర్.టి.ఎల్. జ్యోతిర్మయి,**
ఉపన్యాసకురాలు, ఎస్.సి.ఇ.ఆర్.టి.,
హైదరాబాదు.

**శ్రీ టి.వి.ఎస్.రమేశ్,**
కోఆర్డినేటర్, ఎస్.సి.ఇ.ఆర్.టి.,
హైదరాబాదు.

## సలహాదారులు

**శ్రీ జి.గోపాల్‌రెడ్డి,** సంచాలకులు, రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ, ఆంధ్రప్రదేశ్, హైదరాబాదు.

# కృతజ్ఞతలు

**"విలువల విద్య – జీవననైపుణ్యాలు"** కరదీపిక / వాచకాలను రూపొందించడంలో తమ అమూల్యమైన సలహాలు, సూచనలు అందజేసి అవసరమైన సామగ్రిని ఇచ్చి ప్రోత్సహించిన పెద్దలకు, ఆయా సంస్థలకు రాష్ట్ర విద్యా, పరిశోధన, శిక్షణ సంస్థ, పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు.

**సలహాలు, సూచనలిచ్చినవారు :**

**శ్రీ కె.ఆర్.వేణుగోపాల్,** విశ్రాంత ఐ.ఎ.ఎస్., అధికారి, హైదరాబాదు.

**శ్రీ వాసగిరి లక్ష్మీనారాయణ,** ఐ.పి.ఎస్., కమీషనర్ ఆఫ్‌పోలిస్, థానే, మహారాష్ట్ర.

**డా॥ వి.బ్రహ్మారెడ్డి,** ప్రజావైద్యశాల, కర్నూలు జిల్లా.

**శ్రీ దూస రామకృష్ణ,** ఉపాధ్యక్షులు, విద్యాభారతి, అఖిలభారతీయ శిక్షాసంస్థాన్, న్యూఢిల్లీ మరియు సంచాలకులు, విజ్ఞానవిహార్, గడిలోవ, విశాఖపట్టణం.

**శ్రీ రావుల సూర్యనారాయణ,** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల శైక్షణిక ప్రముఖ, సరస్వతి విద్యాపీఠం, బండ్లగూడ, హైదరాబాదు.

**శ్రీ ఫాదర్ పల్లిదాసు,** సంచాలకులు, పీపుల్స్ ఆక్సన్ ఫర్ రూరల్ అనేకనింగ్ (PARA), రావులపాలెం, తూర్పు గోదావరి జిల్లా.

**శ్రీ సుదర్శనాచార్య,** జాతీయ సంధానకర్త, లీడ్ ఇండియా సంస్థ, హైదరాబాదు.

**శ్రీమతి పోరూరి కృష్ణకుమారి,** ప్రజ్ఞ, కో–ఆర్డినేటర్, వికాస తరంగిణి, జియ్యర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్, హైదరాబాదు.

**శ్రీ శితికంఠానంద,** రామకృష్ణమఠం, హైదరాబాద్.

**శ్రీ ప్రేమ్‌కుమార్‌సింగ్,** రామకృష్ణమఠం, హైదరాబాద్.

**డా॥ పి.జయధీర్ రెడ్డి,** విశ్రాంతప్రధానాచార్యులు, జిల్లా విద్యా శిక్షణ సంస్థ, కరీంనగర్.

**శ్రీ రవీందర్,** కో–ఆర్డినేటర్, వందేమాతరం సంస్థ, వరంగల్ జిల్లా.

**శ్రీ కె.మాధవరెడ్డి,** వందేమాతరం సంస్థ, మహబూబ్‌నగర్ జిల్లా.

**సహకరించిన సంస్థలు :**

- జియ్యర్ ఎడ్యుకేషన్ ట్రస్టు, హైదరాబాదు.
- రామకృష్ణమఠం, హైదరాబాదు.
- సత్యసాయి విద్యాసంస్థలు, హైదరాబాదు.
- బ్రహ్మాకుమారీ సంస్థ, హైదరాబాదు.
- వందేమాతరం సంస్థ, వరంగల్, మహబూబ్‌నగర్.
- ఈనాడు, నమస్తే తెలంగాణ, ఆంధ్రజ్యోతి, సాక్షి, దినపత్రికలు.
- ఎమెస్కో పబ్లిషింగ్ సంస్థ, హైదరాబాదు.
- జాతీయ విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (ఎన్.సి.ఇ.ఆర్.టి.), న్యూఢిల్లీ.

పైన తెల్పిన వ్యక్తులు, సంస్థలతోపాటు పరోక్షంగా కూడా సహకరించిన వ్యక్తులకు, సంస్థలకు, వాచకాలు / కరదీపికల రూపకల్పనలో పాల్గొన్న ఉపాధ్యాయులు, ఉపన్యాసకులు, విషయనిపుణులు, ఎడిటింగ్ చేసిన వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు. **విలువల విద్య – జీవన నైపుణ్యాల** గురించి వాచకం కరదీపికను రూపొందించడంలో ఇది ఒక తొలి అడుగుమాత్రమే! దీన్ని మరింత వృద్ధిపరచుకోవచ్చు. ఇందుకోసం భవిష్యత్తులో కూడా అందరూ సహాయ సహకారాలను ఇలాగే అందిస్తారని ఆశిస్తున్నాం.

తేది : 30-05-2014 **సంచాలకులు**

స్థలం : హైదరాబాద్. రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణసంస్థ, ఆం.ప్ర., హైదరాబాద్.

# ఉపాధ్యాయులకు సూచనలు

- "విలువల విద్య – జీవన నైపుణ్యాలు" కోసం 1 నుండి 10 తరగతులకు తరగతివారీగా కరదీపికలు రూపొందించారు. వీటిని పిల్లలను ఉద్దేశించి తయారుచేశారు. అనగా వీటిని ఉపాధ్యాయులు బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణకు, పిల్లలు స్వయం అభ్యసనానికి వినియోగించవచ్చు.
- ఒక విద్యా సంవత్సరంలో పాఠశాల విద్యాశాఖ సబ్జక్టువారీగా కేటాయించిన పీరియళ్ళ భారత్వం ప్రకారం తరగతి వారీగా పాఠాలు పొందుపర్చారు.
- 6 నుండి 10 తరగతులకు వారానికి 48 పీరియళ్ళు ఉంటాయి. వీటిలో ఒక్కొక్క సబ్జక్టుకు కింది విధంగా భారత్వం ఉంటుంది.

| | | | | | |
|---|---|---|---|---|---|
| ప్రథమ భాష | – | 6 పీరియళ్ళు | సాంఘికశాస్త్రం | – | 6 పీరియళ్ళు |
| ద్వితీయ భాష | – | 3 పీరియళ్ళు | విలువలవిద్య, జీవననైపుణ్యాలు | – | 2 పీరియళ్ళు |
| తృతీయ భాష | – | 6 పీరియళ్ళు | శారీరక, ఆరోగ్యవిద్య | – | 3 పీరియళ్ళు |
| గణితం | – | 8 పీరియళ్ళు | కళలు, సాంస్కృతికవిద్య | – | 3 పీరియళ్ళు |
| భౌతికరసాయనశాస్త్రం | – | 4 పీరియళ్ళు | పని, కంప్యూటర్ విద్య | – | 3 పీరియళ్ళు |
| జీవశాస్త్రం | – | 4 పీరియళ్ళు | **మొత్తం** | **–** | **48 పీరియళ్ళు** |

- విలువల విద్య, జీవన నైపుణ్యాల గురించి బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణకు ప్రాథమికస్థాయిలో వారానికి 1 పీరియడ్, ఉన్నతస్థాయిలో వారానికి 2 పీరియళ్ళు ఉన్నందున, ఇందుకనుగుణంగానే పాఠాలను పొందుపర్చారు.
- ప్రాథమిక స్థాయిలో 12 ప్రధాన విలువల ఆధారంగా ఒక్కొక్కదానికి ఒకటి చొప్పున 12 పాఠాలు ఉన్నాయి. అట్లే ఉన్నత స్థాయిలో 18 ప్రధాన విలువల ఆధారంగా ఒక్కొక్క దానికి ఒక పాఠం చొప్పున 18 పాఠాలు ఉన్నాయి.
- వీటితోపాటు విలువలను పెంపొందించడానికి తోడ్పడేలా పద్యాలు, కథలు, గేయాలు, పాటలు అదనంగా చేర్చారు. 3వ తరగతి నుండి స్ఫూర్తిదాతలను కూడా చేర్చారు.
- విలువల విద్య – జీవన నైపుణ్యాలను పాఠాలలో సగటున ఒక పాఠానికి 3 పీరియళ్ళు అవసరమైతాయి.
- ఒక పాఠంలోని విషయం అమరిక కింది విధంగా ఉంటుంది.
  •) పాఠం పేరు, •) ప్రధానవిలువ, •) ఉపవిలువ, •) ఆశించేఫలితాలు / లక్ష్యాలు, •) ఉపోద్ఘాతం, •) విషయం – సన్నివేశాలు / సంఘటనలు / కథనాలు, •) అభ్యాసాలు – 'ఆలోచించడం – ప్రతిస్పందించడం', 'తరగతి కృత్యం – జట్టుపని', 'ఆచరించడం – అనుభవాలు చెప్పడం', •) సూక్తి.
- విలువల విద్య, జీవన నైపుణ్యాలలోని అంశాలు ప్రధానంగా చర్చింపజేయడానికి ఉద్దేశించినవి. ఆచరించి అనుభవాలు చెప్పించడానికి ప్రాధాన్యతనిచ్చారు. కాబట్టి వీలైనంతమేరకు వీటిని రాయించకూడదు.
- **ఆలోచించడం – ప్రతిస్పందించడం**లోని ప్రశ్నల ద్వారా తరగతిలో చర్చ నిర్వహించాలి. ఆ తర్వాత **'తరగతి కృత్యం – జట్టుపని'** నిర్వహించాలి. అట్లే **'ఆచరించండి – అనుభవాలు చెప్పండి'**లోని అంశాలను ఆచరింపజేసేలా చేసి పిల్లలతో వారి అనుభవాలు, అనుభూతులను చెప్పించాలి.
- మిగతా సబ్జక్టులవలెనే **విలువల విద్య – జీవన నైపుణ్యాల**ను కూడా మూల్యాంకనం చేయాలి. వీటిని సంగ్రహాత్మక మూల్యాంకనం సందర్భంగా చేయాలి. అనగా ఒక విద్యా సంవత్సరంలో మూడుసార్లు మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం పరీక్షలు నిర్వహించకూడదు. పిల్లల్ని పరిశీలించడం, వారి అనుభవాలు, ఆచరణ, ప్రవర్తన, విలువలు మొదలగు వాటి ఆధారంగా మూల్యాంకనం చేయాలి.
- దీని మూల్యాంకనాన్ని 50 మార్కులకు నిర్వహించాలి. **విలువల విద్య – జీవన నైపుణ్యాలు** ఆధారంగా పిల్లల్లో విద్యాప్రమాణాలు సాధించాలి. అవి 1) మంచి, చెడు విచక్షణ జ్ఞానాన్ని ప్రదర్శించడం, సత్ప్రవర్తనకల్గి ఉండడం, 2) రాజ్యాంగ విలువలు పాటించడం, 3) వ్యక్తిగత విలువలు అనగా సహనం, దయ, సానుభూతి, తదానుభూతి

మొదలగునవి కల్గి ఉండడం, 4) జీవన నైపుణ్యాలు కల్గి ఉండడం, 5) ఉపాధ్యాయులు, పెద్దలు, సమాజం, ప్రభుత్వ ఆస్తుపట్ల సరైన వైఖరులు కల్గి ఉండడం.

- పైన తెల్పిన విద్యాప్రమాణాలను ఆయా పాఠాల ఆధారంగా పరిశీలించాలి. వీటిని సాధించడానికి అనుగుణంగానే ప్రధాన విలువకు సంబంధించిన పాఠాలు తరగతుల వారీగా ఉన్నాయి. ఒక్కొక్క సామర్థ్యానికి 10 మార్కుల చొప్పున 50 మార్కులకు నిర్వహించాలి. అనగా పరిశీలించి మార్కులు కేటాయించాలి.
- పిల్లల ప్రగతిని పరిశీలించి గ్రేడింగ్ నమోదుచేయాలి.

  A1 – 91%

  A2 – 71% – 90%

  B1 – 51% – 70%

  B2 – 41% – 50%

  C – 0 – 40%
- పిల్లల ప్రగతిని గురించి గ్రేడింగ్ నమోదు చేసినప్పుడు వాటికి సంబంధించిన గుణాత్మక రిమార్కులు కూడా నమోదుచేయాలి.
- బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణ విధానం – ప్రాథమిక స్థాయి

**మొదటి పీరియడ్** :
- ఉపోద్ఘాతం గురించి తెలియజేయాలి.
- పాఠానికి సంబంధించిన విషయంలోని సన్నివేశాలు / సంఘటనలు / కథనాలను ఒకరితో చదివించాలి. లేదా చెప్పాలి.
- 'ఆలోచించండి – ప్రతిస్పందించండి' లోని ప్రశ్నల ఆధారంగా తరగతిలో చర్చ నిర్వహించాలి.

**రెండవ పీరియడ్** :
- **'తెలుసుకోండి'**లోని విషయాన్ని గురించి పిల్లలకు చెప్పాలి లేదా ఒకరితో చదివించాలి. చర్చద్వారా అవగాహన కల్పించాలి.
- **'తరగతి కృత్యం – జట్టుపని'**ని తరగతిలో పిల్లను జట్లుగా విభజించి నిర్వహించాలి.
- ఒక్కొక్క జట్టువారు చేసిన పనులను ప్రదర్శించాలి.
- **'ఆచరించండి – అనుభవాలు చెప్పండి'** లోని అంశాలను ఇంటివద్ద ఆచరించమని చెప్పాలి.

**మూడవ పీరియడ్** :
- పుస్తకం చివర ఉన్న 'అనుబంధం'లో చేర్చిన కథ / పాట / పద్యం / శ్లోకం / స్ఫూర్తిదాతల గురించి తరగతిలో పిల్లలతో చదివించాలి. చర్చద్వారా అవగాహన కల్పించాలి.
- ఆ తరవాత **'ఆచరించండి – అనుభవాలు చెప్పండి'** గురించి ఒక్కొక్కరితో మాట్లాడించాలి.
- పాఠం చివర ఉన్న సూక్తి గురించి తెలియజేయాలి.

- పాఠశాలలో **'విలువల విద్య – జీవన నైపుణ్యాలు'** పుస్తకాలను పిల్లలకు కూడా ఇవ్వవచ్చు. గ్రంథాలయ పీరియడ్ సమయంలో లేదా భోజన విరామ సమయంలో కూడా పిల్లలకిచ్చి చదువుకోమని చెప్పాలి.
- 'విలువల విద్య – జీవన నైపుణ్యాలు' లోని సన్నివేశాలు, సంఘటనలు, సూక్తులు, పద్యాలు, శ్లోకాలు, కథలు, స్ఫూర్తిదాతల వంటి ఇతర అంశాలు కూడా సేకరించి తెలియజేయవచ్చు. వాటి ఆధారంగా కూడా చర్చ నిర్వహించడం, జట్టుపనుల చేయించడం, 'ఆచరించండి – అనుభవాలు చెప్పండి' వంటివి నిర్వహించవచ్చు.
- పాఠశాల గ్రంథాలయంలోని పుస్తకాలు, మ్యాగజైన్లు, వార్తాపత్రికలు వంటి వాటిని వినియోగించాలి.
- విద్యార్థులకు సూచనలు కూడా ఉన్నాయి. వీటిని మొదటి పీరియడ్‌లోనే చదివి వినిపించాలి. వీటి గురించి అర్థం చేయించాలి. ఆ ప్రకారం పిల్లలు నడుచుకొనేలా చూడాలి.

# విద్యార్థులకు సూచనలు

- పిల్లలూ! **'విలువల విద్య – జీవన నైపుణ్యాలు'** పుస్తకం మీకోసమే రూపొందించి పాఠశాలలకు పంపారు.
- వీటిలోని పాఠాలు, పద్యాలు, కథలు, శ్లోకాలు, పాటలు, స్ఫూర్తిదాతల గురించి మీకు మీ ఉపాధ్యాయులు బోధిస్తారు. లేదా మీరే చదవండి. ఇతరులకు చెప్పండి, వాటి గురించి చర్చించండి.
- వీటి గురించి మీకు వారానికి ఒకరోజు బోధిస్తారు.
- ఒక పాఠంలోని సన్నివేశాలు, సంఘటనలు గురించి మీలో ఒకరు చదివిన తర్వాత మీ ఉపాధ్యాయుడు, కొన్ని ప్రశ్నలు అడుగుతారు. వీరందరూ ఆ ప్రశ్నలకు ఆలోచించి జవాబులు చెప్పండి. చర్చలో పాల్గొనండి.
- తరగతిలో జట్టు కృత్యాలు నిర్వహిస్తారు. మీరు మీ మిత్రులతోకల్సి జట్టు పనుల్లో పాల్గొనండి. మీరు జట్లలో చర్చించిన విషయాల గురించి తరగతిలో చెప్పండి.
- **'ఆచరించండి – అనుభవాలు చెప్పండి'** అని కొన్ని పనులను మీకు పురమాయిస్తారు. ఆ ప్రకారం మీరు ఆచరించడండి. ఆ తరవాత వచ్చే పీరియడ్‌లో ఏం చేశారు? మీకెలా అనిపించిది? దీన్నుండి మీరేమి నేర్చుకొన్నారు? మొదలగు విషయాలను, మీ అనుభవాలను తెలియజేయండి.
- వీటిలోని అంశాలు ఎక్కువగా చర్చించడానికి, ఆచరించి అనుభవాలు చెప్పడానికి ఉద్దేశించినవి కాబట్టి రాయాలని భావించకండి. తప్పనిసరిగా చేయండి.
- మీరు తెల్సుకొన్న, చర్చించిన అంశాల ఆధారంగా వార్తాపత్రికలలో చూడండి. వాటి నుండి సేకరించిన విషయాలు, వార్తలు, వ్యాసాలు, సూక్తులు మొదలగువాటిని తరగతిలో చదివి విన్పించండి. ఆ తరవాత వాటిని తరగతిలోని గోడపత్రికలో ప్రదర్శించండి.
- వీటికి కూడా మూల్యాంకనం ఉంటుంది. ఐతే, వీటికి పరీక్షలు ఉండవు. మీరెలా పాల్గొంటున్నారు? మీ ప్రవర్తన ఎలా ఉంది? మీలో ఏం మార్పువచ్చింది? మొదలగు విషయాలను మీ ఉపాధ్యాయుల పరిశీలించి మార్కులు కేటాయిస్తారు. వాటి ఆధారంగా మీరు గ్రేడింగ్ ఇస్తారు.
- ఇలా ఒక విద్యా సంవత్సరంలో మూడుసార్లు మీ గురించి నమోదుచేస్తారు. మొదటి సంగ్రహణాత్మక, రెండవ సంగ్రహణాత్మక, మూడవ సంగ్రహణాత్మక మూల్యాంకనాలతోపాటు మిమ్మల్ని పరిశీలించి మీ ప్రగతిని గ్రేడుల రూపంలో నమోదుచేస్తారు.
- 10వ తరగతి మెమో / సర్టిఫికటులో కూడా ఈ వివరాలు ఉంటాయి.
- వంట ఎంత మంచిగా వండినా, దాంట్లో చిటికెడు ఉప్పు లేకుంటే రుచి ఉండదదని భాస్కరశతకంలోని పద్యం ఉంది. అట్లే మనం ఎంత చదువుకున్నా, ఎంత మంచి గ్రేడు వచ్చినా, మనలో 'వినయం, సహనం, శీలం, విచక్షణ' లేకుంటే మనకు విలువ ఉండదు. కాబట్టి విలువల విద్య – జీవన నైపుణ్యాలు పాఠాల ద్వారా మీరు గొప్పవారుగా ఎదగాలి.

# విషయసూచిక


| వ.స | ప్రధాన విలువ | నేర్పవలసిన విలువ | పాఠ్యాంశం | పేజీ |
|---|---|---|---|---|
| 1 | స్వేచ్ఛ | రాజ్యాంగబద్ధమైన స్వేచ్ఛ పట్ల అవగాహన పొందడం | భావవ్యక్తీకరణ | 1 |
| 2 | సంతృప్తిగా జీవించడం | లక్ష్యాన్ని సాధించినపుడు తృప్తిని పొందగలమని తెలుసుకోవడం | లక్ష్యసాధనలో తృప్తి | 10 |
| 3 | శీల నిర్మాణం | సహనగుణాన్ని అలవరచుకోవడం<br>కృతజ్ఞతా భావాన్ని కలిగి ఉండడం | సహనగుణం | 16 |
| 4 | జీవన నైపుణ్యాలు | మానవసంబంధ మూలాలు – మంచి అనుకూల వైఖరులు కలిగి ఉండడం | మానవీయత | 22 |
| 5 | బాధ్యత వహించడం | పాఠశాల అభివృద్ధిలో విద్యార్థులుగా బాధ్యతలను తెలుసుకోవడం –రోడ్డు నియమాలు పాటించడం | బాధ్యత నిర్వర్తించడం | 29 |
| 6 | పొదుపు చేయడం | రేపటి కోసం పొదుపు చేయడంపై అవగాహన పొందడం | ముందుచూపు | 36 |
| 7 | ఆరోగ్య విలువలు | మంచి ఆరోగ్యానికి వ్యాయామం, ఆటలు దోహదపడుతాయని తెలుసుకోవడం | జీవన విధానం | 40 |
| 8 | సంస్కృతి, సంప్రదాయాల పట్ల గౌరవం | ప్రకృతిపట్ల ఆరాధన భావం పెంచుకోవడం – భారతీయ ప్రాచీన శాస్త్ర విజ్ఞానం | ప్రకృతి ప్రేమ | 46 |
| 9 | పర్యావరణ – పరిరక్షణ | కాలుష్య నివారణను గురించి అవగాహన పొందడం | కాలుష్య నివారణ | 50 |
| 10 | శాస్త్రీయదృక్పథం | మార్పును అంగీకరించడం, దృఢంగా నమ్మడం | మార్పు | 54 |

| వ.స | ప్రధాన విలువ | నేర్పవలసిన విలువ | పాఠ్యాంశం | పేజీ |
|---|---|---|---|---|
| 11 | న్యాయం | సమాన న్యాయం పొందడం, చట్టప్రకారం ప్రశ్నించడం | న్యాయపోరాటం | 60 |
| 12 | శాంతి/కలిసిమెలిసి జీవించడం | జీవహింస | జీవహింస పనికిరాదు | 66 |
| 13 | శ్రమ విలువ | శ్రమచేసే వ్యక్తులు - వారిసేవలు, గుర్తించడం | సేవలు | 69 |
| 14 | సేవాభావం | వృద్ధులకు సహాయపడడం | వృద్ధుల సేవ | 74 |
| 15 | సమానత్వం, సోదరభావం స్త్రీల పట్ల గౌరవం | సహానుభూతితో వ్యవహరించడం, అసమానతలు అసమానతలు తొలగించడం | సహానుభూతి | 81 |
| 16 | జాతీయభావన - దేశభక్తి | దేశ భక్తుల జీవితగాథల నుండి స్ఫూర్తిని పొందడం | స్ఫూర్తి | 89 |
| 17 | లౌకికతత్వం - మతసామరస్యం | వ్యక్తి సన్మార్గానికి తోడ్పడేదే మతం అని గ్రహించడం | మతసారం | 92 |
| 18 | ప్రజాస్వామ్యవిలువల పట్ల గౌరవం | గ్రామ పరిపాలనలో ప్రజాస్వామ్యం పాత్ర తెలుసుకోవడం | ప్రజల భాగస్వామ్యం | 97 |

## అనుబంధాలు


1. శ్లోకాలు 105
2. పద్యాలు 107
3. పాటలు / గేయాలు 111
4. కథలు 119
5. స్ఫూర్తిదాతలు 130

# 1 భావవ్యక్తీకరణ

**I. ప్రధాన విలువ** : స్వేచ్ఛ

**II. ఉపవిలువ** : రాజ్యాంగబద్ధమైన స్వేచ్ఛపట్ల అవగాహన కల్పించడం (వాక్‌స్వాతంత్ర్యం, భావ ప్రకటనాస్వేచ్ఛ)

**III. లక్ష్యాలు / ఆశించే ఫలితాలు** :

- తమ భావాలను స్వేచ్ఛగా చెప్పగలుగుతారు.
- ఆలోచించి భావవ్యక్తీకరణ చేయగలుగుతారు.

**IV. ఉపోద్ఘాతం** : స్వతంత్రం అంటే ఏమిటి? ఎందుకు అవసరం? ఎలా ఉపయోగించుకోవాలి? మనకు స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మనం ఎలాంటి జీవనం గడపాలి? దేశ పౌరులకు ఎలాంటి హక్కులు, బాధ్యతలు ఉండాలి? మనలను, మనం ఎలా పరిపాలించుకోవాలి – వీటికి సంబంధించిన అన్ని విషయాలకు నియమ నిబంధనలతో కూడిన రాజ్యాంగాన్ని తయారుచేసుకొన్నాం.

మనకు రాజ్యాంగం చాలారకాలైన స్వేచ్ఛలను కల్పించింది. దీని ప్రకారం మనకు చాలారకాలైన హక్కులు బాధ్యతలు ఉన్నాయి పనిచేసేహక్కు, మతస్వాతంత్ర్య హక్కు, వాక్‌స్వాతంత్ర్యహక్కు, పీడనం నుండి నిరోధింపబడే హక్కు, ఓటు హక్కు కలిగి ఉన్నాం. ఈ హక్కుల్లో ముఖ్యమైనది. వాక్‌స్వాతంత్ర్యం, భావప్రకటన స్వేచ్ఛ. ప్రజాస్వామ్య దేశాల్లో ఇది చాలా ముఖ్యమైంది. దీనిప్రకారం మనం మన అభిప్రాయాలను స్వేచ్ఛగా చెప్పే అవకాశం ఉంటుంది. నియంతృత్వదేశాల్లో, రాచరిక వ్యవస్థలో ఈవిధమైన స్వేచ్ఛ ఉండదు. వీటిగురించి ఈ అధ్యాయంలో తెలుసుకుందాం.

**V. సంఘటనలు** :

**సంఘటన-1** సంఘటనలను పరిశీలిద్దాం !

ఎన్నికల సమయం. ఒక రాజకీయ పార్టీ తాము చేయబోయే అభివృద్ధి పనులగురించి, తమ పార్టీ విధివిధానాలను గురించి, హామీల గురించి ప్రకటించింది. దీని గురించి ప్రజలు తమ అభిప్రాయాలను పత్రికలద్వారా తెలియజేశారు. ఇంకా

దీనిపై పార్టీ నేతలతో ప్రజల అభిప్రాయాలపై చర్చ జరుగుతోంది. ఆ చర్చలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు, సామాన్య ప్రజలు కూడా ఉన్నారు. ఒక రాజకీయ పార్టీ తాము చేయబోయే అభివృద్ధి పనులను గురించి చెప్పగా, దాన్ని గతంలో కూడా మీరు ఇదే హామీ ఇచ్చారు. మీరు ఎంతవరకు నెరవేర్చారని ఒక పార్టీ ప్రతినిధి ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో మీ ప్రయోజనంకోసం హామీలు ఇస్తారు. మీరు అధికారంలోకి వస్తే ఎంత మాత్రం వాటిని నెరవేర్చలేరు అని ఒక పౌరుడు ప్రశ్నించాడు.

**సంఘటన-2**

ప్రభుత్వం 'కిలో రెండురూపాయలబియ్యం' పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈపథకం అమలు గురించి మంచిపథకం అని కొందరు చెప్పారు. అధికారపార్టీ ప్రయోజనాలకోసం చేశారని, ప్రజాప్రయోజనాలకోసం చేసినదికాదని, ప్రజలను సోమరులుగా మార్చడానికే ఈపథకం ఉపయోగపడుతుందని తమ అభిప్రాయాలను ప్రజలు వివిధ ప్రచారమాధ్యమాలద్వారా తెలియజేశారు.

**సంఘటన-3**

గతంలో ఒక రాజకీయ పార్టీ విజన్ 2020ని తమ మానిఫెస్టోలో ప్రకటించింది దీని ప్రకారం 2020 నాటికి మనదేశాన్ని అన్ని రంగాలలో ఎలా అభివృద్ధి సాధిస్తామనేది ప్రకటించారు. దీని గురించి వివిధ వర్గాలవారు ఇది చాలా ఉపయోగకరంగా ఉందని, అభిప్రాయపడితే ఇది జరిగే పనేనా? అంటూ తమ అభిప్రాయాలను మరికొందరు స్వేచ్ఛగా తెలియజేశారు.

## VI. (అ) ఆలోచించడం - ప్రతిస్పందించడం

1. ప్రజలు ఎందుకు ఇలా తమ అభిప్రాయాలను చెప్పగలిగారు?
2. ఇలాంటి సౌకర్యం వీరికి ఎలా లభించింది?
3. వాక్‌స్వాతంత్ర్యం అంటే ఏమిటి?
4. అనుకున్నది మాట్లాడగలిగే స్వేచ్ఛను మీరు ఎలా వినియోగిస్తారు?
5. ఇతరులకు హాని కలుగకుండా స్వేచ్ఛాహక్కును ఎలా వినియోగించుకోవాలి?
6. బడి / తరగతిలో మీకు మాట్లాడేస్వేచ్ఛ ఉందని భావిస్తున్నారా? తరగతిలో స్వేచ్ఛగా మాట్లాడగలుగుతున్నారా? ఇందుకోసం మీరు ఏమి చేస్తారు?
7. మన స్వేచ్ఛ - అనుభవాలు అనే అంశంపై మీ అభిప్రాయం తెలుపండి.

## (ఆ) ఆచరించడం - అనుభవాలు చెప్పడం

1. మీ ఇంట్లో, మీ చుట్టుపక్కలవారు ఎవరెవరు ఎక్కువగా మాట్లాడుతారు? ఎవరు తక్కువగా మాట్లాడుతారు? ఎందుకు? పరిశీలించి చెప్పండి.

## తెలుసుకోండి

ఆధునిక రాజ్యాల ప్రజాస్వామిక హోదా తెలుసుకోవడానికి లాస్కీ చెప్పినట్లు "పౌరులకు కల్పించే హక్కులను బట్టే ఒక రాజ్య లక్షణం, స్వభావం మనం తెలుసుకోవచ్చు" పౌరసమాజంలో మానవులు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సమానత్వం, మూనవ హక్కుల కోసం ఎంతోకాలంగా పోరాటం కొనసాగించారు. సమకాలీన మానవ చరిత్ర అనేది మానవులు స్వేచ్ఛకోసం జరుపుతున్న పోరాటాన్ని వివరించేదిగా చెప్పవచ్చు. నాగరిక సమాజంలో ప్రజలు స్వేచ్ఛను కోరుకుంటారు. స్వేచ్ఛను కోరుకోవటం అనే మానవుని సహజమైన వాంఛ. జీవితంలోని అన్ని రంగాల్లోను స్వేచ్ఛాభావం నిబిడీకృతమై ఉంటుంది. సమకాలీన ప్రపంచంలో స్వేచ్ఛ పట్ల ప్రగాఢ భావం ఎంతగా ఉందంటే కోట్లాది ప్రజలు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను పరిరక్షించుకోవడానికి తమ ప్రాణాలను అర్పించిన సంఘటనలు కోకొల్లలు.

స్వేచ్ఛ అంటే ఎటువంటి నిర్బంధం లేకపోవడం అనే భావం సూచిస్తుంది. వ్యక్తి తనకు తోచినట్లుగా చేయడాన్ని స్వేచ్ఛగా చెప్పవచ్చు. ఎలాంటి అడ్డంకులు, అభ్యంతరాలు లేని స్వేచ్ఛ ప్రాకృతిక సమాజంలో ఉండవచ్చు. 20వ శతాబ్దంలో మానవుని సామాజిక జీవన స్వభావం అభివృద్ధి చెందడం వల్ల వ్యక్తి వికాసానికి, రాజ్యాభివృద్ధికి స్వేచ్ఛ గట్టి పునాదులు వేసింది.

సమాజంలో నివసిస్తూ స్వతంత్ర జీవనం గడపాలనే ఆశయమే స్వేచ్ఛ. ప్రారంభంలో పాలకుల నియంతృత్వం నుంచి రక్షణ లేక స్వతంత్రతను పొందడాన్ని స్వేచ్ఛగా భావించేవారు. ప్రజాస్వామ్య భావాలు పెంపొందటంతో స్వేచ్ఛా, సమానత్వం, స్వాతంత్ర్యం, మానవ హక్కులు బహుళ జనామోదాన్ని పొందాయి.

వ్యక్తిగత కార్యకలాపాలలో వ్యక్తికి పరిపూర్ణ స్వేచ్ఛ ఉండాలి. వ్యక్తి కార్యకలాపాలవల్ల సమాజానికి హానికలగనంతవరకు రాజ్యం జోక్యం ఉండరాదు. వ్యక్తికి సంబంధించినంతవరకూ వ్యక్తి తన శరీరంపై, మనస్సుపై సార్వభౌమాధికారాన్ని కలిగి ఉంటాడు. వ్యక్తికి అభిప్రాయ ప్రకటనకు పూర్తి స్వేచ్ఛ ఉండాలి. వ్యక్తి స్వేచ్ఛా పరిరక్షణకోసం రాజ్య పరిమిత జోక్యాన్ని మాత్రమే వ్యక్తి స్వేచ్ఛావాదులు సమర్థించారు.

నాగరిక సమాజంలో వ్యక్తి అనుభవించే వ్యక్తిగత స్వేచ్ఛను పౌర స్వేచ్ఛ అంటారు. సమాజంలో వ్యక్తి జీవించినప్పుడే స్వేచ్ఛ సార్థకమవుతుంది. సమాజంలో పౌరస్వేచ్ఛ ద్వారా వ్యక్తి తన వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోగల్గుతాడు. వ్యక్తుల స్వేచ్ఛలను పరిమితం చేయడానికి, ఇతరులు ప్రయత్నించినట్లయితే రాజ్యం తరఫున వాటిని రక్షించడానికి స్వయం ప్రతిపత్తిగల న్యాయశాఖ ఉంటుంది. అంతేకాక న్యాయస్థానాలు సమన్యాయ పాలనా సూత్రం ప్రకారం పౌరస్వేచ్ఛను, హక్కులను పరిరక్షిస్తాయి. పౌరస్వేచ్ఛను సంపూర్ణ స్థాయిలో అందించడానికి కొన్ని ప్రధానమైన హక్కులను పేర్కొంటున్నాయి. పౌరస్వేచ్ఛ పరిస్థితులను బట్టి మార్పులకు గురవుతుంది.

1) శారీరక స్వేచ్ఛ : దీనిననుసరించి ప్రాణరక్షణ, ఆరోగ్యం, ఎలాంటి ప్రమాదం లేకుండా ఉండటం కలిగి ఉండటం.

2) మేథోపరమైన స్వేచ్ఛ : దీనిననుసరించి ప్రతి వ్యక్తి తన అభిప్రాయాలను, భావాలను, నమ్మకాలను నిర్భయంగా ప్రకటించగలగడం.

3) సాధారణ స్వేచ్ఛ : దీనిననుసరించి ఎలాంటి ప్రత్యేకమైన ఒప్పందాలు, నియమనిబంధనలు లేకుండా సాధారణ కార్యకలాపాలను నిర్వహించుకోవచ్చు.

**స్వేచ్ఛా పరిరక్షణలు :**

రాజ్యాంగ బద్ధమైన ప్రజాస్వామ్య రాజ్యాల్లో మాత్రమే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు వర్ధిల్లుతాయి. ఆలోచనాబద్ధులైన ప్రజలు తమ స్వేచ్ఛను బాధ్యతాయుతంగా ఉపయోగించుకొని, పరిరక్షించుకుంటారు. నిరంతర అప్రమత్తత స్వేచ్ఛను పరిరక్షిస్తుంది. స్వేచ్ఛను సాధించటానికి, పరిరక్షించుకోవడానికి వివిధ దేశాల్లోని ప్రజలు సామాజిక విప్లవాల ద్వారా విజయాన్ని సాధించారు. స్వేచ్ఛను పరిరక్షించుకోవడానికి రాజ్యాంగపరమైన, సాంఘికపరమైన రక్షణలు అవసరం.

**స్వేచ్ఛ – నిర్వచనాలు :**

1. లాస్కీ : "ఎలాంటి వాతావరణంలో వ్యక్తి తన పరిపూర్ణత్వానికి కృషి చేయడానికి అవకాశం ఉంటుందో అదే స్వేచ్ఛ.
2. హాబ్స్ : "ఎలాంటి పరిమితులు, వ్యతిరేకత లేనిదే స్వేచ్ఛ" – స్వతంత్ర జీవనం గడుపుతూ తన అనుభవాలను అందరికీ అందించే సామాజిక స్థితియే స్వేచ్ఛ అని ఇతని అభిప్రాయం.
3. బార్కర్ : "ప్రతి వ్యక్తి తన శక్తి సామర్థ్యాలను ఉపయోగించి, తన హక్కులను అనుభవించాలనే భావంతో వ్యవహరించడానికి రాజ్యం గుర్తించిన నియమాల సముదాయమే స్వేచ్ఛ".
4. జి.డి. హెచ్. కోల్ : "మూర్తిత్వానికి ఎలాంటి అవరోధాలు లేకుండా తన భావాలను వ్యక్తపరచడానికి వ్యక్తికి ఉన్న స్వాతంత్ర్యమే స్వేచ్ఛ.

**స్వేచ్ఛా హక్కు :**

అన్ని ప్రాథమిక హక్కులకు మూలం స్వేచ్ఛ. పౌరుడికి కల్పించే స్వేచ్ఛ హక్కుల ద్వారా వ్యక్తమవుతుందని లాస్కీ భావిస్తాడు. బ్రిటిష్ రాజ్యాంగం పౌరులకు హక్కులు అనుభవించటానికి అవకాశం ఇస్తే అమెరికన్ రాజ్యాంగం వాటిని గుర్తించి అమలుపరిచింది భారత రాజ్యాంగం సవివరంగా వాటిని రాజ్యాంగ చట్టంతో పొందుపరచి వాటికి సర్వోన్నత స్థితినీ పవిత్రతనూ ఆపాదించింది.

10 నుంచి 22 వరకు ఉన్న రాజ్యాంగ నిబంధనలను పౌరస్వేచ్ఛలకు సంబంధించిన హక్కులుగా వివరిస్తున్నాయి.

**19వ నిబంధన :** ఆరు స్వేచ్ఛలను ప్రస్తావించింది అవి :

1. వాక్ స్వాతంత్ర్యం, భావ వ్యక్తీకరణ, అభిప్రాయ ప్రకటన.
2. శాంతియుత నిరాయుధ సమావేశం.
3. సంస్థలను ఏర్పాటుచేసుకోవడం.

4. దేశవ్యాప్త సంచార స్వేచ్ఛ.

5. దేశ వ్యాప్తంగా స్థిరనివాస స్వేచ్ఛ.

6. వృత్తి, వర్తక, వాణిజ్య స్వేచ్ఛ.

అయితే ఈ నిబంధన పైన ప్రస్తావించిన వ్యక్తిగత స్వేచ్ఛలు అపరిమితమైనవికావు. వాటిపై కింది పరిమితులు రాజ్యం అవసరమైనప్పుడు విధించవచ్చు.

1. దేశ సార్వభౌమాధికారం, సమగ్రత భద్రత, ఇతర దేశాలతో సత్‌సంబంధాలు, శాంతిభద్రతలు, మర్యాద, నైతికత, న్యాయస్థానం ధిక్కారం, పరువునష్టం, నేరప్రోత్సాహం మొదలైన కోణాలవల్ల అవసరం అయినప్పుడు పార్లమెంటు ఆమోదించిన చట్టాల ద్వారా స్వేచ్ఛలపై పరిమితులను విధించవచ్చు. ఉదాహరణకు ఉగ్రవాద చర్యల నిరోధచట్టం (Prevention of Terrorist Activities). అలాగే కొన్ని కల్లోలిత ప్రాంతాలకు పౌరులు స్వేచ్ఛగా సంచరించకుండా జాతీయ భద్రతకోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజల పర్యటనా స్వేచ్ఛను పరిమితం చేయవచ్చు.

2. జన సామాన్య ప్రయోజనం రోమేష్ థాపర్, బ్రిజ్‌భూషణ్ వివాదాల్లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను అనుసరించి దేశ సమగ్రతకు ప్రమాదం కలిగించకుండా, శాంతిభద్రతలకు భంగం కలగనంతవరకు రాజ్యం పౌరుని భావ ప్రకటనపై పరిమితులు విధించరాదు. హింసాకాండ, నేరాలు హత్యలు, ఘోరాలను ప్రోత్సహించే చర్యలు, ఉపన్యాసాలపై కూడా ప్రభుత్వంపై తీర్పువల్ల ఎటువంటి చర్య తీసుకోలేదు.

హింసాయుత చర్యలను ప్రోత్సహించే ప్రదర్శనలు, సమావేశాలను శాంతిభద్రతల దృష్ట్యా ప్రభుత్వం నిషేధించవచ్చు. 144 నిబంధనను విధించవచ్చు.

**20వ నిబంధన :** దీని ప్రకారం

1. ఒక వ్యక్తి ఏదైనా ఒక పని చేసినప్పుడు ఆ సమయంలో అది చట్టరీత్యా నేరమని పేర్కొన బడితే తప్ప ఆ వ్యక్తిని నేర సమయంలో ఆ నేరానికి న్యాయంగా ఎంత శిక్ష విధించ తగినదో అంతకు ఎక్కువ శిక్ష విధించే వీలులేదు. (20.1)

2. "ఏ వ్యక్తినీ ఒక నేరానికి ఒకసారి కంటే ఎక్కువసార్లు విచారణ చేసి శిక్షించరాదు". (20.2)

3. ముద్దాయి అయిన ఏ వ్యక్తి అయినా తనకు (అతనికి) సాక్ష్యం చెప్పవలసిందిగా నిర్బంధం చేయరాదు (20.3)

**21వ నిబంధన :** వ్యక్తి ప్రాణానికీ స్వేచ్ఛకు రక్షణ హక్కు

ఈ నిబంధన ప్రకారం చట్టం నిర్ణయించిన పద్ధతి, న్యాయోచిత ప్రక్రియ ద్వారా తప్ప వేరే ఏ విధంగానైనా హరించబడకూడదు."

వ్యక్తి స్వేచ్ఛ ప్రాముఖ్యాన్ని రాజ్యాంగ నిర్మాతలు గుర్తించారు. అయితే అమెరికన్ రాజ్యాంగంలో లాగా "న్యాయోచిత ప్రక్రియ (Due Process) అనే పదాలను భారత రాజ్యాంగంలో వాడలేదు. ఎందువల్లనంటే సదరు ప్రక్రియ న్యాయస్థానాల

అధికార పరిధిని విస్తరింపచేస్తుందని రాజ్యాంగ వేత్తలు అంతేకాకుండా పార్లమెంటరీ సార్వభౌమత్వానికి బ్రిటన్‌లో వలె భారత్‌లో ఆధిక్యత కల్పించటం వారి ఉద్దేశమని మనం భావించవచ్చు. అందువల్లనే చట్టపరమైన ప్రక్రియ (Legal Process) అనే పదాలను ఉపయోగించారు. దాని అర్థం ఏమిటంటే చట్టాలు సూచించిన పద్ధతిని అనుసరించి మాత్రమే న్యాయస్థానాలు విచారణ జరపాలి. "చట్టబద్ధం" అనే నిర్వచనం చట్టబాద్ధమైందా కదా? దాని వ్యాఖ్యానం అంతిమంగా మరి రాజ్యాంగం ఆధిక్యతను కాపాడే బాధ్యత ఉన్న న్యాయస్థానమే నిర్ణయించవలసి వస్తుంది. అందువల్ల పర్యాయపదం ఏదైనప్పటికీ భారత న్యాయస్థానం ప్రాథమిక హక్కుల పరిరక్షణ విషయంలో అమెరికన్ న్యాయస్థానానికి ఏమాత్రం తీసిపోలేదు.

**22వ నిబంధన ప్రకారం**

1. "నిర్బందంలోకి తీసుకొచ్చిన ప్రతివ్యక్తికీ సాధ్యమైనంత వెంటనే అటువంటి నిర్బంధంలో ఉంచటానికి తగిన కారణాలను వివరించాలి. నిరబ&ంధంలోకి తీసుకొన్న వ్యక్తికి తనకు ఇష్టమైన న్యాయవాదిని కలిసి ఆలోచన చేయడానికి తన రక్షణకు సదరు న్యాయవాది సేవలను ఉపయోగించుకోవటానికి అతడికి ఉన్న అధికారాన్ని మరచిపోరాదు" (22.1)
2. నిర్బంధంలోకి తీసుకున్న వ్యక్తిని అటువంటి నిర్బంధంలోకి తీసుకున్న స్థలం నుంచి అతిచేరువలో ఉన్న మేజిస్ట్రేట్ వద్దకు తీసుకువెళ్ళటానికి పట్టే సమయం పోగా 24 గంటల్లో సదరు విచారణాధికారి వద్ద హాజరుపరచాలి. ఆ మేజిస్ట్రేట్ ఉత్తరువు లేనిదే అంతకంటే ఎక్కువ కాలం ఆ వ్యక్తిని నిర్బంధంలో ఉంచరాదు" (22.2)
3. పైన పేర్కొన్న నిబంధనలు విదేశీయులకు వర్తించవు. (22.3)
4. ఏ వ్యక్తినీ మూడు నెలలకు మించి నిర్బంధంలో ఉంచటానికి తగిన అధికారం నివారక నిరోధక చట్టం ఇవ్వకూడదు. నిర్బంధాన్ని ఆమోదించరాదు. అయితే కొన్ని సందర్భాల్లో నిర్బంధ గడువును పొడిగించవచ్చు." (22.4)

పై నిబంధనలకు లోబడి నివారక నిర్బంధ (Preventive Detension) చట్టాన్ని రూపొందించే విషయంలో పార్లమెంటు లోపలా బయటా అనేక వాద వివాదాలు, ప్రతిఘటనలూ ఎదురైనప్పటికీ మొట్టమొదటి చట్టం 1950లో అమల్లోకి వచ్చింది. అయితే తరవాత సదరు చట్టం 1971లో అంతరంగిక భద్రత చట్టంగా రూపాంతరం చెందింది. 1975-77 మధ్యకాలంలో అమల్లో ఉండిన అంతరంగిక అత్యవసర పరిస్థితి సమయంలో అన్ని ప్రాథమిక హక్కులు హరించబడ్డాయి. 'మీసా' చట్టాన్ని నిర్దాక్షిణ్యంగా అమలు జరిపి లక్షలాది వ్యక్తులను నిర్బందంలోకి తీసుకొన్నారు. ఈ అత్యవసర పరిస్థితి సృష్టించిన అతిఘోరణులను అరికట్టటానికి 1977లో అధికారంలోకి వచ్చిన జనతా ప్రభుత్వం 'మీసా' చట్టానికి మార్పులు చేసింది. అటు తరవాత కాలంలో కూడా అనేక చట్టాలూ, సవరణలూ వ్యక్తి స్వేచ్ఛను పరిమితం చేసే విధంగా ఆయా సందర్భాలను అనుసరించి రూపొందాయి. వీటిలో ముఖ్యమైనవి :

1. జాతీయ భద్రత చట్టం (National Security Act) (1981)
2. అత్యవసర సేవల నిర్వహణ చట్టం (Essential Services Maintenance) (1981)

3. బ్లాక్ మార్కెట్ నిరోధక చట్టం అత్యవసర సరకుల సరఫరా చట్టం (Prevention of Black Marketing nad Maintenance of Supplies Commodities Act) (1980).
4. విదేశీ మారక ద్రవ్య రక్షణ, దొంగ వ్యాపారుల చర్యల నిరోధక చట్టం (Foreign Exchange and Prevention of Smugglers Activities Act) (1975).
5. ఉగ్రవాద విచ్ఛిన్నకర కార్యకలాపాల అదుపుచట్టం.
6. టాడా స్థానంలో ఉగ్రవాద కార్యకలాపాల నిరోధక చట్టం (Pota) (పోటా)

పేర్లు ఏమైనప్పటికీ ప్రజాస్వామ్యం పరిరక్షణకోసం సాధారణ ప్రజాహితం, రక్షణకోసం కొన్ని నిర్బంధ, నిరోధక, కఠినచర్యలు ప్రభుత్వం తీసుకోక తప్పదు. సమాజంలోని అసాంఘిక శక్తులను అదుపులో ఉంచటానికి ప్రజల ధనమాన ప్రాణాలను కాపాడటానికి కొన్ని చట్టాలు" ఆవశ్యకత తప్పదు. ప్రజాస్వామ్యానికి ప్రపంచ వ్యాప్తంగా తలమానిక విచారణచేసి మరణశిక్షను విధించటానికి అవకాశం ఇచ్చింది. స్వేచ్ఛకు కొన్ని సందర్భాలు ఇటువంటి మూల్యం తప్పనిసరి అవుతుంది.

**మనకున్న రాజ్యాంగపరమైన స్వేచ్ఛలు**

1. వాక్‌స్వాతంత్ర్యం, భావవ్యక్తీకరణ స్వేచ్ఛ.
2. ఆయుధాలు లేకుండా, శాంతియుతంగా సమావేశమయ్యే హక్కు.
3. సంఘాలు, సమావేశాలు, ఏర్పాటు చేసుకునే స్వేచ్ఛ.
4. భారతదేశంలోని ఏ మూలకైనా స్వేచ్ఛగా తిరగవచ్చు.
5. భారతదేశంలోని ఏ ప్రాంతాలలోనైనా స్థిరంగా నివసించే స్వేచ్ఛ ఉంది.
6. ఏ వృత్తినైనా, ఏ స్థానాన్నైనా, ఏ వ్యాపారమైనా చేపట్టే స్వేచ్ఛ ఉంది.

**3. మీకు కింది వాటిలో వేటిలో స్వేచ్ఛ ఉందో గుర్తించండి.**

1. మాట్లాడే స్వేచ్ఛ.
2. మీ అభిప్రాయాలను, భావాలను చెప్పే స్వేచ్ఛ.
3. ఎక్కడికైనా వెళ్ళే స్వేచ్ఛ.
4. మీకు నచ్చిన వృత్తిని ఎన్నుకునే స్వేచ్ఛ.
5. మీకు నచ్చిన చదువు చదివే స్వేచ్ఛ.
6. మీరు స్నేహితులను కలిసే స్వేచ్ఛ.
7. మీకు ఇష్టంలేనివి నిరాకరించే స్వేచ్ఛ
8. ప్రశ్నించే స్వేచ్ఛ.

## తెలుసుకోండి

భారత రాజ్యాంగం అర్టికల్ 19 లో వాక్‌స్వాతంత్ర్యం, భావప్రకటనా ప్వాతంత్ర్యంపై ఏమిన వ్యాఖ్యానించారో తెలుసుకోండి.

### 19(1) (ఎ), 19(2) ఆర్టికల్స్ పై వ్యాఖ్యానము

**వాక్ స్వాతంత్ర్యము, భావ ప్రకటనా స్వాతంత్ర్యము** Freedom of Speech and Expression : వాక్ స్వాతంత్ర్యము, భావ ప్రకటనా స్వాతంత్ర్యము అనగా, పౌరుడు నోటి మాటల ద్వారా, రాతల ద్వారా, ముద్రణ ద్వారా బొమ్మలు ప్రదర్శించుట లేదా ఇతర పద్ధతుల ద్వారా తన మనో భావాలను, స్వేచ్ఛగా వ్యక్తపరిచే హక్కు అని అర్థము. ఈ హక్కులను, రాజ్యాంగములో 19(1), (ఎ)వ ఆర్టికలు వ్యక్తులకు ప్రసాదిస్తున్నది. అయితే, ఈ రాజ్యాంగమే, 19(2)వ ఆర్టికలు ద్వారా ఈ హక్కులపై కొన్ని పరిమితులను / ఆంక్షలను / నిర్బంధాలను విధిస్తున్నది. ఈ హక్కులకు భౌగోళిక హద్దులంటూ ఏవి లేవు. ఈ హక్కులను భారతదేశంలో మాత్రమే కాకుండా, దేశం వెలుపల కూడా వినియోగించవచ్చును.

వాక్ స్వాతంత్ర్యము, భావ ప్రకటనా స్వాతంత్ర్యములో పత్రికా స్వాతంత్ర్యము (Freedom of Press) కూడ చేరివుంది.

రమేష్ పవర్ vs స్టేట్ ఆఫ్ మద్రాసు (AIR 1950 SC 124) కేసులో జస్టిస్ పతంజలి శాస్త్రి, ఇలా వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య సంస్థలన్నింటికీ, వాక్, భావప్రకటన స్వాతంత్ర్యం, పత్రికా స్వేచ్ఛ, పునాది వేశాయి. ఎందుకంటే, స్వేచ్ఛగా రాజకీయ చర్చలు జరపకపోవడం, లేదా సార్వజనిక విద్య ఉండకపోవడం వలన ప్రజాస్వామ్య సంస్థలు మనుగడ కలిగిఉండవు. అందుచేత ప్రజామోదం కలిగిన ప్రభుత్వ వ్యవహారాలు, సక్రమంగా కొనసాగడానికి ఇవి చాలా అవసరమైనవి.

ఆలోచనలను స్వేచ్ఛగా వ్యాప్తిచేసే స్వేచ్ఛ (Freedom of Propagation), సర్క్యులేషనులో స్వేచ్ఛ ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. ప్రచురణా స్వేచ్ఛ మాదిరిగానే, ఆ స్వేచ్ఛకు, సర్కులేషను స్వేచ్ఛ అవసరం. నిజానికి, సర్క్యులేషను లేకుండా ప్రచురణకు విలువ ఉండదు.

ఈ స్వేచ్ఛలో ఒకరు తన అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యాప్తి చేయడమే కాకుండా, ఇతరుల అభిప్రాయాలను కూడా వ్యాప్తి చేయడానికి లేదా ప్రచురించడానికి గల హక్కు చేరి ఉంటుంది. ప్రభుదత్తా vs యూనియన్ ఆఫ్ ఇండియా ( AIR 1982 SC 6) కేసులో సుప్రీంకోర్టు, వార్తలను తెలుసుకొనే హక్కు, ప్రభుత్వ పరిపాలనకు సంబంధించిన సమాచారాన్ని తెలుసుకొనే హక్కు ఇందులో చేరి ఉందని అభిప్రాయపడింది.

స్టేట్ vs చరిత (AIR 11999 SC 1379 ) కేసులో సుప్రీంకోర్టు, “జైలులో విచారణలో ఉన్న ఖైదీని ఇంటర్వ్యూ చేయడానికి పత్రికలకు విశృంఖలమైన హక్కులేదని” (have no unfettered rights) పేర్కొంది.

లైఫ్ ఇన్సూరెన్సు కార్పొరేషను ఆఫ్ ఇండియా vs. మనూభాయ్ డి.షా. (1992) 3 SCC 637 కేసులో సుప్రీంకోర్టు. వాక్ మరియు భావ ప్రకటన స్వాతంత్ర్యం గురించి విశదీకరిస్తూ ఇలా అంది.

"న్యాయస్థానం. వాక్, భావ ప్రకటన స్వాతంత్ర్యంలో, పౌరులకు మాటల ద్వారా లేదా వ్రాతపూర్వకంగా లేదా దృశ్య, శ్రవణ పరికరాల (audio - visual instrumentalities) ద్వారా తమ అభిప్రాయాలను వ్యాప్తి చేసే హక్కు చేరివున్నట్లు విశాల దృక్పథంలో అన్వయించాలని పేర్కొనింది."

"అందుచేత ఒక వ్యక్తికి ప్రింట్ మీడియా ద్వారా లేదా రేడియో, టివీ వంటి ఇతర సమాచార ప్రసార సాధనాల ద్వారా తన అభిప్రాయాలను వ్యాప్తి చేసుకొనే హక్కు, వాక్, భావప్రకటన, పత్రిక స్వాతంత్ర్యంలో చేరి ఉంది"

"అంతేకాకుండా న్యాయస్థానం, స్వరూపాన్ని పట్టించుకోకుండా ముందుగా అడ్డంకులు సృష్టించడం, వాక్, భావ వ్యక్తీకరణ స్వాతంత్ర్యానికి ప్రమాద హెచ్చరికలని ఎందుకంటే, వాటిని అనుమతిస్తే, నిరంకుశమైన మరియు అహేతుక నిర్ణయాలు రావడానికి కారణమని అభిప్రాయపడింది.

సినిమా, శక్తివంతమైన ప్రచార సాధనము, ప్రేక్షకుల మనసులపై తీవ్రమైన అభిప్రాయాలను ముద్ర వేయడానికి ఎంతో శక్తివంతమైనది. అందుచేత అది అందజేసే సందేశము, సంఘటనకు లేదా సంఘములోని ఏదేని వర్గమునకు ప్రతికూల ప్రభావము కలిగించేదిగా వుండకుండా చూడాలి.

అందుచేత దుష్పరిణామాల నుండి సంఘమునకు కాపాడటానికి సినిమాలపై ముందస్తు ఆంక్షలు విధించడం ద్వారా సెన్సార్ చేయడం సబబని అభిప్రాయపడటం జరిగింది. ఒక చలన చిత్రమును ముందస్తు సెన్సార్ లేకుండా అనుమతించినపుడు అది సమాజంపై దుష్పరిణామాలు చూపుతాయి. కాబట్టి, రాజ్యాంగంలోని 19(2) వ ఆర్టికలు పొందుపరచిన సామాజిక శ్రేయస్సును సంరక్షించడానికి, సెన్సార్ షిప్ యొక్కు తీసుకొని రావడం జరిగింది. అట్టి సెన్సార్ షిప్పు హేతుబద్ధమై ఉంది. రాజ్యాంగంలోని 19వ ఆర్టికలు యొక్క పరీక్షకు నిలువ గలిగేదిగా ఉండాలి. ఉన్నది కూడా.

సూక్తి : శక్తి అంతా మీలోనే ఉంది!... దీనిని విశ్వసించండి. బలహీనులమని భావించకండి!... లేచి నిలబడి మీలో అంతర్లీనంగా ఉన్న శక్తిని ప్రకటించండి!

*– స్వామి వివేకానంద*

# 2 లక్ష్యసాధనలో తృప్తి

**I. ప్రధాన విలువ** : సంతృప్తిగా జీవించడం

**II. ఉపవిలువ** : అనుకున్న లక్ష్యాన్ని సాధించినప్పుడు తృప్తిని, సంతోషాన్ని పొందగలగడం.

**III. లక్ష్యాలు / ఆశించే ఫలితాలు** :

- అనుకున్న లక్ష్యాన్ని సాధించిన్పుడు తృప్తిని సంతోషాన్ని పొందగలుగుతాడు.
- లక్ష్యసాధనలో వచ్చేసమస్యల్ని ఎదుర్కొంటు ముందుకు వెళ్ళగలుగుతాడు.

**IV. ఉపోద్ఘాతం** : ఏదైనా ఒక కార్యం సాధించాలంటే కొన్ని ఆటంకాలు ఎదుర్కోక తప్పదు. ఆటంకాలను అధిగమించితే పొందే తృప్తి, ఆనందం లెక్కలేనంతగా ఉంటుంది. లక్ష్యసాధనలో వచ్చే ఆటంకాలకు భయపడకూడదు. సాధించగలను అన్న నమ్మకం, పట్టుదల ఉండాలి. అలా ఉండే ఈ తృప్తి సంతోషాన్ని కలిగిస్తుంది.

**V. సంఘటనలు** :

**సంఘటన-1**

నేను ప్రసంగం పూర్తికావొస్తుండగా ఈ మాటలు కూడా వారికి చెప్పకుండా ఉండలేకపోయాను. చూడండి, "మీకు వాగ్దానం చేస్తున్నాను. ఈ నెలాఖరులోగా 'అగ్ని'ని జయప్రదంగా ప్రయోగించే మేము తిరిగొస్తాము"

రెండవ ప్రయోగంలో సంభవించిన వైఫల్యాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం మొత్తం నియంత్రణ వ్యవస్థనే పూర్తిగా మెరుగుపెట్టాం. ఈపని సంయుక్త సంస్థా బృందానికి అప్పగించాం. ఆ బృందం మొదటి దశ నియంత్రణ వ్యవస్థని పూర్తిగా మెరుగు పరిచింది. అద్భుతమైన లక్ష్య దృష్టితో, సంకల్పశక్తితో ఆపనిని రికార్డ్ వ్యవధిలో పూర్తి చేసింది. పది రోజుల్లో ఆమోద పరీక్ష ఉందనగా అంత తక్కువ వ్యవధిలో వందలాది శాస్త్రజ్ఞులు ఆ వ్యవస్థల్ని తీసుకొని విమానం పదకొండవరోజున త్రివేండ్రం వదిలి ప్రయోగస్థలానికి వచ్చింది. కానీ ఈసారి వాతావరణ పరిస్థితులు మామీద ఆగ్రహించాయి. తుఫాను హెచ్చరిక ఒకటి నానాటికి బలపడుతూ ఉంది. అన్ని కేంద్రాలు శాటిలైట్ సమాచారవ్యవస్థలో అనుసంధానింపబడ్డాయి. వాతావరణ సమాచారం ప్రతి పదినిమిషాలకొకసారి మాకు చేరుతూ ఉంది.

ఏమైతేనేం, 1989 మే 22న ప్రయోగానికి ముహూర్తం నిర్ణయించాం. ఆముందు రోజు రాత్రి డా॥అరుణాచలం, జనరల్ కె.ఎస్.సింగ్, నేనూ, రక్షణ మంత్రి కె.సి పంత్‌తో మాట్లాడుతూ ఉన్నాం. ఆయన కూడా ప్రయోగాన్ని చూడడానికి వచ్చాడు. అది పున్నమి రాత్రి. సముద్రంలో పోటు అధికంగా ఉంది. కెరటాలు ఎగిసిపడుతూ సర్వేశ్వరుని వైభవాన్నీ, శక్తినీ కీర్తిస్తున్నట్టుగా ఘోషిస్తున్నాయి. మేము 'అగ్ని'ని రేపు జయప్రదంగా ప్రయోగించగలమా? అందరి మనసుల్లోనూ మెదుల్తున్న ప్రశ్న అదే. కానీ ఆమాట పైకిచెప్పి ఆ సుందరమైన వెన్నెల రాత్రి మా మీద విధించిన మనోహరత్వాన్ని భంగపరచడానికి కెవ్వరం సిద్ధంగా లేము. సుదీర్ఘ నిశ్శబ్దాన్ని తుంచి వేస్తే చివరికి రక్షణ మంత్రి అడిగారు నన్ను "కలాం, రేపు నీ సంతోషాన్ని అందరితో పంచుకోవటానికి నన్నేమిమ్మంటావు చెప్పు" అని. ఎంత సరళమైన ప్రశ్న, కానీ ఏం చెప్పాలో వెంటనే తోచలేదు. నేనేం కోరుకున్నాను? నాదగ్గర లేనిది ఏమిటి? నన్ను సంతోష పరచగలిగించేది? అప్పుడు తట్టింది నాకు సమాధానం. "మాకు ఇమారత్ కంచా దగ్గర నాటడానికి లక్ష మొక్కలు కావాలి" అన్నాను. ఆయన వదనం ఆత్మీయ ప్రకాశంతో వెలిగిపోయింది. "నువ్వు "అగ్ని" కోసం భూదేవి ఆశీస్సుల్ని బేరమాడుతున్నావు" రక్షణ మంత్రి పరిహాసమాడారు. "రేపు మనం తప్పకుండా నెగ్గుతాం" అని ఆకాంక్షించారాయన.

ఆ మర్నాడు 7 గంటల 10 నిమిషాలకి 'అగ్ని' దూసుకుపోయింది. అది సాంకేతికంగా పరిపూర్ణమైన ప్రయోగం. ఆ మిస్సైల్ గమనరీతి అచ్చు పాఠ్యపుస్తకాల్లో రాసినట్లే నడిచింది. గమనగతి ప్రమాణాలన్నీ అందుకోబడ్డాయి. భయంకరమైన పీడకలలరాత్రి గడిచిన తర్వాత సుందరప్రత్యూషంలోకి మేల్కోవడం లాంటిదది. అయిదు సంవత్సరాల నిరంతర కృషి తర్వాత మేం లాంచ్‌పాడ్‌కి చేరగలిగాము. చివరి అయిదు వారాల్లో అగ్ని పరీక్షల వరసని దాటుకుంటూ వచ్చాం. అసలు మొత్తం ప్రక్రియనే ఆపెయ్యమని మామీద వచ్చిన ఒత్తిడిని నిభాయించుకున్నాం. కానీ చివరికి మేమది సాధించగలిగాం! అది నా జీవితంలో మహత్తర క్షణాల్లో ఒకటి. 600 సెకండ్ల ఒక ఉజ్వల ప్రయోగ గతి మా మొత్తం అలసటని ఒక్క క్షణంలో మటుమాయం చేసింది. ఏళ్ళ తరబడి మేము పడ్డ కష్టానికి ఎటువంటి ప్రదీప్తి. ఆరాత్రి నాడైరీలో రాసుకున్నాము.

అగ్ని ఊర్ధ్వముఖంగా ఎక్కుపెట్టిన వస్తువుకాదు
అశుభాన్ని పరిహసించడానికో
నీ బలాన్ని చూపించడానికో కాదది
అది భారతీయుడి హృదయాగ్ని
దానికి ఆయుధ రూపం ఇవ్వకు
జ్వలిస్తున్న జాతి ఆత్మగౌరవ కాంతితో
దాన్ని మరింత వెలగనివ్వు

ప్రధానమంత్రి రాజీవ్‌గాంధి అన్నారు. "అది మన స్వాతంత్ర్యాన్ని మన జాతి భద్రతని స్వయం శక్తితో పరిరక్షించుకునే మహత్తర విజయం. మన జాతి రక్షణ కోసం ఉన్నత సాంకేతిక పరిజ్ఞానాన్ని దేశీయంగా అభివృద్ధి పరచుకోవాలనే మన నిబద్ధతకు 'అగ్ని' నిరూపణ. "ఈ దేశం మీ ప్రయత్నాల్ని చూసి గర్విస్తోంది" అని నాతో చెప్పారాయన. రాష్ట్రపతి ఆర్.వెంకట్‌రామన్ 'అగ్ని' తన ఫలించిన స్వప్నంగా భావించాడు. సిమ్లానుంచి తంతి ఇచ్చాడు. "ఇది నీ అంకితభావానికి, కఠోర పరిశ్రమకూ, ప్రతిభకూ నిదర్శనం."

మనిషి అనుకున్న లక్ష్యాన్ని సాధించినప్పుడు అంతులేని ఆనందాన్ని అనుభవిస్తాడు. ఆ లక్ష్యం ఇతరులకు ఉపయోగపడితేనే వచ్చే ఆ సంతృప్తి చెప్పనలవికాదు.

## VI. (అ) ఆలోచించడం - ప్రతిస్పందించడం

1. లక్ష్యం కలిగి ఉండటం అంటే ఏమిటి? దీని గురించి మీరు ఏమి అనుకొంటున్నారు?
2. లక్ష్యాన్ని సాధించడానికి అబ్దుల్ కలాం ఏమి చేశాడు?
3. మీరు అనుకున్నది సాధించినప్పుడు మీకెలా అనిపిస్తుంది? మీ అనుభవాలు చెప్పండి.
4. మీకున్న లక్ష్యాలు ఏమిటి? వాటిని సాధించడానికి మీరేం చేస్తారు?
5. పిల్లలు మీరు ఏమైనా అనుకొని సాధించారా చెప్పండి. సాధించిన తరుణంలో మీ అనుభవాలు చెప్పండి.

## (ఆ) ఆచరించడం - అనుభవాలు చెప్పడం

1. అనుకున్న లక్ష్యాన్ని సాధించిన కొందరిని కలవండి. వారి అనుభూతుల్ని రికార్డు చేయండి. మీకు కలిగిన అనుభవాల్ని చెప్పండి.

### తెలుసుకోండి

### పోల పిచ్చయ్య

అతడు ప్రభుత్వ అధికారి కాదు, స్వచ్ఛంద సంస్థ కార్యకర్తా కాదు. ఓ మామూలు గిరిజనుడు. పేరు పోల పిచ్చయ్య. ఆంధ్రప్రదేశ్‌లోని ఇరవై లక్షలమంది కుంచెరుకుల్లో ఇతడొకడు. చీపురు కట్టల తయారీయే ఇతడి ప్రధాన జీవనాధారం.

చీపుర్ల తయారీకోసం అవసరమయ్యే ఈత బరుగును సేకరించుకోవడం, ఆ బరుగును సన్నగా కోయడం, ఈతముండ్లు తొలగిపోయేదాకా చెక్క పలకతో నున్నగా రుద్దడం, ఆ తర్వాత చీపుర్ల తయారీలో నిమగ్నం కావడం - ఇదీ ఇతడి దినచర్యగా ఉండేది. ఇదంతా కాయకష్టంతో కూడిన పని. దినమంతా పనిచేసినా పది చీపుర్లను మించి అధిక సంఖ్యలో తయారు చేయలేరు. ఒంటినొప్పులు భరించడం అదనంగా ఉండేది. ఇవన్నీ పిచ్చయ్యను ఆలోచింపజేశాయి. దాంతో అతడు ఓ చిన్న మోటరును తయారు చేసి ఎరుకల కుటుంబాల్లోకి దాన్ని ప్రవేశపెట్టాడు. ఫలితంగా ఓ పెను విప్లవానికే ఆయన నాంది పలికాడు.

చీపుర్ల తయారీని సులభతరం చేయడానికి పిచ్చయ్య తొలిదశలో ఓ చెక్క సాధనాన్ని తయారు చేశాడు. రెండో దశలో ఒక రైతునుంచి విద్యుత్తు మోటరు తెచ్చి, దాన్ని గ్రైండింగ్ మిషనుగా మార్చివేశాడు. ఇది విజయవంతం అయ్యాక ఆ చెక్కసాధనాన్ని తీసేసి బరువు తక్కువగా ఉండే ప్లాస్టిక్ పాత్రను బిగించి చూశాడు. ఫలితంగా ఆ యంత్రంగా మరింత సౌకర్యంగా తయారైంది. ఇంకేం? ఇంటింటికీ తిరిగి ఆ మోటరును తమ తెగవారందరికీ పరిచయం చేశాడు. అలా ఒకే ఒక్క మనిషి వివేచన చీపుర్ల తయారీలో ఓ అపూర్వ ప్రయత్నాన్ని ఆవిష్కరింప జేసింది.

ఇది నిన్నా ఇవాళ్టి విశేషం కాదు. రమారమి పద్దెనిమిది సంవత్సరాల క్రితం సంగతి. కానీ ఈ విశేషాన్ని ఏ పత్రికా ప్రచురించలేదు. మరే టెలివిజన్ ఛానలూ ఆయన్ని పలుకరించలేదు. మన జనమాధ్యమాల ఘనత అంతటిదంటే సిగ్గు సిగ్గు.

అయినా ఈ ప్రచార, ప్రసార సాధనాలతో తనకేమీ నిమిత్తం అన్నట్టుగానే ఉంటాడు పిచ్చయ్య. ఆయన నిరాడంబరంగా, నిమ్మళంగా పనిచేసుకుంటూ ఉంటాడు. తన జాతి జనులకు మేలు చేయడంలో తనకు సంతృప్తి, అంతేతప్ప ప్రపంచానికి తన గురించి తెలియవలసింది ఉందని కూడా ఆయన అనుకోడు.

## నీ లక్ష్యాన్ని చేరుకునేలా చేసే రహస్య మార్గదర్శిని

విద్యార్థి పేరు ...................... జీవిత లక్ష్యం .......................... చేరుకునే సం॥ ...........................

| మార్పురహస్యం | మీరు చేయాల్సిన ప్రక్రియ |
|---|---|
| మనస్సు ↓ | మీరు గొప్ప కలలు కనండి. మీకంటూ ప్రపంచం గుర్తించే గొప్ప లక్ష్యాన్ని నిర్దేశించుకోండి! మనసు ద్వారాలు ఎప్పుడు తెరిచి ఉంచండి! |
| ఆలోచనలు ↓ | మీదైన శైలిలో దూరదృష్టితో, సృజనాత్మకంగా, పాజిటివ్ ఆలోచనలు చెయ్యండి. అనవసరమైన ఆలోచనలు "కాదు, రాదు, అనే నెగటివ్" ఆలోచనలు చేయకండి. |
| కోరికలుగా ↓ | ఎలాగైనా లక్ష్యాన్ని సాధించాలనే ధృఢమైన కోరిక ఉండాలి. అన్నిటిలో అగ్రగామిగా, ఆదర్శముగా, నైపుణ్యముగా కొత్త విషయాలు నేర్చుకునే కోరికలను మాత్రమే కోరాలి. |
| మాటలు ↓ | స్పష్టంగా, నిర్దుష్టంగా, సరళంగా, తగినంత సందర్భానుసారంగా, ప్రేమతో, సత్యముగా, హృదయ రంజకముగా నవ్వుతూ మాట్లాడాలి. ఇచ్చిన మాట తప్పకూడదు. |
| పనులుగా ↓ | ఆరోగ్యం, పరిశుభ్రత, విజ్ఞానం, పెద్దలకు ఆనందం కలిగించి, లక్ష్యాన్ని నెరవేర్చే పనులు చేయుట, చదువుట, వ్రాయుట, చర్చించుట. |

అలవాట్లుగా
↓
ఏ రోజుపని ఆరోజు పూర్తిచేయుట, మరుసటి రోజు పనుల పట్టిక వేసుకొనుట, చేసేపని ఇష్టంతో, అంకిత భావంతో, పరిశీలనాత్మకంగా చిరునవ్వుతో చేసే అలవాట్లు చేసుకోవాలి. సామాజిక బాధ్యతతో చొరవ తీసుకుని నాయకత్వం వహించాలి.

ప్రవృత్తులు
↓
ప్రతి విషయాన్ని ఏమిటి? ఎందుకు? ఎక్కడ? ఎవరు? ఎప్పుడు? ఎలా అని ప్రశ్నించి, పరిశోధించే ప్రవృత్తులు పెంచుకోవాలి. చేపట్టిన పని పూర్తి చేయాలి. ప్రవృత్తులను గుర్తించి నివృత్తి చేసుకోవాలి.

గుణాలుగా (శీలం)
↓
సత్యం, ధర్మం, ధైర్యం, ప్రేమ, క్రమశిక్షణ, ఏకాగ్రత, పట్టుదల తదితర మంచి గుణాలు పెంచుకోవాలి.

గమ్యం ఆఖరుకు
↓
పై మార్పులు చేసిన వ్యక్తి లక్ష్యాన్ని సాధించి, తన గమ్యాన్ని చేరుకోగలడు.

**ఆలోచన – ఆచరణ :**

మనం ఏదైతే ఒక లక్ష్యంగా నిర్ణయించుకున్నామో మన ఆలోచనలన్నీ ఆ లక్ష్యం చేరుకునే దిశగానే ఉండాలి. లక్ష్యసాధనలో ఎన్ని అవాంతరాలు ఎదురయినప్పటికీ లక్ష్యసాధనలో వెనుకడుగు వేయకుండా లక్ష్యాన్ని సాధించే దిశగా ముందుకు పోవాలి. మన ఆలోచనలు ఎప్పుడూ సవ్యంగా ఉండాలి. సవ్యమైన ఆలోచనలు చక్కని మాటల రూపంలో పైకి రావాలి. మాటలు అనేవి ఆయుధాల కంటే శక్తివంతమైనవి. ఏదైతే మాట్లాడామో అవి కార్యరూపం దాల్చాలి.

ఉదా: ఒక రంగంలో అత్యంత గొప్పవారు ఇతర రంగాల్లో వారు జీరో కావచ్చు. కానీ వారి స్థానంలో (రంగంలో) దాంట్లోవారే గొప్పవారు.

ఉదా: హీరో అయినవారు, సచిన్ టెండుల్కర్‌కు మద్దెల వాయించటం రాకపోవచ్చు. లతామంగేష్కరుకు కూచిపూడి రాకపోవచ్చు. మదర్‌థెరిస్సాకు పేయింటింగ్ రాకపోవచ్చు. కాని వారి వారి రంగాల్లో వారు అద్వితీయులు.

ఉదాహరణ : విద్యార్థి లక్ష్యం 'డాక్టర్ కావటం అయితే....."

మనసులో ఆలోచనలు
↓
ప్రపంచం గుర్తించే గొప్ప డాక్టర్ కావాలనే లక్ష్యాన్ని ఎంచుకున్నాను. నేను డాక్టర్ కావాలంటే ఏం చెయ్యాలో, ఏం చదవాలో ఆలోచిస్తాను. నా చుట్టు ప్రక్కల వచ్చే వ్యాధులు, వాటి లక్షణాల గురించి నేను డాక్టరైనా తర్వాత ఈ వ్యాధులు ఏ విధంగా రూపుమాపగలను అనీ, పేదవాళ్ళకు, అనారోగ్యంతో బాధపడుతున్నవారికి ఎలా సేవచేయగలనని ఆలోచిస్తాను.

కోరికలు
↓
నా లక్ష్యానికి సంబంధించిన కోరికలు కోరుకుంటాను.

మాటలు
↓
డాక్టర్ కావాలంటే ఏమి చదవాలి, ఏం చేయాలి; అనే విషయాలను డాక్టర్లను గానీ, ఉపాధ్యాయులనుగానీ తెలిసినవారిక నెవరినైనాగాని అడిగి తెలుసుకుంటాను. నేను గొప్ప డాక్టర్‌నై పేదవాళ్ళందరికీ ఉచిత వైద్య సేవలు అందిస్తానని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్నేహితులు, బంధువులందరికీ చెప్తాను. నా ప్రాంతంలోని వ్యాధులు, వాటి లక్షణాల గురించి, వాటికి సంబంధించిన మందుల గురించి డాక్టర్‌ని అడిగి తెలుసుకుంటాను.

| | |
|---|---|
| పనులు ↓ | మెడికల్ ప్రవేశ పరీక్షలకు సంబంధించినవి బాగా ప్రిపేర్ అవుతాను. మెడిసిన్ కోర్సుకు అవసరమైన పుస్తకాలు చదువుతాను. మా ప్రాంతంలో ఉన్న హాస్పిటల్స్, డాక్టర్లను సందర్శిస్తాను. గొప్ప గొప్ప డాక్టర్లకు సంబంధించిన 'పత్రికల కటింగ్స్' సేకరించి ఆల్బమ్స్‌లా తయారుచేసుకుంటాను. నా చుట్టూ ప్రక్కల ఎవరికైనా అనారోగ్యం ఉంటే వారిని హాస్పిటల్‌కి తీసుకువెళ్తాను. |
| అలవాట్లు ↓ | పైన చేసిన పనులు మళ్ళీ మళ్ళీ చేయటం ద్వారా వాటిని అలవాట్లుగా మార్చుకుంటాను. మంచి డాక్టర్‌కు ఉండవలసిన మంచి అలవాట్లు – పరిశుభ్రత, చిరునవ్వుతో ప్రేమతో పలకరించుట, సేవాతత్పరత అలవరచుకుంటాను. |
| ప్రవృత్తులు ↓ | కోపం, చిరాకు, అసహనం, బద్ధకం ఇత్యాది చెడు ప్రవృత్తులను మార్చుకుంటాను. |
| గుణాలు ↓ | వైద్య విద్య విజయవంతంగా పూర్తి చేయడానికి కావలసిన ఏకాగ్రత, క్రమశిక్షణ, ధైర్యం, అధ్యయనం, ప్రణాళికా బద్ధంగా కృషి చేయడం, పట్టుదల, సత్యం మొదలైన మంచి గుణాలను పెంచుకుంటాను, చెడుగుణాలను వదిలేస్తాను. |
| గమ్యం ↓ | పైవన్నీ పాటించి వైద్య కళాశాలలో సీటు సంపాదించి, కోర్సు పూర్తిచేసి గొప్ప డాక్టర్‌గా నా లక్ష్యాన్ని సాధించి పేదవారికి ఉచితంగా వైద్య సేవ చేస్తాను. |

**సూక్తి :** కష్టములనెదుర్కొనుటలో మహాత్ములకు సామాన్యులు సాటిరారు. సానపట్టు ఒరపిడి రాతి ఘర్షణమునకు వజ్రము తట్టుకొనగలదేగాని మట్టిపెల్లచాలదు గదా.

# 3 సహనగుణం

**I. ప్రధాన విలువ** : శీలనిర్మాణం

**II. ఉపవిలువ** : సహన గుణాన్ని అలవరచుకోవడం

**III. లక్ష్యాలు / ఆశించే ఫలితాలు** :
- సహనగుణాన్ని అలవరచుకుంటారు
- సహనంతో ప్రవర్తిస్తారు

**IV. ఉపోద్ఘాతం** : 'సహనం' ఒక ఉత్తమగుణం. సహనగుణం కలిగి ఉంటే చాలా సద్గుణాలు అలవడతాయి. ఒక వ్యక్తి జీవితంలో అనేక ఒడుదుడుకులు సంభవిస్తుంటాయి. ఈఒడుదుడుకులే మనకు పరీక్షాసమయాలు. వాటిని సహనంతో ఎదుర్కోగలగాలి. సహనం కలిగినవారే దేనినైనా నేర్చుకోగలరు. ప్రతిమనిషి ఒకేసారి అనుకున్నది సాధించలేడు. సాధించేవరకు సహనం వహించి ప్రయత్నించాలి.

సహనం లోపించి ప్రవర్తించడం వల్ల వాదోపవాదాలు పెరుగుతూ వివాదాలకు దారితీస్తాయి. ప్రమాదాలకు కారణాలవుతాయి. విచక్షణ లోపిస్తుంది. కొట్టుకోవడాలు, విడిపోవడాలు జరుగుతాయి. దీంతో మానవ సంబంధాలకు భంగం కలుగుతుంది. సహనగుణాన్ని అలవరుచుకోవలసిన ఆవశ్యకతను తెలియజేయడమే ఈ పాఠ్యాంశ ఉద్దేశం.

**V. సంఘటనలు** :

**సంఘటన-1**

అదో సమావేశమందిరం. మానవీయ విలువలపైన చర్చాకార్యక్రమం జరుగుతోంది. చర్చలో చాలామంది పాల్గొంటున్నారు. ప్రసాద్. చర్చలో తనవంతు వచ్చేదాకా ఆగకుండా అడ్డదిడ్డంగా మాట్లాడడం మొదలుపెట్టాడు. ఇది ఇతర సభ్యులకు ఇబ్బందిని కలిగిస్తున్నది. చర్చలో అనవసరంగా, అసందర్భంగా మాట్లాడుతున్నాడు. విసుగు చెందిన ఇతర సభ్యులు ప్రసాద్

వాదనను అడ్డుకొన్నారు. దీంతో అతనిలో అసహనం మొదలైంది. ఉద్రేకానికి లోనయ్యాడు. మాటామాటా పెరిగింది. విచక్షణ కోల్పోయాడు. నోటిదురుసుతో ఇష్టం వచ్చినట్లు మాట్లాడేశాడు. సమావేశం నుండి దురుసుగా వచ్చేశాడు.

ఇంటికి వచ్చాడు. అతనికి ఇంకా అసహనంగానే ఉంది. కాస్సేపు వాలుకుర్చీలో చేరగిలబడ్డాడు. సమావేశంలో జరిగిన సన్నివేశాలను గురించి. ఆలోచిస్తూ ఉన్నాడు. తన ప్రవర్తన తనకే నచ్చలేదు. నేనలా చేసుండకూడదు. నావంతు వచ్చేదాకా ఆగి, కాస్తంత ఓర్పు వహించి ఉంటే సరిపోయేది కదా! అనుకొన్నాడు.

**సంఘటన-2**

రాజు బద్ధకంగా నిద్రలేచాడు. టైం చూసుకొన్నాడు 9 గంటలైంది. అరే! తొమ్మిదైపోయిందే! 10 గంటలకు మార్నింగ్‌షో సినిమా మొదలవుతుంది కదా! అనుకొంటూ గబగబా తయారయ్యాడు. టూవీలర్ తీసికొని ఆదుర్దాగా బయలుదేరాడు. మెయిన్‌రోడ్డుపైకి వచ్చాడు. వాహనాల రద్దీ విపరీతంగా ఉంది. ఇది రాజుకి అసహనంగా ఉంది. మనసంతా సినిమా షోపైనే ఉంది. వాహనాల రద్దీని చూసుకోకుండా అడ్డదిడ్డంగా వెళుతున్నాడు. సిగ్నల్ లైట్లని గమనించే స్థితిలో కూడా లేదు. వాహనాల మధ్యనుండీ దూసుకెళుతున్నాడు. ఎదురుగా పడ్డ రెడ్‌లైట్ సిగ్నల్ని కూడా గమనించకుండా వేగంగా ముందుకు వెళ్ళాడు. ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొన్నాడు. ఎగిరి అవతల పడ్డాడు.

**సంఘటన-3**

గౌతమబుద్ధుడు రోజులాగే ఆ రోజు భిక్షాటనకు బయల్దేరి ఒక ఇంటి ముందుకొచ్చాడు. ఆ గృహిణి బుద్ధుడిని సాధారణ భిక్షువుగా భావించి తిట్లవర్షం కురిపించింది. బుద్ధుడు అవన్నీ భరిస్తూ నిశ్శబ్దంగా ఉండిపోతే ఆమెకు మరింత కోపం వచ్చింది.

అలా రాయిలా నిలబడకపోతే, జవాబు చెప్పవచ్చుకదా! అందామె చివరికి.

అమ్మా మీరు నాకు ఆహారం ఇస్తే, నేను దాన్ని కాదంటే ఆ ఆహారం ఎవరికి చెందుతుంది చెప్పండి. అనడిగాడు బుద్ధుడు.

'నాకే' అంది ఆ గృహిణి ఆశ్చర్యంగా.

'మరిప్పుడు మీ తిట్లను నేను తిరస్కరిస్తున్నాను. అవి ఎవరికి చెందుతాయి?' అన్నాడు బుద్ధుడు

ఆ మహిళ క్షణం నివ్వెరపోయి ఆ మాటలు అర్థం గ్రహించి సిగ్గుపడింది. ఆ తర్వాత ఇంట్లోకి వెళ్ళి బుద్ధుడికి వేడివేడి అన్నాన్ని తెచ్చి అందించింది.

## VI. (అ) ఆలోచించడం - ప్రతిస్పందించడం

1. మొదటి సంఘటనను గమనించారు కదా! ఏం జరిగింది? ఇలా ఎందుకు జరిగింది?
2. రెండవ సంఘటనలో ఏం జరిగింది?
3. మూడవ సంఘటన ద్వారా ఏం గ్రహించారు?

4. 'సహనం' ఎందుకు అలవరచుకోవాలి?
5. సహనం అలవరచుకొంటే ఏమి జరుగుతుంది? సహనం కోల్పోతే జరిగే పరిణామాలు ఏమిటి?
6. ఏఏ సందర్భాల్లో సహనం కోల్పోరాదు ! అలా ఎందుకు చేయాలి?
7. అసహనంగా ఉండడం వల్ల ఏం జరుగుతుంది?
8. కుటుంబంలో సహనం ఎప్పుడు అవసరం?

## (ఆ) ఆచరించడం - అనుభవాలు చెప్పడం

1. వారం రోజుల మీ ప్రవర్తనను పరిశీలించండి. మీరు సహనం పాటించాల్సిన సందర్భాలు ఏమేమి వచ్చాయి? అప్పుడు మీరేం చేశారు. ఇలా చేయడంవల్ల మీరు పొందిన ప్రయోజనాలు ఏమిటి చెప్పండి. అలా చేసి ఉండకపోతే ఏం జరిగిఉండేది? చెప్పండి.
2. మీ చుట్టు ప్రక్కల ప్రజలు, బంధువులు స్నేహితులు సహనం కోల్పోయిన సందర్భాలు చెప్పండి. దాని పర్యవసానం ఏమి జరిగింది?

### ఇలాచేయండి

| సహనం పాటించాల్సిన సందర్భాలు | మీరైతే ఏం చేస్తారు? |
|---|---|
| 1. చర్చలో అభిప్రాయాలు చెప్పే సమయం<br>2. ఆటలు ఆడేటప్పుడు<br>3. బస్సు ఎక్కేటప్పుడు<br>4. కొళాయిల వద్ద నీళ్ళు తాగేటప్పుడు<br>5. అమ్మ తినుబండారాలు ఇచ్చే సమయంలో | |

## తెలుసుకోండి

### సహనం చాలా అవసరం !

సహనం అనేది ఒక గొప్ప గుణం. మనం సహనం అనే గుణాన్ని అలవరచుకున్నట్లయితే మన జీవితం మంగళప్రదంగా ఉంటుంది. సహనం అనే దానిని మనం అలవాటు చేసుకున్నట్లయితే మన జీవితం చాలా సాఫీగా సాగిపోతుంది. మనం ఇతరులతో సహనభావంతో ఉండగలిగితే మన జీవితాన్ని సజావుగా నెట్టుకురాగలము. ఈ ప్రపంచంలో అందరూ ఒకే రకంగా ఉండరు. చాలా మంది చాలా రకరకాలమైండ్‌సెట్‌తో ఉంటారు. అందరిని మనం అర్థం చేసుకోవాలి. మనం ఎంతో చిరాకులో ఉన్నా కూడా ఇతరులపట్ల ఆ చిరాకును ప్రకటించకూడదు. ఎప్పటికప్పుడు ప్రతివారితో సహనభావంతో సర్దుకుపోవాలి. మనం ఎంత పని ఒత్తిడిలో ఉన్నా సరే, వినాలనిపించకపోయినా, చెపుతూ ఉంటే మన అసహనాన్ని బయటపెట్టకూడదు వింటున్నట్లే ఉండాలి. అది నటనే కావచ్చు. ఓపికా కావచ్చు. అది ఏదైనా కావచ్చు, ఇతరుల మనస్సును మనం నొప్పించకుండా చూసుకోవాలి. వారిని మనం బాధపెట్టకూడదు. మనం ఎంత విసిగిపోయిఉన్నా సరే ఇతరులకు మన అసహనం తెలియపరచకూడదు. ఎదుటివారు మనతో మాట్లాడడానికి వచ్చారంటే, మనకి ఫోన్ చేశారంటే ఎంతో కొంత అభిమానం ఉంటేనే వస్తారు. ఫోన్ చేస్తారు. మనమీద ఎలాంటి అభిప్రాయం లేకపోతే వారు మన వద్దకు రారు. ఆ అభిమానాన్ని మనం దూరం చేసుకోకూడదు. దూరం చేసుకుంటే మనకి మనుషులు దూరమౌతారు. మనల్ని మరచిపోవడం కూడా జరుగుతుంది. మనకు ఫ్రీ టైమ్ కుదిరినప్పుడు మాట్లాడడానికి అభిమానులేగాని, స్నేహితులేగాని, ఎవరూ కూడా లేకుండా పోతారు. ఆ సమయంలో మనకు ఏమీ తోచక పిచ్చివాళ్ళుగా మారిపోతాము. అందువలనే మనం బిజీగా ఉన్నప్పుడు కూడా ఎవరైనా వచ్చి మనతో మాట్లాడాలనుకుంటే వారికి సంతోషంగా నమస్కరించి వారిపట్ల మనకు చాలా ప్రేమ ఉన్నట్లు ప్రవర్తించాలి. అంతేగాని వచ్చినవారు ఎప్పుడు వెళ్ళిపోతారా అన్నట్లు మాట్లాడకూడదు. మన కళ్లలో అసహనం అసలు కన్పించకుండా చూసుకోవాలి.

### జ్ఞానాన్ని పెంచే సహనం మీ చిరునామానా?

సహనం జ్ఞానాన్ని పెంచేందుకు సహకరిస్తుందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. ఇదే సహనాన్ని కీలకమైన సమయంలో కోల్పోతే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. అందుకే సహనంతో ఉండాలని మన పెద్దలు హితబోధ చేస్తుంటారు.

అయితే ఈ సహనం మీలో ఎలా పెంపొందించుకోవాలి. ఒకవేళ మీలో సహనం తక్కువగా ఉంటే ఏ విధంగా అలవర్చుకోవాలన్న దానికి కొన్ని సాధారణ నియమాలను పాటిస్తే సరిపోతుంది. ముఖ్యంగా, మహిళలు ఈ విషయంలో జాగ్రత్తగా ఉంటే మరీ మంచిది.

తరచూ సహనాన్ని కోల్పోతున్నట్లు అనిపిస్తే శారీరక వ్యాయామం ద్వారా సమస్యను అధిగమించడానికి ప్రయత్నించాలి. ఒక విషయంలో సహనం కోల్పోతున్నట్లు భావిస్తే మీలో మీరు నిగ్రహించుకునేందుకు ప్రయత్నించాలి.

ముఖ్యంగా, కీలక సమయాల్లో మీ మాటకు తగిన ప్రాధాన్యత ఇవ్వలేదనే విషయం మీకు అర్థమైనప్పటికీ దాన్ని పెద్దగా తీసుకోకుండా ఉండటం ఎంతో మంచిది. తామరాకు మీద నీటిబొట్టులాగ భావోద్వేగాలకు దూరంగా ఉండటం చాలా మంచిది. సహనం హద్దులు దాటుతున్నట్టు లేదా నోరు అదుపు జారుతుందని మీకు అనిపించినా వెంటనే పది నుంచి ఒకటి వరకు అంకెలు లెక్కిస్తే ప్రయోజనం ఉంటుంది.

సహనం ఒక విధమైన నిగ్రహణ శక్తి. ఓ మానసిక పరిపక్వత గల స్థితి. ముఖ్యంగా కష్ట సమయాల్లో ఏదైనా విషయాన్ని, ఉద్వేగాన్ని దాటవేయడం ద్వారా గానీ వాయిదా వేయడం ద్వారా గానీ చింతన లేదా కోపాన్ని అధిగమించడంగా పరిగణించవచ్చు లేదా బాధను అధిగమిస్తూ ఓర్పుతో ఉండడాన్ని కూడా సహనంగా పరిగణిస్తారు. మానవుని మానసిక భావోద్వేగాల నియంత్రణకు ఉపకరించే సహనం. ఈ భావాన్ని ఒక్కోసారి ఓ వ్యక్తి వ్యక్తిత్వాన్ని తనకున్న నిశ్చంచల లక్షణాన్ని నిర్వచించడానికి కూడా ఉపయోగిస్తుంటారు.

పట్టుదల, సహనం రెండింటికి అవినాభావ సంబంధం ఉంది. మనిషికి ఒట్టి పట్టుదల ఉంటే సరిపోదు. సహనం అనేది లేకపోతే పట్టుదల వేస్ట్. పిల్లలని పట్టుదలతో చదవమని అంటుంటాము, ఆ పని పట్టుదలతో చేయాలి రా అంటాము. కాని వాళ్ళలో సహనం అనేది ముందు ఉంటే పట్టుదలతో కృషి చేసి విజయం సాధిస్తారు. సహనం, పట్టుదల. ఈ సద్గుణాలు లేనిదే లౌకిక జీవనలోకానికి, ఆధ్యాత్మిక పథంలోకాని, విజయం సాధించడం అసాధ్యం. ఈ గుణాలు సంకల్ప శక్తిని పెంపొందిస్తే ప్రతిదశలో కష్టాలు కలిగినా, వాటిని సహనం పట్టుదలతో ఎదుర్కోవాలి. ఈ సద్గుణాలవల్లనే మహాత్మాగాంధీగారు తమ ప్రయత్నాలలో విజయం సాధించారు. తనకు కలిగిన అపజయాలపట్ల అధైర్యపడలేదు. ఈ లోకంలో గొప్పవారందరూ సహనం, పట్టుదలతోనే గొప్పదనం, విజయం, పేరు ప్రఖ్యాతులు, పేరు ప్రతిష్టలు సంపాదించారు. ఈ సద్గుణాలను నెమ్మదిగా అలవరచుకోవాలి.

సహనంగల వ్యక్తి ఎల్లప్పుడూ ప్రశాంతంగా, మానసిక సంతులత కలిగి ఉంటాడు. అపజయాలకు కష్టాలకు భయపడడు. స్వయం శక్తిని దృఢపర్చుకొనే మార్గాలను అన్వేషిస్తాడు. ఏకాగ్రతా సాధనకు అపారమైన సహనం కలిగి ఉండాలి. కొందరు వ్యక్తులు కష్టాలు ఎదురుపడగానే అధైర్యపడి తమ ప్రయత్నాలను విరమించుకుంటారు. ఇది చాలా తప్పు ఎన్ని అవరోధాలు ఎదురైనా సాధకులు తమ సాధనను వదులుకోకూడదు. చీమలు చిన్న చిన్న చెక్కర, బియ్యం ముక్కలను సేకరించి తమ పుట్టలోనికి తీసుకువెళ్ళాయి. వాటికి ఎంత సహనం, ఎంత పట్టుదల, ఎంత ఐకమత్యం ‘ ఓ బద్ధకస్తుడా చీమల జీవ శైలిని గమనించి బుద్ధి తెచ్చుకో’ అనే వాక్యం బైబిల్‌లో ఉంది. తేనెటీగలు ప్రతి పుష్పం నుంచి ఏంతో ఓర్పుతో తేనె చుక్కలు తెచ్చి తెనెతుట్టెలో ప్రోగు చేస్తాయి. వాటి కెంత సహనమో గమనించండి. సహనంగల వ్యక్తి ఎంత మాత్రం చికాకు పడదు సహనం వలన అమిత శక్తి కలుగుతుంది. సహనం వలన కోపాన్ని జయించవచ్చు. సహనంగా ఉండటం ముందు నేర్చుకొంటే అది Slow & steady wins race –సామెత లాంటిది.

సహనం వల్ల కలిగే లాభాలను గురించి రోజూ ఆలోచించడం నేర్చుకోవాలి. అలా ఆలోచించడం వల్ల తెలియకుండానే సహన శీలురం అవుతాం. మనల్ని చూసి నలుగురూ నమస్కరించే విధంగా మారతాము.

జీవితంలో అందరూ ఏదో ఒక విధమైన కష్టాన్ని అనుభవించితీరాలి. కొందరు కష్టాలకు లోనైనప్పుడు దిక్కుతోచక నిరుత్సాహంతో నిరాశావాదులవుతారు. తమ కష్టాలకు ఇతరులే కారణమని భావించి వారిని నిందించి ఆత్మతృప్తిని పొందుతారు. మరికొందరు దుఃఖభారాన్ని సహించలేక ఆత్మహత్యవంటి నీచకృత్యానికి పాల్పడతారు. మానవ జీవితంలో సుఖదుఃఖాలు శాశ్వతంకావు. మనం కోరుకోకపోయినా దుఃఖం సంభవిస్తుంది. దుఃఖం వచ్చినప్పుడు నిస్పృహ చెందకుండా అందుకు కారణం తెలుసుకోవాలి. దాన్ని అధిగమించేందుకు ధైర్యంతో ముందడుగు వేయాలి.

సజ్జనులు, సత్యవంతులు, పరోపకార గుణం కలవారు, చెడుమాటల్ని, నిందల్ని వినవలసి ఉంటుంది. ఇక సామాన్యుల గతి ఏమిటి? అటువంటి దుష్ప్రచారాన్ని, నిందల్ని దిగమించాలని కాదు. యుక్తాయుక్తాల్ని గమనించి ప్రతిక్రియకు పూనుకోవాలి. ప్రపంచంలో ప్రతివ్యక్తీ ఏదో ఒక విధమైన నిందల్ని వినాల్సి వస్తుంది. అందువల్ల నిస్పృహ చెందకుండా అందరి నోటిని మూయించడానికి చేసే ప్రయత్నం వృథా కాగలదు. నిజం, నిందించేవారి నోటిని తనకు తానుగా మూసుకొనేట్లు చేయాలి. ఒక విధంగా చూస్తే నిందించేవారి అవసరం ఎందుకంటారేమో! వారు మన లోపాలను ఎత్తి చూపుతూ మనల్ని తీర్చిదిద్దిన గురువులవుతారు. సహనం వల్లనే ఈ తెలివి మనకు లభిస్తుంది. సహనంతో సద్గుణాలన్నీ మన వశం కాగలవు. ఓర్చితే ఓరుగల్లే పట్టణం అవుతుందన్నారు.

సూక్తి : 1. ఒక్కక్షణం, సహనం కొండంత ప్రమాదాన్ని దూరం చేస్తే, ఒక్క క్షణం అసహనం మొత్తం జీవితాన్నే నాశనం చేస్తుంది. – స్వామి వివేకానంద.

సూక్తి : 2. సహనంలేనని వ్యక్తి ఎన్నటికి విజయం పొందలేడు.

# 4 మానవీయత

**I. ప్రధాన విలువ** : జీవన నైపుణ్యాలు

**II. ఉపవిలువ** : మానవసంబంధాలు – మూలాలు

మంచి అనుకూల వైఖరులు కలిగి ఉండటం

**III. లక్ష్యాలు / ఆశించే ఫలితాలు** :

- మానవసంబంధాలు నిలిచి ఉండటానికి గల కారణాలను తెలుసుకుంటారు.
- అనుకూల వైఖరులు కలిగి మంచి మానవ సంబంధాలను ఏర్పరచుకుంటారు.

**IV. ఉపోద్ఘాతం** : ప్రస్తుత కాలంలో ఉరుకు పరుగుల జీవితాలలో మనుషుల మధ్య సంబంధాలు తగ్గిపోతున్నాయి. మనుషులు ఆర్థికపరమైన అంశాలకు ఇచ్చినంత ప్రాధాన్యత మానవ సంబంధ అంశాలకు ఇవ్వటం లేదు. ఉదయం నిద్రలేచి పనులు చేసుకొని ఆఫీసుకువెళ్ళి అలసిపోయి ఇంటికి వచ్చిన తర్వాత భార్యాభర్తలు మాట్లాడుకోవడానికి కాని, తల్లిదండ్రులు పిల్లలు మాట్లాడుకోవటానికి కాని, బంధువులతో, ఇరుగుపొరుగువారితో మాట్లాడటానికి సమయం దొరకడంలేదు. సమయం దొరికినా ఏ టి.వి. ముందో కంప్యూటర్ ముందో కూర్చుని కాలం వెళ్ళబుచ్చుతున్నారు తప్ప కలిసి కూర్చొని మాట్లాడుకోవటం లేదు. ఒక వేళ మాట్లాడినా పని ఒత్తిడి వల్ల, విసుగు వల్ల, చికాగ్గా మాట్లాడటం వల్ల మనుషుల మధ్య మనస్పర్థలు వస్తున్నాయి. పిల్లలు కూడా తోటి పిల్లలతో ఆడుకోవడం కన్నా టి.వి, కంప్యూటర్లకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. మనుషుల మధ్య సంబంధాలు నెలకొనాలన్నా, నిలిచి ఉండాలన్నా, చిరునవ్వుతో, ఆప్యాయతతో పలుకరించాలి. గౌరవభావం కలిగి ఉండాలి. వినయం, విధేయత, సహనం, ఓర్పు ఉండాలి. ఇవన్నీ, విద్యార్థులలో పెంపొందించాలి. వారు పరిస్థితులను అర్థం చేసుకొని తల్లిదండ్రులతో, ఇతరులతో మంచి సంబంధాలను కలిగి ఉండేలా ప్రోత్సహించాలి.

## V. సంఘటనలు :

### సంఘటన-1

రాఘవ 7వ తరగతి చదువుతున్నాడు. మంచి తెలివైన విద్యార్థి. అతని తల్లిదండ్రులు ఇద్దరూ ఉద్యోగస్థులు. ఉదయం 9 గం॥లకు ఇంట్లో బయలుదేరితే సాయంత్రం 8 గం॥లకు వస్తారు. రాఘవకు ఇంటిపని చేసేటప్పుడు అప్పుడప్పుడు డౌట్స్ వస్తుంటాయి. అమ్మనడిగితే నాన్నా! పనిలో బిజీగా ఉన్నాను చూస్తున్నావు కదా! నాన్ననడుగు అంటుంది. నాన్ననడిగితే ఆఫీస్ నుంచి రాగానే విసిగిస్తావు అని విసుక్కుంటారు. ప్రియంగా మాట్లాడరు. తనకు కావలసినవన్నీ తెచ్చిస్తారు. కానీ అమ్మానాన్నలకు తనతో మాట్లాడటానికి సమయం ఉండదు. తనంటే అమ్మానాన్నలకు ఇష్టమా, కాదా రాఘవకు సందేహం.

### సంఘటన-2

అనిల్, అనిరుధ్ ఇద్దరూ మంచి స్నేహితులు. ఇద్దరూ 7వ తరగతి చదువుతున్నారు. ఎవరికి అవసరమొచ్చినా మరొకరు సహాయం చేసుకుంటారు. ఒక్కోసారి కోపంలో ఉండి ఒకరికొకరు విసుక్కున్నా సర్దుకుపోయే వారు కాని పోట్లాడుకునే వారు కాదు. ఒకరికి బాధకలుగితే మరొకరు తట్టుకోలేరు. ఒకసారి ఇద్దరూ సైకిల్ మీద పాఠశాలకు వస్తుంటే అనిరుధ్ కింద పడ్డాడు. మోచేతికి, మోకాలుకి దెబ్బలు తగిలాయి. అంతే అనిరుధ్ కళ్ళ వెంబడి నీళ్ళు కారాయి. అనిల్‌కు కూడా కళ్ళవెంబడి నీళ్ళు వచ్చాయి. తన సైకిల్ మీద డాక్టర్ దగ్గరకు తీసుకుని వెళ్ళి గాయాలకు చికిత్స చేయించి వాళ్ళ ఇంట్లో దిగబెట్టాడు. అనిరుధ్‌కు గాయాలు మాని ఆడుకోవడానికి వచ్చేదాకా అనిల్ కూడా ఆడుకోవడానికి వెళ్ళలేదు. సాయంత్రం పూట అనిరుధ్ పక్కనే కూర్చుని కబుర్లు చెప్పేవాడు.

### సంఘటన-3

రాఘవయ్య ఒక రైతు. రాజుపాలెం అనే పల్లెటూరిలో ఉంటాడు. చాలా మంచి వాడు. భార్యలేదు, పిల్లలు అమెరికాలో ఉంటారు. చిన్న, పెద్ద, పేదవారు, ధనికులు అన్న బేధం లేకుండా అందరికీ సహాయం చేస్తాడు. అందరితో మంచిగా ఉంటాడు. అతని ముఖంలో కోపంకాని విసుగుకాని ఆ ఊరి వాళ్ళు ఎప్పుడూ చూడలేదు. అనుకోకుండా ఒకసారి అతనికి జబ్బు చేసింది. మంచం మీదినుంచి లేవలేక పోయాడు. అంతే ఆ ఊరు ఊరంతా అతని ఇంట్లోనే ఉందా అన్నట్లుగా ఒకరు డాక్టరును పిలుచుకొని వచ్చారు. మరొకరు వాళ్ళింట్లో ఆయనకు కావలసిన పాలు, జావ కాచుకొని వచ్చారు మరొకరు ఆయనకు సపర్యలు చేశారు. ఇలా రాత్రింబవళ్ళు ఆయనకు సేవచేశారు. రాఘవయ్య మళ్ళీ మామూలుగా ఆరోగ్యవంతుడయ్యాడు.

## VI. (అ) ఆలోచించడం - ప్రతిస్పందించడం

1. పై సన్నివేశాల ద్వారా మీరేమి గ్రహించారు?
2. మనుషుల మధ్య సంబంధాలు ఎందుకు ఉండాలి? ఎలాంటి సంబంధాలు కలిగి ఉండాలి?
3. మనుషుల మధ్య సంబంధాలు నిలిచి ఉండాలంటే మన ప్రవర్తన ఎలా ఉండాలి?
4. నీకు మంచి స్నేహితులు ఉన్నారా? వారంటే నీకు ఎందుకు ఇష్టం?

5. ఆనందంగా జీవించాలంటే డబ్బు, ఆస్తిపాస్తులు కాదు అందరితో మంచి సంబంధాలు ఉండాలి. దీన్ని మీరు ఏవిధంగా సమర్థిస్తారు?

6. మీ ఇంట్లో, మీ చుట్టుపక్కల వాళ్ళతో మీరు ఎలా ఉంటారు? వాళ్ళు మీతో ఎలా ఉంటారు?

## (ఆ) ఆచరించడం - అనుభవాలు చెప్పడం

1. ఈవారం రోజులు మీరు పెద్దల పట్ల గౌరవంతో, నమ్రతతో ప్రవర్తించండి. ఎవరిపైనా కోపం, విసుగు లేకుండా ఓర్పుతో ఉండండి. ఇతరులకు చేతనైన సహాయం చేయండి. మీ అనుభవాలను చెప్పండి.

## తెలుసుకోండి

మానవుడు సంఘజీవి. సమాజంలో జీవించాలంటే సమాజంలోని వ్యక్తులతో సంబంధాలను కలిగి ఉండాలి. మనుషుల మధ్యనున్న సంబంధాలు మన వ్యవహారాలను బట్టి మారుతూ ఉంటాయి. అంటే ఇప్పుడు మిత్రుడుగా ఉన్నవాడు మరికొంత కాలానికి శత్రువుగా మారవచ్చు; అభిమానించిన వారే ద్వేషించవచ్చు. దీనికి కారణం మనుషుల మధ్య ఏర్పడిన సంబంధాలను వారు నిలబెట్టుకోలేక పోవడమే మనుషుల మధ్య ఏర్పడిన సంబంధాలు అవి కుటుంబాలలో కానీ సమాజంలో కానీ కలకాలం నిలిచి ఉండాలి అంటే మనం మంచి అనుకూల వైఖరులను కలిగి ఉండాలి. ఎదుటి వారిని కష్టపెట్టే మాటలు కాని పనులుకాని చేయరాదు.

మానవ సంబంధాలు అన్నీ సాధారణంగా అవసరం మీదనే ఆధారపడి ఉంటాయి. ఇక్కడ అవసరం అంటే కేవలం భౌతిక అవసరాలేకాదు మానసిక అవసరాలు కూడా. ఉదా॥ కుటుంబంలోని సభ్యులతో గడపడం వల్ల నేను ఆనందంగా ఉంటాను. అనుకుంటే ఇక్కడ మనకు మానసిక అవసరం తీరుతున్నట్లే అలానే సమాజంలోని వ్యక్తులు కూడా ఏదైనా కార్యం నెరవేర్చుకోవాలంటే ఒకరి శక్తి చాలదని సంఘాలుగా ఏర్పడతారు. ఇక్కడి సంబంధాలు కూడా అవసరం కోసమే. ఇలా ఏర్పడిన మానవసంబంధాలు నిలిచి ఉండాలి అంటే మనం కొన్ని అనుకూల వైఖరులను కలిగి ఉండాలి. అవి :

### నమ్మకం :

మానవ సంబంధాలు ఒకరిపై మరొకరికి గల నమ్మకంపై ఆధారపడతాయి. ఎదుటి వ్యక్తిలో నిజాయితీ ఉంటేనే వారి మీద మనకు నమ్మకం కుదురుతుంది. కనుక సంబంధాలు మంచిగా ఉండాలంటే నమ్మకంతో వ్యవహరించాలి. నమ్మిన వారినే మోసం చేయవచ్చు అని మోసపూరితంగా వ్యవహరిస్తే సంబంధాలు దెబ్బతింటాయి.

ఉదా॥ అమ్మ మనను అన్ని వేళలా నమ్ముతుంది.

ఉదా॥ అమ్మ ఎప్పుడూ పిల్లల మాటలను నమ్ముతుంది. అమ్మ మా స్నేహితుని ఇంటికెళ్ళి చదువుకుంటాను అని చెపితే, అలాగే అంటూ మురిసిపోయి పంపుతుంది. కానీ మీరు వెళ్ళి చదువుకోకుండా టి.వి. చూడడమో, ఆడుకోవడమో చేసారనుకుందాం, అప్పుడు నిజం మీ అమ్మకు తెలిస్తే ఎలా ఉంటుందో ఊహించండి. మీ మీద నమ్మకం ఏమౌతుందో ఆలోచించండి.

## పరస్పర గౌరవం :

గౌరవం ఇచ్చిపుచ్చుకోవాలి అంటారు అంటే మనం ఇతరుల్ని గౌరవించినపుడే ఇతరులు మనల్ని గౌరవిస్తారు. గౌరవం లేని చోట మనం కొద్దిసేపు కూడ ఉండలేము. కనుక చిన్న, పెద్దా, స్త్రీలు, పురుషులు, బీదవారు అన్న భేదాలు లేకుండా అందరినీ గౌరవించాలి. గౌరవాన్ని పొందాలి. పిల్లలు పాఠశాలలో ఉపాధ్యాయులు కనిపించినపుడు గౌరవంగా పలుకరించి వారి అభిమానాన్ని పొందాలి.

ఉదా॥ ఇంటికి వచ్చిన వారితో మర్యాదగా మాట్లాడాలి.

ఉదా॥ రజని ఇంటికి వాళ్ళ నాన్న ఫ్రెండు ఎవరైనా వచ్చినా లేదా పెద్దలు ఎవరైనా వచ్చినా గౌరవంగా పలకరించి కూర్చోపెడుతుంది. మంచినీళ్ళు తాగుతారా అని అడుగుతుంది. ఏ పని మీద వచ్చారో కనుక్కుంటుంది. వచ్చిన వాళ్ళకు రజని గౌరవించే తీరు చాలా నచ్చడమే కాదు రజనినీ కూడా వాళ్ళు గౌరవంగా చూస్తారు.

## సహానుభూతి :

ఎవరికైనా ఏదైనా బాధకలిగినపుడు మనం వారి స్థానంలో ఉండి ఆలోచించి వారికి సహాయం చేయాలి. ఇదే సహానుభూతి. ఉదా॥ ఎవరైనా బాధల్లో ఉంటే వారికి స్వాంతన కలిగించే మాటలు చెప్పి వారి బాధను తగ్గించడం సానుభూతి అయితే తానే ఆ పరిస్థితులో ఉంటే ఎలా బాధపడుతాడో ఆ బాధను అనుభవిస్తూ అతనికి సహాయం చేస్తే అది సహానుభూతి. దీనివల్ల మానవసంబంధాలు వృద్ధి చెందుతాయి. మనుషులు ఇతరుల దృష్టికోణంలో ఆలోచిస్తారు కనుక అపార్థాలు అనేవి ఉండవు.

ఉదా॥ తోటి ప్రాణులకు దెబ్బతగిలినప్పుడు వారిని ఓదార్చి, అవసరమైన సహాయం అందివ్వడం.

ఉదా॥ పిల్లికూనలు రెండు ఆడుకుంటూ ఉన్నాయి. ఇంతలో ఒకటి బండి చక్రంలోకి ఇరుక్కుపోయింది. అది కుయ్యో మొయ్యో అని అరుస్తూ ఉంది. ఇది లత చూసింది. ఎలాగౌనా ఆ పిల్లిని కాపాడాలనుకుంది. పాపం అది భయంతో చక్రంలోపలికి దూరిపోయే కొద్దీ కాలు ఇరుక్కుపోయి నొప్పితో అరుస్తుంది. లత మెల్లగా దాన్ని పట్టుకొని చక్రం ఊచలను వెడల్పు చేసి దాన్ని రక్షించింది. కాలుకు మందు రాసింది.

## సర్దుబాటు :

వ్యక్తులతో గాని, పరిసరాలతోగాని సర్దుబాటు చేసుకోగలిగిన వ్యక్తి ఎక్కడైనా ఆనందంగా జీవించగలడు, సత్సంబంధాలను నెలకొల్పుకోగలడు. మనుషుల అలవాట్లు, వారి మనస్తత్వాలు, ప్రవర్తనలు, వైఖరులు ఒకే

విధంగా ఉండవు ఈవిధంగా వివిధ రకాలైన మనుష్యులతో సత్సంబంధాలు ఏర్పరచుకోవాలంటే సర్దుబాటు ఉండాలి.

ఉదా॥ బస్సులో విపరీతమైన రష్‌గా ఉంది. చాలా మంది నిలబడి ఉన్నారు. అందులో ముసలివాళ్ళు కూడా ఉన్నారు. విశాల్, ప్రశాంత్ వాళ్ళని చూసి వెంటనే లేచి తమ సీటులో కూర్చోమన్నారు. ఆ ముసలివాళ్ళకు చాలా సంతోషమైంది.

## కృతజ్ఞత :

మనకు మేలు చేసిన వారికి, సహాయం చేసిన వారికి కృతజ్ఞతలు తెలపడం మన ధర్మం. మనకు వారు చేసిన మేలు మరువకుండా ఉండాలి. వారికి కూడ మనకు చేతనైన సహాయం అందించాలి.

ఉదా॥ శ్రీనివాస్ అయ్యంగార్ మాస్టారుగారి ఇల్లు ఎక్కడండీ వారిని కలవాలి అన్నాడు వెంకటేష్ అనే యువకుడు ఊరివాళ్ళతో. ఆయన బాబు! ఆయన ఇప్పుడు లేరు చనిపోయి చాలా కాలం అయ్యింది అన్నారు ఊరివాళ్ళు. వాళ్ళ ఇంట్లో వాళ్ళైనా ఉన్నారా మళ్ళీ అడిగాడు. ఆ... ఉన్నారు అదిగో అదే ఇల్లు చూపెట్టారు. వెంకటేష్ వెళ్ళేసరికి మాస్టారు భార్య, కొడుకు, కోడలు ఉన్నారు. వెంకటేష్ వారితో నమస్కారమండీ. నా పేరు వెంకటేష్ నేను ఎస్.ఐ.గా పనిచేస్తున్నా. నేను ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నానంటే మాస్టారి చలవే. ఆయన దగ్గర వారాలు ఉండి చదువుకున్నా, నాకింత తిండిపెట్టి, చదువుచెప్పి, నన్ను ప్రయోజకుడ్నిచేసినందుకు ఆయనకు కృతజ్ఞతలు చెబుదామని వచ్చాను. నా దురదృష్టం వారిని చూసే భాగ్యం లేదు అన్నాడు. మస్టారి గారి కుటుంబానికి ఆనందంతోబాటు ఆశ్చర్యం వేసింది.

## వినయం / విధేయత :

పెద్దవారి పట్ల వినయ విధేయతలు కలిగి ఉండాలి. అది నలుగురిలో మనగౌరవాన్ని పెంచుతుంది.

ఉదా॥ నాన్నా ఉండండి నేను సామాన్లు తీసుకొస్తా, అంటూ చేతిలోని సంచిని అందుకున్నాడు వినయ్. ఇంట్లో కూడా అంతే అమ్మ, నాన్నాలు చెప్పిన పని ఏదైనా తుచ తప్పకుండా చేస్తాడు. వారి మాటలకు అంత విలువ ఇవ్వడమే కాదు వారికి ఏ లోటు రాకుండా చూసుకుంటాడు. వినయ్ ఎవరితోనైనా అలాగే ఉంటాడు. ఇతరులను గౌరవంగా చూడడం, వారి మాటలను వినయంతో వినడం, పాటించడం. అందుకే వినయ్ అంటే ఆ ఊరిలో అందరికీ గౌరవం.

## క్షమాగుణం :

ఇతరులు తప్పుచేసినపుడు వారిని క్షమించే గుణం కలిగి ఉండాలి. అలాగే మనం తప్పు చేసినపుడు కూడా దానిని అంగీకరించి క్షమాపణలు చెప్పగలగాలి.

ఉదా॥ నేను తప్పుచేశానురా! మా అమ్మ నాన్నలకు వ్యాపారం చేస్తున్నాని డబ్బు తీఃసుకుపోయి అంతే జల్సాగా ఖర్చుపెట్టా. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని వాళ్ళ దగ్గరికి వెళ్ళాలి. నేను ఇంటికి రానురా అన్నాడు వెంకట్ తన స్నేహితుడు రమేష్‌తో. నువ్వు తప్పు తెలుసుకున్నావు కదా! మీ అమ్మ, నాన్న సంగతి నాకు తెలుసు వాళ్ళు నిన్ను అర్థం చేసుకొని క్షమిస్తారు. నీకేమి భయంలేదు. ఇంటికి పోదాం రా అన్నాడు. రమేష్ అన్నట్లుగానే వెంకట్ వాళ్ళ అమ్మ నాన్న డబ్బు పోతే మళ్ళీ సంపాదించుకోవచ్చు. నువ్వే లేకపోతే మేమెలా బతకాలిరా అంటూ వెంకట్‌ని దగ్గరికి తీసుకున్నారు. వాళ్ళు తనను కోప్పడకుండా క్షమించినందుకు ఇంకెప్పుడూ ఇలాంటి పొరపాటు పనులు చేయకూడదని నిర్ణయించుకున్నాడు వెంకట్.

## ఉద్వేగ నియంత్రణ :

మానవ సంబంధాలను నిలిపి ఉంచడంలో ఇది ప్రముఖపాత్ర వహిస్తుంది. సాధారణంగా మనుషులమధ్య సంబంధాలు శత్రుత్వాలుగా మారడానికి కారణం ఈ ఉద్వేగనియంత్రణ లేకపోవడం. మనలోని ఆవేశాన్ని, క్రోధాన్ని, ద్వేషాన్ని నియంత్రించుకోవడం ద్వారా, సహనం, ఓర్పును అలవరచుకోవడం ద్వారా మానవ సంబంధాలను కలిగి ప్రశాంతంగా జీవించవచ్చు.

అంటే మనం ఇతరులతో మంచి సంబంధాలను నెలకొల్పుకోవాలన్నా, ఏర్పడిన సంబంధాలను నిలిపి ఉంచుకోవాలన్నా పైన చెప్పిన అంశాలను పాటించాలి. మానవసంబంధాలను ఏర్పరచుకున్న వ్యక్తి ఎటువంటి ఒడిదుడుకులు లేకుండా విజయవంతంగా, ప్రశాంతంగా జీవించగలడు.

ఉదా॥ కోపం వస్తే రంగయ్య మనిషికాదు అలా ఊగిపోతాడు. ఇంట్లో అందరినీ తిట్టడమే కాదు ఏది కనబడితే దాన్ని విసిరిపారేస్తాడు. ఒకసారి అలా విసిరేసినప్పుడే కర్ర వేగంగా అతని కూతురు కంటికి తగిలి కన్ను పోయింది. కళ్ళు పోయిన కూతురుని చూసి రంగయ్య కుమిలి కుమిలి ఏడ్చాడు. తను ఆ కోపాన్ని ఆ క్షణం నియంత్రించుకుంటే ఈ ప్రమాదం జరిగేది కాదు కదా! అని రోజూ కూతుర్ని చూసి బాధపడుతుంటాడు.

### మిమ్మల్ని మీరు పరీక్షించుకోండి : నేనివి చేస్తున్నానా?

1. అమ్మ నాన్నల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉండడం.
2. నన్ను నమ్మి అప్పజెప్పిన పనులు చేయడం.
3. ఇతరులను గౌరవంగా చూడడం.
4. ఇతరులకు సహకరించడం.
5. ఇతరుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని సర్దుకుపోవడం.

6. నాకు ఉన్నంతలో ఇతరులకు ఇవ్వడం.
7. నాకు ఇదే కావాలని పేచీ పెట్టడం. సాధించుకోవడం.
8. ఎవరైనా చేసిన మేలు మరవకుండా ఉండడం. వారికి కృతజ్ఞతలు చెప్పడం.
9. పెద్దలపట్ల వినయంగా ఉండడం.
10. తప్పు చేసినప్పుడు క్షమించమని అడగడం.
11. కోపాన్ని నియంత్రించుకోవడం.
12. అందరితో సంతోషంగా మాట్లాడడం.
13. ఓర్పు, సహనం కలిగి ఉండడం.
14. అందరితోనూ ఆప్యాయంగా మాట్లాడడం.

## మనం ఇవి చేస్తున్నామా?

1. మన పనులు మనం పూర్తి చేసుకుంటున్నామా?
2. మన పుస్తకాలు, బ్యాగు మనం సర్దుకుంటున్నామా?
3. మన దుస్తులు మనం శుభ్రం చేసుకుంటున్నామా?
4. తరగతి గదులను శుభ్రంగా ఉంచుకుంటున్నామా?
5. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నామా?
6. పాఠశాల వస్తువులను జాగ్రత్తగా కాపాడుకుంటున్నామా?
7. ఇంట్లో మనకు సంబంధించిన వస్తువులను జాగ్రత్తగా సర్దుకుంటున్నామా?

**సూక్తి :** తన యింటికి వచ్చినవాడు ఎట్టివాడైనా తగిన రీతిగా వానిని ఆదరించవలెను. కుశల ప్రశ్నాదులచే సంభాషించి, శక్త్యానుసారము మంచి తీర్థము, అన్నము నొసగి సంతోషపెట్టవలెను.

# 5 బాధ్యత నిర్వర్తించడం

**I. ప్రధాన విలువ** : బాధ్యతలు నిర్వర్తించడం, కర్తవ్యపాలన

**II. ఉపవిలువ** : పాఠశాల అభివృద్ధిలో విద్యార్థులుగా బాధ్యతలు తెలుసుకొనడం

**III. లక్ష్యాలు / ఆశించే ఫలితాలు** :

- విద్యార్థులుగా పిల్లలు ఏఏ బాధ్యతలు నిర్వహించాలో తెలుసుకొంటారు.
- పాఠశాల ఆస్తులను పరిరక్షించుకోవడంలో వారి బాధ్యతలను తెలుసుకుంటారు.

**IV. ఉపోద్ఘాతం** : మనం చిన్నపిల్లలుగా ఉండి పెద్దవారుగా ఎదుగుతున్నకొద్దీ మన అవసరాల కోసం ఉపయోగించుకునే వస్తువులను మనం ఎంతో జాగ్రత్తగా కాపాడుకుంటాం. మన ఇంటిలో మన వస్తువులకు బాధ్యత వహిస్తాం. అలాగే మన పనులు మనమే చేసుకుంటాం. అలాగే మన పాఠశాలలో కూడా మన పనులకు బాధ్యత వహించాలి. మన తరగతి గది, మన పాఠశాల మనది అనే భావన కల్గినపుడు దానిపై మనకు ప్రత్యేక శ్రద్ధ కలుగుతుంది. అలా కలిగినప్పుడే మనం దానిపై బాధ్యత తీసుకుంటాం. అలా బాధ్యత గురించి తెలియజేయడమే ఈ పాఠ్యాంశ ఉద్దేశం.

**V. సంఘటనలు** :

**సంఘటన-1**

సమయం ఉదయం 8-50 ని॥లు అయ్యింది. ఇద్దరు ఉపాధ్యాయులు బస్సు దిగి హడావిడిగా పాఠశాలకు వచ్చారు. పాఠశాల ముందు పిల్లలు గుంపు గుంపులుగా చేరి గోల చేస్తున్నారు. తరగతి గదులను, పరిసరాలను శుభ్రం చేయలేదు. ఉపాధ్యాయులు పిల్లలను కేకలు వేసి పిలిచి పనులు పూర్తి చేయించారు. ఇంతలో ప్రార్థనా సమయమైంది. బెల్లు మోగింది. శబ్దం విని పిల్లలు తాపీగా ఉన్నారేకానీ, వచ్చి వరుసల్లో నిలబడలేదు. ఉపాధ్యాయులే తంటాలుపడి వరుసల్లో నిలబెట్టారు. ప్రార్థనా సమయం మించిపోతుందన్న హడావిడిలో సూక్తులు, వార్తలు చదువకుండానే జాతీయ గీతం పిల్లలతో పాడించి ప్రార్థనను ముగించారు.

ఉపాధ్యాయులు తరగతి గదులకు వెళ్ళారు. ఇద్దరు ముగ్గురు పిల్లలు బయట తిరుగుతున్నారు. పాఠశాల అంతా ఎప్పుడూ అల్లరిగా ఉంటుంది. మధ్యాహ్న భోజన సమయంలో వరుసలో నిలబడక పిల్లలందరు కొట్టుకొంటుంటారు. పరిశుభ్రతను పాటించరు. ఆటలు ఆడేసమయంలో బాగా గొడవలు పడుతారు. గొడవలో పిల్లలకు గాయాలయ్యాయి. బాలల సభలో ఎవరికి వారు ఇష్టం వచ్చినట్లుగా చెప్పింది వినకుండా మాట్లాడుకుంటారు. ఆ పాఠశాలలో వేడుకలు, ఉత్సవాలు ఎప్పుడూ జరుగవు. పిల్లలకు వివిధ కార్యక్రమాలపై అంతగా అవగాహన లేదు. ర్యాలీలు నిర్వహించరు. పాఠశాలలో ఎలాంటి పనులు చేయరు. సాయంత్రం వరకల్లా తరగతిగదులను చిత్తుకాగితాలతో చిందరవందర చేసి అపరిశుభ్రం చేస్తారు. పిల్లలు గ్రంథాలయ పుస్తకాలను చదువుకోవడానికి ఇంటికి తీసుకెళ్ళి మళ్ళీ తిరిగి ఇవ్వరు. ఇచ్చినా చినిగిపోయిన పుస్తకం వస్తుంది. పాఠశాల వస్తువులను విరగొట్టడం పాడుచేయడం వంటివి చేస్తారు. సాయంత్రం ఇంటి బెల్లు కొట్టగానే పిల్లలంతా ఏకకంఠంతో గట్టిగా అరిచి పరుగులు పెడుతూ ఒకరినొకరు తోసుకుంటూ ఇంటికి వెళ్ళుతారు. ఇలా కాకుండా ఎవరి బాధ్యతలను వారు సక్రమంగా నిర్వర్తించాలి.

### సంఘటన-2

రెండవ పాఠశాల. ఆ పాఠశాలలో పిల్లలందరూ సమయపాలన పాటిస్తూ వరుసలో నిలబడి ప్రార్థనా చేస్తారు. తరగతి గదులను శుభ్రంగా ఉంచుకుంటారు. పాఠశాల ఆవరణ చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటారు. తరగతి గదిలో ఉపాధ్యాయులు నిర్వహించే వివిధ అభ్యసన కృత్యాలలో క్రమశిక్షణతో పాల్గొంటారు. మధ్యాహ్నభోజన సమయంలో చేతులు, ప్లేట్లు కడుక్కొని వరుసలో నిలబడి అన్నంపెట్టుకొని తింటారు. చెత్తకుండిని ఏర్పాటు చేసుకొని దానిలో చెత్తను వేస్తారు. మరుగు దొడ్ల వాడకంలో పరిశుభ్రతను పాటిస్తారు. ఆరోగ్యపు అలవాట్లను పాటిస్తారు. సాయంత్రం సమయంలో నియమాలకను గుణంగా ఎంతో ఉత్సాహంతో ఆటలు, క్రీడలు ఆడుతారు. వ్యాయామాలు చేస్తారు. ధ్యానం చేస్తారు. పాఠశాల ఆవరణలో చెట్లను నాటి తరగతి వారిగా బాధ్యతలు తీసుకొని రోజు వాటికి నీరు, ఎరువువేయడం శుభ్రం చేయడం వంటివి చేస్తారు. వారానికొకసారి బాలల సభరోజున ప్రతి తరగతి నుండి తాము చేసే పనులపై సమీక్ష చేసుకొని సమస్యలను పరిష్కరించుకుంటారు. అందులో భాగంగా పాటలు, పద్యాలు, కథలు చెప్పుకుంటారు.

ముఖ్యంగా పాఠశాల వనరులను కాపాడుకొనడంలో బాధ్యత వహిస్తారు. గ్రంథాలయ పుస్తకాలను తరగతి వారీగా అమర్చుతారు. తరగతి వారీగా పుస్తకాలను పంచిపెట్టి వారం తరువాత తిరిగి వాటి స్థానంలోనే ఉంచుతారు. పాఠశాల వస్తువులను ఎంతో జాగ్రత్తగా కాపాడుకుంటారు. ఏదైనా వస్తువు దొరికితే నిజాయితీ పెట్టెలో వేస్తారు.

సామాజిక కార్యక్రమాలు చేపట్టి ర్యాలీలు నిర్వహిస్తారు. వారు చేసే పనుల గురించి వారి తల్లిదండ్రులకు తెలియజేస్తారు. పాఠశాలలో జరిగే పాఠశాల వార్షికోత్సవంనాడు కమిటీలుగా ఏర్పడి ఎవరికి వారు బాధ్యతలు తీసుకుంటారు. ఆవేడుకకు వారి తల్లిదండ్రులకు, గ్రామపెద్దలకు, అధికారులకు సమాచారాన్ని అందజేస్తారు. వేదికకు కావల్సిన వస్తువులను సేకరించి ఉపాధ్యాయుల సలహాలతో పిల్లలే అలంకరిస్తారు. వచ్చిన వారిని చిరునవ్వుతో పలకరించి ఆహ్వానిస్తారు. సాంస్కృతిక కార్యక్రమాలతో వచ్చిన వారందరిని ఆనందింపచేస్తారు.

తరగతిలో ఉపాధ్యాయులు చెప్పింది శ్రద్ధగా విని ఎప్పటికప్పుడు ఇంటి పనిని పూర్తి చేస్తారు. బాగా చదువుతారు. ప్రతి సంవత్సరం మంచి ఫలితాలు వస్తాయి. ఆ పాఠశాలంటే ఆ ఊరి వారికే కాదు పక్క ఊళ్ళో వారందరికి చాలా ఇష్టం. కాబట్టి ఆపాఠశాల ఒక మంచి పాఠశాలగా గుర్తించబడింది. ఇవన్నీ కార్యక్రమాలు పిల్లలే స్వయంగా చేయడం ద్వారా ఆ పాఠశాల ఎంతో అభివృద్ధి చెందింది. ప్రతి సంవత్సరం పిల్లల నమోదు కూడా పెరుగుతుంది.

## VI. (అ) ఆలోచించడం - ప్రతిస్పందించడం

1. పై రెండు సంఘటనలను గమనించారు కదా! వీటి ద్వారా మీకు ఏం అర్థం అయ్యిందో చెప్పండి.
2. పై రెండు పాఠశాలల్లో ఏ పాఠశాలకు దగ్గరిసంబంధం కల్గి ఉంది?
3. పాఠశాలలో పిల్లలు తమ బాధ్యతలను చేపట్టడం వలన కలిగే ప్రయోజనం ఏంటి?
4. ఒక విద్యార్థిగా నీ బాధ్యతను నీవు నిర్వర్తించినపుడు నీకు ఎలా అనిపిస్తుంది?
5. పాఠశాలలో మీకున్న బాధ్యతలు ఏవి? వీటిని ఎలా నిర్వహించాలి?

## (ఆ) ఆచరించడం - అనుభవాలు చెప్పడం

1. పాఠశాల ఆస్తులన్నీ మనకు సంబంధించినవి అని అనుకున్నప్పుడు వాటిని కాపాడుకోవడానికి మీరేమి చేస్తారో, ఎవరి సహకారం తీసుకుంటారో? మీ అనుభవాలను చెప్పండి.

**నాయకుడు ఏం చేయాలి?**

- ముందు తనను తాను తెలుసుకుని, లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలి.
- తన పనిని కాకుండా అందరి పనిని కూడా తన పనిగా భావించాలి.
- నాయకుడి మంచి ఆలోచనల ద్వారా, మంచి ప్రవర్తన ద్వారా విజయం అనేది సమకూరుతుంది.

**కార్యాచరణ :**

నీవు ఏ ఏ సందర్భాలలో, విషయాలలో, సమస్యల పరిష్కారాలలో మంచి నాయకత్వం వహించావో రాసుకో...

ఉదా॥ నేను మా టీచర్ రాని రోజున తరగతి గదిలోని నాతోటి విద్యార్థులను క్రమశిక్షణతో ఉంచి నాయకత్వం వహించాను.

1.
2.
3.
4.
5.
6.

**టీంవర్క్ (Team Work) కలిసి పనిచేయడం :**

మన శరీరంలో వేరు వేరు భాగాలు కలసి ఒకే శక్తిగా ఎలా పనిచేస్తాయో అదే విధంగా టీంవర్క్‌తో కూడా ప్రతి సభ్యుడు నిర్మలమైన మనస్సుతో, స్పష్టమైన అవగాహనతో కలసి పనిచేయడానికే టీం వర్క్.

- ఐకమత్య భావనతో కలసి పనిచేయడం.
- ప్రతి ఒక్కరిని పనిలో నిమగ్నం చేయడం.

టీం వర్క్ గురించి ఇప్పుడొక కథను చూద్దాం!

**కథ** : ఒక వేటగాడు పావురాల కొరకు వల పన్ని పట్టుకుందామని ఒక అడవిలోని చెట్టు కింద గింజలు చల్లి వలపన్ని కొద్ది దూరంలో ఉండి చూస్తూ ఉన్నాడు. ఆకాశంలో ఎగురుతూ వస్తున్న పావురాల గుంపులోని ఒక పావురం గింజలు చూసి తిందామని మిగిలిన పావురాలతో అంటుంది.

అందులో ఒక తెలివైన పావురం వద్దని వారించినా, కానీ, మిగిలిన పావురాలు ఆ సలహా వినకుండా అన్నీ కలిసి కిందకు వాలి గింజలను తింటూ మెల్లగా అన్నీ వేటగాడు పన్నిన వలలో చిక్కుకున్నాయి. వేటగాడు రావడం చూసి తెలివైన పావురం సలహా మేరకు అన్నీ కలిసి ఒక్కసారిగా వలతో సహా పైకి ఎగిరిపోయాయి. అలా ఎగురుతూ తమ మిత్రుడు మూషికరాజు వద్దకు చేరి తమ కట్లను విడిపించమని అడుగగా, అతడు కట్లు కొరికి వాటిని విముక్తులను చేసాడు.

**కలిసి పనిచేయడం వల్ల లాభాలు**

1. తక్కువ సమయంలో ఎక్కువ పని చేయవచ్చు.
2. ప్రతి పనిని నైపుణ్యంతో చేయవచ్చు.
3. అనుకున్న సమయంలో అనుకున్న లక్ష్యం చేరుకోవచ్చు.
4. ప్రతి వారిలో కలిసి పనిచేయడం అలవాటు అవుతుంది.
5. ప్రతి వారిలో నైపుణ్యం, ఆత్మ విశ్వాసం పెరుగుతుంది.

Together
Every one
Achieves
More
} **TEAM**

## తెలుసుకోండి

ప్రతి సంస్థ ఒక ఉదాత్తమైన లక్ష్యాలకోసం పనిచేస్తుంది. ఆ సంస్థ పనితీరు సమాజంపై ప్రభావం చూపుతుంది. ఒక పోలీస్ స్టేషన్, ఆసుపత్రి తమ లక్ష్యాలను నెరవేర్చుకుంటే సమాజం ఎలా ఉంటుందో ఊహించండి.

మొత్తం సమాజ నిర్మాణాన్ని ప్రభావితం చేయగల శక్తి ఒక పాఠశాలకు మాత్రమే ఉంది. పాఠశాల ఏఏ మహోన్నత లక్ష్యాల కోసం పనిచేస్తుందో ఆ లక్ష్యాలు నెరవేరడం కోసం ప్రణాళిక రూపొందించుకొని అమలుచేస్తూ సమీక్షించుకొనే కార్యక్రమాల సమాహారాన్ని పాఠశాల అభివృద్ధి నిర్వహణగా చెప్పవచ్చు.

మన ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే పిల్లలు ఎవరు? వారి నేపథ్యం ఏమిటి? అనే విషయాలు మనం ఆలోచించినట్లయితే మన పాఠశాలలకు వచ్చే పిల్లల్లో ఎక్కువగా నిరుపేద పిల్లలు మరియు విద్యపట్ల సరైన అవగాహనలేని సమాజం నుండి వచ్చే పిల్లలు ఎక్కువగా కనిపిస్తారు. వారికి నాణ్యమైన విద్యను అందించి దేశానికి, సమాజానికి సేవ చేయడమే. విద్యావంతులుగా, మానవతా విలువలు కలిగినవారుగా మనం ఒక్కసారి ఆలోచించి పిల్లలకు సమాన అవకాశాలు కల్పించి అందుకోసం వారికి అభ్యసన వాతావరణం కల్పించి, అన్ని సహపాఠ్య కార్యక్రమాలలో వారిని భాగస్వాములను చేస్తూ జ్ఞాన నిర్మాణం కలిగించాలి. వారిలో సమగ్రాభివృద్ధి జరిగేలా చూడాలి.

పాఠశాలకు మంచిపేరు రావాలంటే పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలి. విద్యార్థులంతా బోధనాభ్యసన ప్రక్రియల్లో చురుకుగా పాల్గొనేటట్లు చేయాలి. పిల్లలందరిని ప్రతి కార్యక్రమములో భాగస్వామ్యం చేసేలా మంచి వాతావరణాన్ని కల్పించాలి. అప్పుడే మంచి ఫలితాలను రాబట్టవచ్చు.

పాఠశాల అభివృద్ధి చెందాలంటే మానవ సంబంధాలను మెరుగు పరుచుకోవాలి. పాఠశాల సమాజంతో మమేకమై, సహకారాన్ని పొందవలసిన అవసరం ఉంది. సమాజం అనగా కేవలం పిల్లలు, పిల్లల తల్లిదండ్రులే కాదు. గ్రామస్తులు, వివిధ వర్గాల వారు, అధికారులు, సేవా దృక్పథం కలిగిన వ్యక్తులు వీరందరు అభివృద్ధికి చిహ్నాలు, బడిలో జరిగే కార్యక్రమాలలో కూడా వీరందరిని పాల్గొనేలా, బడికి సహకారం అందించేలా చూడాలి.

బడి ద్వారానే విద్యాభ్యాసం, విద్యాభ్యాసన ద్వారానే గ్రామాభివృద్ధి అన్నట్టు పిల్లల భాగస్వామ్యంతోనే బోధనాభ్యసన ప్రక్రియలను నిర్వహించాలి. అన్వేషణలు, కృత్యాలు, ప్రయోగాలు వంటివి పాఠశాలలో కనిపించాలి. పిల్లల్లో ఆశించిన సృజనాత్మకత, వికాసం చోటుచేసుకోవాలి.

విద్యావ్యవస్థలో ప్రతిస్థాయిలో పనితీరులో మార్పు అనేది ఉండాలి. ప్రోత్సహకరమైన వాతావరణం కల్పించాలి. సమర్థవంతమైన నాయకత్వం ఉపాధ్యాయుల్లో నూతన ఉత్సాహం నింపేదిగా ఉండాలి. పని సంస్కృతి గౌరవించబడేలా వాతావరణం నెలకొల్పబడాలి. పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు చాలా ముఖ్యమైన వ్యక్తులు వారు ఆదర్శంగా ఉంటూ సమస్యాసాధనలో ముందుండాలి. మిగతా వారిని ప్రభావితం చేస్తూ పని చేయించుకోవాలి.

పాఠశాల అభివృద్ధిలో కీలక పాత్ర వహించేది మానవ వనరుల నిర్వహణ. ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేయాలి. వివిధ కార్యకలాపాలలో పిల్లల భాగస్వామ్యాన్ని పెంచేలా చూడాలి. పరస్పర సహకారం, సలహాలు సూచనలు ఇస్తూండాలి.

ఇక పాఠశాలలో ప్రధాన వనరులైన గ్రాంటులు, గ్రంథాలయం, ప్రయోగశాల మొ॥ అన్ని వనరులను సద్వినియోగపర్చడంపైనే పాఠశాల అభివృద్ధి ఆధారపడి ఉంది. బోధనాభ్యసన సామాగ్రి, కంప్యూటర్‌లు మొ॥ వాటిని సమకూర్చుకొని ఆర్థికంగా పరిపుష్టిగా ఉండాలి.

పిల్లలు సక్రమంగా బడికి వచ్చేటట్లు చూసే బాధ్యత తల్లిదండ్రులదే. కాబట్టి నెలకు ఒకసారి తల్లిదండ్రులతో సమావేశమై హాజరు కాని విద్యార్థుల వివరాలు తెలియజేయాలి. పిల్లల ప్రగతిపై ఎప్పటికప్పుడు తల్లిదండ్రులకు వివరణ ఇవ్వాలి. పాఠశాలలో జరిగే SMC సమావేశాలకు విద్యార్థుల తల్లిదండ్రులను ఎక్కువగా హాజరయ్యేలా చూడాలి.

పాఠశాల అభివృద్ధికి ప్రధానమైనది ప్రణాళిక, సంస్థాగత ప్రణాళిక విద్యా సంవత్సర ప్రారంభంలో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు, పాఠశాల యాజమాన్య కమిటి సభ్యులు కలిసి రూపొందించుకోవాలి. విద్యా విషయాలతోపాటు, మౌళిక వసతులు, సమాజ భాగస్వామ్యం వంటి అనేక అంశాలకు చోటు కల్పించాలి.

పాఠశాలలో పిల్లల్ని అభ్యసనంతో పాటు అనేక ఇతర కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం వల్ల పిల్లలు సర్వతోముఖాభివృద్ధిని సాధించుటకు వీలు కలుగుతుంది. సాంస్కృతిక కార్యక్రమాలు, ర్యాలీలు (బడిబాట) పల్స్‌పోలియో, జాతీయ పండుగలు మొ॥వి, ఆరోగ్యకార్యక్రమాలు, పరిసరాల పరిశుభ్రతలు పచ్చదనం, మేళాలు, సైన్స్‌ఫేయిర్, విజ్ఞాన యాత్రలు, జాతీయ పండుగలు, బాలల సంఘాలు, సేవాకార్యక్రమాలు మొ॥వి వాటిలో పిల్లల భాగస్వామ్యం తప్పని సరిగా ఉండాలి.

పాఠశాలలో నిర్వహించే వివిధ కార్యక్రమాలకు సంబంధించిన పనులకు బాధ్యతవహించాలంటే పిల్లల్ని కమిటీలుగా ఏర్పరచాలి. 1. పరిశుభ్రత కమిటి, 2) ఆరోగ్య ఆహారకమిటి, 3) పచ్చదనం - పరిశుభ్రత, 4) క్రమశిక్షణ కమిటి.

### పరిశుభ్రత కమిటి :

తరగతి గది. పాఠశాల ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం. ప్రతి తరగతి నుండి ఒకరు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు.

### ఆరోగ్య ఆహార కమిటి :

పిల్లలు ఆరోగ్యపు అలవాట్లను పరిశీలించడం, మధ్యాహ్నభోజన సమయంలో అందరు శుభ్రంగా చేతులు, ప్లేట్లు కడుక్కునేలా చూడడం.

### పచ్చదనం – పరిశుభ్రత :

పాఠశాలలో మొక్కల్ని పెంచడం, వాటికి ప్రతిరోజు తరగతి వారీగా బాధ్యతలు తీసుకొని నీరుపోయడం, కంచెవేసి కాపాడడం.

### క్రమశిక్షణ కమిటి :

ప్రార్థనా సమయానికి రావడం, పిల్లలు వాళ్ళ పుస్తకాలను జాగ్రత్తగా పెట్టుకోవడం. తరగతిగదిలో క్రమశిక్షణతో ఉండడం ఉపాధ్యాయులు ఇచ్చిన పనిపూర్తిచేయడం పాఠశాల వస్తువులను పాడుచేయకుండా చూడడం.

పై కమిటీలో పిల్లలు తప్పని సరిగా బాధ్యత వహించాల్సి ఉంటుంది.

**సూక్తి :** ప్రతి కర్తవ్యమూ పవిత్రమైనదే. శ్రద్ధాభక్తులతో కూడిన కర్తవ్య నిర్వహణ పరమోత్కృష్టమైన ఈశ్వరారాధన.

# ౬ ముందు చూపు

**I. ప్రధాన విలువ** : పొదుపు

**II. ఉపవిలువ** : రేపటికోసం పొదుపు చేయడంపై అవగాహన పొందడం.

**III. లక్ష్యాలు / ఆశించే ఫలితాలు** :

- రేపటికోసం పొదుపు చేసుకోవాలని తెలుసుకుంటారు.
- పొదుపును పాటించగలుగుతారు

**IV. ఉపోద్ఘాతం** : నిత్యజీవితంలో డబ్బుకు ఉన్నవిలువ మనకు తెలియనిదికాదు. తెల్లారి లేచిన దగ్గరనుండి రాత్రి పడుకునేవరకు మన ప్రయాణం డబ్బుతోనే ముడిపడి ఉంటుంది. మన అవసరాలు తీర్చుకోవాలంటే డబ్బుకావలసిందే అటువంటి డబ్బును పొదుపు చేయకపోతే మనం చాలా ఇబ్బంది పడతాం. "జీవితంలో వీలైనంత సక్రమమైన మార్గంలో కూడబెట్టు" అనేదే పెద్దలు మనకి నేర్పే మొట్టమొదటి ప్రాథమిక ఆర్థికసూత్రం. సకాలంలో పొదుపు మీద శ్రద్ధ వహించకపోతే బ్రతుకు భారం కాకతప్పదమేది జీవన సత్యం. కనుక పిల్లలకు చిన్నప్పటినుంచే ఒక పద్ధతి ప్రకారం పొదుపును అలవాటు చేయడం మంచిది. కేవలం డబ్బునే కాకుండా మనకు లభించే సహజ వనరులైన గాలి, నీరు నేలను అలాగే ఇంధనాలను, విద్యుత్తును, వస్తువులను పొదుపుగా వాడుకోవాలని తెలియజేయాలి.

**V. సంఘటనలు** :

**సంఘటన-1**

రామం ఒక ప్రైవేటు సంస్థలో చిన్న ఉద్యోగం చేస్తున్నాడు. భార్య, ఇద్దరు పిల్లలు. ఆనందకరమైన కుటుంబం వారిది. రామంకు చిన్నప్పటినుంచి పొదుపు చేయడం అలవాటు. కనుక వాళ్ళింట్లో అనవసరపు ఖర్చులు ఉండవు. రామం భార్య సీత కూడా ఆయనకు అనుకూలవతి అయిన భార్య ప్రతి విషయంలో వారిస్థాయిని తెలుసుకొని ప్రవర్తిస్తుంది. ప్రక్కవారితో పోల్చుకుని భర్తను ఇవికావాలి, అవికావాలి అని ఇబ్బంది పెట్టదు. రామం తను సంపాదించిన డబ్బులో ప్లిలల చదువుకని

పోస్టాఫీసులో రికరింగ్ డిపాజిట్ చేస్తున్నాడు. అలాగే ఎల్.ఐ.సి ఆరోగ్యభీమా, జీవిత భీమా పథకాలు తీసుకొని ప్రీమియం కడుతున్నాడు. అవి అవసర సమయాల్లో ఆదుకుంటాయని అతని నమ్మకం. ఇలా పొదుపు చేస్తున్నాడు కనుక అతను రేపటి గురించిన ఆందోళన పడవలసిన అవసరం లేదు. అతను చేస్తున్న పొదుపు రేపటి అవసరాలకు ఉపయోగపడుతుంది.

**సంఘటన-2**

కిషోర్ కూడ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగి 5 అంకెల జీతం డబ్బుకు కొదవలేదు. ఇతనికి కూడ భార్య ఇద్దరు పిల్లలు వీళ్ళింట్లో ఎవరికి కాని పొదుపు పాటించే అలవాటులేదు. శని, ఆది వారాలలో వీకెండ్ పార్టీలని, విందులు వినోదాలని డబ్బును విరివిగా ఖర్చు చేస్తాడు. వారి ఇంటిలో లేని వస్తువంటూ ఏదీ ఉండదు అది అవసరం ఉన్నాలేకున్నా మార్కెట్లో రిలీజ్ అయ్యిందంటే వీళ్ళింట్లో ఉండాల్సిందే. వారంలో ఇంట్లో భోంచేసే దానికన్నా బయట హోటళ్ళకు వెళ్ళి తినేదే ఎక్కువ దీనితో అప్పుడప్పుడు కడుపు అప్‌సెట్ అయి డాక్టరు దగ్గరకు కూడా వెళ్ళవలసి వస్తూ ఉంటుంది. వీరి ఇంట్లో అన్నివస్తువులూ ఉన్నాయి కానీ అవసరానికి ఆదుకోవడానికి మాత్రం పొదుపు చేసిన డబ్బు లేదు. అనుకోకుండా ఒకసారి అతని భార్యకు జబ్బుచేసి ఆపరేషన్ చేయాల్సి వచ్చి దాదాపుగా 8 లక్షలు అవసరం అయ్యింది. డబ్బుకోసం చాలా ఇబ్బంది పడి చివరకు అప్పుచేయాల్సి వచ్చింది.

మనం ఇలాంటి వారిని ఎంతో మందిని చూస్తున్నాం. ఆడంబరాలకు పోయి ఎక్కువగా ఖర్చుచేసి అవసరాలు తీర్చుకోవడానికి అప్పుచేసి ఆ అప్పుతీర్చుకోలేక వడ్డీలు కట్టలేక ఆత్మహత్యలు చేసుకునేవారి గురించి రోజూ పేపర్‌లో చదువుతూ ఉన్నాం దీనిని బట్టి పొదుపు యొక్క విలువ, ఆవశ్యకత ఎంతో గుర్తించండి.

## VI. (అ) ఆలోచించడం - ప్రతిస్పందించడం

1. పై సంఘటనల ద్వారా మీరు ఏమి గ్రహించారు?
2. రేపటి కోసం మనం పొదుపు చేయాల్సిన అవసరం ఏమి?
3. వేటిని మనం భవిష్యత్తుకోసం పొదుపు చేయవచ్చు?
4. మీరు వేటిని పొదుపు చేస్తారు? ఎలా పొదుపు చేస్తారో చెప్పండి.
5. "దుబారా చేయకుండా పోతే పొదుపు చేసినట్లే" దీనిపై మీ అభిప్రాయాన్ని తెలపండి.
6. అనవసర ఖర్చులకు కొన్ని ఉదాహరణలు చెప్పండి.
7. దుబారాకు కొన్ని సంఘటనలు లేక ఉదాహరణలు చెప్పండి.
8. నిరాడంబరతకు పొదుపుకు ఏమి సంబంధం ఉన్నది? చర్చించండి.
9. వినిమయ సంస్కృతి అంటే ఏమిటి? దీనికి పొదుపుకు సంబంధం ఏమిటి?

## (ఆ) ఆచరించడం - అనుభవాలు చెప్పడం

1. మీరు పొదుపు సూత్రాలను ఈవారం రోజులు అమలు పరచండి వేటిని ఎంతమాత్రం పొదుపు చేయగలిగారో చెప్పండి. పొదుపు చేయడం వల్ల ఎలాంటి అనుభూతిని పొందారు.

# తెలుసుకోండి

చినుకు చినుకు కలిసి వరదైనట్లు... పైసా పైసా కూడబెడుతూపోతే జీవితంలో డబ్బుకోసం ఇబ్బందిపడాల్సిన అవసరం ఉండదనేది కాదనలేని సత్యం. "Save for a rainy day to make it also a sunny day" అన్న ఇంగ్లీషు సామెతలో కూడా పొదుపు ప్రాముఖ్యతే విదితమవుతుంది. సకాలంలో పొదుపు మీద శ్రద్ధ వహించకపోతే జీవితంలో చాలా కష్టాలను ఎదుర్కోవలసి వస్తుంది.

సాధారణ వాడుకలో పొదుపు అంటే తమ ఆదాయంలో డబ్బును ఖర్చుపెట్టకుండా అట్టేపెట్టుకోవడం. ఆర్ధికశాస్త్ర పరిభాషలో ఆదాయంలో వినియోగం చేయగా మిగిలిందే పొదుపు. మరింత విస్తృతమైన అర్ధంలో పొదుపు అంటే ఖర్చును తగ్గించుకోవడం.

ఇటీవల రోజుల్లో ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సగటుమనిషి నెలసరి వేతనంలో ఎటువంటి మార్పులు లేకపోయినా ధరల విషయంలో తేడాలు ఉంటున్నాయి. మనం పెట్టాల్సిన ఖర్చు రాను రాను పెరుగుతోంది కానీ తగ్గటం లేదు. తిండి, బట్టలు, వైద్యం, ఇంటిపన్ను లేదా అద్దె, వాటర్ బిల్లు, కరెంటుబిల్లు, ఫోన్ బిల్లు ఇలాంటి వన్నీ, కాలం గడిచే కొద్దీ మరింతగా పెరిగిపోతాయి. దానికి తోడు పిల్లల చదువులు, విందు, వినోదాలు వంటి వాటిలో పాల్గొనేందుకు అలాగే అనుకోని వాటికి అయ్యే ఖర్చుకు మనం క్రమం తప్పకుండా కొంత మొత్తాన్ని పొదుపు చేయాలి. డబ్బు అవసరం ఈరోజు కన్నా రేపు రేపటి కన్నా ఎల్లుండి మనకు ఎక్కువగా ఉంటుంది. ఈ జీవిత సత్యాన్ని దృష్టిలో పెట్టుకొని రేసటికోసం ఎంతో కొంత మొత్తాన్ని మనం పొదుపు చేయాల్సి ఉంటుంది. పొదుపు చేయడమే కాదు పొదుపు చేసిన ప్రతి రూపాయినీ మనం జాగ్రత్తగా ఉంచుకోవాలి. మనం తినటానికి, ఉండటానికే అవసరమైన మొత్తాన్ని ఖర్చు చేసుకొని వివిధరూపాల్లో మన సంపాదనకు తగిన విధంగా తగు మొత్తాన్ని జాగ్రత్త చేసుకోవాలి.

భారతదేశంలో పొదుపుని మహోద్యమంగా ప్రోత్సహించడానికి పోస్టాఫీసులు ఎంతగానో కృషి చేస్తున్నాయి. అత్యధిక సంఖ్యలో పొదుపు ఖాతాలు తెరిచిన పోస్టాఫీసులని ఇతోధికంగా ప్రోత్సహించడం కోసం కేంద్రప్రభుత్వం అవార్డుల ప్రదానోత్సవాలు కూడా నిర్వహిస్తోంది.

నేషనల్ సేవింగ్స్ ఇన్‌స్టిట్యూట్ ప్రజలలో 'పొదుపు' ఒక అలవాటుగా మార్చడం కోసం ఎన్నో ఆకర్షణీయమైన పథకాలూ ప్రవేశపెడుతోంది.

బ్యాంకులు కూడా మనం పొదుపు చేసుకోవడానికి ఫిక్స్‌డ్ డిపాజిట్లు మ్యూచువల్ ఫండ్స్ మొ॥న పథకాలను అందిస్తున్నాయి. అలాగే ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలు అందిస్తున్న జీవిత భీమా, ఆరోగ్యభీమా పథకాలు కూడా బాగా కలసి వచ్చే పొదుపు మార్గాలు.

పొదుపు పాటించే ప్రతి ఒక్కరూ జాతీయ జీవన స్రవంతిలో 'పొదుపు' విషయంలో తమవంతు కర్తవ్యం నిర్వహిస్తూ దేశ ఆర్థిక ప్రగతికి ఉడతా భక్తిగా సేవలు అందిస్తున్నారనే చెప్పాలి. పొదుపు ఖాతాలలో మదుపు చేసిన చిన్న చిన్న మొత్తాలు కూడా, దేశప్రగతికి దోహదం చేస్తాయనడంలో సందేహం లేదు. అలా పరోక్షంగా పేదరికం నిర్మూలించడానికి, సామాజిక స్థిరత్వానికి సామాన్యులు కూడా సాయం చేస్తున్నారన్న మాట.

పిల్లలకు డబ్బువిలువ తెలియజేయడంకన్నా ముఖ్యమైనది పిల్లలలో పొదుపు అలవాటును ప్రోత్సహించడం.

**పొదుపరితనం మనిషికి రక్షణనిచ్చును**

తనకు లభించే ఆదాయంలో కొంత పొదుపు చేసుకుని దాచుకునే మనిషిని చూడు అతని అడుగు తేలికగా పడుతుంది. అతని గుండె ధైర్యముగా కొట్టుకుంటుంది. అతని చూపులు నిశ్చలంగా ఉంటాయి. అతని మాట నిర్భయంగా ఉంటుంది. ఉద్యోగములోనిగాని, వర్తకములోగాని కొంతపరిస్థితి తారుమారైనా, అతడు తలక్రిందులుకాడు, గుండెపగిలి కన్ను మూయడు.

**దుబారాచేసేమనిషి దేనినీ సాధించలేడు**

తన ధనాన్ని గాని, కాలాన్ని గాని, శక్తిని గాని వ్యర్థంగా, మంచినీటిని వాడినట్లు వాడే దుబారా మనిషి, జీవితములో ఎన్నడూ దేనినీ సాధించలేడు. ప్రమాదవశాన సాధించినా అది తాటాకుమంటవలె మరుక్షణమే మాయమైపోతుంది. ఒక్క క్షణాన్ని కూడా, నిరర్థకంగా గడపక, నిర్విరామముగా పాటుపడిన వ్యక్తులే. మహానాయకులై ప్రపంచ చరిత్రను నడిపించిరి. ఒక విషయములో నిర్లక్ష్యముగా జీవించే మనిషి, మరో విషయంలో శ్రద్ధ కనపరచలేడు.

సూక్తులు :

- "కూడబెట్టినవాడు మేడకట్టుట నిజము. ఖర్చుపెట్టినవాడు కూలిపోవుట నిజము.
- పొదుపరితనం మనిషికి రక్షణనిచ్చును.
- దుబారాచేసే మనిషి దేనినీ సాధించలేడు.
- పొదుపరితనంమనిషికి రక్షణనిచ్చును.
- దుబారా చేసే మనిషి దేనినీ సాధించలేడు.

# 7 జీవన విధానం

**I. ప్రధాన విలువ** : ఆరోగ్య విలువలు

**II. ఉపవిలువ** : మంచి ఆరోగ్యానికి వ్యాయామం, ఆటలు, యోగాసనాలు దోహదపడతాయి.

**III. లక్ష్యాలు / ఆశించే ఫలితాలు** :
- పిల్లలు మంచి ఆరోగ్యానికి వ్యాయామం, యోగా, ఆటలు అవసరమని గుర్తించి, సాధన చేయడం.

**IV. ఉపోద్ఘాతం** : ప్రతివ్యక్తీ మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉంటేనే ఆరోగ్యవంతునిగా పరిగణించబడతాడు. ఆవిధమైన ఆరోగ్యం లభించాలంటే సరైన వ్యాయామం, ఆటలు, యోగ సాధన మొదలైనవి చేయాలి. దానివల్ల శారీరక ధృడత్వం ఏర్పడి మానసికానందంతో మనిషి ఏ పనినైనా చేయగలుగుతాడు. ఉత్సాహంగా, చురుకుదనంగా వ్యవహరించగలడు. వ్యాయామం, యోగ సాధన మొదలైనవి నియమబద్ధంగా ప్రతిదినమూ ఆచరించాలి.

**V. సంఘటనలు** :

**సంఘటన-1**

కరుణ తరచుగా జలుబు, దగ్గు, తలనొప్పి లాంటి వాటితో బాధపడుతుండేది. కానీ ఆ అమ్మాయి తాతగారు ముసలి వాడైనప్పటికీ ఎంతో ఉత్సాహంగా చురుకుగా ఉంటారు. పైగా చిరునవ్వుతో శాంతంగా కనిపిస్తుంటారు. ఆ విషయాన్నే కరుణ తాతగారిని అడిగింది. అప్పుడు ఆయన తాను చిన్నప్పుడు చదువుకునే రోజుల్లో బడి చాలా దూరంలో ఉండేదని, రోజూ అంత దూరం నడిచివెళ్ళి వచ్చేవాడినని చెప్పాడు. అంతేకాదు. తల్లిదండ్రులకు పొలం పనుల్లో, ఇంటి పనుల్లో సాయపడేవాడినని, అలాగే పరిశుభ్రమైన ఆహారం తీసుకునేవాడినని చెప్పారు. ఈ రోజుల్లో మీకు అటువంటి అవకాశాలు లేకపోవడం వల్ల శారీరకశ్రమ లేకుండా పోయి అనేక రుగ్మతలు కలుగుతున్నాయని అన్నారు. కరుణకు నిజమే అనిపించింది. చదువు తప్ప ఆటలు, వ్యాయామం మొదలైనవి ఉండడంలేదని, అమ్మానాన్నలు కూడా పోటీ ప్రపంచంలో చదువుకు ఇచ్చిన ప్రాధాన్యత ఆటలకు, వ్యాయామానికి ఇవ్వడం లేదని గ్రహించింది. ఈ పరిస్థితి మారాలని భావించింది.

### సంఘటన-2

సీత, గీత అక్కాచెల్లెళ్ళు. సీతబడి నుండి వచ్చి కొంచెం సేపు స్నేహితురాళ్ళతో ఆటలాడుకొనేది. గీత మాత్రం ఆటలు ఆడడం ఇష్టం లేదని టి.వి. చూస్తూ, కథల పుస్తకాలు చదువుతూ మధ్య మధ్యలో ఏదో తింటూ గడిపేది. కొంతకాలానికి గీత శరీరంలో చెడుకొవ్వు పెరిగిపోయి లావుగా అయిపోయి ఏపనిచేసినా తొందరగా అలసిపోయేది. ఆయాసపడేది. వైద్యుడు ఆమెను పరీక్షించి, రోగనిరోధక శక్తి లేకపోవడం వల్ల అలా వచ్చిందని చెప్పాడు. సీత గీత ఒకే ఇంట్లోని వారైనా వారి వారి పనులవల్ల ఎటువంటి ఆరోగ్యాన్ని పొందారో కదా! తరువాత గీత కూడా సీతతో కలిసి ఆడుకునేది. క్రమంగా లావు తగ్గింది. ఉత్సాహం, చురుకుదనంతో ఇదివరకటి కంటె ఎంతో మెరుగ్గా అన్నింటిలో పాల్గొంటుంది.

### సంఘటన-3

రాము రోజూ గురువు సహాయంతో యోగా చేస్తున్నాడు. ధ్యానం చేసేవాడు. అది చూసి రమణ నువ్వు మునిలా తపస్సు చేస్తున్నావు అని వెక్కిరించేవాడు. రాము ఎప్పుడూ ప్రశాంతంగా, నవ్వు మొహంతో కన్పిస్తూ, టీచరు అడిగిన ప్రశ్నలు చురుకుగా సమాధానాలిచ్చేవాడు. ఎవరిపైనా చిరాకుపడేవాడు కాదు. అతనితో స్నేహం చేయడానికి చాలా మంది ఉత్సాహపడేవారు. రమణ ఆలస్యంగా నిద్రలేచేవాడు. ఎప్పుడూ బద్ధకంగా ఉంటాడు. క్లాసులో నిద్రపోతూ ఎప్పుడూ టీచర్ల చేత చివాట్లు తినేవాడు. ఎప్పుడూ అతడు అసహనంగా, చిరాకుగా ఉండేవాడు అతనితో స్నేహం చేయడానికి ఎవరూ ఇష్టపడే వారు కాదు.

## VI. (అ) ఆలోచించడం - ప్రతిస్పందించడం

1. మొదటి సంఘటనలో ముసలి తాత చురుకుగా ఉత్సాహంగా ఉండడానికి కారణాలు ఏమిటి?
2. నేటి కాలంలో పిల్లలు తరచుగా వివిధ జబ్బులకు ఎందుకు గురవుతున్నారో చెప్పండి?
3. ఆటల వల్ల కలిగే ప్రయోజనాలు తెల్పండి. ఆటలు ఆడకపోతే ఏమవుతుంది.
4. వ్యాయామం అంటే ఏమిటి? మీరు రోజూ వ్యాయామం చేస్తారా? ఎటువంటి వ్యాయామం చేస్తారు?
5. యోగాసనాల గూర్చి మీకు తెలుసా? మీలో ఎవరైనా చేస్తున్నారా? యోగాసనాల సాధనవల్ల మనం పొందే ప్రయోజనాలు ఏమిటి?
6. పోయిన వారంలో ఎన్ని గంటలు ఆటలు, నడక, తిరగడంలో గడిపారు.
7. ప్రతిరోజు సాయంత్రం, పాఠశాల సమయం తరువాత 5 నుండి 7 గంటల వరకు ప్రతి విద్యార్థికి ఆటల సమయం. ఎంత మంది క్లాసులో ఆ సమయంలో ఆటలలో గడుపుతున్నారు? చర్చించండి. ఉదయం జాగింగ్ చేయాలి. చేస్తున్నారా?

## (ఆ) ఆచరించడం - అనుభవాలు చెప్పడం

1. రోజూ ఉదయం/సాయంత్రం వ్యాయామం, యోగ సాధన చేయండి. అవి చేసిన తరువాత మీకేమి అనిపించిందో మీ అనుభవాలను, అనుభూతులను చెప్పండి.
2. ఆరుబయట ప్రతిరోజూ మీ స్నేహితులతో ఆటలు ఆడండి. ఆటలు ఆడడం వల్ల శారీరకంగా, మానసికంగా మీలో కలిగిన మార్పులు చెప్పండి.
3. నిన్నటి రోజుల్లో ఉదయం నుండి సాయంత్రం వరకు మీరు ఎన్ని గంటలు కూర్చుని గడిపారు. ఎన్ని గంటలు ఆటలు, నడకలో గడిపారు.

**వ్యాయామం :**

పాఠశాల స్థాయి విద్యార్థులు - ఆటలు, క్రీడలు

కళాశాల స్థాయి విద్యార్థులు - ఆటలు, క్రీడలు

25-35 సం.ల మధ్య వయస్కులు - జాగింగ్, సైకిల్ తొక్కటం, ఈత, ఆసనాలు.

35 సం.ల పై వయస్కులు - వేగంగా నడవటం

ప్రతిరోజు 1 గంట వ్యాయామం తప్పనిసరి. దీనివల్ల కలిగే ప్రయోజనాలు.

- ఊబకాయాన్ని తగ్గించవచ్చు, నివారించవచ్చు.
- రక్తపోటు, మధుమేహం అదుపులో ఉంటాయి.
- ఎండార్ఫిన్స్ అనే రసాయనాలు మెదడులో స్రవించినందువల్ల మనసు ఉల్లాసంగా ఉంటుంది.
- గుండెకు ఒత్తిడిని తట్టుకునే గుణం పెరిగి గుండెపోటు వచ్చే అవకాశం తగ్గుతుంది.
- వయసుమళ్ళిన వారిలో వచ్చే ఆస్టియోపొరోసిస్ అనే వ్యాధిని నివారించవచ్చు. ఎముకలు, కండరాలు, కీళ్ళ బలం పెరుగుతుంది.
- రక్తంలో కొవ్వుశాతం తగ్గుతుంది. గుండెపోటు రాకుండా నివారించవచ్చు.
- రోగనిరోధక శక్తి పెరుగుతుంది.
- ఊపిరితిత్తుల సామర్థ్యం పెరగటంతో శ్వాసకోశాల జబ్బులు తగ్గుముఖం పడతాయి.
- రోజువారీ పనిలో అలసట తగ్గుతుంది.
- మనలో మనోధైర్యం, కార్యసాధనకు మనసులో బీజాలు పడతాయి.

**ఆహారం – అలవాట్లు :**

మనం ప్రతిరోజూ ఆహారంలో ఈ కింది పదార్థాలు తీసుకుంటాం.

**ఎ. పిండిపదార్థాలు :**

| | |
|---|---|
| వరి | – అన్నం, ఇడ్లి, దోసె, పొంగలి మొదలైనవి |
| గోధుమ | – ఉప్మా, చపాతి మొదలైనవి |
| రాగి, సజ్జ, జొన్న, మొక్కజొన్న | – జావ, రొట్టెలు, పిండి వంటలు |
| పంచదార | – పానీయాలు, పిండివంటలు |
| బెల్లం | – పొంగలి, పిండివంటలు |
| మాంసకృత్తులు | – పప్పుదినుసులు, బఠాణి, చిక్కుడు, పాలు, గుడ్డు, మాంసం, పుట్టగొడుగులు, రొయ్యలు, చేపలు |
| కొవ్వులు | – నూనె, గుడ్డులోని పసుపు, వేరుశెనగ, నువ్వులు మొదలైన విత్తనాలు, జంతుమాంసం. |
| సూక్ష్మ పోష్టికాలు | – ఆకుకూరలు, కూరగాయలు, పాలు మొదలైనవి |

**ఆహారాన్ని 5 సార్లుగా తినాలి.**

| | |
|---|---|
| ఉదయం 7 గంటలకు | – పాలు, అల్పాహారం |
| ఉదయం 11 గంటలకు | – అల్పాహారం |
| మధ్యాహ్నం 1 నుండి 2 గం.లకు | – భోజనం |
| సాయంత్రం 4 నుండి 5 గంట.లకు | – అల్పాహారం |
| రాత్రి 8 నుండి 9 గం.లకు | – భోజనం లేదా టిఫిన్ |
| రాత్రి 10 గం.లకు | – కప్పు పాలు లేదా మజ్జిగ |

**మొత్తం ఆహారంలో కాయకూరలు, పండ్లు 1/3వ వంతు ఉండేటట్లు చూడాలి.**

**శక్తి విడుదల :** 1 గ్రాము పిండిపదార్థం – 4 కేలరీలు

1 గ్రాము కొవ్వు – 9 కేలరీలు

1 గ్రాము మాంసకృత్తులు – 4 కేలరీలు

**శక్తి అవసరం :** మనిషికి బరువు 50 కేజీలు, రోజుకు

| | |
|---|---|
| ఆఫీసు పని | – 1500 కేలరీలు |
| శారీరకశ్రమ | – 2000 నుండి 3000 కేలరీలు |
| మధ్యస్థం | – 2000 కేలరీలు |

# తెలుసుకోండి

చక్కని ఆరోగ్యానికి వ్యాయామం, ఆటలు, యోగసాధన అనేవి చాలా అవసరం. పాతకాలంలో మన పెద్దలు సమయానుకూలంగా, మితాహారం తీసుకొనేవారు. చాలా దూరం కాలినడకన వెళ్ళడం, బరువులు ఎత్తడం, పొలం పనులు, ఇంటి పనులు చేస్తుండేవాడు. పురాణ కాలం నాటి ఋషులు యోగసాధన ద్వారా దీర్ఘాయుష్షును పొందారని గ్రంథాలలో, కథలలో చదివి తెలుసుకున్నాం కదా! నిజానికి ఆలోచిస్తే పాతతరం వారిని అడిగి చూడండి. మా కాలంలో అయితే ఇలా ఉండేది. అని అంటుంటారు. ఆ కాలంనాటి వారు చేసిన శారీరక శ్రమ, పాతతరం ఆటలు వారికి మంచి ఆరోగ్యాన్ని ఇచ్చాయి.

ఈనాడు యాంత్రికమైన జీవన విధానంలో పిల్లలు బడికి వెళ్ళడం, చదువుకోవడం, ఇంటికి రావడం హోంవర్కు చేయడం లాంటివి చేస్తున్నారు. ఏమాత్రం సమయం దొరికినా టి.వి. చూడడానికి సమయం కేటాయిస్తున్నారు. పెద్దలు కూడా వారికుండే పనుల ఒత్తిడివల్ల పిల్లల ఆరోగ్యం గూర్చి పట్టించుకొనే పరిస్థితి లేదు. చాలా మంది వ్యాయామం చేయరు. బయటికి వెళ్ళి ఏ పని చేయాలన్నా, నడవరు. పైగా బజారు పనంతా స్కూటరుపై కూర్చొనే ముగిస్తారు. అందుకే మధుమేహం వంటి జబ్బులు వస్తున్నాయి. ఈరోజుల్లో చిన్న పిల్లలకు కూడా మధుమేహం వస్తుంది.

సామాన్యంగా జాగింగ్ చాలా మంచిది. నడక, సైకిలు తొక్కడం, ఈతకొట్టడం, మొదలైనవి దేహానికి ఉల్లాసాన్నిస్తాయి. వ్యాయామం చేస్తే మంచి నిద్రవస్తుంది. మంచి నిద్ర ఉంటే బుద్ధి చురుకుగా పనిచేస్తుంది. వ్యాయామం వల్ల మన దేహం నుండి బయటకు వచ్చే చెమట మన రక్తాన్ని శుభ్రపరుస్తుంది. అంతేగాక వ్యాయామం శరీర సామర్థ్యం పెంచుతుంది. ఆకృతిని మెరుగుపరుస్తుంది. బరువు తగ్గడానికి, గుండెను బలోపేతం చేయడానికి, ఆత్మవిశ్వాసం పెంపొందడానికీ దోహదం చేస్తుంది. వ్యాయామం మూలంగా మనస్సును ఉత్సాహపరిచే ఎండార్ఫిన్లు విడుదలవుతాయి. రక్త సరఫరా మెరుగుపడి జ్ఞాపకశక్తిని నియంత్రించే భాగాలు వృద్ధి చెందుతాయి. వ్యాయామం చేసేవారు జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, సరైన నిర్ణయాలు తీసుకోవడం, వివిధ లక్ష్యాలను ఛేదించటం, వంటి వాటిల్లో చురుకుగా ఉన్నట్లు వివిధ అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. చాలాసేపు కంప్యూటరు ముందు వంగి కూచోవటం వల్ల భుజం, మెడనొప్పి రావడం, వంటి వాటిని వ్యాయామం ద్వారా దూరం చేయవచ్చు.

అనారోగ్యం కలిగినప్పుడు మనం కేవలం శరీరానికి చికిత్స చేస్తున్నాం మనస్సును అలక్ష్యం చేస్తున్నాం. ఆరోగ్యానికి మనస్సు కూడా ముఖ్యమని విజ్ఞానశాస్త్రం చెబుతుంది. శరీరానికి, మనస్సుకు సమప్రాధాన్యాన్ని ఇచ్చేది యోగా. ఈనాడు ఇది చాలా అవసరం. దీనివల్ల మనస్సుకు ప్రశాంతత లభిస్తుంది. యోగాకు పెద్ద, చిన్న ముసలి ముతక అనే భేదం లేదు. మందుల వల్ల కలగని ఉపశమనం యోగావల్ల కలుగుతుంది. మనిషి ప్రవర్తన, దృష్టి, ఆలోచనలను, జీవనశైలిని ప్రభావితం చేయగలదు. యోగశాస్త్రం అతి పురాతనమైనది. ఈ రోజుల్లో అనేక పాఠశాలల్లో,

కళాశాలల్లో ఇది నేర్పిస్తున్నారు. పెద్దవాళ్ళకు, ఉద్యోగులకు యోగా తరగతులు నిర్వహిస్తున్నారు. టి.విలలో కూడా స్వామి రాందేవ్‌బాబా లాంటి వారు ప్రజలకు యోగ శిక్షణ ఇస్తున్నారు.

ఇక ఆటల నుండి పిల్లలను చదువులపేరుతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు దూరం చేస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో పిల్లలు ఆడుకోవడానికి ఆటస్థలాలు కూడా లేవు.

కొంతమంది పిల్లలు ఎప్పుడూ స్తబ్దుగా ఉండి ఆటలలో కూడా పాల్గొనరు. నిజానికి ఆటలు కూడా వ్యాయామమే. పిల్లలు ఆటల ద్వారా శారీరక, మానసిక ఆనందం పొందుతారు. మధుమేహం, ఆస్థమా, నడుం నొప్పులు, కీళ్ళ నొప్పులు, చర్మవ్యాధులు మొదలైన వాటిని దూరం చేయవచ్చు. ధ్యానం చేయడంవల్ల మనస్సును నియంత్రించవచ్చు.

సూక్తి : ఆరోగ్య ధర్మాలను పాటిద్దాం - ఆరోగ్యంగా జీవిద్దాం

# 8 ప్రకృతి ప్రేమ

**I. ప్రధాన విలువ** : సంస్కృతి సంప్రదాయాలు

**II. ఉపవిలువ** : ప్రకృతి పట్ల ఆరాధనాభావం పెంచుకోవడం

**III. లక్ష్యాలు / ఆశించే ఫలితాలు** :

- ప్రకృతిని రక్షించుకుంటె మనం సుఖంగా జీవించగలమని తెలుసుకుంటారు. ప్రకృతి పట్ల ఆరాధనాభావాన్ని పెంచుకొని ప్రకృతిని రక్షించడానికి ప్రయత్నం చేయగలుగుతారు.

**IV. ఉపోద్ఘాతం** : మనమందరం ప్రకృతి ఒడిలో బ్రతుకుతున్నాము. ప్రకృతి అంటే చెట్లు, పర్వతాలు, నదులు, సముద్రాలు, పక్షులు, జంతువులు, క్రిమికీటకాలు మొదలైనవన్నీకూడా. ఈ ప్రకృతిలో మనమూ ఒక భాగమే. పైన చెప్పినవన్నీ మన జీవనానికి ఎంతో సహాయపడుతున్నాయి. ప్రకృతికి పక్షులు అందాన్నిస్తాయి. పక్షులకు ఆధారం చెట్లు. పక్షులకే కాదు అన్ని జీవులకు చెట్లు ఆధారమే. వాటి వలన మనకు ప్రాణవాయువు లభిస్తుంది. ఫలాలు, కలప, పూలు, మందులు మొదలైనవన్నీ చెట్లు అందిస్తాయి. అలాగే నదులు, పర్వతాలు అన్నీకూడా మనకు ఎంతో మేలు చేస్తాయి.

పిల్లలూ! మరి ఈ ప్రకృతిని రక్షించుకుంటే మనం సుఖంగా జీవించగలమా? ఎందుకు?

ప్రకృతి మనకు ఎంతో ప్రశాంతతను, ఆహ్లాదాన్ని ఇస్తుంది. ప్రకృతితో మనకు విడదీయరాని సంబంధం ఉంది. ప్రకృతివలన మనకు ఎన్నోలాభాలు ఉన్నాయి. కాబట్టి మనం ప్రకృతిని ఆరాధించాలి. ప్రకృతిపై ప్రేమను పెంచుకోవాలి. ఇలా ప్రకృతి పట్ల ఆరాధనా భావం చూపుతున్న మిత్రుల కథ తెలుసుకోండి.

## V. సంఘటనలు :

### సంఘటన-1

రాము, శ్యాము ప్రాణస్నేహితులు. రాముకి చెట్లు అంటే ఎంతో ఇష్టం. శ్యాముకి బద్ధకం. రాము తన ఇంటివద్ద ఒక మామిడిచెట్టు, జీడిచెట్టు, కొబ్బరిచెట్టువేసి రోజూ నీళ్ళుపోసి పెంచేవాడు. శ్యాము మాత్రంఏమీ చెయ్యకుండా జులాయిగా తిరిగేవాడు. కొంతకాలానికి వాళ్ళు పెద్దవారయ్యారు. చెట్లు కూడా పెద్దవైనాయి. పూతపూసి కాయలు కాయడం ప్రారంభించాయి. రాము, అతని ఇంటివారు రోజూ ఆపండ్లను తింటుండేవారు. అలాగే కొబ్బరి కాయలు కాస్తున్నందువలన రోజూ దేవునికి కొబ్బరికాయలు కొట్టేవారు. పాపం శ్యాము రోజూ ఆ చెట్లవైపు చూస్తూ పండ్లను చూసి ఆశపడేవాడు. అతనికి నోరూరేది. కానీ కోసుకోవడానికి వీలుపడేది కాదు. అయ్యో నేను కూడా ఆనాడు రాములాగే చెట్లు నాటితే, వాటిని పెంచితే ఈనాడు ఫలాలు అనుభవించే వాడిని కదా! ఎండాకాలంలో నీడనిచ్చేవి కదా! అని అనుకొని బాధపడ్డాడు. అప్పటినుండి అతను కూడా చెట్లను పెంచడం ప్రారంభించాడు.

పశువులు, పక్షులు కూడ ప్రకృతికి ఎంతో సహాయపడుతున్నాయి. చెరువులో చేపలు, నీటిలోని మురికిని తిని నీటిని శుభ్రపరుస్తున్నాయి. ఆవులు మనకు పాలనిస్తున్నాయి. ఆవుపేడ, మూత్రం పొలాలకు ఎరువుగా ఉపయోగపడుతుంది. పూర్వకాలంలో ఉత్తరాలను పంపించడానికి పావురాలను ఉపయోగించేవారు. గుర్రాలను ప్రయాణసాధనంగా ఉపయోగిస్తున్నాము. ఎద్దులతో పొలందున్నడం, బండిని లాగడం చేస్తుంటాయి. ఒకటేంటి? ప్రకృతిలో ఉన్నవన్నీ మనిషికి ఏదో ఒక విధంగా సహాయపడుతూనే ఉన్నాయి.

అందుకే మన పెద్దలు ప్రకృతిని తల్లిగా భావించి ప్రకృతి మాత అన్నారు. ప్రకృతిని పూజించడం మన సంప్రదాయం. నదీనదాలకు వనదేవతకు, చెట్లకు పూజచెయ్యడం మన సంస్కృతిలో భాగం. మనింట్లో తులసి మొక్కను పెంచి పూజిస్తాము.ఇది కేవలం భక్తికోసమే కాదు. తులసి ఔషధపు మొక్క కూడా. దానినుండి వచ్చేగాలి ఆరోగ్యానికి మంచిది. దేవాలయాల్లో తీర్థంలో తులసిదళాలు వేసి భక్తులకు ఇస్తుంటారు. దీనివలన తులసిరసం కడుపులోని రోగకారక క్రిములను నాశనం చేస్తాయి. ఈవిధంగా ప్రకృతి మనకు ఎన్నోవిధాలుగా ఉపయోగపడుతున్నది. కాబట్టి ప్రకృతిమీద మనం ఆరాధనాభావాన్ని పెంచుకోవాలి. ప్రకృతిని రక్షించడానికి మనం ప్రయత్నించాలి.

## VI. (అ) ఆలోచించడం - ప్రతిస్పందించడం

1. ప్రకృతి అంటే ఏమిటి?
2. ప్రకృతి ఆరాధనచేయడం అంటే మీరేమి అర్థం చేసుకున్నారు?
3. ఏఏ పనులు చేస్తే ప్రకృతి ఆరాధకులు అంటారు?
4. ప్రకృతిని ఆరాధించకుంటే మనం సుఖంగా జీవించడం సాధ్యమేనా? ఎందుకు?
5. మనదేశంలో ప్రకృతిని ఆరాధించే సందర్భాలను తెలియజేయండి.
6. ప్రకృతిపై ఆరాధనాభావాన్ని ఎందుకు పెంపొందించుకోవాలో చెప్పండి.
7. ప్రకృతి పట్ల ఆరాధనాభావం లేదనడానికి కొన్ని ఉదాహరణలివ్వండి.

### (ఆ) ఆచరించడం - అనుభవాలు చెప్పడం

1. ప్రకృతిలో భాగమైన చెట్లు, నదులు, పక్షులు, జంతువులను ఆరాధించండి. వాటిని ఆరాధించడంవల్ల మీలో కలిగిన అనుభూతులను తెల్పండి.
2. భారతీయ సంస్కృతిలో పంచ భూతాలు అనగా, గాలి, నీరు, భూమి, ఆకాశం, అగ్ని. మనం పూజ్యాభావనతో చూస్తున్నాం, ఆరాధిస్తున్నాం. మన జీవనంలో వీటి ప్రాధాన్యమేమి? ఎందుకు పూజ్యభావనతో చూడాలి.

## తెలుసుకోండి

మనదేశ ప్రజలు ప్రకృతియొక్క ప్రాముఖ్యతను గుర్తించిన కారణంగానే ప్రకృతియొక్క అంశాలను పంచభూతాలను ఆరాధించేవారు. కావుననే సూర్యుని సూర్యభగవానునిగాను, గాలిని వాయుదేవునిగాను, వర్షమును వరుణదేవునిగానూ, భూమిని భూదేవిగానూ ఆరాధించేవారు. ప్రకృతి అంటే అమితమైన భక్తి భావం ఉండేది. ఉదాహరణకు ఒకగోతిని తీయుటకు ముందు భూదేవికి ప్రార్థించి ఆమె అనుమతిని తీసుకునేవారు. ఆవిధంగా మనపూర్వీకులు ఈ ప్రకృతి పంచభూతాలతో నిర్మితమైనదని భావించి వాటిని ఆరాధించేవారు.

ప్రకృతిలో ఒక అంశమైన సూర్యుడు ప్రకాశిస్తూ వీరు వారని భేదం లేకుండా అందరికీ వెలుగును, వేడిని ఇస్తాడు. తలుపులు మూసికొని ఉన్నవారు చీకటిలోనే ఉండిపోతారు. అదేవిధంగా దివ్యత్వం కూడా అంతే. మనకు ప్రేమనిచ్చి మనలో ఒక భాగంగా ఉండడానికే దివ్యత్వం ఉంది. ఆ దివ్యత్వాన్ని మన హృదయంలోనికి ఆహ్వానించి హృదయాన్ని ప్రకాశింపచేసుకొనవలసినది మనమే. ఎవరు కిటికీ తలుపులు తెరిచి పెట్టుకొంటే వారికి వెలుగు వస్తుంది.

యదు అనే ఒక రాజుకి ఒక అడవిలో నివసించే ఒక ఋషిని కలవడం తటస్థించింది. ఆ ఋషిచాలా విజ్ఞానవంతుడని , వివేకవంతుడని గ్రహించాడు. ఒంటరిగా అరణ్యంలో జీవిస్తున్న అతడు ఇంత జ్ఞానాన్ని ఎలా సంపాదించుకున్నాడని రాజు ఆశ్చర్యపోయాడు. ఇన్ని విషయాలు ఎలా తెలుసుకున్నారని ఆయన అడిగారు. ఇరవైనాలుగు మంది గురువులు నాకు సమస్తం బోధించారని ఋషిసమాధానమిచ్చాడు. ఈ అడవిలో ఇంతమంది గురువులా? అని ఆశ్చర్యపడి ఆ గురువులెవరని రాజు అడిగాడు. ప్రకృతిలోని అంశాల పేర్లను చెప్పి అవి ఒక్కొక్కటి తనకు విషయాలను ఎలా బోధించాయో ఆ ఋషి వివరంగా చెప్పారు.

**ఉదాహరణకు**

**గాలి** : సువాసనల చేత దుర్వాసనల చేత గాలి ఎలా ప్రభావితం కాదో అలాగే జ్ఞానికూడా మంచి లేదా చెడు వస్తువుల ప్రభావానికి లోను కాకూడదు.

| | | |
|---|---|---|
| **పర్వతము** | : | పర్వతమువలె ప్రతిఒక్కరు చెడ్డకు అతీతంగా ఎదిగి, చక్కగా ఉన్నతంగా నిటారుగా ఉండాలి. |
| **నీరు** | : | నీరు వలె మనము మలినరహితంగా శుద్ధంగా తియ్యగా ఉపశమనం కలిగించేలా ఉండాలి. |
| **చెట్లు** | : | ప్రతిఫలం ఆశించకుండా ఇస్తూ ఎప్పుడూ ఉదారంగా ఉండాలని చెట్లుమనకు బోధిస్తాయి. |
| **చంద్రుడు** | : | కష్టకాలంలో స్నేహితుని యొక్క అవసరాలను గమనించమని చెపుతుంటాడు. |
| **అగ్ని** | : | ధైర్యం, ఆత్మనిగ్రహం కలిగి ఉండాలని, చెడునంతా తొలగించాలని బోధిస్తుంది. |
| **సముద్రం** | : | నిశ్చలంగా ఉంటూ, విజ్ఞానంతో పరిపూర్ణంగా ఉంటూ, కట్టలు తెంచుకొని పోకుండా ఉండాలని నేర్పుతుంది. |
| **మన్ను** | : | మంచి విషయాలను గ్రహించుకొంటూ మనస్సును తెరచుకుని ఉంచుకోవాలని తెలియజేస్తుంది. |
| **నక్షత్రం** | : | నక్షత్రంలా ఉన్నతమైన విషయాలను కాంక్షిస్తూ, చీకటి (కష్టకాలం)లో కూడా ప్రకాశిస్తూ ఉండగలగాలి అని నేర్చుకుంటాం. |
| **తేనెటీగ** | : | అది పువ్వులలోని మకరందాన్ని పోగుచేసుకొన్నట్లుగా మనం కూడా అందరి నుండి అన్నిటినుండీ సారాన్ని గ్రహించి స్వీకరించాలి. |

"భగవంతుడు ప్రకృతిలో వీటన్నింటినీ సృష్టించాడు కానీ తృప్తి కలుగలేదు. అందుకే మనిషి సృష్టించాడు. తనబుద్ధిని ఉపయోగించి ప్రకృతిలోని వీటన్నింటి నుండి నేర్చుకునే సామర్థ్యం అతనికిచ్చాడు" అని ఆ ఋషి రాజుకి చెప్పాడు.

పై కథ ద్వారా ప్రకృతి నుండి ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చని తెలుసుకోండి. అందుకే ప్రకృతిని మనం ఆరాధించాలి. కాపాడాలి. ప్రకృతిపై ప్రేమను పెంచుకోవాలి. అందుకనే పూర్వీకులు ప్రకృతి భాగమైన చెట్లను పూజించి ఆచెట్లను నరకనీయకుండా కాపాడుకునేవారు. నదులను దేవతలుగా భావించి పూజ్యభావంతో వాటికి హారతులిస్తూ కలుషితం కాకుండా కాపాడుకునేవారు. వివిధ జంతువులను వివిధ దేవతల వాహనాలుగా భావించి వాటికి హాని జరుపకుండా నేటికీ జంతువులపట్ల ప్రేమ, దయ, కరుణను చూపుతూ వాటిని రక్షించడం జరుగుతుంది. మనం కూడా ప్రకృతిలో అంతర్భాగమే. కాబట్టి ప్రకృతిని ఆరాధిస్తూ పూజ్యభావంతో వాటిని సంరక్షించుకుందాం. తర్వాతి తరాలవారు కూడా హాయిగా ఈ ప్రకృతిలోని అందాలను ఆస్వాదిస్తూ ఆనందంగా గడిపేలా మార్గాన్ని సుగమం చేద్దాం.

**సూక్తి : ప్రకృతిని రక్షించడం ప్రతిపౌరుని కర్తవ్యం. ప్రకృతిపై ఆరాధన – ప్రగతికి శుభం**

# ౨ కాలుష్య నివారణ

**I. ప్రధాన విలువ** : పర్యావరణం

**II. ఉపవిలువ** : వాయుకాలుష్య నివారణను గురించి అవగాహన కలిగి ఉండాలి.

**III. లక్ష్యాలు / ఆశించే ఫలితాలు** :

- గాలి ప్రాముఖ్యాన్ని తెలుసుకుంటారు.
- గాలికాలుష్యం ఎలా జరుగుతుందో తెలుసుకుంటారు.
- గాలి కాలుష్య నివారణకు కృషి చేయగలుగుతారు

**IV. ఉపోద్ఘాతం** : మనం జీవించడానికి గాలి, నీరు, ఆహారం చాలా ముఖ్యం ఆహారం లేకుండా కొన్ని రోజులు జీవించవచ్చు. నీరు లేకుండా రెండు మూడు రోజులు జీవించవచ్చు. కాని గాలి లేకుండా కొన్ని నిముషాలు కూడా జీవించలేం. మనం పీల్చే ఆక్సిజన్‌ను ప్రాణవాయువు అని అన్నారు. ఆధునికత పేరుతో జరుగుతున్న అభివృద్ధివలన, పెరుగుతున్న అవసరాలవల్ల గాలికాలుష్యం పెరిగింది. దీనిని నివారించలేకపోతే భవిష్యత్తులో గాలిని కూడా కొనవలసి వస్తుంది. బతకడమే కష్టతరం అవుతుంది. ఇప్పుడు మనం గాలి కాలుష్యం ఎలా జరుగుతుందో తెలుసుకుందాం.

**V. సంఘటనలు** :

**సంఘటన-1**

రామయ్యపాలెం ఓ మారుమూల గ్రామం. ఆ ఊరిలో ఒక స్వాతంత్ర్యసమరయోధుడు ఉండేవాడు. అతడు తన గ్రామాన్ని అందంగా ప్రకృతి అందాలకు నిలయంగా నిర్మించాలనుకున్నాడు. గ్రామంలోని అందరి సహకారంతో ప్రతి ఇంటిని పూల మొక్కలతో చెట్లతో అందంగా తీర్చి దిద్దగలిగారు. గ్రామంలోని ఖాళీస్థలాలు చెట్లతో నిండిపోయాయి. కొండలు గుట్టల మీద కాలువల వెంట, రోడ్డుల వెంట చెట్లను బాగా పెంచాడు. ఆ ఊరిలో ఎవరుకూడా ఇంధనంతో నడిచేవాహనాలు

వాడరు. సైకిల్‌లు, ఎడ్లబండ్లు, గుర్రపుబండ్లు వాడుతారు. ఉదయాన్నే వ్యాయామం చేయడం, యోగాసనాలు చేయడం, సేంద్రియ ఎరువుల ద్వారా పండిన పదార్థాలు తినడం చేయడం, ఇలా జీవన విధానం అలవాటు పడడంతో ఆ గ్రామం ప్రజలు ఆరోగ్యంతో ఆనందంగా జీవించగలుగుతున్నారు.

పట్టణంలో జీవించే ఒక వ్యక్తి శ్వాసకోశ వ్యాధితో బాధపడుతూ, డాక్టర్‌ను కలిశాడు. డాక్టర్ అతనిని పరిశీలించి, ఎలాంటి మందులూ రాయకుండా, ఓ రెండు నెలలు రామయ్యపాలెం గ్రామంలో గడిపి రమ్మని చెప్పాడు.

సంఘటన 2 :

నాగవరం గ్రామంలోని ప్రజలు ఆర్థికంగా ఎదగాలని, ఆర్థికంగా ఎదిగినప్పుడే హాయిగా జీవించవచ్చని భ్రమలో పడ్డారు. అందుకు అనుగుణంగా వారి ఆలోచనలు మారిపోయాయి. పేపర్ మిల్లులవారు ఎక్కువ డబ్బు ఇవ్వటంలో ఊరిలోని చాలా మంది, తమ ఇంట్లో పొలాల్లో ఉండే చెట్లను నరికి అమ్ముకున్నారు. రైతులు రసాయన ఎరువులు వేసి, ఎక్కువ పంట పండించి, ఎక్కువ డబ్బు సంపాదించడం మొదలు పెట్టారు. గ్రామంలోని ప్రతి ఒక్కరు తన హోదా చూపించుకోవాలని అందంగా సిమెంటు భవనాలు నిర్మించుకున్నారు. రిఫ్రిజిరేటర్లు, కారులు, బైకులు తెచ్చుకున్నారు. కష్టపడి బాగా సంపాదించేవారు. ఆవూరంతా వాహనాలతో, యంత్రాలతో, పరిశ్రమలతో నిండిపోయింది. చెట్లు తక్కువగా ఉండడం వలన ఎండాకాలమైన, ఏ కాలమైనా ఫ్యాను వేసిన ఉడకపోసేది, శరీరమంతా చెమటతో తడిచేది. చేసేదిలేక, ఇంట్లో, ఆఫీసుల్లో ఎ.సిలు వాడడం మొదలు పెట్టారు.

ఇలా కొన్ని సంవత్సరాలు గడిచింది. ఆ ఊరిలో కొందరు శ్వాసకోశ వ్యాధులతో, మరికొందరు ఊపిరితిత్తులతో, క్యాన్సర్‌తో, ఇంకొందరు ఆస్మా వంటి వ్యాధులతో బాధపడడం మొదలైనది. డాక్టర్‌ను కలవడం ప్రతినెల వేలకువేలు ఖర్చు చేసిన, వారి వ్యాధులు తగ్గుముఖం పట్టలేదు. అనారోగ్యంతో బాధపడుతూ, ఏపనిచేయలేక సంపాదన లేక ఆర్థిక ఇబ్బందులకు గురైనారు. ఇంట్లో ఉన్న ఒక చెట్టు నాలుగు AC లతో సమానం.

## VI. (అ) ఆలోచించడం - ప్రతిస్పందించడం

1. డాక్టర్ శ్వాసకోశవ్యాధితో బాధపడుతూ వచ్చిన వ్యక్తిని ఎందుకు రామయ్యపాలెం గ్రామంలో రెండునెలలు గడిపి రమ్మన్నాడు?
2. రామయ్యపాలెం గ్రామంలా మీఊరిని తీర్చిదిద్దటానికి మీరు ఎలాంటి కృషి చేస్తారు?
3. ఆనందంగా ఆరోగ్యంగా జీవించడానికి, డబ్బు ఉంటే సరిపోతుందా? ఇంకేమి కావాలి?
4. వాయు కాలుష్యాన్ని నివారించడానికి ఏమేమి చేయాలి?
5. ఊరు చెట్లతో పచ్చగ, చల్లగా కళకళలాడాలంటే మనమేం చెయ్యాలి?
6. చెట్టు కింద కూర్చున్నప్పుడు హాయిగా ఉంటుంది. ఎందుకు?
7. గాలి కాలుష్యం వల్ల వచ్చె వ్యాధులపై చర్చించండి.

(ఆ) ఆచరించడం - అనుభవాలు చెప్పడం

1. మీ వీధిలోని వారితో కలిసి, చెట్లను నాటడం చేయండి. వాహనాలను తక్కువగా వాడేట్లు చూడండి. మీరు పొందిన అనుభవాలను చెప్పండి.

## తెలుసుకోండి

### పర్యావరణానికి, ఆరోగ్యానికి ముడి :

పర్యావరణం, మావన ఆరోగ్యం ఒకదానితో ఒకటి సంబంధం కలిగి ఉంది. మానవుడు ఆరోగ్యంగా ఉండాలంటే తన పరిసరాలప్రభావం ఎంతో ఉంటుంది. స్థానికంగా ఆరోగ్యకర వాతావరణం నెలకొల్పితేనే భౌగోళిక ఆరోగ్యం గురించి మనిషి ఆలోచించగలడు. ఈ భూమిపై ఆధారపడి నివసించే వారికి మంచి నీరు, గాలి, ఆహారం, నివాసం కావాలంటే ఆరోగ్యకర పర్యావరణం కావాలి. అనారోగ్య పరిస్థితులు ఉత్పత్తిని తక్కువ చేస్తాయి. ఈ చర్య పర్యావరణ వినాశనానికి ఒత్తిడి కలుగ జేస్తుంది.

జీవించేందుకు అవసరమయే గాలి కలుషితం కావడంతో కాలుష్యకారకారకాలైన వాయువులు సూక్ష్మజీవులు దుమ్ముధూళి మానవుని శరీరంలోకి ప్రవేశించి శరీర రక్షణవ్యవస్థను నెమ్మదిగా దిగజారుస్తోంది. అందువల్ల రోగనిరోధకశక్తి తగ్గి అనేక రకాల శ్వాసకోశసంబంధవ్యాధులు హృదయసంబంధ వ్యాధులు వస్తున్నాయి. ప్రతి మనిషికి సగటున రోజుకు 15 కిలోల గాలి అవసరమవుతుంది. నీరు ఆహారం లేకుంటే కొంతకాలం జీవించగలం కానీ గాలి లేకుంటే కొన్ని నిముషాలు కూడా జీవించలేము. రోగనిరోధకశక్తి తక్కువగా ఉన్న శిశువులు వృద్ధులు గర్భస్థశిశువులపై గాలి కాలుష్య ప్రభావం ఎక్కువగా ఉంటుంది. పరిశ్రమలు రవాణా వ్యవస్థలు వ్యవసాయ గృహసంబంధ పనులవల్ల గాలి విపరీతంగా కలుషితం అవుతోంది. ప్రపంచ ఆరోగ్యసంస్థ అంచనా ప్రకారం కోట్లాది ప్రజలు అపాయకరమైన సల్ఫర్‌డయాక్సైడ్ గాఢతలకు సూక్ష్మాతి సూక్ష్మమైన ధూళికణముల వలన హద్దులు దాటిన ప్రమాదాలకు గురవుతున్నారు. గృహాలలో వంటచెరకు పిడకలు బొగ్గు ఇంధనాలువాడటం వలన ఇండ్లలో గాలి ఆడడానికి సరియైన వ్యవస్థ లేనందువలన అభివృద్ధి చెందుతున్న దేశాలలో స్త్రీలు, పిల్లలు గాలి కాలుష్యానికి గురవుతున్నారు.

ప్రపంచ ఆరోగ్యసంస్థ ప్రకారం ప్రతి వ్యక్తికి రోజుకు 40 - 50 లీటర్ల నీరు అవసరముంటుంది. మంచినీటికి గృహసంబంధ వ్యక్తిగత అవసరాలకు అవసరమయ్యే ఈ నీరు చాలా మంది ప్రజలకు అందుబాటులో లేదు. కొన్ని దేశాలలో నీరు మోసుకొని నడిచివెళ్ళేందుకు ఎక్కువ సమయం కేటాయించవలసి వస్తోంది. కొన్నిచోట్ల ఆరోగ్యకరమైన నీరు లభిచడం చాలా కష్టమవుతోంది. నాణ్యమైన నీరు సరఫరా చేయడం ఎంతో ముఖ్యమైనది. కలుషిత నీటిలోని వివిధ వ్యాధికారకక్రిములు జ్వరాలు, డయేరియా, రక్తక్షీణత, కామెర్లు మొదలగు అనేక వ్యాధులు కలిగిస్తాయి.

నీటిలో ఫ్లోరైడ్ శాతం ఎక్కువైతే ఎముకలు బలహీనమై దంతక్షయం, కీళ్ళనొప్పులు వచ్చే అవకాశాలున్నాయి. నీటిసరఫరాకు లెన్‌పైపులను వాడటంవల్ల కూడా నీటి కలుషితం జరుగుతుంది. పాదరసంతో కూడిన జలపానం వల్ల చూపు వినికిడి మందగించడం మానసిక అస్వస్థత వ్యాధులు కలుగుతాయి. నైట్రిక్ ఆసిడ్ కలిసిన నీటి వలన రోగనిరోధకశక్తి తగ్గి శిశుమరణాలు ఎక్కువయ్యే ప్రమాదం ఉంది. ఆర్సినిక్ క్రోమియంలు నీటిలో కలపడం వల్ల కాలేయం నాడి, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, జీర్ణాశయాలకు సంబంధించిన వ్యాధులు వస్తాయి.

## ప్రకృతిని కాపాడితే అందరికీ మేలు :

వాతావరణంలో మార్పులు, ఋతుపవనాల వైఫల్యం, అదిక ఉష్ణోగ్రతలు, తీవ్ర వర్షాభావ పరిస్థితులు, అతివృష్టి, అనావృష్టి ఇలాంటి తీవ్ర పరిణామాలు ప్రకృతిని పరిరక్షించకపోవడం వల్ల సంభవిస్తున్నవి. ప్రకృతి లేనిది మనిషి మనుగడ లేదు. మనిషి ప్రకృతి పైన, ప్రకృతి మనిషిపైన ఆధారపడి ఉన్నాడు. ప్రకృతి వైపరీత్యాలు మానవ సృష్టే. జనాభా పెరుగుదల, పట్టణీకరణ, అడవుల విధ్వంసం. కనీసం బొట్టు నీరు కూడా భూమిలోకి ఇంకిపోవడానికి స్థలం లేకపోవడం ఇవన్నీ మానవ తప్పిదాలే. గాజు, పింగాణి స్టీలు కప్పుల స్థానంలో డిస్పోజబుల్ గ్లాసులు, ప్లాస్టిక్ కప్పులు, స్టెరోఫోమ్ అనే థర్మకోల్‌తో చేసిన కప్పుల వాడకం పైగా ఇవి వేడిచేస్తే వీటిలోని పాలిస్టరీస్ శరీరంలోకి చేరి రకరకాల కేన్సర్లు రావడం, ఇవి మట్టిలో కలిసిపోక కొన్ని సంవత్సరాలు ఉండడం, కాల్చితే విషపూరితమైన వాయువులు విడుదల అవడం వాతావరణాన్ని కలుషితం చేస్తున్నాయి.

ఈ మధ్య దాదాపు ప్రతి ఇంటికి ఎసిలు కార్లకు ఎసిలు వీటివల్ల విడుదలయ్యే క్లోరోఫ్లోరో కార్బన్లు వాతావరణాన్ని ఇంకా వేడెక్కిస్తున్నాయి. విపరీత ఉష్ణోగ్రతల వల్ల నదులు ఇంకిపోవడం, వేడిగాలుల కారణంగా ఋతుపవనాలుసకాలంలో రాకపోవడం జరుగుతున్నాయి. ముందుందు మంచినీటికి తీవ్రకటకట ఏర్పడుతుంది. ఇప్పటికే పల్లెవాసులు ఎన్నో కిలోమీటర్లు కాలినడకన వెళ్లి నీరు తెచ్చుకునే దౌర్భాగ్య స్థితిలో మనదేశం ఉంది. ఇది ఒక భారతదేశ సమస్య కాదు. ఈ సమస్య యావత్ ప్రపంచానికి ప్రతి దేశం గ్రీన్‌హౌస్ వాయువుల పరిమాణాన్ని ఎలా తగ్గించడం? ఓజోన్ పొరను ఎలా కాపాడుకోవడం? కేర్సర్లు రాకుండా ఎలా నిరోధించడం, రసాయనాలతో కాకుండా వంటలు, కూరగాయలు, పండ్లు ఎలా పెంచడం అన్న అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. సముద్రమట్టం 3.5 నుండి 34 అంగుళాల మేరకు ముందుకు చొచ్చుకురావడం. భూగర్భ జలాలు ఉప్పు నీటిగా మారడం ఇది ఒక పెద్ద సమస్య. ఈ దుష్ప్రభావాలన్ని గుర్తించి సరైన రీతిలో సమస్యను పరిష్కరిస్తే మన దేశాన్ని మన ప్రపంచాన్ని మన ప్రకృతిని కాపాడుకోగలుగుతాము.

సూక్తి : ---

# 10 మార్పు

**I. ప్రధాన విలువ** : శాస్త్రీయ దృక్పథం

**II. ఉపవిలువ** : మార్పును అంగీకరించడం – విమర్శను స్వీకరించడం.

**III. లక్ష్యాలు / ఆశించే ఫలితాలు** :
- చేసిన పని పట్ల ఇతరుల అభిప్రాయాలను సానుకూలంగా స్వీకరించడం అలవర్చుకుంటారు.

**IV. ఉపోద్ఘాతం** : ఎవరికైనా సరే వారు చేసిన పనుల మీద ఒక అభిప్రాయంతో ఉంటారు. సాధారణంగా తాను చేసిన పని సరిగ్గానే ఉందని భావించడం కూడా జరుగుతుంది. ఒక్కోసారి ఇతరుల అభిప్రాయాలను తీసుకున్నప్పుడు, దానిని సానుకూలంగా తీసుకోవాలి. కాబట్టి మార్పును అంగీకరించడానికి సిద్ధంగా ఉండాలి. అంతేకాని వాటిని పట్టించుకొనకపోతే ఫలితం తారుమారు అయ్యే అవకాశం ఉంటుంది. ఒకసారి కింది సన్నివేశాలను పరిశీలిద్దాం. ఒక ఉదాహరణ కంప్యూటర్ వరల్డ్ నేర్చుకోవడం తప్పనిసరి.

**V. సంఘటనలు** :

**సంఘటన-1**

రమేష్‌బాబు రచయితగా ఎదిగి మంచి పేరు సంపాదించుకోవాలని అనుకుంటూ ఉండేవాడు. అందుకు తగ్గట్లుగానే అనేక రకాల రచనలు చేస్తుండేవారు. ఒకరోజు ఒక దినపత్రికలో "ఉగాది కథల పోటీలు" అని ప్రకటనను చూసి, ఈసారి తప్పకుండా ఈ పోటీలకు ఒక మంచి కథను రాసి పంపాలని నిర్ణయించుకున్నాడు. దీనిద్వారా రాష్ట్రమంతా తన పేరు తెలిసిపోతుందని ఆశతో కథ రాయడం మొదలు పెట్టాడు. మొత్తానికి రమేష్ బాబు కథను సిద్ధం చేసుకున్నాడు. ఆ పత్రికా కార్యాలయానికి పంపేకంటె ముందు తన భార్యకు వినిపిద్దామని పిలిచాడు. తను రాసిన కథనంతా భార్యకు వినిపించాడు. కథనంతా విన్న భార్య "బాగానే ఉంది కాని, సమకాలీన అంశాలతో కూడిన కథ అయితే ఇంకా బాగుండేది. ప్రస్తుత రచనలన్నీ ఎక్కువగా ఇలాంటి కథలే వస్తున్నాయని" తన అభిప్రాయాన్ని చెప్పింది. తన భార్య చెప్పింది విన్న రమేష్ బాబు "ఇక చాలు, ఏదో, పోనీలే అని నీకోసారి వినిపించి కథను పోస్టు చేద్దామనుకుంటే, ఇలా ఉంటే బాగుండేది, అలా ఉంటే బాగుండేదని చెప్తున్నావా నాకు తెలియదా ఎలా ఉంటే బాగుంటుందో" అని ఆ కథను పత్రికా కార్యాలయానికి పంపించారు.

కొన్ని రోజులకు తాను రాసిన కథ యథాతథంగా తిరిగి పోస్టులలో వచ్చింది. ఆశ్చర్యంతో కవర్ విప్పి చూడగా అందులో " మీ కథ ఎంపిక కాలేదని, కారణం కథ సమకాలీన అంశాలకి సంబంధించి కాదని అందుకే మీ కథను తిరిగి పంపిస్తున్నాం" అని రాసి ఉన్న పేపరుని చదివాడు. అప్పుడే అక్కడికి వచ్చిన భార్య "ఏమైందండీ" అని అడుగగా "నీవన్నది నిజమే. నీవు చెప్పినపుడు, నీ మాటలు పట్టించుకోలేదు.. నీ మాటవిని నా కథను సమకాలీన అంశాలతో రాసి ఉంటే బాగుండేది" అని తనతో జరిగిన విషయం చెప్పాడు.

### సంఘటన-2

శ్రద్ధ ఆ పాఠశాలలో చాలా తెలివైన అమ్మాయి. చాలా చురుకైన అమ్మాయి కూడా. అందుకే ఉపాధ్యాయులందరూ తనని అభిమానించేవారు. కాని శ్రద్ధకు మరో కోణం తను చాలా అల్లరిపిల్ల ఎప్పుడూ ఎవర్నో ఒకర్ని ఎడిపిస్తూనే ఉంటుంది. వారిని వెక్కిరిస్తూ ఆటపట్టిస్తూ ఉండేది. దీంతో చాలా మంది విద్యార్థులు తన నుండి తప్పించుకుని వెళ్ళేవారు. ఇలా చేయడం తప్పని వారు బాధపడ్తారని తన స్నేహితురాలు అచ్యుత రోజు చెప్తునే ఉంటుంది. ఐనా వినిపించుకోదు.

ఒకరోజు రోజూ మాదిరిగానే శ్రద్ధ ఒకరిని ఆట పట్టిస్తుంటే అతను కాలుజారి పడ్డాడు. తలకు దెబ్బతగిలి గాయమైంది. అది తెలిసి ఆ అబ్బాయి నాన్న వెంటనే పాఠశాలకు వచ్చాడు. శ్రద్ధ భయంతో వణికిపోయింది, వాళ్ళ నాన్న ఏమంటారో అని దిగాలుగా ఉంది. శ్రద్ధ దగ్గరకు వచ్చిన ఆ అబ్బాయి నాన్న "చూడమ్మా! అందరూ కలిసి సంతోషంగా ఆడుకోవాలి. కానీ, ఇలా చేయకూడదని" ఎంతో శాంతంగా చెప్పివెళ్ళాడు. శ్రద్ధ ఆశ్చర్యపోయింది. కనీసం తను నాపై కోపగించుకోలేదని అనుకుంది. శ్రద్ధ ఆలోచనల్లో పడింది. "తను అనవసరంగా మిగతా పిల్లల్ని ఏడిపిస్తున్నానని ఎన్ని సార్లు తన ప్రవర్తన మార్చుకోమని చెప్పినా వినిపించుకోలేదని, ఇక నుండి అందరితో కలిసి ఉండాలని" అనుకుంది. మరుసటి రోజు నుండి శ్రద్ధలో మార్పు కనిపిస్తోంది. తను ముందటిలా కాకుండా అందరితో కలివిడిగా ఉంటూ సంతోషంగా ఆడుకుంటుంది.

## VI. (అ) ఆలోచించడం - ప్రతిస్పందించడం

1. రమేష్‌బాబు తన భార్య చెప్పిన అభిప్రాయం వినలేదు కదా! అది సరైందేనా? ఎందుకు?
2. శ్రద్ద తన ప్రవర్తన మార్చుకోవలసిన అవసరం ఎందుకు వచ్చింది? ఒకవేళ తను మారకపోతే ఏమయ్యేది?
3. మీరు మీ విషయంలో ఇతరులు చెప్పినప్పుడు వారి మాటలు విని ఏమైనా పద్ధతులు మార్చుకున్నారా?
4. ఏయే సందర్భాలలో మనం ఇతరుల అభిప్రాయాలను తీసుకోవాలి.

## (ఆ) ఆచరించడం - అనుభవాలు చెప్పడం

1. మీరు మీ ఇంట్లో గాని పాఠశాలలో గాని ఏదైన పనిని చేస్తున్నపుడు, ఎవరైనా నీ దగ్గరకు వచ్చి అలా కాదు ఇలా చేయాలన్నపుడు మీరు ప్రవర్తించిన తీరును రాయండి.

## స్వీయాభివృద్ధి

*మన చుట్టూ జరుగుతున్న అభివృద్ధిని గమనించుకుంటూ స్వీయ అధ్యయనం ద్వారా, కృషి, పట్టుదలతో జీవితంలో సొంతంగా అభివృద్ధి చెందటాన్ని స్వీయాభివృద్ధి అంటారు. మార్పును అంగీకరిస్తూ ముందుకు పోదాం.*

***స్వీయాభివృద్ధి సాధించడానికి పాటించాల్సిన అంశాలు / చర్యలు :***

- *ఎల్లప్పుడు పాజిటివ్ ఆలోచనలు కలిగి ఉండాలి.*
- *నీ చుట్టు జరుగు అభివృద్ధిని గమనించాలి. మంచిని నీలో అభివృద్ధి చేసుకోవాలి.*
- *నీ చుట్టూ జరిగే మార్పులను అస్పష్టతను ఎదుర్కొని, వాటిని ప్రేమించాలి.*
- *అపఖ్యాతి పరిస్థితిని కూడా చిరునవ్వుతో స్వీకరించి దానిని ఎదుర్కోవాలి.*
- *నీదైన శైలిలో అభివృద్ధికై సాహసించాలి, సాధించాలి.*
- *కష్ట, నష్టాలలో క్లిష్ట పరిస్థితులలో సమయ స్ఫూర్తిని ప్రదర్శించి సమస్యలను అధిగమించాలి.*
- *దూర దృష్టితో నీ లక్ష్యాన్ని సాధించడానికి ఒక దృక్పథాన్ని ఏర్పరచుకొని ఆ దృక్పధంలో నీ చుట్టూ ఉండే వారిని భాగస్వాములను చేసి అందరితో కలసి ఉండి అభివృద్ధిని సాధించాలి.*

## తెలుసుకోండి

సమాజంలో మనం అనేక మందిని గమనిస్తూ ఉంటాం. వారిలో ఎదుటి వారి అభిప్రాయాలకు గౌరవమిచ్చే వారైతే. మరికొంత మంది అసలే పట్టించుకోని వారు. అయితే చేస్తున్న పని గురించి ఎవరైనా సద్విమర్శ చేసే దానిని సహించని వారు అనేక మంది ఉంటారు. ఏదైనకాని ఎదుటివారు మనల్ని విమర్శిస్తున్నారంటే మనలో కాని మనం చేస్తున్న పనిలో ఏదో మార్పును ఆశిస్తున్నట్లుగా భావించాలి.

మార్పును ఆహ్వానిస్తే మనకు అందులోని అవకాశాలు కనిపిస్తాయి. అందులోని సంతోషం పలుకరిస్తుంది. ఒకవేళ మనం మార్పును ఆహ్వానించకపోతే అందులో అవకాశాలు మనకు కనిపించవు. నిరాశ, నిస్పృహలు మనల్ని ఆవరిస్తాయి. ఇక ఇలాంటి పరిస్థితుల్లో అభివృద్ధికి అవకాశముండదు కదా! ఉదాహరణకు ఒక డాక్టరు తను చేసిన చిన్న పొరపాటువల్ల ఒకరోగి మరణించాడు. అప్పటి నుండి రోగులు ఆ డాక్టరు దగ్గరికి వెళ్ళడమే మానేశారు. కాని తన పొరపాటును తెలుసుకున్నాడు. ఇక నుండి అలా చేయకూడదనుకున్నాడు. మళ్ళీ వైద్యం చేయడం ప్రారంభించాడు. రోగులతో తన మాటలతో స్వాంతన చేయగలిగాడు. ఇప్పుడే అదే డాక్టరు దగ్గరకు ఎంతో మంది రోగులు వస్తున్నారు.

ఏదైనా గాని మంచి విషయానికి, అభివృద్ధికి తోడ్పడే ఏ విమర్శనైనా స్వీకరించాలి. ఏ మార్పునైనా ఆహ్వానించాలి.

మార్పు చైతన్యానికి చిహ్నం. చైతన్యం జీవనానికి చిహ్నం. ప్రకృతి ప్రతి ఋతువులోనూ తన స్వభావాన్ని మార్చుకుంటుంది. శిశిరంలో ఆకురాల్చిన చెట్టు వసంతంలో చిగురిస్తుంది. సృష్టిలోని ప్రతి ప్రాణి తన అంతః బాహ్య స్వభవాలను నిరంతరం కాలనుగుణంగా మార్చుకుంటుంది. ప్రకృతిలో మార్పు అత్యంత సహజమన జీవన ప్రక్రియ.

**మార్పు అంటే...**

జరుగుతున్న పనులలో కనిపించే పురోగతినే మార్పు అంటారు. ఈ మార్పుకు మూలం వివిధ రకాల అనుభవాలు, అభిప్రాయాలు, పరిశోధనలుగా చెప్పవచ్చు.

**మార్పును ఎందుక అంగీకరించాలి...**

గత అనుభవాల్ని పునాదులుగా చేసుకొని భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని వర్తమానాన్ని మీరు తీర్చిదిద్దుకోవడానికి మనం మారాలి.

మార్పుని ఆహ్వానిస్తే మనకు అందులోనే అవకాశాలు కనిపిస్తాయి. అందులోని సంతోషం పలుకరిస్తుంది.

**మార్పును అంగీకరించకపోతే...**

ఒకవేళ మనం మార్పుతను ఆహ్వానించక పోతే అందులో అవకాశాలు మనకు కనిపించవు. నిరాశా నిస్పృహలు మనల్ని ఆవరిస్తాయి. ఇక ఇలాంటి పరిస్థితుల్లో అభివృద్ధికి అవకాశం ఉండదు. చాలా మంది మార్పును అంగీకరించక పోవడానికి కారణం "భయం". ఉన్నది పోతుందేమో అని, అనుకున్నది రాదేమోనని దిగులుతో ఇలా అన్ని అనుమానాలతో వారు మార్పును అంగీకరించరు.

**విమర్శ అంటే...**

మనం చేస్తున్న పనులపై నిర్మొహమాటంగా అభిప్రాయాలు చెప్పడం. ఎవరైన సద్విమర్శలు చేస్తే కచ్చితంగా వాటిని స్వీకరించాలి. అందుకు ఈ ఉదాహరణ చూద్దాం. ఓ మహాత్ముణ్ణి ఆయన శిష్యుడెప్పుడూ ఘాటుగా విమర్శించేవాడు. అనుక్షణమూ నిందించేవాడు. ఏదో సమయంలో శిష్యుడు తెలుసుకోగలగుతాడనీ, పశ్చాత్తాపం చెందుతాడని ఆ మహాత్ముడనుకునేవాడు. తన ఇతర శిష్యులతో – ఆ శిష్యుడు నిగర్వి అని, చాలా సద్గుణశీలుడని మెచ్చుకోలుగానే ఆ మహాత్ముడు చెప్పేవాడు. కొన్నాళ్ళకు ఆ గర్విష్ఠుడైన శిష్యుడు పొరుగూరికి ఓ పనిమీద వెళుతూ ఆలోచించాడు. తానెంతగా విమర్శిస్తున్నా, గురువుగారు తననెన్నడూ పల్లెత్తు మాటయినా అనలేదు. పైగా తనను మెచ్చుకుంటూనే మాటాడుతున్నాడు. ఆయన దగ్గరికెళ్ళి తప్పక క్షమాపణ కోరాలనుకున్నాడు. అయితే ప్రమాదవశాత్తు పులివాతపడి ప్రాణాలు కోల్పోయాడు. ఆ వార్త విన్న మహాత్ముడెంతగానో దుఃఖించాడు. నాలో అహంకారం పెరగకుండా, ఎప్పటికప్పుడు ఆత్మపరిశోధన చేసేందుకు ఉపయోగపడే విమర్శలు చేసే శిష్యుడు మరణించడం నా దురదృష్టం అని విచారించాడు.

ఎదుటి వారి విమర్శలు మనలో అంతర్వీక్షకు ప్రేరేపిస్తాయి. మనకు పాఠాలవుతాయి. మార్గదర్శకాలవుతాయి. మన వివేచనను, వివేకాన్ని జాగృతం చేస్తాయి. అంటేగాని విమర్శించిన వారిని నిందించడం, అవమానించడం తగదు. మనలోని లోపాలను గ్రహించుకునే ప్రయత్నం చెయ్యాలి.

కొంత మంది మనం చేస్తున్న పనులకు సంబంధించి, మనకు సంబంధించి అనవసరంగా విమర్శలు చేస్తూ ఉంటారు. వాటివల్ల మనం బాధపడాల్సిన అవసరం లేదు.

## అజ్ఞానంతోనే అనవసర విమర్శ

ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ఎదురు చూస్తూ కాలక్షేపం చేసేవారు చాలా మంది ఉంటారు. అయితే తాను మాత్రం ఇతరులకు ఏ రకంగానూ మేలు చేయరు. కేవలం ఎదుటివారిని పదునైన మాటలతో గాయపరుస్తుంటారు. కానీ, తానను మాత్రం ఎవరూ ఏమీ అనకూడదు. వారికి మంచి చెప్పడాన్ని కూడా సహించరు. పైగా ఎదురు దాడి చేస్తారు. ఎవరికైతే తనకు అన్నీ తెలుసు అని అనుకుంటారో వారంతా మూర్ఖులే. ఎదుటి వ్యక్తి నుంచి మనం తెలుసుకోవలసింది ఎంతో ఉంటుంది. సరే! మీకు తెలియకున్నా ఇబ్బంది ఉండదు. కానీ ఇతరుల విషయంలో జోక్యం చేసుకోవడం మాత్రం సరికాదు. ఏ పనీ చేయలేనివారే ఎదుటివారు చేసే పనిపై విమర్శలు గుప్పిస్తుంటారు. ఎవరికీ సహాయపడనివారే ఇతరులు అందించే సహాయాన్ని లెక్కచేయరు. ఒకవేళ తాము అందులో చొరవ చూపితే ఆ పని విలువ తెలుస్తుంది. ఆ సహాయాన్ని అంచనా వేసే అవకాశం ఏర్పడుతుంది. అంతేకానీ ఎప్పుడూ ఇతరులను విమర్శిస్తూ కాలక్షేపం చేసేవారు ఎందుకూ కొరగానివారవుతారు. మాటలు కోటలు దాటుతాయి, కానీ కాళ్ళు గడప దాటవు అనే సామెత ఉంది. ఎప్పుడూ ఇతరుల సహాయం కోసం నిరీక్షించేవారు చివరకు సోమరులుగా మారిపోతారు. ఈ తత్వం చాలా ప్రమాదకరం. దీనివల్ల వారే ఇబ్బందుల్లో పడతారు. పనిచేయడం చేతకాకుండా పోతుంది. కాబట్టి మీరు చేసేంత చేయండి. అయినా సహాయం కావాలంటే ఏదో రకంగా చేయూత అందుతుంది. కానీ ఏ పనీ చేయనని ఒట్టేసుకు కూర్చుండేవారు జీవితంలో చాలా నష్టపోవలసి వస్తుంది. పనివల్లే ఆరోగ్యం, పనివల్లే విజ్ఞానం మెరుగుపడుతుంది. అంతేకాదు పనివల్లే జీవన ప్రమాణాలు పెరుగుతాయి. అయితే ఏమీ చేతకాని వారు మాత్రం ఇతరులపై అనవసరపు నిందలు వేస్తుంటారు. ఎదుటి వ్యక్తి చేసే ప్రతి పనిలో తప్పులు తీయడానికి ప్రయత్నం చేస్తుంటారు. ఎదుటివారి ఎదుగుదలను జీర్ణించుకోలేరు. వీరి వాదనలు, ఉపమానాలు అన్నీ నీరసాన్ని తెప్పిస్తుంటాయి. ఈ మాటలు వినడానికి ఇతరులకు కూడా కొంత హద్దు ఉంటుంది. హద్దు మీరితే వారు కూడా చులకన చేస్తారు. నీ పని నీవు చేస్తూ వెళ్ళాలి. ఇతరుల పని ఫలితం ఎలా ఉన్నా ఏమీలేదు. పని సమర్థవంతంగా చేస్తే నీవు విజేయుడవవుతావు, పనిలో తప్పులు జరిగితే మళ్ళీ అటువంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త పడతావు. అంతేకాని అసలు ఏపనీ చేయనని కూర్చోవడం మూర్ఖత్వమే అవుతుంది. పనిమాధుర్యాన్ని పసిగడితే దాన్ని విడిచిపెట్టడానికి ఎవరూ సాహసించరు. ఈ ప్రకృతి నీకు అన్ని సమకూర్చింది. గాలి, నీరు, వెలుతురుతో

పాటు ఆహ్లాదంగా ఉండటానికి అవసరమైన పర్వతాలు, సూర్య, చంద్రులు కొండలు, లోయలు ఎన్నెన్నో, వీటన్నింటితో మీరు ఏ మేరకు ఆనందం పొందుతున్నారు. ఇంతెందుకు మీ పనులు కూడా మీరు అనాలోచితంగా చేసుకోగలుగుతున్నారు. శ్వాసతీసుకోవడం, గుండె కొట్టుకోవడం, స్పర్శజ్ఞానం, కనురెప్పలు కొట్టుకోవడం ఇలా మీకు తెలియకుండానే ఎన్ని పనులు నిరాటంకంగా జరిగిపోతున్నాయి? అయినా మీలో అసంతృప్తి ఉండటం వల్ల మీలో బాధ, ఈర్ష్య రాగద్వేషాలు పెరిగిపోతుంటాయి. వీటివల్ల ఏదో తెలియని అశాంతి మీలో చోటు చేసుకుంటుంది. ఫలితంగా అనారోగ్యం మిమ్మల్ని వెంటాడుతుంది. అందుకే మీ మనసును ఎప్పుడూ ప్రశాంతంగా ఉంచుకునే ప్రయత్నం చేయాలి. అది కేవలం విజ్ఞాన వంతులకే సాధ్యపడుతుంది. మీలో ఉండే అవలక్షణాలను తొలగించుకోవడానికి విజ్ఞానం అనే ఆయుధాన్ని ఉపయోగించాలి. దానివల్ల దేన్నయినా సునాయాసంగా పొందే అవకాశం ఉంటుంది.

**సూక్తి : మనం మార్పు చెందితే ఈ ప్రపంచం కూడా మార్పుచెందుతుంది; మనం పరిశుద్ధులమైతే ఈ లోకం పరిశుద్ధమౌతుంది.**

# 11 న్యాయపోరాటం

**I. ప్రధాన విలువ** : న్యాయం

**II. ఉపవిలువ** : అన్యాయాలను ప్రశ్నించడం

**III. లక్ష్యాలు / ఆశించే ఫలితాలు** :
- అన్యాయాలను తెలుసుకొని న్యాయం జరిగే వరకు ప్రశ్నించడం నేర్చుకోగలరు.

**IV. ఉపోద్ఘాతం** : మనచుట్టూ ఉన్న సమాజంలో ఎక్కడైనా అన్యాయం జరిగితే నాకెందుకులే అని చూస్తూ ఊరుకోక, జరుగుతున్న అన్యాయాలని ప్రశ్నించగలగాలి. న్యాయం జరిగే వరకు నిజాయితీగా ప్రయత్నిస్తూనే ఉండాలి. అలాంటి అన్యాయాలను ప్రశ్నించిన కొన్ని సన్నివేశాలను పరిశీలిద్దాం.

**V. సంఘటనలు** :

**సంఘటన-1**

ఒక ఊరిలో సంతోష్ అనే రైతు ఉండేవాడు. వ్యవసాయమే ఆయనకు ఆధారం. అతను ఎండనకా, వాననకా, పగలనకా, రేయనకా ఎంతో కష్టపడి పంటలు పండించేవాడు. పంటలు పండించడానికి అయ్యే ఖర్చుల కోసం తాను పట్నంలోని వ్యాపార దళారి దగ్గర నుండి డబ్బులను అప్పుగా తీసుకు వచ్చాడు. అయితే వీరి మధ్య ఒప్పందం ఏంటంటే, తాను పండించిన పంటలను ఈ దళారికి అమ్మడం. అలా కొన్ని నెలలకు పంట చేతికొచ్చింది. పండిన పంటను రైతు అమ్మడానికి దళారి దగ్గరకు తీసుకెళ్ళాడు. అప్పుడు దళారి ఒక ధర నిర్ణయించి తనకు కావలసిన డబ్బులు తీసుకొని మిగతా డబ్బులు ఇచ్చివేశాడు. తర్వాత రైతు తాను అమ్మిన పంటకు మార్కెట్‌లో దళారి పెట్టిన ధర కంటే ఎక్కువగా ఉందని తెలుసుకుని దళారి దగ్గరకెళ్ళి "ఏంటండీ! నా పంటకు మార్కెట్ ధర కంటె తక్కువ ధర చెల్లించారు. ఇదేం అన్యాయం" అంటూ ప్రశ్నించాడు.

**సంఘటన-2**

"పౌష్టికాహారం లోపం రాకుండా విద్యార్థులంతా సంపూర్ణ ఆరోగ్యాన్ని కలిగి ఉండాలని ప్రభుత్వం అన్ని పాఠశాలల్లో "మధ్యాహ్న భోజనం" నిర్వహిస్తున్నారు. అందుకోసం వారంలో ఏరోజు ఏయే ఆహారపదార్థాలను అందించాలో "మెను"ని

కూడా రూపొందించి ఇవ్వడం జరిగింది.” అని మండల విద్యాధికారి తన సందేశాన్ని ముగించారు. ఆరోజు ఉదయం 9:00 గంటలకు పాఠశాల సందర్శనలో భాగంగా మండల విద్యాధికారి ప్రార్థనా సమావేశ:లో పైవిధంగా ప్రసంగించారు.

పాఠశాలలో మండల విద్యాధికారి సందేశం విన్న విద్యార్థులందరూ అదే ఆలోచిస్తున్నారు. “రోజు తమకు మధ్యాహ్న భోజనంలో కేవలం పప్పు, అన్నం మాత్రమే పెడుతుంటే, యం.ఇ.ఓ గారేమో మెనూ ప్రకారం అంటున్నారేంటే” అని చర్చించుకుంటున్నారు. అసలు మెనూలో ఏముందో తెలుసుకుందామని నిర్ణయించుకున్నారు. కొంత మంది విద్యార్థులు ప్రధానోపాధ్యాయుని గదికి వెళ్ళి చూశారు. అందులో రోజూ వారిగా ఇవ్వాల్సిన ఆహార పదార్థాల వివరాలు ఉన్నాయి. సోమవారం - పండు, బుధవారం కోడిగుడ్డు ఇవ్వాలని ఉంది. అది చదివిన విద్యార్థులు మళ్ళీ మిగతా విద్యార్థులతో మెనూలోని అంశాల గురించి చర్చించుకొని, అందరు కలిసి మధ్యాహ్న భోజనం వంటచేసే సిబ్బంది దగ్గరికి వెళ్ళారు.” మీరు ప్రతివారం పండు ఎందుకు ఇవ్వడం లేదు? మాకు గుడ్డు ఎందుకు ఇవ్వడం లేదు? రోజు పప్పు అన్నమే ఎందుకు పెడ్తున్నారు? కూరగాయలు ఎందుకు చేసి పెట్టడం లేదు? అంటూ ఒకరి తర్వాత ఒకరు వారిని ప్రశ్నిస్తూనే ఉన్నారు.

## VI. (అ) ఆలోచించడం - ప్రతిస్పందించడం

1. రైతుకు అన్యాయం జరిగిందని తెలుసుకున్నారు కదా! ఆ రైతు తనకు జరిగిన అన్యాయాన్ని గురించి దళారిని ప్రశ్నించడం సరైనదేనా? ఎందుకు?
2. మధ్యాహ్న భోజనం మెను ప్రకారం పెట్టడం లేదని విద్యార్థులు ప్రశ్నించడాన్ని మీరు సమర్థిస్తారా? ఎందుకు?
3. అన్యాయం జరిగిందని మనం ఎలా తెలుసుకుంటాం?
4. మీ నిత్యజీవిత అనుభవంలో మీకు అన్యాయం జరిగిందన్న సందర్భం ఉందా? ఉంటే ఆ అన్యాయాన్ని ఎలా ప్రశ్నించారు?
5. మీ గ్రామంలో లేక ప్రాంతంలో అన్యాయం జరిగిన సంఘటనలు ఏమైనా ఉన్నాయా? చర్చించండి, కారణాలను విశ్లేషించండి.

## (ఆ) ఆచరించడం - అనుభవాలు చెప్పడం

1. పాఠశాలలో ఉన్న మధ్యాహ్న భోజనం మెనూని పరిశీలించండి.

ఒక వారం రోజుల పాటు మీకు అందిస్తున్న మధ్యాహ్నభోజనం మెనూ ప్రకారమే పెడ్తున్నారా లేదా పరిశీలించండి. ఏయే రోజులలో మెనూ ప్రకారం పెట్టారు. ఏయే రోజులలో పెట్టలేదో నమోదు చేసి వివరాలు తెల్పండి. పెట్టకపోతే కారణాలు తెలుసుకొని చెప్పండి.

## తెలుసుకోండి

### అన్యాయాన్ని గురించి ప్రశ్నించడం

మానవుడు సంఘజీవి. సంఘంలో బతకడానికి కొన్ని కట్టుబాట్లు, ఆచారాలు, నియమాలు ఉంటాయి. వాటిని మానవుడు తప్పక పాటించాల్సి ఉంటుంది. అదే విధంగా తను పొందవలసిన న్యాయమైన హక్కులకు భంగం వాటిల్లినట్లైతే కూడా న్యాయపరంగా వాటిని పొందడానికి అవకాశం ఉంది.

ఉదా : కుటుంబపరంగా చూసినట్లైతే ఇంట్లో పెద్దవారిని సరిగా చూసుకోవడం, పిల్లలకు సరైన రక్షణ కల్పించడం, విద్య, ఆహార, విషయాల్లో వారికి లోటురాకుండా చూసుకోవడం మొదలైనవి. ఒక కుటుంబంలో తల్లీ తండ్రిడి ముసలివాళ్ళు వాళ్ళ పనులు వాళ్ళు చేసుకోలేకుండా ఉంటారు. అటువంటి సమయంలో పిల్లలు తల్లి తండ్రికి ఆసరాగా నిలబడాలి. వాళ్ళకు కావలసిన వాటిని సమకూర్చాలి. ఇది కుటుంబ న్యాయం కిందకి వస్తుంది. పై వాటికి భంగం కలిగినట్లైతే వాటిని న్యాయపరంగా ప్రశ్నించి సమకూర్చుకోగలిగే హక్కు వారికుంది.

- సమాజ పరంగా చూసినట్లైతే సమాజంలో రోజూ మనం అన్యాయాలు జరుగుతుండడం చూస్తూఉన్నాం. ఉన్నవాడు లేనివాడిని బానిసగా చూడడం. కనీస అవసరాలైన కూడు, గూడు, ఆహారం మొదలైనవి అందరికీ అందుబాటులో లేకపోవడం – సంపద అంతా కొందరి చేతుల్లోనే కేంద్రీకృతమై ఉండడం. కొంతమంది వ్యక్తులు అస్పృశ్యతకు లోనుకావడం మతం, కులం, అనే పేరుతో చిన్న చూపు చూడడం, లింగవివక్ష చూపించడం మొదలైనవన్నీ మనం సమాజంలో చూస్తూ ఉంటాం.

అయితే వీటిని రాజ్యాంగం న్యాయపరంగా పౌరులు తమ హక్కులను పొందడానికి కొన్ని చట్టాలను చేసింది. ఒకవేళ తాము తమ హక్కులకు భంగం కలిగినట్లైతే న్యాయస్థానాల ద్వారా అన్యాయాన్ని ప్రశ్నించి న్యాయం పొందవచ్చు. అంతేకాకుండా అన్యాయాలను ఎదిరించడానికి నేడు సమాజంలో ఎన్నో రకాల సంస్థలు ఏర్పడ్డాయి.

ఆ సంస్థలు నేడు అన్యాయాన్ని ప్రశ్నించడానికి ముందుకు వస్తున్నాయి. అటువంటి సంస్థలతో కలిసి పోరాడి అన్యాయాన్ని ఎదిరించాలి. ప్రతివ్యక్తి అన్యాయాన్ని ఎదిరించడమనేది తన బాధ్యతగా గుర్తించాలి. అలానే వ్యక్తులు తమ తమ నైతిక బాధ్యతలను కూడా సమర్థవంతంగా నిర్వర్తించాలి. తల్లిదండ్రులను ప్రేమగా చూసుకోవడం, పిల్లలకు సరైన పోషణ, విద్య, రక్షణ కల్పించడం, న్యాయబద్ధంగా నడచుకోవడం, భూతదయను కలిగి యుండడం, ఎదుటి వ్యక్తిని గౌరవించడం, న్యాయ సముపార్జన మొదలైనవి ఎవరికి వారు నిబద్ధతతో చేసినట్లైతే సమాజంలో అన్యాయాలు కొంతవరకు తగ్గే అవకాశం ఉంటుంది.

నేటి సమాజంలో ఎన్నో అన్యాయాలు జరుగుతుండడం చూస్తున్నాం. ఒక కొడుకు తల్లిదండ్రులను బయటకునెట్టడం, భర్త భార్యను వదిలివేయడం, పిల్లలను తల్లిదండ్రులు సరిగా చూడకపోవడం, శ్రమజీవులను బానిసలుగా చూడడం, ప్రేమపేరుతో అమ్మాయిలను మోసంచేయడం, ఉన్మాదులు హత్యలుచేయడం, వడ్డీవ్యాపారులు నిరక్షరాస్యులను మోసగించి వారి ఆస్తులను ఆక్రమించుకోవడం, హత్యలు, మానభంగాలు మొదలైన ఎన్నో అవినీతి పరమైన అన్యాయాలు సమాజంలో జరుగుతూ ఉన్నాయి. వీటిపై ధ్వజమెత్తి పోరాడే సంస్థలు కొన్ని ఆవర్భవించాయి. పౌరులు అన్యాయాలను ఎదుర్కోవడానికి అటువంటి సంస్థలతో కలిసిపోరాడాలి.

## న్యాయాలు ఏవి?

రాజ్యాంగం సహజ న్యాయ సూత్రాల ఆధారంగా రూపొందించబడింది.

అవి ఏవి?

**ఎ) సాంఘిక (సామాజిక) న్యాయం :** స్త్రీ–పురుష లింగ భేదము పెద్దా – చిన్నా వయో భేదము కులము మతము ప్రాంతము అన్నవి కారణాలుగా సమాజంలోని వ్యక్తులకు ఇవ్వబడే గౌరవము, గుర్తింపులలో తేడా ఉండకూడదు. వివక్ష ఉండరాదు. అంటరానితనం, ఊరి చివర పల్లెలు (వాడలు) ఉండరాదు.

ప్రతి ఒక్కరూ శక్తి కొలదీ పని చేయాలి. అవసరాన్ని బట్టి ఫలితం అందాలి. పని చేయలేని పిల్లలు, ముసలివారు, అంగవికలురు మొదలయిన వారి బాధ్యత యువత తీసుకోవాలి. ఇది సామాజిక న్యాయంలో భాగం. ఉత్తమ సమాజంలో మనం అనుకున్న విద్య, భద్రత దీని కిందకే వస్తాయి.

**బి) ఆర్థిక న్యాయం :** పై కారణాలు వేటి వలన కూడా ఆర్థికపరమైన వివక్ష ఉండరాదు.

- ఆర్థిక న్యాయం అమలు జరగాలంటే సమిష్టి లాభ నష్టాలలో ప్రతి వ్యక్తికి భాగస్వామ్యముండాలి.
- ఆర్థిక అసమానతలకు దారి తీసే నియమాలుండరాదు. ఆర్థిక సమానతకు దారితీసే నియమాలుండాలి.
- తప్పని సరిగా ఏర్పడే అసమానతలను తొలగించే / తగ్గించే ఏర్పాట్లుండాలి.
- బలహీనులు, అంగవికలురు, ముసలివారు, పిల్లలు – వీరి బాధ్యత సమాజం తీసుకోవాలి.

ప్రతి ఒక్కరూ శక్తి కొలది పని చేయాలి. పనిని బట్టి ఫలితం అందుకోవాలి.

"ఎక్కువ పని చేస్తే ఎక్కువ ఫలితం.

తక్కువ పని చేస్తే తక్కువ ఫలితం.

ఏమీ చేయకపోతే ఏమీ ఫలితం రాదు" ఇది ఆర్థిక న్యాయం.

"తక్కువ పని చేస్తే ఎక్కువ ఫలితం" గానీ.

"ఏమీ పని చేయకపోయినా ఫలితం అందటం" గానీ ఆర్థిక అన్యాయం కిందకు వస్తాయి.

ఉత్తమ సమాజంలో మనం అనుకున్న ఉపాధి, సంపదలో భాగస్వామ్యం అన్నవి దీని కిందికి వస్తాయి.

**సి) రాజకీయ న్యాయం :** పైన పేర్కొన తేడాల ఆధారంగా రాజకీయ రంగంలో వివక్ష ఉండరాదు.

వివిధ స్థాయిలలో ప్రతినిధులను ఎన్నుకోవటానికీ, ఎన్నుకోబడటానికీ అవకాశం ఉండాలి.

ఉత్తమ సమాజంలో మనం అనుకున్న "పరిపాలనలో భాగస్వామ్యం ఈ రాజకీయ న్యాయం కింద వస్తుంది.

"ఉత్తమ సమాజంలో" విద్య, ఉపాధి, భద్రత, సంపదలో భాగస్వామ్యం పరిపాలనలో పౌరులందరికీ ఉంటాయన్నాము.

## అన్యాయాలను ప్రశ్నించడం

రాజ్యాంగబద్ధమైన హక్కులకు భంగం కలగకుండా వ్యవహరించడం. పౌరహక్కులు : నాగరిక సమాజంలో పౌరుల ధన, మాన, ప్రాణసంరక్షణకు అవసరమైన సాంఘిక, రాజకీయ పరిస్థితులను సృష్టించేవే పౌరహక్కులు. ఈ హక్కులు లేకుండా నాగరిక జీవనం సాధ్యంకాదు. పౌరహక్కులు మానవుని స్వేచ్ఛా జీవితాన్ని సఫలం చేస్తాయి. ఆధునిక సమాజాలలోని ప్రజాస్వామిక రాజకీయ వ్యవస్థల్లో పౌరహక్కులు అమలు చేయబడతాయి. ప్రజలందరికీ అన్ని రంగాలలో ఒకేవిధమైన సమాన అవకాశాలు కల్పించాలనే సూత్రమే పౌరహక్కులకు ముఖ్య ఆధారం. ఆధునిక రాజకీయ వ్యవస్థలు గుర్తించిన ప్రాథమిక హక్కుల్లో ప్రధానంగా, ప్రాణరక్షణ హక్కు, నిర్బంధం నుంచి విముక్తి పొందే హక్కు, భావప్రకటనహక్కు స్వేచ్ఛాహక్కు సభలు – సమావేశాలు నిర్వహించుకునే హక్కు మొదలైన హక్కులున్నాయి.

**మానవ హక్కులు**

ఎ. జీవించే హక్కు

బి. స్వేచ్ఛా హక్కు

సి. వ్యక్తుల భద్రత హక్కు

డి. బానిసత్వం వెట్టి నుంచి స్వాతంత్ర్యం పొందే హక్కు

ఇ. చట్టం నుండి సమానంగా రక్షణ పొందే హక్కు

ఎఫ్. స్వతంత్ర ఆలోచన, స్వేచ్ఛ విహారపు హక్కు

జి. ఆత్మ ప్రబోధానుసారంగా మతం స్వీకరించే హక్కు

హెచ్. భావప్రకటన హక్కు

ఐ. సంస్థలను, సంఘాలను నిర్వహించుకొనే హక్కు

జె. సభలు, సమావేశాలు నిర్వహించుకొనే హక్కు

కె. వయోజనులైన ప్రతిపౌరుడు స్వేచ్ఛగా, స్వచ్ఛందంగా సాధారణ ఎన్నికలలో పాల్గొనే హక్కు మొదలైన వాటిని పౌర–రాజకీయ హక్కులుగా ప్రకటించారు.

- సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక హక్కులలో ప్రధానమైనవి.

ఎ. సాంఘిక భద్రత హక్కు

బి. పని హక్కు

సి. విరామం, సేదతీర్చుకునే హక్కు

డి. విద్యా హక్కు

ఇ. మానవ సముదాయపు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనే హక్కు

ఎఫ్. ప్రకటన ప్రతి మనిషి సాంఘికంగా అంతర్జాతీయ గుర్తింపును పొందటమే కాకుండా హక్కులను, స్వేచ్ఛలను వాస్తవంగా సాకారం చేసుకొనే హక్కు.

పై హక్కులకు భంగం వాటిల్లినప్పుడు వ్యక్తి అన్యాయాన్ని ఎదిరించడానికి సిద్ధపడతాడు. పై హక్కులను కాపాడుకుంటూ వానికనుగుణంగా నడుచుకోవడాన్ని న్యాయబద్ధమైన పాలన అంటాం. న్యాయబద్ధమైన పాలన సరిగా లేనప్పుడు అన్యాయాన్ని ఎదిరించడానికి ప్రతి వ్యక్తీ సిద్ధపడాలి.

## న్యాయ వ్యవస్థ :

భారతదేశంలోని న్యాయవ్యవస్థ సామాజిక వ్యవస్థ లక్ష్యాలు స్పష్టంగా ఉన్నాయని చెప్పడానికి వీలులేదు. రాజ్యాంగం ప్రజలకు ప్రసాదించి ప్రాథమిక హక్కులను పరిరక్షించడం న్యాయవ్యవస్థ లక్ష్యాల్లో ఒకటి. ప్రజలకు జరిగిన అన్యాయాలను ఎదిరించడానికి కోర్టులు సహకరిస్తున్నాయి. గ్రామస్థాయిలో గ్రామకోర్టులు జిల్లాస్థాయిలో జిల్లా కోర్టులు. రాష్ట్రస్థాయిలో హైకోర్టు, కేంద్రస్థాయిలో సుప్రీంకోర్టు ప్రజలతరపున న్యాయం చేయడానికి పనిచేస్తున్నాయి. అట్లాగే వినియోగదారులు తాముకొన్న వస్తువులు తాము చెల్లించిన మూల్యానికి తగినట్లుగా ఉండకపోయినా, వ్యాపారస్తులు చెప్పిన విధంగా వాటి నాణ్యత లేకపోయినా కొన్నవస్తువు యొక్క రసీదు ఉన్నట్లయితే వినియోగదారుల ఫారం (Consumer Court) ద్వారా అన్యాయాన్ని ఎదిరించడానికి అవకాశం ఉన్నది.

పై విధంగా న్యాయవ్యవస్థ ప్రజలకు జరిగిన అన్యాయాలను ఎదిరించి న్యాయసమీక్ష చేసి ప్రజలకు అండగా నిలబడుతుంది.

**సూక్తి : ఎదుగుదలను నిరోధించే ప్రతికూల పరిస్థితుల మధ్యలో వికసించి పెంపొందడమే జీవితం.**

# 12 జీవహింస పనికిరాదు

**I. ప్రధాన విలువ** : శాంతి / కలిసి మెలిసి జీవించడం

**II. ఉపవిలువ** : జీవహింస

**III. లక్ష్యాలు / ఆశించే ఫలితాలు** :

- జీవహింస చేయకూడదని తెలుసుకుంటారు జీవుల్ని ప్రేమిస్తారు
- జీవహింసను అడ్డుకుంటారు, రక్షిస్తారు.

**IV. ఉపోద్ఘాతం** : ఈ భూమిపైన ఎన్నో రకాల జీవుల్ని మనం చూస్తుంటాం. ఏ జీవికి ఇంకో జీవిని బాధపెట్టే హక్కులేదు. అన్నింటికీ సంతోషంగా జీవించేహక్కు ఉంది. మనుషులు స్వార్థపరులై మూగజీవాలపై తను ప్రతాపాన్ని చూపిస్తున్నారు. మన అవసరాలకు మనం అనేక జీవులపై ఆధారపడడం సహజమే. కాని మన అవసరాలకు, అవసరం తీరాక వాటిని హింసించడం అనేది పాపం. మనుషుల స్వార్థానికి బలౌతున్న సంఘటనలు కొన్నింటిని చూడండి.

**V. సంఘటనలు** :

**సంఘటన-1**

అది ఒక పాల ఉత్పత్తి కేంద్రం. అందులో అనేక ఆవులు ఉన్నాయి. పాలకోసం ఆ ఆవులను పెంచుతున్నారు. పాలు అమ్ముకునే వ్యాపారి ఆవులు దూడలను కనగానే రెండు మూడు రోజులు దూడలను తల్లి పాలు తాగించి తర్వాత వాటికి పాలు ఇవ్వకుండా క్రమంగా చంపేసేవాడు. ఆవుపాలను మెషిన్‌ల ద్వారా పొదుగులనుండి తీసేవాడు. అక్కడ ఆవులు పడే బాధ వర్ణనాతీతము. పాపం అవి తమ బాధను చెప్పుకోలేవు.

**సంఘటన-2**

అది సిటికి దగ్గరగా ఉన్న ఒక గ్రామం. ఆ గ్రామంలో వ్యవసాయానికి ఎడ్లను వాడుతారు. కొంత కాలానికి ఎడ్లు ముసలివి అయ్యేసరికి వాటికి తిండి పెట్టి మేపాల్సి వస్తుందని సిటీలోని కబేళాలకు పంపేస్తారు. కబేళాలంటే జంతువులను చంపేసి వాటి చర్మాన్ని ఒలిచి, మాంసం, ఎముకలు వేరుచేసి వ్యాపారం చేసే చోటు.

**సంఘటన-3**

ఒక రోజు మా ఊరికి సర్కస్ బృందం వచ్చింది. ఆ సర్కస్ వాళ్ళు రకరకాల జంతువులను తీసుకొచ్చారు. అందులో కోతులు, కుక్కలు, పులులు, ఏనుగులు ఇలా చాలా జంతువులు ఉన్నాయి. ప్రదర్శనకు ముందు వాటికి శిక్షణ ఇస్తారు. శిక్షణ ఎలా ఇస్తారా అని చూస్తే శిక్షణ ఇచ్చేవాడు ఒక కర్రను పట్టుకొని చెప్పినట్టు చేయకపోతే వాటిని చితకబాదుతున్నాడు. ఇవన్నీ మనకేం తెలుసు సర్కస్‌లో అవి చేసే విన్యాసాలను చూసి చప్పట్లు కొట్టి మరీ ఆనందిస్తాం.

**సంఘటన-4**

ఒక ఊరిదేవత గుడి ముందు జనం అంతా పోగై ఉన్నారు. వాళ్ళ ముందు ఒక మేకపోతు. దానికి బొట్టు పెట్టి, మెడలో పూలమాల వేసి డప్పులు కొడుతున్నారు. ఆ పక్కనే ఒకడు దానిని బలి ఇవ్వడానికి కత్తి నూరుతున్నాడు.

## VI. (అ) ఆలోచించడం - ప్రతిస్పందించడం

1. మనం చేసే వ్యాపారాల కోసం మూగజీవులను హింసించడం ఎంతవరకు సమంజసం. మీ అభిప్రాయాలు చెప్పండి.
2. జంతువులను బలి ఇస్తే దేవతలు సంతోషిస్తారా?
3. సర్కస్‌లో జంతువులు చేసే విన్యాసాలు చూసి ఆనందిస్తారు కదా! ఆ జంతువుల గురించి ఎప్పుడైనా ఆలోచించారా? అని తమ బాధను మీతో చెప్పుకుంటే ఏమని చెబుతాయో ఊహించి చెప్పండి.
4. మేకపోతు, కోళ్ళు వంటివి బలి ఇవ్వడం మనం చూస్తూనే ఉంటాం. వాటికి ఎలా అనిపిస్తాయి? మనం చేసేది సరైనపనేనా? మీరు సమర్థిస్తారా? వ్యతిరేకిస్తారా?
5. మీ చుట్టుపక్కల జీవులను హింసించే సంఘటనలు ఏవైనా చూశారా? అలాంటివి ఎదురుపడ్డప్పుడు మీకు ఏమనిపిస్తుంది?
6. ఆవు, గేదె, దూడలకు సరిగా పాలు ఇవ్వకుండా ఆడడం వాటి ఆహారం మనం తీసుకోవడం న్యాయమా?
7. ఇలాంటి పరిస్థితులలో మన బాధ్యతలేవి? మీ ప్రాంతంలో జరిగే జీవహింస సంఘటనలు ఇంకొన్ని ఇవ్వండి. చర్చించండి. మనసున్న మనిషిగా మన బాధ్యతలేవి? మీరు జంతువులకు ఏ రకంగానైనా మంచి చేస్తారా! అయితే ఏమి! చెప్పండి.

## (ఆ) ఆచరించడం - అనుభవాలు చెప్పడం

1. మీ ఇంట్లో, బయట, చుట్టు పక్కల జీవహింస జరిగిన సంఘటనలను గమనించి రాయండి. వాటిని అడ్డుకునేందుకు మీరేమి చేస్తారు?
2. మీరు తినబోయేటప్పుడు మన ముందున్న ఆహారం లాక్కుంటు మీకేమి అన్పిస్తుంది.

## తెలుసుకోండి

ప్రపంచంలో ఎన్నో జీవరాశులు పుట్టాయి. అందులో మనిషికి ఒక ప్రత్యేకత. మనిషి ఆలోచించగలడు అన్ని అవసరాలను తీర్చుకోగలడు. వీటన్నింటికన్నా ప్రధానమైనది మానవత్వాన్ని ప్రదర్శించగలడు. మానవత్వంలో భాగంగా శాంతి, దయ, కరుణ, సానుభూతి, సహానుభూతి ఇవన్నీ మనిషికి ఉండాల్సిన లక్షణాలు.

మనతోపాటు సకల జీవులూ ఆనందంగా బతకాలి. మనం మన ఎన్నో అవసరాలకు సృష్టిలో ఉన్న జీవరాశులపై ఆధారపడి ఉన్నాము. పాలకోసం, ఆహారంకోసం, రక్షణకోసం, మనం జంతువులను మచ్చిక చేసుకుని బతుకుతున్నాం. వాటిని ఏమి చేసినా అవి ఎదురు తిరగవని, మన మితిమీరిన స్వార్థంతో జంతువులను హింసించి డబ్బు సంపాదించాలనుకోవడం మానవత్వం అనిపించుకుంటుందా, ఆలోచించండి. మనిషి తెలివి, మంచితనం ఇతర జీవరాశులను రక్షణ కల్పించాలే గాని హింసకు దారితీయకూడదు. పక్షులు, జంతువుల వలన మనం ఎన్నో రకాల సౌకర్యాలను పొందుతున్నాం. అవి మనతో సహజీవనాన్ని గడుపుతున్నాయి. వాటిని ప్రేమతో చూడడం. స్వేచ్ఛగా బతకనివ్వడం మన కనీస బాధ్యత. అంతేకాదు వాటిని ఆహారం పెట్టడం, ఆశ్రయమెవ్వడం, సంరక్షించడం కూడా మన బాధ్యతే.

పూర్వం నుండి పల్లెటూళ్ళలో ఇళ్ళలో పెంచుకునే ఆవులను మనుషులకు పేరు పెట్టినట్టే పేరు పెట్టి దాన్ని కూడా కుటుంబంలో సభ్యులవలె చూసుకునేవారు. వాటిని కూడా ఆ కుటుంబంలోని మనుషులను చూస్తే ఆనందం. ఇది మన భారతీయులకున్న సంస్కృతి. వేటినీ చంపే హక్కు మనకు లేదు. జంతువులు అడవిలో ఉన్నా ఇళ్ళల్లో ఉన్నా, రోడ్డు మీద ఉన్నా అవి కూడా బతకాలి. సురక్షించబడాలి అనే భావనతో వాటిని కాపాడుదాం.

ఈ మధ్య జంతువుల రక్షణకై బ్లూక్రాస్ సొసైటిని స్థాపించి ఎక్కడెక్కడ జంతువుల ఎటువంటి ఆదరణ లేకుండా ఉంటాయో వాటిని కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. మనం మనుషులం మానవత్వం ఉన్న వాళ్ళం అనే సంగతి మరిచిపోకుండా జీవహింసకు పాల్పడకుండా జీవులన్నిటిని రక్షిద్దామని శపథం చేయాలి. మనతోబాటు సమానంగా ఇతర జీవరాశులను జీవించనీయాలి.

### బ్రతకండి - బ్రతకనివ్వండి

సూక్తి : మనిషిలో దైవత్వం దాగివుంది. అతడు దాన్ని వెలికితీసి, తన ప్రవర్తనతో వ్యక్తపరచడం సాధ్యమే. అదే మానవ జీవిత లక్ష్యం.

– స్వామి వివేకానంద

# 13 సేవలు

**I. ప్రధాన విలువ** : శ్రమ విలువ

**II. ఉపవిలువ** : వివిధ వృత్తులవారి సేవలను గుర్తించడం

**III. లక్ష్యాలు / ఆశించే ఫలితాలు** :

- సమాజంలోని వివిధ వృత్తుల వారి సేవలను గుర్తించగలుగుతారు.
- అన్ని వృత్తులు సమానమైన విలువను కలిగి ఉన్నాయని అందరికీ సమాన గౌరవాన్ని అందజేయాలని గ్రహించగలుగుతారు.

**IV. ఉపోద్ఘాతం** : మానవాళిని రెండు వర్గాలుగా విభజించవచ్చు. మొదటి వర్గం శ్రామికులు. రెండవ వర్గం సోమరులు. సోమరితనం క్షమించరాని నేరము. సోమరి సంఘమునకు, దేశానికి భారము. తనకు తానే భారము. ఒకరు పండించిన పంటను తిని, మరొకడు నేసిన బట్టను కట్టి, వేరొకరు నిర్మించిన ఇంటియందు నివసిస్తున్నందుకు ప్రతిఫలము ప్రతిమానవుడూ శ్రమ రూపమున సంఘమునకు ముట్టజెప్పవలెను. అట్లు చేసినవారే శ్రామికులు. చేయనివారే సోమరులు. శ్రమించడం కేవలం అవసరము కోసమే కాదు. అందులో ఆనందంకూడా ఉంటుంది. శ్రామికులందరూ ఒక విధమైన సహకార పద్ధతిలో పనిచేయుటవలన, సమిష్టిగా ప్రయోజనం పొందగల్గుతున్నారు. రైతు హలము పట్టి భూమిదున్ని, ధాన్యరాసులు పండిస్తాడు. కార్మికుడు నడుము వంచి కర్మాగారములందు పనిచేసి సాధన సంపత్తి సృష్టిస్తాడు. వడ్రంగి తలుపులు చేస్తాడు. కమ్మరి బిందెలు చేస్తాడు. సాలెవారు బట్టలు నేస్తారు. తాపీవారు ఇండ్లుకడతారు. ఈ విధంగా శ్రమను పంచుకోవడం జరుగుతుంది.

- పిల్లలూ! మీ పరిసరాలలో శ్రమచేస్తున్న వివిధ వృత్తులవారున్నారు గదా! వారి గురించి చెప్పండి.
- వివిధ వృత్తుల వారి సేవలు మనకు లభించకపోతే ఏమౌతుందో! అన్ని వృత్తుల వారికి నేడు సమాజంలో సమానమైన విలువ, గౌరవం లభిస్తున్నాయా? ఎందుకు?

నేడు సమాజంలో వివిధ వృత్తులవారు మనమధ్యనే ఉంటూ అసాధారణమైన సేవలను చేస్తున్నారు. సామాన్యులుగా కనిపించే వీరిలో అసామాన్యమైన ప్రతిభ దాగి ఉంటుంది. దాన్ని గుర్తించాలి. గౌరవించాలి. ఇటువంటి అసామాన్యులైన వివిధ వృత్తులవారి సేవలను గురించి వినండి.

## V. సంఘటన :

### సంఘటన–1

మన సమాజంలో వివిధ వృత్తులవారు సహజీవనం చేస్తూ తమ జీవితాలను సంతోషంగా గడుపుతూ ఉన్నారు. వృత్తులన్నీ ఒకదానిమీద మరొకటి ఆధారపడి ఉన్నాయి. ఒక్క 'మంచం' తయారు కావడానికి వెనుక ఎందరు వృత్తి పనివాళ్ళ కష్టం దాగుందో చూశారా? ప్రతి వృత్తీ పవిత్రమైనదే. ప్రతివృత్తిలోనూ ఎంతో కష్టం, నైపుణ్యం, త్యాగం కలగలిసి ఉంటాయి. కాంతిని చూసి మురిసిపోతాం. కానీ ఆకాంతినివ్వడానికి కరిగిపోయే కొవ్వొత్తిని గురించి ఎప్పుడైనా ఆలోచిస్తున్నామా?

ఎండాకాలం వచ్చిందంటే చాలు కుండలకు, కూజాలకు గిరాకి. అటికెలు, గురుగులు మన అవసరాలను తీరుస్తున్నాయి. భక్తి జీవితంలో భాగమైనవి ప్రమిదలు. ఇవన్నీ చకాచకా ఎలా వచ్చేస్తున్నాయి? కుమ్మరి చక్రంనుంచి బంకమట్టి నుంచే. మరి చక్రం మాత్రం ఊరకే తయారైందా? కమ్మరి, వడ్రంగి, వాళ్ళ నైపుణ్యం. కలగలిసి ఏర్పడింది. ఇందులో ఎంతో ఇంజినీరింగ్ నైపుణ్యం తొంగిచూస్తుంది. చక్రం తిరగడం మాత్రమేకాదు. సమాజగతినే తిప్పేసింది. ఇదొక అద్భుత ఆవిష్కరణ చూశారా పిల్లలూ! మన ఉపయోగించుకొనే మట్టిపాత్రల వెనక ఇంత తతంగముంది.

ఇక ఆడవాళ్ళు బాగా ఇష్టపడేవి నగలు. మెడలో హారాలు, చేతులకు కడియాలు, గాజులు, చెవికి కమ్మలు, ముక్కుపుడక, సిగబిళ్ళ, నడుముకు ఒడ్డాణం, కాళ్ళకు కడియాలు, గజ్జెలు, వేళ్ళకు ఉంగరాలు ఇలా ఎన్నో ఆభరణాలు ఒంటినిండా ధరిస్తారు. ఒక్కొక్క ఆభరణాన్ని ఎన్నోరకాలుగా తీర్చిదిద్దుతారు. ముద్దగా ఉన్న బంగారాన్ని ముద్దుగా తీర్చిదిద్దడంలో ఎంతశ్రమ దాగుందో. ఈ బంగారం పనిచేసే వారిని స్వర్ణకారులు అంటాం. బంగారాన్ని, వెండిని వివిధ ఆకృతులుగా తీర్చిదిద్దడంలో గానీ, రత్నాలను పొదగడంలోగానీ సున్నితమైనవారి పనితనం కనిపిస్తుంది. సన్నని వస్తువును తయారుచేసేటప్పుడు వాళ్ళ కళ్ళు తీవ్రమైన ఒత్తిడిని లోనవుతాయి. అయినా మన కళ్ళకు ఆనందాన్నిచ్చేలా ఆభరణాలను అందించడానికి శ్రమిస్తున్నారు. చూశారా పిల్లలూ! వీరు ఇంతశ్రమిస్తున్నా శ్రమకు తగిన ఫలితం పొందలేకపోతున్నారు.

ఇక ఇనుముతో నిత్యం సహవాసం చేసే కమ్మరులు తమ శ్రమను, నైపుణ్యాన్ని సమాజం కోసం త్యాగం చేస్తున్నారు. ఇనుముతో వాళ్ళు చేసే నాగటి కర్రు భూమిని దున్నడానికి ఉపయోగపడుతుంది. అలాగే పార, గొడ్డలి, గడ్డపార, కొడవలి, సుత్తి మొదలైనవి వ్యవసాయానికి చాలా అవసరమైన పనిముట్లు. వీటన్నింటికీ ఉత్పత్తికేంద్రం కమ్మరి కొలిమి.

ఇప్పుడిక వడ్రంగుల పనితనాన్ని చూద్దాం. మనకు ఆహారం కావాలంటే భూమిని దున్నాల్సిందే. అందుకు ప్రధాన సాధనం నాగలి. దీన్ని రూపొందించేవాళ్ళు వడ్రంగులు. ఇదేకాదు గుంటక, గొర్రు వంటి పనిముట్లు కూడా వ్యవసాయంలో కీలకమైనవి. వాటి తయారీకి ఏ చెట్టు కలప సరిపోతుందో పరిశీలిస్తారు. ఆ కోయ్యను సరైన రూపాలలోకి తీసుకురావడం వెనక ఎంతో శ్రమ ఉంటుంది. చెట్టుకొట్టాలి. కొయ్యాలి, చెక్కాలి, చిత్రిక పట్టాలి. తొలికట్టాలి, అందులో బిగించాలి. ఇలా ఎన్నెన్నోదశలు. వడ్రంగులు సమాజానికి అందించిన మరో సౌకర్యం బండి. ఇది వ్యవసాయానకే కాదు. ప్రయాణానికి కూడా పనికివస్తుంది. దూలాలు, వాసాలు, కిటికీలు, తలుపులు ఇవన్నీ వడ్రంగుల పనితనం మూలంగానే అందంగా

ఆకర్షణీయంగా తయారవుతాయి. మనం వాడుకొనే మంచాలు, కుర్చీలు, బెంచీలు, టేబుళ్ళు, అలమారాలు – ఇలాంటివెన్నో వడ్రంగుల చేతుల్లో రూపొందినవే! అందుకేవాళ్ళను 'దారుశిల్పుల'ని అంటారు. ఇంటిసామాగ్రివంటిని చూస్తున్నప్పుడు వడ్రంగులను తలచుకోవడం మనధర్మం. వాళ్ళ నైపుణ్యాన్నీ గొప్పదనాన్నీ గౌరవించడం మన బాధ్యత.

తెల్లవారినప్పటినుంచి అడుగుబయటకు వేయాలంటే చెప్పుల్లో కాళ్ళు పెట్టాల్సిందే. ఈ చెప్పులను చేసే తోలు పని వాళ్ళు. ఆ జంతువు చర్మాన్ని ఒడుపుగా ఒలుస్తారు. శుభ్రంచేస్తారు. దానితోనే చెప్పులు తయారుచేస్తారు. ఒకవ్యర్థ పదార్థం నుండి అందరికీ ఉపయోగపడే వస్తువును సృష్టించినవారి తెలివి ఎంతో గొప్పది. అందుకు వాళ్ళుపడే శ్రమ ఎంతో విలువైనది. అసలు దీనికి వెల కట్టగలమా?

అలాగే సంఘంలో క్షురకుల సేవలు మరవరానివి. ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించడం వారి భాగస్వామ్యంగా ఉంది. కత్తి, కత్తెరలతో వారు చేసే పనితనం నాణ్యమైనదే కాదు, సున్నితమైనది కూడా.

ఇకనేతపనివారు. మనం కట్టుకునే బట్టలు, తయారు కావడానికి ఎంతో శ్రమిస్తారు. మగ్గంలో వాళ్ళు దారాలను ఏర్పరచుకున్నతీరు, నేసేటప్పుడు వారు చూపే నైపుణ్యం ఇంతంతనరానివి. ఒకప్పుడు మనదేశంలో నేతపనివారు అగ్గిపెట్టెలో పట్టేటంత చీరను నేసినారంటే ఆశ్చర్యం కలగకమానదు. ఇదంతా ఆషామాషీ వ్యవహారం కాదు. పత్తి నుంచి దారం తీయడం, రంగులద్దడం, అవసరమైన పద్ధతిలో గుడ్డను తయారుచేయడం – ఇదొక సుదీర్ఘప్రక్రియ.

గొర్రెల బొచ్చు కత్తిరించి ఉన్నిదారం వడికి దానితో గొంగడి (కంబళి) ని తయారుచేసే గురుమలశ్రమ ఎందరికో వెచ్చదనాన్ని కలిగిస్తుంది. మురికి బట్టలను శుభ్రం చేసే రజగ్రుల కాయకష్టం మనకు ఆరోగ్యాన్ని అందిస్తుంది.

మనం తినే అన్నం, కూరగాయలు, పండ్లు వంటివి ఏవీసులువుగా వచ్చిపడేవికావు. చెమటోడ్చి పనిచేసిన రైతుల కృషి ఫలాలివి. ఎండనక, వాననక, రేయింబగళ్ళనక రెక్కలు ముక్కలు చేసుకొని రైతుశ్రమచేస్తేనే మనం హాయిగా తినగలుగుతున్నాం. తెలిసిందిగా, రైతులత్యాగం, కృషిఎటువంటిదో! ఒక్కోసారి పంట వచ్చే సమయానికి, తుఫానులు, అకాల వర్షాలు, ఈదురు గాలులు వచ్చి చేతికి వచ్చే పంటలు నాశనమవుతాయి. రైతు ఆ పండ పండించడానికి శ్రమ మరియు డబ్బు కూడా పెడతాడు. మరి ఈ నష్టాన్ని ఎవరు పూడుస్తారు. ఎవరు అతనికి సహాయానికి నిలబడతారు. ఆలోచించండి.

ఇలా చూస్తూ పోతే ప్రతిఒక్క వృత్తిలోనూ ఎంతో కొంత శ్రమ, నైపుణ్యం తొంగిచూస్తాయి. ప్రతివృత్తీ పవిత్రమైనదే. దేన్నీ చిన్నచూపు చూడాల్సిన పనిలేదు. ఎవరి ఇంట్లో శుభకార్యం జరగాల్సి ఉన్నా మంగళవాద్యాలు, కుండలు, ప్రమిదలు, ఆభరణాలు, వస్త్రాలు మొదలయినవన్నీ కావాలి. అంటే ఇన్ని వృత్తులవారూ సహకరిస్తేనే ఏకార్యాలైనా జరుగుతాయి. ఇలా అందరూ పరస్పరం సహకరించుకొంటేనే సమాజం నడుస్తుంది. అంతేకానీ, 'ఎవరికివారే యమునా తీరే' అన్నట్లుగా ఉంటే సమాజ అభివృద్ధి కుంటుబడుతుంది. ఇందులో ఎక్కువ తక్కువ తేడాలు మన మనస్సులో ఉండకూడదు. శరీరంలో కళ్ళు, చెవి, ముక్కు, కాళ్ళు, చేతులు....వీటిలో ఏవి గొప్ప అంటే? అన్నీ కలసి ఉంటేనే శరీరం. అలాగే అందరూ కలిసి ఉంటేనే సమాజం.

మనిషిని మనిషిగా గౌరవిద్దాం. అతనిలో దాగున్న ప్రతిభను అభినందిద్దాం. ఆగొప్పదనాన్ని మనం అందుకోవడానికి ప్రయత్నిద్దాం.

'శ్రమ' పునాదిపైనే "అభివృద్ధి" భవనం ఆధారపడి ఉంటుంది. శ్రమించడానికి ఎవరూ సిగ్గుపడగూడదు. సోమరితనంతో శ్రమించకపోతేనే సిగ్గుపడాలి. శ్రమైక జీవన సౌందర్యాన్ని చూడగలగాలి. శ్రమను గౌరవంగా భావించడం నేర్చుకోవాలి. శ్రమ సంస్కృతిలో జీవించడం నేర్చుకోవాలి. శ్రమ చేసే వారిని గౌరవించాలి. పనిచేయకుండా సౌకర్యాలు అనుభవించడం దోపిడి, నేరం కూడా.

## VI. (అ) ఆలోచించడం - ప్రతిస్పందించడం

1. సమాజంలోగల వివిధ వృత్తుల వారి గురించి చెప్పండి.
2. వివిధ వృత్తుల వారి సేవలు సమాజానికి అవసరమా? ఎందుకు?
3. పెళ్ళి, పేరంటం మొదలైన వేడుకలలో వివిధ వృత్తులవారి భాగస్వామ్యం ఎలా ఉంటుంది?
4. వివిధ వృత్తులవారు నేడు సమాజంలో సమాన స్థాయిలో గౌరవించపబడుతున్నారా? లేదా? తగిన కారణాలు చెప్పండి.
5. వివిధ వృత్తులవారికి నేడు లభిస్తున్న ఆదరణ గురించి చెప్పండి.
6. మీ ప్రాంతంలో ఏ వృత్తి వారికి ఎక్కువ గౌరవం లభిస్తుంది ఎందుకు?

## (ఆ) ఆచరించడం - అనుభవాలు చెప్పడం

1. మీ నిత్యజీవితంలో వివిధ వృత్తుల వారి సేవలను ప్రశంసించండి. మీరు పొందిన అనుభూతిని చెప్పండి.

### తెలుసుకోండి

కోటి విద్యలు కూటికొరకే అన్నట్లు అనేక వృత్తులు చేసి మానవులు జీవిస్తూ ఉంటారు.

కొండకోనల్లో కొందరు, పల్లెల్లో కొందరు, నగరాల్లో మరికొందరు నివసిస్తూ ఉన్నారు. వింధ్య పర్వతాలలో నివసించే బిల్లుజాతివారు కట్టెలమ్ముకొని జీవిస్తుండగా, నల్లమల కీకారణ్యాలలోని చెంచులు తేనె అమ్ముకుని జీవిస్తారు.

సముద్రతీరంలో జాలరులు చేపలు పట్టుకొని పొట్టపోసుకొనుచుండగా హిమపర్వత శ్రేణులలో నివసించే గూర్ఖాలు సైనికులుగా చేరి దేశరక్షణ చేస్తున్నారు. సహ్యాద్రిపర్వతాలలోని మరాఠీలు పాడి పశువులను పెంచి జీవించుచుండగా కోనసీమలోని రైతులు వివిధ ఫల వృక్షములను పెంచి వర్ధిల్లుతున్నారు.

ఒకవైపున రాళ్ళను పగులగొట్టి కొందరు కూలివాండ్రు జీవయాత్ర గడుపుచుండగా, మరియొక వైపున అధికారులు తలలు పగులగొట్టుకొని ఆలోచిస్తూ పరిపాలనా బాధ్యతలను నిర్వహిస్తున్నారు. శాస్త్రవేత్తలు పరిశ్రమల నిర్వహణ చేయుచుండగా, న్యాయవేత్తలు ధర్మ నిర్వహణ చేస్తున్నారు. వైద్యులు వ్యాధి నివారణ చేయుచుండ, వ్యవసాయదారులు క్షామనివారణగావిస్తున్నారు.

ఈ వృత్తులలో ఏది ఉత్తమం, ఏది అథమం అనే ప్రశ్న కలుగవచ్చు. అందుకు ప్రత్యుత్తరమగు శ్రీ తుమ్మల సీతారామమూర్తి చౌదరిగారిలా హెచ్చరిక చేశారు.

కలమెత్తిన హలమెత్తిన

మలమెత్తిన వాని నొక్కమై జూడవలెన్

వలతియు నలతియు లేదిట

బలువృత్తులు సాగినపుడే బ్రతుకులు సాగున్

కలమెత్తి రాయు ఉద్యోగియు, నాగలి ఎత్తి భూమిని దున్ను వ్యవసాయదారుడును, అశుద్ధము నెత్తుచు జీవించెడి మనిషియు ఒకే విధముగ చూడబడాలి. ఇచట ఒక వృత్తికి ఆధిక్యము, మరొక వృత్తికి అల్పత్వము లేదు. వివిధ వృత్తులు సామరస్యముతో సాగినపుడే ప్రజల బ్రతుకులు నడుస్తాయి అన్నారు ఆ విద్వత్కవి. కాబట్టి మన సమాజంలోని వివిధ వృత్తులవారు చేయు సేవలను గుర్తించాలి. అన్ని వృత్తులవారిన ఒకే విధంగా చూడాలి. ఏవృత్తివారు లేకపోయినా సమాజంలో అందరికీ సమస్యలు చుట్టుముడతాయి. కాబట్టి మనం అన్ని వృత్తులవారు సమానులేయని గుర్తించాలి. సామరస్యపూర్వంగా అందరూ ఒకరినొకరు సహకరించుకుంటూ ఆనందంగా జీవితం గడపాలి.

**సూక్తి :** శ్రమిస్తే దానికి తగ్గ ఫలితం తప్పకుండా శ్రమ మీద మాత్రమే నీకు అధికారం ఉంది, ఫలితం మీద కాదు. కావున త్రికరణశుద్ధిగా శ్రమచెయ్యండి. శ్రమైక జీవులను గౌరవించండి. శ్రామికులలో ఉన్న నైపుణ్యాలను చూడండి, అభివందించండి.

# 14 వృద్ధుల సేవ

**I. ప్రధాన విలువ** : సేవాభావం

**II. ఉపవిలువ** : వృద్ధులపై సేవాభావం కల్గియుండడం

**III. లక్ష్యాలు / ఆశించే ఫలితాలు** :

- వృద్ధులు ఎలాంటి హింసలకు గురవుతున్నారో తెలుసుకుంటారు
- వృద్ధులకు ఎలాంటి సహాయ సహకారాలు అందించాలో తెలుసుకుంటారు.

**IV. ఉపోద్ఘాతం** : ఈ రోజులలో ఆయుష్షు పెరగడంతో వృద్ధుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుంది. మంచి మంచి ఉద్యోగాలలో ఉన్నందున పిల్లల చేతిలో పుష్కలంగా డబ్బు ఉంటుంది. డబ్బుతో ఏమైనా కొనవచ్చనే ఆలోచనతో అభిమానాలు, ఆప్యాయతలు, ప్రేమానురాగాలు మరచి ఎంత డబ్బు ఖర్చయినా పర్వాలేదని అనాథాశ్రమాలను ఆశ్రయిస్తున్నారు. స్త్రీలు కరుణా మూర్తులై మమతానురాగాలను పంచగలిగితే ఈ సమస్య ఉత్పన్నంకాదు. కొందరు తల్లిదండ్రులకు సేవ చేయాలనుకున్నా, వేరే ఇంటి నుండి వచ్చిన ఇల్లాలు ఇష్టపడకపోవడం వల్లనే గొడవలు, సమస్యలు ఉత్పన్నమై ఇంట్లో అశాంతి మంటలు రేగి నేడు హాయిగా కాపురాలు చేయలేకపోతున్నారు. గోముఖ వ్యాఘ్రంలా పైకి కనిపిస్తున్నారు.

ఉమ్మడి కుటుంబాలు అంతరించిపోవడం, యువత వృత్తిరీత్యా విదేశాల బాట పట్టడం, భార్యభర్తలిద్దరూ ఉద్యోగాలలో నిమగ్నమై పెద్దల సంరక్షణకు సమయం వెచ్చించలేకపోవటం జరుగుతున్నది. వయోధికులు ఒంటరిగా ఉండలేక, గృహనిర్వహణ బాధ్యతలు నిర్వహించలేక, మంచానపడి కదలలేని స్థితిలో ఉంటున్నారు, కుటుంబ సభ్యుల ఆదరణ కరువైన కారణంగా 'వృద్ధాశ్రమాల' ఆవశ్యకత మనకు ఏర్పడినది. పదవీ విరమణ పొందిన

వారు, వృద్ధులు, బ్రహ్మచారులు, మంచాన పడిన పక్షవాత బాధితులు, మానసిక రోగులు వంటి వారికి ఆదరణ లభించాలి. వయోధికులకు మారిన జీవన శైలికి అలవాటు పడేటట్లు శారీర, మానసిక ఒత్తిడులను తట్టుకునే మనోధైర్యాన్ని ఇచ్చి వారు శేష జీవితాన్ని ఆనందంగా గడపటానికి తోడ్పాటు అందించాలి.

## V. సంఘటనలు :

**సంఘటన-1**

జగన్నాథరావుని పిల్లలు సరిగా చూడరు. ఆయన ఏమైనా అనబోయేముందే - వృద్ధాశ్రమంలో చేర్పించేస్తామని బెదిరిస్తారు. భార్య అనారోగ్యంతో మరణించాక ఒంటరితనంతో బాధపడుతున్న ఆయనకు కుటుంబానికి దూరమవ్వడం ఇష్టం లేదు. అందుకే తిరస్కారాలను, అవమానాలను భరిస్తూ బతుకీడుస్తున్నాడు.

**సంఘటన-2**

మీనాక్షి కొడుకు ఎప్పుడూ డబ్బు ఇస్తావా? చస్తావా? అని పీకలమీద కూచుంటాడు. కోడలు వత్తాసు పలుకుతుంది. ఆస్తి అంతా తన పేరున పెట్టమని పోరు. వియ్యంకుడి జోక్యం. నిస్సహాయతతో మీనాక్షి కుంగిపోతుంది. అయితే, అమ్మా, నాన్నలంతా మంచివాళ్ళూ, పిల్లలందరూ దుర్మార్గులూ అనడం సబబేనా?

ఇవే సంఘటనలు కాక వృద్ధులను హింసించే లేదా బాధపెట్టే సందర్భాలు చాలా ఉన్నాయి. వీటిలో కొట్టడం, మంచానికి కట్టెయ్యడం, ఇంట్లో అన్ని గదులలోకి రానివ్వకపోవడం, తిట్టడం, అరవడం, పేర్లు పెట్టడం, తప్పులు ఎన్నడం వాక్కుకి సంబంధించిన హింసలు, మనస్సు బాధపెట్టడం, వదిలెయ్యడం, మానసిక హింసలు, ఆస్థి లాక్కోవడం, బంగారం, వెండి నగలు తీసేసుకోవడం, వస్తువులు దొంగిలించడం, బలవంతంగా విల్లు రాయించుకోవడం, ఆర్థిక హింసలు వంటివి ఉన్నాయి.

**సంఘటన-3**

రామయ్య, లక్ష్మికి 5 గురు సంతానం ముగ్గురు కొడుకులు, ఇద్దరు కూతుళ్ళు. ఉన్నంతలో పిల్లల్ని పెంచి, పోషించి వారికి పెళ్ళిళ్ళు చేసి జీవితంలో స్థిరపడేట్టు చేసేసరికి, రామయ్యకు, లక్ష్మికి జవసత్వాలు పోయి ముసలివారయ్యారు. ఉన్న ఆస్తిని ఇల్లును కూడా కొడుకులు పంచుకున్నారు. ఆస్తిలో ఏమీ కూడా తల్లిదండ్రులకు భాగం ఇవ్వకుండా వారిని మేము పోషిస్తాం. ఇంకా వారికి ఆస్తి ఎందుకు అని చెప్పి ఒక్కొక్క నెల ఒకరు తండ్రిని ఇంకోకరు తల్లిని పంచుకున్నారు. ఈ ముసలి వారు వేరువేరుగా కొడుకుల ఇంట్లో ఉంటున్నారు. భార్యాభర్తలైన వారు ఏమి ఒకరి కష్ట సుఖాలను ఒకరికి ఒకరు చెప్పుకోలేని పరిస్థితి. మీరు ఇలా ఆధారపడి స్వేచ్ఛలేకుండా బ్రతుకీడుస్తున్నారు.

## VI. (అ) ఆలోచించడం - ప్రతిస్పందించడం

1. ఇలాంటి సంఘటనలు మీరు మీ ఇంట్లో కాని, మీ చుట్టు పక్కల, బయటి రోడ్డుపైన చూపినప్పుడు మీకేమనిపిస్తుంది?
2. వృద్ధులు కష్టాల్లో ఉన్నప్పుడు నీవు వారిని ఎలా ఆదుకుంటావు?
3. ఎందుకు వృద్ధులకు సేవ చేయాలనుకుంటున్నావు?
4. మీరు ఎప్పుడైనా వృద్ధులకు సేవ చేశారా? ఎలాంటి సేవచేశారు? అప్పుడు మీకేమనిపించింది?
5. కొందరు వృద్ధాశ్రమాలు నడుపుతుంటారు? వృద్ధాశ్రమాలపై మీ అభిప్రాయం ఏమిటి?
6. వృద్ధులైన తల్లి దండ్రులను పంచుకొని వేర్వేరుగా పోషించడం మంచిదేనా మీ అభిప్రాయాన్ని చెప్పండి.
7. మీ ప్రాంతంలో వృద్ధులు, ఏ బాధలు పడుతున్నారు. చెప్పండి. దానికి కారణాలు విశ్లేషించండి.

## (అ) ఆచరించడం - అనుభవాలు చెప్పడం

1. ఈ వారం రోజుల్లో మీరు ఇంట్లోకాని బయట రోడ్డుపైనకాని, వృద్ధాశ్రమానికి వెళ్ళి ఎలాంటి సేవలు చేశారో అనుభవాలు రాయండి.

### తెలుసుకోండి

### వృద్ధుల సంక్షేమాన్ని పట్టించుకోవాలి :

నాలుగైదు దశాబ్దాల కాలంపాటు కుటుంబ సభ్యుల ఉజ్వల భవిష్యత్తు కోసం, సమాజ ఉన్నతికోసం విశేషంగా కృషిచేసిన అనంతరం వృద్ధాప్యంలో ప్రవేశించినవారు తమ జీవితాన్ని ఒక శాపంగా భావించే పరిస్థితులు మన సమాజంలో నెలకొనడం విచారకరం. భారతీయ కుటుంబ వ్యవస్థలో వృద్ధుల పాత్ర విశిష్టమైనది. సామాజిక విలువలు పాటించి, మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకొనే విధంగా ఎప్పటికప్పుడు కుటుంబ సభ్యులను అప్రమత్తం చేయడంతోపాటు, సమాజానికి మార్గదర్శకులుగా నాటి వృద్ధులు మెలిగేవారు. తమ చుట్టూ ఉన్నవారు నిరాశకు, నిర్లిప్తతతకు గురయితే వారిని ఓదార్చి, అవసరమైన మనోధైర్యం కల్గించి కోలుకొనే విధంగా చేసేవారు. ఇంట్లో పెద్దవారున్నారంటే అందరూ

నిశ్చింతగా ఉండేవారు. ఇంటికి పెద్ద దిక్కు ఉందని భరోసాతో ఉండేవారు. అయితే నేడు పరిస్థితులు మారాయి. కుటుంబ వ్యవస్థ కుప్పకూలుతున్నది. ఉద్యోగాలు, వృత్తులకోసం ఎవరిదారిన వారు వెడుతున్నారు. యువ దంపతులు ఇంట్లో పెద్దవారుండటం తమ ఆనందానికి అవరోధంగా పరిగణించే పరిస్థితులు నెలకొంటున్నాయి. తల్లిదండ్రుల ఆరోగ్యం, అవసరాల గురించి పట్టించుకోవడం భారంగా భావిస్తున్నారు. పెళ్ళికాగానే వేరే కాపురం పెట్టమని భర్తను వేధించడం భార్యలకు మామూలు అవుతున్నది. ఇటువంటి పరిస్థితులలో తల్లిదండ్రులు, వృద్ధుల జీవనం దుర్భరంగా మారుతున్నది వారి బాగోగుల గురించి పట్టించుకోవలసిన బాధ్యత ప్రభుత్వంపై పడుతున్నది. అప్పటివరకూ కుటుంబంలో అందరి అవసరాలు తీరుస్తూ, అందరికీ ఆధారంగా ఉన్నవారు ఒకేసారి తమకే ఆధారం కరువవుతున్న పరిస్థితులు ఏర్పడి నిరాదరణకు గురికావడం వారిని ఎంతగా మానిసిక వేదనకు గురిచేస్తుందో వేరే చెప్పనవసరం లేదు. మారుతున్న సామాజిక విలువలను గుర్తించి మొదటగా వాజ్‌పాయ్ నేతృత్వంలోని ఎన్.డి.ఎ ప్రభుత్వంలో తల్లిదండ్రులు, వృద్ధుల సంక్షేమంకోసం ఒక జాతీయ విధానాన్ని 1999లో రూపొందించింది. ఆ విధానం ఆమలుకోసం యు.పి.ఎ ప్రభుత్వం 2007లో తల్లిదండ్రులు, వృద్ధుల సంరక్షణ చట్టంను రూపొందించింది. ఈ చట్టం ప్రకారం తల్లిదండ్రుల సంరక్షణ పిల్లల బాధ్యత. ఆ బాధ్యతలో నిర్లక్ష్యం చూపితే వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించి పిల్లల రాబడిలో తమ వాటాను కోరే హక్కు ఉంది. అందుకోసం వివిధ స్థాయిలలో ప్రత్యేక ట్రిబ్యునల్స్ ఏర్పాటుకు కూడా ఈ చట్టం అవకాశం కల్పిస్తుంది.

భారత రాజ్యాంగంలోని 41వ అధికరణ ప్రకారం ఆర్థికంగా వెనుకబడిన వృద్ధులు, వికలాంగుల సంక్షేమం గురించి ప్రభుత్వం పట్టించుకోవాలి. వారి రక్షణకోసం అవసరమైన ఏర్పాట్లుచేయాలి. 2007లో ఈ చట్టం తీసుకొచ్చినా దాని అమలుకు అవసరమైన నిధులను బడ్జెట్‌లో కేటాయించడం లేదు. వృద్ధుల సంక్షేమం గురించి దాదాపు ఏ రాజకీయ పార్టీ పట్టించుకోవడం లేదు. ఈ విషయమై ఎన్నికల ప్రణాళికలలో ప్రత్యేక విధానం అంటూ ప్రకటించడం లేదు.

వృద్ధులను రాజకీయంగా ప్రాధాన్యత లేనివారుగా భావించడమే ఇందుకు ప్రధాన కారణం. మన జనాభాలో వృద్ధుల జనాభా 10 శాతం వరకూ ఉంది. ఓటు హక్కుగల వారిలో 20 శాతం మంది వరకూ వృద్ధులు ఉన్నారు. పైగా వారు పెద్ద దిక్కుగా ఇతర కుటుంబ సభ్యులను సైతం రాజకీయంగా ప్రభావితం చేయగలరని అన్ని రాజకీయ పార్టీలు గుర్తించాలని ఆంధ్రప్రదేశ్ సీనియర్ పౌరుల సమాఖ్య అధ్యక్షులు సి.హెచ్. పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. త్వరలో జరుగనున్న ఎన్నికలలో వృద్ధుల సంక్షేమం, రక్షణకోసం అన్ని రాజకీయ పార్టీలు తమ ఎన్నికల ప్రణాళికలో నిర్దుష్టమైన ప్రతిపాదనలు చేసే విధంగా చూడడంకోసం ఆయన కృషిచేస్తున్నారు. ఏనాడో ప్రవేశపెట్టిన ఇందిరాగాంధీ జాతీయ వృద్ధాప్యపు పింఛన్ పథకం క్రింద ఒక కుంటుంబలో ఇద్దరు పెద్దవారుంటే నెలకు రు.200 చొప్పున కేంద్ర ప్రభుత్వం ఫింఛన్ సదుపాయం కల్పిస్తున్నది. ఈ మొత్తం నేటి జీవన ప్రమాణాల దృష్ట్యా ఏమాత్రం సరిపోదు. తమిళనాడు. ఢిల్లీ, హర్యానా, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలలో రు.1000 వరకూ చెల్లిస్తున్నారు. దేశవ్యాప్తంగా వృద్ధులకు రు.1000 నెలకు ఫింఛన్ చెల్లించవలసి ఉంది. ఈ పింఛన్ సదుపాయం బి.సి.ఎల్. కుటుంబాలకు మాత్రమే వర్తిస్తుంది. ఎన్.డి.ఎ ప్రభుత్వం వృద్ధులకు రైల్వే చార్జీలలో రాయితీలను ప్రవేశపెట్టారు. ప్రస్తుతం మహిళలకు 50 శాతం, మగవారికి 40 శాతం రాయితీ కల్పిస్తున్నది.

అందరికీ 50 శాతం రాయితీ కావాలని కోరుతున్నారు. అదేవిధంగా ఆర్.టి.సి బస్‌లలో సైతం వృద్ధులకు 50 శాతం రాయితీ కల్పించాలని కోరుతున్నా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

కర్ణాటక, ఢిల్లీ, హర్యానా, మహారాష్ట్ర, రాజస్థాన్ ప్రభుత్వాలు ఇటువంటి రాయితీలను కల్పిస్తున్నాయి.

ఆర్.టి.సి.బస్‌లలో వృద్ధులకు రెండు, మూడు సీట్లు రిజర్వ్ చేస్తున్నా హైదరాబాద్ నగరంలో మినహాయిస్తే జిల్లాలలో అంతగా అమలుకావడం లేదు. వృద్ధులు వస్తే ఆ సీట్లు ఖాళీచేసి ఇవ్వడం లేదు. ఈ సదుపాయం ఖచ్చితంగా అమలుజరిగే విధంగా చూడాలి. ఉద్యోగ విరమణ చేసి ప్రభుత్వ పింఛన్ పొందుతున్న వారికి, దారిద్ర్యరేఖ దిగువన ఉన్న పేద కుటుంబాలకు ఆరోగ్యశ్రీ కార్యక్రమం ద్వారా వైద్య భీమా సదుపాయం లభిస్తున్నది. అయితే మధ్యతరగతికి చెందిన వృద్ధులు అటువంటి సదుపాయం లేక వైద్య అవసరాలకు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వారికి సహితం ఆరోగ్యశ్రీ సేవలు విస్తరింపచేస్తే ప్రభుత్వంపై రు.30 కోట్లకు మించి అదనపు భారం పడదు. నేటి రోజులలో కుటుంబంలో ఒక వ్యక్తి ఒక తీవ్రమైన వ్యాధికి గురైతే ఆ కుటుంబం మొత్తం కోలుకోలేని పరిస్థితులున్నాయి. అందుచేత వృద్ధులకు ఆరోగ్యశ్రీ భీమా వర్తింపచేయడం చాలా అవసరం. 2007లో రూపొందించిన తల్లిదండ్రుల, వృద్ధుల సంరక్షణ, సంక్షేమం చట్టం అమలుకు తగిన బడ్జెట్ కేటాయింపులు జరపడం ద్వారా ఆ చట్టం అమలుకు ప్రయత్నం చేయాలి. ఈ చట్టం ప్రకారం ప్రతి జిల్లాలో ఒక వృద్ధాప్యపు ఆశ్రమాలను ప్రభుత్వం ఏర్పాటుచేసి, నిర్వహించాలి. పిల్లల నిర్లక్ష్యానికి గురవుతున్న తల్లిదండ్రుల విజ్ఞప్తుల పరిశీలనకు ప్రత్యేక ట్రిబ్యునల్‌ను ఏర్పాటుచేయాలి. అదేవిధంగా వృద్ధులు వివాదాల పరిష్కారంకు కోర్టులను ఆశ్రయించవలసి వస్తే ప్రాధాన్యత క్రమంలో వారి కేసులను సత్వరం పరిశీలించే ఏర్పాటుచేయవలసి ఉంది. వారికి అవసరమైన న్యాయ సహాయం కూడా అందించాలి.

నేడు ఎక్కడికి వెళ్ళినా పెద్ద పెద్ద క్యూలను చూస్తున్నాము. ముఖ్యంగా ఆసుపత్రులు, రైల్వే–బస్ బుకింగ్ కేంద్రాలు, దేవాలయాలు, కరెంట్ బిల్లుల చెల్లింపు వంటి చోట్ల పెద్ద పెద్ద క్యూలలో ఎక్కువసేపు నిలబడటం వృద్ధులకు ఇబ్బందికరమే. అటువంటి ప్రదేశాలలో వృద్ధులకు ప్రత్యేక క్యూలు ఏర్పాటుచేయాలి. వారి పనులు తొందరగా పూర్తయ్యేటట్లు చూడాలి. అలాగే ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రాలవద్ద సైతం పెద్ద పెద్ద క్యూలు చూస్తుంటాము. ఆ క్యూలలో వృద్ధులు ఎక్కువసేపు నిలబడే అవసరం లేకుండా వారికి ప్రత్యేక క్యూలు ఏర్పాటుచేస్తే వారికి చాలా ఉపశమనం కల్గించినట్లు కాగలదు. వివిధ పనులపై గ్రామాలనుండి పట్టణాలకు వచ్చే వృద్ధులకు, పట్టణాలలో సహితం చాలా దూరం ప్రయాణించి కార్యాలయాలకు, దుకాణాలకు వచ్చే వృద్ధులకు కాసేపు విశ్రాంతి తీసుకోవడానికి ఎటువంటి సదుపాయాలు అభించడం లేదు. జనరద్దీ బాగా ఉండే ప్రదేశాలలో వారికి విశ్రాంతి కేంద్రాలు ఏర్పాటుచేస్తే ఎంతో సదుపాయం కల్గించినట్లు కాగలదు. పేదలు ఎక్కువగా ఉండే కాలనీలలో వృద్ధులకు సైతం అటువంటి విశ్రాంతి కేంద్రాలు ఏర్పాటుచేసి వారికి యోగ, వ్యాయామాలకు ఏర్పాట్లు దినపత్రికల సదుపాయం, టి.వి. / రేడియో సౌకర్యాలతోపాటు కాలక్షేపానికి ఏర్పాట్లు జరగాలి.

ప్రభుత్వ ఆసుపత్రులు వార్షికపు వార్డులను ప్రత్యేకంగా ఏర్పాటుచేసే వారికి అవసరమైన చికిత్స లభించేటట్లు చూడాలి. ఇదివరలో పార్కులు, ఇతర బహిరంగ ప్రదేశాలలో రేడియోలు ఉండేవి. ఇప్పుడు ఎక్కడా కనబడటం

లేదు. సామాజిక రేడియోలను ఏర్పాటుచేస్తే వారికి ఎంతో చేదోడుగా ఉండగలవు. ఎన్.డి.ఎ. ప్రభుత్వ హయాంలోనే బ్యాంక్‌లలో వృద్ధుల డిపాజిట్‌లకు అదనపు వడ్డీ చెల్లించడం ప్రారంభించారు. ప్రస్తుతం అరశాతం అదనంగా చెల్లిస్తున్నారు. ఆ వడ్డీ మొత్తాన్ని 1 శాతంగా పెంచాలని కోరుతున్నారు. మొత్తం బ్యాంక్ వడ్డీలు గణనీయంగా తగ్గడంతో ఆ మాత్రం అయినా అదనపు వడ్డీ లభించడం వారికి చేదోడుగా ఉండగలదు. వృద్ధులు ప్రధానంగా నిరాదరణ కారణంగా మనోవేదన చెందుతున్నారు. వారిలో ఆ భావన పోగొట్టటంకోసం ప్రత్యేకంగా కృషి జరగాలి. పౌర సమాజ సంస్థలద్వారా స్వచ్ఛంద సంస్థల ద్వారా ఇటువంటి కృషి జరగాలి. వారు గౌరవంగా జీవనం కొనసాగించే విధంగా అవసరమయితే పునరావాసం కల్పించి, వీలయిన చోట్ల రాయితీలు కల్పించి ఆత్మవిశ్వాసం పెంపొందించుకొనే విధంగా సహకరించాలి. భారత ప్రభుత్వం రూపొందించిన వృద్ధుల జాతీయ విధానాన్ని సూత్రప్రాయంగా పూర్తిగా ఆమోదిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2005లో ప్రకటించిన కార్యాచరణ ప్రణాళికలో చేర్చినా, ఇంకా అమలుకు చాలా దూరంలో ఉండడం విచారకరం. అందుకు అవసరమైన నిధులను బడ్జెట్‌లో కేటాయించడం ద్వారా వృద్ధుల సంక్షేమం పట్ల రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ నిబద్ధతను ప్రదర్శించాలి. ఇది ఎన్నికల సంవత్సరం కావడంతో వివిధ వర్గాల ప్రజలను ఆకట్టుకోవడానికి రాజకీయ పక్షాలు ఆకర్షణీయంగా ఎన్నికల హామీలను గుప్పించడం ఆనవాయితీగా వస్తున్నది. అదే క్రమంలో సమాజంలో కీలకం అయిన వృద్ధుల సంక్షేమం సంరక్షణ గురించి కూడా రాజకీయ పక్షాలు ఆలోచించి, తగిన ప్రతిపాదనలతో ముందుకు రాగలవని ఆశిద్దాము.

## వృద్ధులపై సేవా భావం

### మానవత్వమే ఊతకర్ర!

దేహమిచ్చి, విద్యాబుద్ధులందించి, పెంచి పోషించే తల్లిదండ్రులే బిడ్డలకు గురురూపులు, దైవస్వరూపాలు. శ్రీనాథుడు శ్లాఘించినట్లు 'జననియు జనకుడు నెవ్వని/ యనువర్తనమున బ్రియంబునందుదురెద ద / త్తనయుడు ధర్మము గీర్తియు / ననూ నముగ బొందబడయు నక్షయ గతులన్'

రాజ్యాధికారం వీడి అడవిబాట పట్టిన రామచంద్రుడి లక్ష్యం పితృవాక్యపాలన. హోరాహోరీ పోరాడి గెలిచిన గరుత్మంతుడిది – తల్లిని దాస్యవిముక్తం చేయాలన్న ప్రగాఢ తపన. కన్నవారిని కావడిగంపలో కూర్చుండబెట్టి, భుజాన మోస్తూ తీర్థయాత్రలు చేయించిన శ్రవణకుమారుడిది అపార భక్తితత్పరత. 'నా జననీ జనకుల్ కదు వృద్ధులు' అంటూ బెంగపడతాడు ప్రవరుడు. 'తల్లిదండ్రుల పాదసీమ పవిత్రభూములకన్న విమలతరము' అనుకుంటూ పశ్చాత్తప్త హృదయుడవుతాడు పుండరీకుడు.

### తల్లిదండ్రులు దైవసమానులు

కష్ట పెట్ట బోకు కన్నతల్లి మనసు

నష్ట పెట్ట బోకు నాన్న పనులు

తల్లి దండ్రులన్న దైవసన్నిధులురా

లలిత సుగుణ జాల ! తెలుగు బాల !

– తల్లి, తండ్రి ఇద్దరూ దైవాలే, వాళ్ళను దేవుళ్ళులాగా గౌరవించాలి. వాళ్ళకు కష్టం, నష్టం కల్గించకూడదు. తల్లిదండ్రుల్ని సేవించిన శ్రవణ కుమారుడి కథ తెలుసా?

**సూక్తి :**

1. **భయము చెందిన వానికి అభయదానము, రోగపీడితులకు ఔషదదానము, విద్యార్థులకు విద్యాదానము, ఆకొన్నవారికి అన్నదానము చేయుట ఉచితమైనది.**
2. **దానము వలన భోగము, వృద్ధుల సేవల వలన జ్ఞానము, అహింసవల్ల చిరంజీవియునగునని బుద్ధిమంతులు చెపుతున్నారు.**

# 15 సహానుభూతి

**I. ప్రధాన విలువ** : సమానత్వం, సోదరభావం, స్త్రీల పట్ల గౌరవభావం

**II. ఉపవిలువ** : సహానుభూతికల్గినవారి గురించి తెలుసుకుందాం.

**III. లక్ష్యాలు / ఆశించే ఫలితాలు** :

- ఎదుటివారి బాధను తన బాధగా, వారి కష్టాలను తన కష్టాలుగా భావించి ఆపన్నహస్తం అందించడానికి సంసిద్ధులుగా చేయడం
- సమస్యలపట్ల సానుకూలంగా స్పందించడం అలవరుచుకుంటారు.

**IV. ఉపోద్ఘాతం** : మన చుట్టూ ఉన్న సమాజంలో ఎందరో వ్యక్తులు ఎన్నో ప్రమాదాల బారినపడుతూ ఉంటారు. ఎన్నో సమస్యలను ఎదుర్కొంటూ ఉంటారు. ఒక్కొక్కసారి ప్రకృతి వైపరిత్యాల వలన, అగ్నిప్రమాదాలు, వరదల వలన మన తోటివారు ఎంతో నష్టపోతూ ఉంటారు. ఆ సమయంలో వారికి వచ్చిన కష్టం మన కష్టంగానే భావించి అందించే సమయంవల్ల వారికి ఎంతో మేలవుతుంది.

**V. సంఘటనలు** :

**సంఘటన-1**

అది 1972వ సంవత్సరం. నల్లగొండ జిల్లాలోని అన్నవరగూడెం ఒక చిన్న గ్రామం. ఆ గ్రామంలో ధనిక, పేద, సాద అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి జీవిస్తుంటారు. ఒక వేసవికాలంలో ఉన్నట్టుండి ఓ పూరింటి ముందున్న పూర్తిగా ఆర్పనిపొయ్యినుండి చిన్న నిప్పురవ్వలు రాజుకుని గాలికి ఎగిసిపడి కొద్దిదూరంలో ఉన్న గడ్డివాముమీద పడి చూస్తుండగానే మరికొన్ని గడ్డివాములు, పూరిళ్ళు దగ్ధమవ్వసాగాయి. ప్రజలంతా మేల్కొని హాహాకారాలమధ్య సహాయం కోసం అర్థించసాగారు. వెనువెంటనే కుల-మత వివక్ష లేకుండా, ధనిక, పేద, వృద్ధ, యువక, ఆడ, మగ భేదం లేకుండా ఉరుకులు పరుగుల మీద అతి వేగంగా కదులుతూ నీటిని మోసి, ముందుగా వృద్ధులను, చిన్నపిల్లలను, పెంపుడు జంతువులను ఆపై గడ్డివాములను, ఇండ్లను పూర్తిగా దగ్ధం కాకుండా ప్రాణనష్టం లేకుండా, ఆస్తి నష్టం ఎక్కువ కలుగకుండా కాపాడుకోగలిగారు. అటు తర్వాత పశువుల మేతను అందరూ ఒకరికొకరు ఆ సంవత్సరమంతా పంచుకొని సహాయంచేసుకున్నారు.

### సంఘటన-2

అది డిసెంబరు నెల సమయం రాత్రి 12 గంటలు. హైదరాబాదు నగరానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, నిరాడంబరజీవి శ్రీ కొండా లక్ష్మీకాంతరెడ్డిగారు తనే స్వయంగా ఒక వ్యానునిండా రగ్గులు నింపుకుని వ్యాను నడుపుతూ చెట్లక్రింద, ఫుట్‌పాత్‌లపైనా, మురికి వాడలలో తిరుగుతూ చలికి వణుకుతున్న ముసలివారి, పేదవారి వద్దకు వెళ్ళి ఒక్కొక్క రగ్గు తీసుకొని వారికి కప్పుతూ ముందుకు సాగిపోతున్నారు. ఆవిధంగా ఎందరినో తీవ్రమైన ఎముకలు కొరికే చలిబారి నుండి కాపాడి ఇంటికి చేరుకునే సరికి తెల్లవారింది. చాలా సంవత్సరాలుగా ప్రతీ చలికాలం వారి కార్యక్రమం అదే.

### సంఘటన-3

ఈనాడు సంస్థ సునామీ (సముద్ర తుఫాను) బాధితుల సహాయకేంద్రాలు ఏర్పరచారు. వితరణశీలురు సునామీబాధితుల సహాయార్థం డబ్బు, దుస్తులు, మందులు మొదలగునవి మన సమీపంలో ఉన్న సునామీ సహాయనిధి కేంద్రానికి అందజేయవచ్చునని ప్రకటించారు. ఆ విధంగా వచ్చిన డబ్బుతో బాధితుల పునరుద్ధరనకోసం గృహ సముదాయాలు నిర్మించి ఇచ్చారు. దుస్తులు, మందులు మొదలగునవన్నీ వారు బాధితులకు పంచి వారిని ఎంతగానో ఆదుకున్నారు.

పై సంఘటనలు ఇతరుల బాధలు తమ బాధలనుకొని, బాధ్యతగా తమ వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించారు.

## VI. (అ) ఆలోచించడం - ప్రతిస్పందించడం

1. అన్నవరగూడెం గ్రామస్థులు నష్టం ఎక్కువ జరగకుండా ఎలా కాపాడుకోగలిగారు?
2. ఆ సమయంలో నువ్వక్కడ ఉంటే ఏం చేసివుండేవాడివి?
3. కొండా లక్ష్మీకాంత రెడ్డిగారు ఆ విధంగా ఎందుకు చేస్తారు?
4. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు లేదా మీ సమీపంలో ఏదైనా ప్రమాదాలు జరిగినప్పుడు మీరెప్పుడైనా స్పందించారా?
5. పైన పేర్కొన్నవారందరూ ఆ విధంగా చెయ్యడానికి గల కారణాలేమిటి?
6. కష్టాలలో ఇతరులకు సహాయపడ్డప్పుడు మీకు ఎలా అన్పించింది?
7. సహాయం పొందినవారి అనుభూతి ఎలా ఉంది?
8. మీరు సహానుభూతి చూపిన సంఘటనలు ఏమైనా ఉంటె చెప్పండి. మీకేమనిపించింది.
9. చలికి వణుకుతున్న ఒక చిన్న కుక్క పిల్లను మీరు చేరదీస్తే ఆ కుక్కపిల్ల మనసులో మీ పట్ల ఎలాంటి భావన కలుగుతుంది. దానికి మాటలువస్తే ఎలా వ్యక్తం చేస్తుంది?
10. బాగా అలసిపోయిన ఒక ఎద్దును చెర్నాకోలుతో కొట్టి బరువును లాగిస్తే దానిస్థానంలో నీవుంటే ఏమనుకుంటావు?
11. పాలుత్రాగుతున్న చిన్ని దూడను దాని కడుపునిండకుండా తల్లి ఆవునుండి వేరుచేస్తే మీకేమనిపిస్తుంది?

## (ఆ) ఆచరించడం - అనుభవాలు చెప్పడం

1. మనకు సహానుభూతి అనే విలువ లోపిస్తే ఏమి జరుగుతుంది?
2. సహానుభూతి ఉన్న మరవలేని సంఘటనలను చెప్పండి. చర్చించండి. బడిలో సహానుభూతి ఉన్న సంఘటనలు చెప్పండి.

## తెలుసుకోండి

ఎదుటి వారి బాధను తమ బాధగా భావించి ఆపన్నహస్తం అందివ్వగలగడమే సహానుభూతి. ఈనాడు మనిషిలో స్వార్థం పెరిగిపోతుంది. నేను-నాకు-నావాళ్ళు అనే భావన అంతకంతకు పెరుగుతూనేఉంది. మన సహాయం అవసరమైనవాళ్ళు మనం సహాయం చేయగల సందర్భాలు నిత్యం మనకెన్నో ఎదురవుతుంటాయి. అటువంటి సమయాల్లో ఏవిధమైన సంశయాలు, స్వార్ధభావన లేకుండా ముందుకు వచ్చి ఆ కష్టం తమకే వచ్చిందన్న భావనతో సహాయం చేసి ఆదుకోవడానికి ముందుకు రావాలి. ఇదే సహానుభూతి అటువంటి సహానుభూతికి ఎల్లలులేవు. హద్దులులేవు. కులం లేదు. గోత్రం లేదు, పేద,ధనిక తేడా లేదు, చిన్న,పెద్ద తేడా లేదు. కేవలం సహాయపడగలిగే మనసు బాధను అర్థం చేసుకోగల మనసుమాత్రముంటే చాలు. మనం మన చుట్టూ క్రూర జంతువులు కూడా తమ తోటి జంతువుల పట్ల సహానుభూతిని వ్యక్తపరిచే సంఘటనలెన్నో చూస్తూ ఉంటాము. అటువంటప్పుడు మేధస్సుతో సృష్టించబడిన మానవుడు తోటి వారిపట్ల జంతువుల పట్ల ఎంతటి సహానుభూతిని వ్యక్తం చేయగలడో ఆలోచించండి.

### <u>తెరిచిన పిడికిలి</u>

***బిడ్డ ఆకలి అమ్మకి తెలుస్తుంది. ఈ తల్లులకు తమ పిల్లల ఆకలే కాదు. అనాథల క్షుద్బాధా తెలుసు. ఇంత తెలిసిన వీరంతా గొప్ప స్థితిమంతులేం కాదు. అలాంటప్పుడు లేనివారికి గుప్పెడు మెతుకులు పంచేదెలా. ఆలోచించగా ఆలోచించగా దారి దొరికింది. రోజూ పిడికెడు గింజలు దాచాలన్న ఊహ కలిగింది. పిడికిలి బిగిస్తే ఉద్యమం అవుతుంది. ఉద్యమం ఏదైనా సాధించుకోవడానికి, కానీ పిడికిలి తెరిస్తే? పిడికిలి తెరిస్తే అది ప్రేమ అవుతుంది. పంచుకోవడం అవుతుంది. ఆ ఊళ్ళో జనం పిడికిలి తెరిచారు. తమదగ్గరున్న గింజల నుంచి ప్రతీరోజూ పిడికెడు పంచడం నేర్చారు. ఇవ్వడం సాయం. పంచడం మానవత్వం. సాటిమనుషుల ఆకలి చూడలేక బడుగు జీవులు తెరచిన పిడికిలి కథ ఇది.***

దిగువ మధ్యతరగతి ప్రజలు నివసించే ప్రాంతం విశాఖపట్నంలోని చినగదిలి. పోలమాంబ వీరి గ్రామ దేవత. అన్ని చోట్లా ఉన్నట్టే ఈ పల్లెవాసాన కూడా దిక్కులేని పక్షులెన్నో ఉన్నాయి. కన్నబిడ్డలకు దూరమైన వారు, ఏ ఆధారమూ లేని వృద్ధులు, వికలాంగులు ఆకలితో అలమటిస్తున్నారు. వీరి ఆకలి కేకలు ఇక్కడి మహిళలను కదిలించాయి. వీరికోసం ఏం చేయాలి... అనే ఆలోచన మొదలైంది. 'ఇదంతా దాదాపు పదేళ్ళ కిందటి మాట. పాతికమంది వరకూ ఉంటారు.

ఎక్కడివారో. ఎవరు కన్నబిడ్డలో నా అనేవారు లేక గంజి నీళ్ళ కోసం కొట్టుమిట్టాడేవారు. వీరిని ఆదుకోవాలనుకున్నాం. కనీసం ఒక్కపూటయినా వీరి కడుపునింపాలని నిర్ణయించుకున్నాం. మరి భోజనాలు ఎక్కడ పెట్టాలి. పోలమ్మ ఆలయం గుర్తుకొచ్చింది. మహిళలంతా మా మదిలోని మాట చెప్పేసరికి మందిరం పెద్దలూ సంతోషించారు. ఇక మా ప్రయత్నాలు మేం మొదలెట్టాం. ప్రతీ రోజూ ఇంట్లో అన్నం వండుకునే ముందు దేవుణ్ణి తలచుకుని పిడికెడు బియ్యం ఒక గిన్నెలో వేయడం ప్రారంభించాం. ఇది ఏభై ఇళ్ళలో నిత్యం జరిగే ప్రక్రియగా మారింది. అప్పట్లో వారానికి ఒకటి రెండు సార్లు వంటచేసి పేదలకు పంచేవాళ్ళం.' అన్నదానం ఆరంభమైన నాటి సంగతులను ఒక్కొక్కటిగా చెప్పుకొచ్చాంది. ఆటోడ్రైవర్ భార్య చందు.

**పుణ్యకార్యం**

ఈ పిడికెడు బియ్యం వ్యవహారం చినగదిలి పరిసరాల్లోని సంతపాలెం, రాధాకృష్ణనగర్, సూర్యతేజానగర్, రామలక్ష్మణాపురం, ఆరిలోవ, దీనదయాళ్ పురం వాసులకూ తెలిసింది. మనం తినే అన్నంలో ప్రతీ రోజూ గుప్పెడు గింజల్ని పేదలకోసం సమర్పించడాన్ని ఈ ప్రాంతాల మహిళలెందరో పుణ్యకార్యంగా భావించారు. వారంతా ఒకే కుటుంబసభ్యులుగా మారారు. ఒక్క మాటమీద నిలిచారు. బియ్యం గింజల నిల్వలు మెల్లగా ప్రతీ ఇంటా పెరగనారంభించాయి. 'వేలూ లక్షలూ ఇవ్వలేం. సంపాదించుకున్న దాంట్లో కొద్దిపాటి నూకల్ని బీదలకు ఇవ్వగలం కదా. నిరాధారంగా బతుకుతున్న వారికి సేవచేసే భాగ్యం దేవుడే మాకిచ్చాడేమో. మేమూ సాదాసీదా మనుషులమే. కానీ ఆకలితో నకనకలాడేవారిని చూస్తూ గుడ్లప్పగించి కూర్చోలేం. వారూ సాటి మనుషులే. రోజూ బియ్యాన్ని పోగుచేసి పేదలకు వండి పెడుతుంటే వారి కళ్ళల్లోని ఆనందం మా నేత్రాలను చెమర్చేలా చేస్తోంది. ఆ తృప్తి అపారం' కన్నీటి తెర కమ్మేయగా తాపీ మేస్త్రి భార్య కుమారి తెలియజేసింది.

**అన్నపూర్ణ 'కుంభం'**

ప్రతీ వారం ఇలా పేదలకు భోజనం పెడుతుండటం ఆనోటా ఈ నోటా పాకడంతో కొందరు దాతలు ముందుకు వచ్చి కూరానారా పప్పూ ఉప్పూ ఇవ్వడం మొదలెట్టారు. మరికొందరయితే పాత్ర సామగ్రి అందజేశారు. దీంతో కూర, సాంబారు కూడా అనాథలకు అందించేందుకు మార్గం సుగమం అయింది. పోలమ్మ ఆలయం వివిధ దైవస్వరూపాలకు నిలయం. నార్త్ షిరిడీ సాయి టెంపుల్ కాంప్లెక్సుగా ప్రఖ్యాతమైంది. ఈ ఆలయ ప్రతినిధులు మంచి మనసున్న తల్లులు చేస్తున్న అన్నదానాన్ని వ్యవస్థీకృతం చేయాలని భావించారు. మట్టితో చిన్న చిన్న కుండలు తయారు చేయించారు. వాటికి రంగులేశారు. నారాయణ సేవ పాత్రగా పేరు పెట్టారు. అనునిత్యమూ ఈ పాత్రల్లో బియ్యాన్ని దాచిపెట్టాలని పిలుపునిచ్చారు. దీంతో ఈ పాత్రలను తీసుకునేందుకు కొత్తవారూ ఆసక్తి చూపారు.

"ఇప్పటి వరకూ రెండువేల మట్టి కుండలు పంపిణీ అయ్యాయి. ఈ నారాయణ సేవ పాత్రలు ఎక్కడెక్కడికో వెళ్ళిపోయాయి. సింహాచలం, ఆనందపురం, పెందుర్తి వరకూ వీటి ప్రయాణం సాగింది. వీటిని ప్రవేశపెట్టాలని యోచించిన ఆలయ ప్రతినిధి వానపల్లి అప్పారావు దూరదృష్టిని ఎన్నటికీ మరువలేం. మా ఇంటికి వచ్చే చుట్టాలు

కూడా, బియ్యం జాగ్రత్త చేస్తున్న మమ్మల్ని మెచ్చుకుని మా పాత్రలు పట్టుకుపోయేవారు. రోజూ వారు బియ్యం నిల్వచేసి వారానికోసారి పంపిస్తుండేవారు. ఇలా ఎక్కడెక్కడో ఉన్న మా కూతుళ్ళు అల్లుళ్ళూ కూడా ఈ మంచిపనిలో భాగస్వాములుగా మారిపోయారు. ఉన్న నారాయణ పాత్రలన్నీ అయిపోయి మరిన్ని వందలు చేయించాల్సి వచ్చింది.' పేదలకు ఏళ్ళతరబడి కడుపు నింపుతూ ఆనందం పొందుతున్న నీలి అప్పలనరసింహ, విజయలక్ష్మి, అరుణ ముక్తకంఠంతో చెప్పారు.

**వారంతా మా బిడ్డలే**

ఇప్పుడు ఎటు చూసినా బియ్యం నిల్వలే. నిండిన బియ్యం కుండల్ని పట్టుకుని బిలబిలా విచ్చేసే మహిళలతో పోలమాంబ మందిరం కళకళలాడుతుంటుంది. ఎప్పుడయితే బియ్యం బస్తాలు పెరుగుతున్నాయో వెనువెంటనే మహిళలంతా కలిసి నిత్యాన్నదానం చేయాలని తీర్మానించుకున్నారు. 2008 డిసెంబర్ 12 నుంచి రోజూ ఆలయ ప్రాంగణంలో పొయ్యి మండుతోంది. వంట సాగుతోంది. తొలినాళ్ళలో పాతికమందికి భోజనం పెట్టే వీరంతా ఇప్పుడు నూటేభై మందికి నిత్యమూ ఆకలి తీరుస్తున్నారు. 'మా మహిళలంతా సంఘంగా ఏర్పడ్డాం. రోజూ ఎవరు వంట చేయాలో వంతులు వేసుకున్నాం. ఒక తల్లిబిడ్డలన్న భావనే మమ్మల్ని మునుముందుకు నడిపిస్తోంది. మాలో అరమరికలు లేవు. ఈ పుణ్యకార్యాన్ని మా అందరి ఇంట జరిగే పెళ్ళిలాగానే భావిస్తాం. కష్టసుఖాలు కలబోసుకుంటూ గరిటె తిప్పుతాం. కూర, చారు చకచకా వండేస్తాం. బియ్యం ఉడికించి వడ్డనకు అంతా సిద్ధం చేస్తాం. కేవలం ఒక్క మాట మేం పెట్టే అన్నం మెతుకులు తిని జీవితాన్ని వెళ్ళదీస్తున్న ఎందరినో రోజూ చూస్తున్నాం. వారంతా నోరారా అమ్మా అనిపిలుస్తుంటే ఏ జన్మలోనో మా బిడ్డలేనేమో అనిపిస్తోంది. ఏ జన్మలోనో మా రక్తసంబంధీకులై ఉంటారు' అన్నదాన యజ్ఞంలో పాత్ర వహిస్తున్న వకీలా రాణీ వివరించారు. కుండల్లో క్రమం తప్పకుండా బియ్యం పోసే అలవాటు కావడంతో కొన్ని ఇళ్ళవారు పిల్లల పుట్టినరోజులు, పండగరోజుల్లో మరో ఇన్ని పిడికిళ్ళు పోసి త్వరగా కుంభాన్ని నింపేస్తున్నారు. ఇప్పుడు నిత్యాన్నదానంతో పాటుగా నెలలోని మొదటి గురువారం నాడు నాలుగయిదు వేల మంది నిరుపేదలకు సంతర్పణ చేసే స్థాయి వచ్చింది. తల్లులంతా నారాయణపాత్రలను నింపుతుంటే ఆ ఇంట్లోని మిగిలిన కుటుంబసభ్యులందరికీ సేవామార్గం పట్ల చక్కని అవగాహన కలుగుతోంది. తోటి వారికోసం సాయపడాలన్న తాపత్రయం పెరుగుతోంది. కంచం పక్కన ఒక్క మెతుకు కింద పడ్డా వీరి ప్రాణం ఉసూరుమంటోంది. ఒక్క బియ్యం గింజ నేలపాలయినా దాన్ని మరొకరి ఆకలి తీర్చేందుకు వినియోగించవచ్చునే తపన కనిపిస్తోంది.

మన దేశంలో అంతో ఇంతో ఉన్నవారంతా ఇలా పిడికెడు గింజలు రోజూ దాచిపెడితే నిరుపేదల ఆకలి పటాపంచలైపోవడం ఎంత సులువు.' సత్యవతి, సూర్యప్రభ, లక్ష్మి, పార్వతి, వెంకటరత్నం వంటపనుల్లో మునిగితేలుతూనే మాట్లాడారు. ఈ తల్లులను చూస్తుంటే కాశీ అన్నపూర్ణలుగా కనిపించారు. బాల్యంలో గోరు ముద్దలను తినిపించే అమ్మలా అగుపించారు. ఇలాంటి సజ్జనులను కలవడం, మాట్లాడటం, చూడటం పూర్వ జన్మ పుణ్య ఫలమే.

## డెడ్ బాడీ ఇస్తారా?

***చదవడానికి అసహ్యంగా ఉంది కదూ? పావురం ప్రాణాన్ని కాపాడడానికి శిబి చక్రవర్తి తన శరీరం నుంచి మాంసాన్ని తీసి ఇచ్చాడు. ప్రాణహాని ఉన్నదని తెలిసే కర్ణుడు తన కవచకుండలాలను ఇంద్రుడికి ఒలిచి ఇచ్చాడు. వీళ్ళందరూ వారి తనువు మీద ప్రీతి లేనివారు కాదు. అయినా త్యాగానికి వెనుకాడలేదు. మీకు పనికిరానిది ఒకటి మిమ్మల్ని అడిగితే... త్యాగం చేస్తారా? చనిపోయాక మీ బాడీని రాసిస్తారా? మెడికల్ కాలేజీలో పిల్లలు మీ దేహాన్ని కోసి – కుట్టి, మళ్ళీ మళ్ళీ కోసి – కుట్టి వైద్యం నేర్చుకుంటారట.. కొంచెం దానం చేస్తారా? చదవటానికి వెగటుగా ఉంది కదూ. ఆలోచిస్తుంటేనే గగుర్పాటు కలుగుతుంది కదూ. మీ విశ్వాసాలు, మీ కుటుంబ సభ్యులు... అసలు మీరు... ఒప్పుకుంటారా? సీతామహాలక్ష్మి ఇలా అనుకునేవారి ఆలోచనలను మార్చగలిగింది. ఆమె ప్రస్థానం ఇలా ఆమె మాటల్లోనే..***

నా పేరు గూడూరు సీతామహాలక్ష్మి. మాది పశ్చిమగోదావరి జిల్లా ఉండి. 1962లో పుట్టాను. మా నాన్న టీచరు. అమ్మ గృహిణి. ఆరుగురం పిల్లలం. మధ్య తరగతి కుటుంబం మాది. మా అమ్మ మమ్మల్ని ఆడ, మగ తేడా లేకుండా పెంచింది. ఆ రోజుల్లోనే ప్రజానాట్యమండలి పాటలు విని ఇంట్లో పాడుతుండేది. 'మిన్నకుండుట న్యాయమా సోదరి' అని ఆమె ఆలపించిన గీతం నా జీవితం మీద చాలా ప్రభావం చూపింది. ఈ సమాజానికి ఏదో ఒకటి చేయాలనే కోరిక కలిగింది.

**దక్కని చదువే దారి చూపింది**

చిన్నప్పటి నుంచి మెడిసిన్ చదవాలని కోరిక. ఇంటర్‌లో గోల్డ్‌మెడలిస్టుని. కనుక మెడిసిన్‌లో ఆంధ్రా మెడికల్ కాలేజీలో మెరిట్ మీదే సీటొచ్చింది. అయితే మా నాన్న ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం. "నా నెల జీతమంతా పెట్టినా నీకు స్టెత్‌సోప్ కొని తేలేనే తల్లీ" అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడాయన. ఆరోజు నేను పడిన వేదన అంతా ఇంతా కాదు. దాంతో టీచర్ ట్రైనింగ్‌లో చేరక తప్పలేదు. అలా ఏలూరులో టీచర్ ట్రైనింగ్ చేసి 1983లో మా ఊరిలోనే టీచర్‌గా అపాయింట్ అయ్యాను. అయితే వైద్య శాస్త్రం మీద మమకారం పోలేదు. మానవ శరీరానికి సంబంధించిన పుస్తకాలన్నీ బాగా చదివేదాన్ని. చదివే కొద్దీ నాకు అనేక విషయాలు అర్థమయ్యాయి. మన శరీరంలోని అవయవాలు చాలా అమూల్యమైనవి. వాటితో ఎందరివో ప్రాణాలు కాపాడవచ్చు. ఉదాహరణకు మన కాలేయాన్ని నలుగురికి దానం చేయవచ్చు. కర్ణభేరిని ఇద్దరికి అమర్చవచ్చు. మన రెండు కళ్ళతో ఇద్దరి జీవితాల్లో వెలుగు నింపవచ్చు. పాంక్రియాస్, గాల్‌బ్లేడరు, రక్తనాళాలు ఇలా చెప్పుకుంటూ వెళితే శరీర భాగాలెన్నో ఎందరికో పనికివచ్చేలా సహాయం చేయవచ్చు. దేశంలో ప్రస్తుతం ముప్ఫయి అయిదు లక్షల మంది రోగ పీడితులు అవయవమార్పిడి కోసం నిరీక్షిస్తున్నారు. వాళ్ళ కోసం ఏదైనా చేయాలని నాకు అనిపించింది.

**చనిపోయాకైనా**

రక్తదానం, నేత్రదానం విషయంలో మనందరికీ కొంతయినా అవగాహన ఉంది. శరీరదానంపై ఇంకా చైతన్యం రావాలి. జరగాల్సిందల్లా ఈ విషయమై రేగే సందేహాలను తీర్చడమే. చనిపోగానే మన శరీరాన్ని దహనం చేస్తున్నాం.

లేదా ఖననం చేస్తున్నాం. అలా కాకుండా వాటిలోని విలువైన అవయవాలని ఇతరులకు దానం చేస్తే మన దేహానికి ఒక సార్థకత ఏర్పడుతుంది కదా. అప్పటి నుంచి ఈ విషయం మీద విస్తృత ప్రచారం ప్రారంభించాను. కాని ఆ పని అంత సులభం కాలేదు. మొదట్లో నన్నంతా వింతగా చూసేవారు. శరీరదానమంటే అదేదో అశుభమని తలచేవారు. ఎప్పుడు చచ్చిపోతానో చెప్పమంటావా... అంటూ కొందరు వెక్కిరిస్తుండేవారు. విసుక్కునేవారు. పట్టించుకునేదాన్ని కాదు. మంచి పనికి ప్రతిబంధకాలుంటాయి. వీటిని వదిలించుకుని ముందుకువెళ్ళాలి. నేను చెప్పే మాటల మీద అందరికీ నమ్మకం కలగాలి. అందుకే ముందుగా నా శరీరాన్ని దానం చేస్తూ డాక్యుమెంట్ రాశాను. నన్ను చూసి మా నాన్న తనూ విల్లు రాశారు. మారుతున్న చట్టాల ప్రకారం ఇప్పుడు దానపత్రం రాయడమే కాదు. సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులో రిజిస్టర్ చేయించాలి. ఆ కాగితాలను మెడికల్ కాలేజ్‌కి అందజేయాలి. అలా శరీరదానం చేసినవారు మరణించినప్పుడు వారి డెడ్‌బాడీని మెడికల్ కాలేజ్‌కి అప్పగించాలి. ఇలా అవయవదానం చేసిన వారెవరయినా దురదృష్టవశాత్తూ, బ్రెయిన్ డెత్ అయితే వారి లోపలి భాగాలన్నీ రోగపీడితులెందరికో అమర్చవచ్చు. అలా కాకుండా మామూలుగా చనిపోతే ఆ కాయాన్ని శాస్త్ర పరిశోధనలకు వినియోగించవచ్చు. ఈ రోజు శవాలు దొరక్క మెడిసిన్ విద్యార్థులు నానా యాతనా పడుతున్నారు. గతంలో ఒక శరీరాన్ని ఒక్కో మెడికోకిచ్చి డిసెక్షన్ చేయించేవార. ఇప్పుడు క్లాసుకో బాడీ సమకూర్చలేకపోతున్నారు. మన దేహాలు భవిష్యత్ తరాలకు తోడ్పడితే అంతకంటే మోక్షం ఏముంటుంది చెప్పండి.

**ఫలిస్తున్న శ్రమ**

ఈ ఏడాది ఆగస్టు 22న తొలిసారిగా విశాఖనగరంలో శరీరదానం చేస్తూ పది మంది రిజిస్ట్రేషన్లు చేయించారు. పెద్ద విజయం సాధించట్టనిపించింది. ఇది ప్రభంజనంగా మారుతోందన్న భరోసా లభించింది. దీంతో వైజాగ్ బాజీ జంక్షన్‌లో నా ఇంటినే ఆఫీసు కింద మార్చాను. శరీరదాతలుగా ముందుకొచ్చేవారికి అవగాహన పెంచుతున్నాను. ఆంధ్రా మెడికల్ కాలేజీ, రిజిస్ట్రార్ ఆఫీసులతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి కాగితాలు సిద్ధం చేయిస్తున్నాను. కరపత్రాలు ప్రచురించాను. పోస్టర్లు అంటించాను. నలుగురికీ సమాచారం తెలిసింది. ఎందరెందరో కలుస్తున్నారు. ఇప్పుడు నా ఇల్లు బాడీ డోనర్లతో కిక్కిరిసిపోయింది. ప్రతీరోజూ సమావేశాలే. చనిపోయాక కూడా మనం బతకాలంటే ఇదే ఉపాయమని వారందరికీ హితవు చెబుతున్నాను.

**మన చుట్టూ మంచితనమే**

మనుషుల్లో మంచితనం చచ్చిపోయిందని ఎవరైనా అంటే అంగీకరించను. మన చుట్టూ కావాల్సినంత మంచి ఉంది. మనం చూడగలగాలి. మీకు చెబితే ఆశ్చర్యంగా ఉంటుంది. పదిహేను, ఇరవై సంవత్సరాల పిల్లలు బాడీ డొనేట్ చేస్తామంటూ వస్తున్నారు. ముందుగా వారిని రక్తదానం వైపు మళ్ళిస్తున్నాను.

ఇంకాస్త పెద్దయ్యాక నిర్ణయాలు తీసుకోవచ్చని చెప్పి పంపుతాను. విశాఖ నగరంలోనే కాదు. గ్రామీణ ప్రాంతాల్లోనూ మా ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. బాడీ డొనేషన్‌కు ముప్ఫయి అయిదుగురు సిద్ధమయ్యారు. కశింకోట మండలం కన్నూరుపాలానికి చెందిన కృష్ణమూర్తి రాజు కుటుంబమంతా శరీరదానం చేసింది. ఇంకా ఎందరో దంపతులు

దానపత్రాలను రిజిస్టర్ చేయించారు. అక్టోబర్ 8న డాక్యుమెంట్లను ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ భాగ్యారావుకు సమర్పించారు. ఒకే రోజు ఇంత పెద్ద ఎత్తున బాడీ డొనేషన్ జరగడం రాష్ట్రంలో ఇదే ప్రథమం. ఇదో రికార్డు.

**ఎంతో జరగాలి**

నేనేదో గొప్పపని చేస్తున్నానని కాదు. ఇదంతా శుభారంభమే. ఇంకా చేయాల్సింది చాలానే ఉంది. అవయవదానంపై అభ్యుదయవాదులు, స్వచ్ఛంద సంస్థలు పెద్ద ఎత్తున పనులు చేపట్టాలి. దానపత్రాల రిజిస్ట్రీ వేళ డోనర్లను చూస్తుంటే వైద్యరంగ పురోగతిలో మైలురాళ్ళుగా కనిపిస్తారు. రానున్న కాలంలో శరీరదానం మహా విప్లవమై భూగోళాన్ని తాకుతుంది. కొత్త ప్రపంచానికి తలుపులు తెరుస్తుంది. సీతామహాలక్ష్మి గట్టి నమ్మకంతో చెబుతున్న ఈ మాటలు ఆమెలోని నిబద్ధతకు నిలువుటద్దం. ఆమెకు అభివందనాలు.

## మీకు తెలుసా?

- ఒక కోతిని వెంటాడి వేటాడిన పులి తల్లి కోతిని చంపేస్తుంది. కానీ తల్లికోతి పొత్తిళ్ళలో ఉన్న చిన్నకోతి పిల్లను చూసి దాని మనసులోని మాతృత్వపు పొర కదులుతుంది. అతి జాగ్రత్తగా వేరే ఏ జంతువుల భారిన పడకుండా తన పాలిచ్చి ఆ చిన్న కోతిని పెంచి పెద్ద చేసింది.
- తల్లి చనిపోయిన ఆవు దూడకు కుక్క పాలిచ్చి పెంచుతుంది.

సూక్తి : త్యాగగుణ మొకటే సర్వత్ర పూజింపబడుచున్నది. మిగిలిన గుణములన్నిటికంటె త్యాగము గొప్పది. త్యాగము వల్లనే జగత్తున పాషాణాదులు, వృక్షములు, జంతువులు కూడా పూజనీయములగుచున్నవి.

# 16 స్ఫూర్తి

**I. ప్రధాన విలువ** : దేశభక్తి : జాతీయభావన

**II. ఉపవిలువ** : దేశభక్తుల జీవితగాథలనుండి స్ఫూర్తిని పొందడం

**III. లక్ష్యాలు / ఆశించే ఫలితాలు** :
- జాతీయభావాన్ని పెంపొందించుకుంటారు. సేవాతత్పరతను, త్యాగశీలతను అలవరచుకొంటారు.

**IV. ఉపోద్ఘాతం** : మనది భారతదేశం. ఇది మనమాతృభూమి. మన తల్లిపట్ల ఏ విధమైన భక్తిని కలిగి ఉంటామో అదే విధమైన భక్తి మన దేశము పట్ల కలిగి ఉండాలి. భారతదేశంలోని ప్రతి పౌరుడు ఇదే లక్ష్యాన్ని ఆదర్శాన్ని కలిగి ఉండాలి. ఈ పుణ్యభూమిని మనం ప్రేమించాలి. గౌరవించాలి. ఈ దేశపురోభివృద్ధికి శక్తివంచన లేకుండా మనం శ్రమించాలి. ఇది మన కర్తవ్యం. తమ జీవితాన్ని దేశం కోసం సమర్పించిన వారి జీవితాలు కొన్ని సంఘటన ద్వారా పరిశీలిద్దాం.

**V. సంఘటనలు** :

**సంఘటన-1**

ఒక ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, గొప్ప సంఘ సంస్కర్త. మహారాష్ట్రలో ఒక మందిరాన్ని కట్టించి దానికి పూజారిగా ఒక హరిజనుణ్ణి నియమించిన సంస్కర్త ఆయన. జాన్సన్ అనే తెల్లదొర హత్యతో సంబంధమున్నదని భావించిన బ్రిటీషువారు ఆయనకు యావజ్జీవ శిక్షను విధించారు. ఆయన ఉపన్యాసాలు, రాసిన రాతలు రెచ్చగొట్టేవిధంగా ఉన్నాయని వెంటనే ఇంకొక యావజ్జీవ శిక్షను విధించారు. మొత్తం 50 ఏండ్లు శిక్షను అనుభవించడానికి ధైర్యంగా, సంతోషంగా ముందుకు నడుస్తూ “రెండు యావజ్జీవ శిక్షలు నాకు విధించి, పునర్జన్మ ఉన్నదని బ్రిటీషు ప్రభుత్వం ఒప్పుకున్నట్లయింది. అది చాలు నాకు” అని చమత్కరించారు. ఆరెండు జైలుశిక్షలు అండమాన్ జైలులో అనుభవిస్తుండగా తిరిగి విచారణనిమిత్తం ఆయనను ఓడలో ఇండియా తిరిగి తీసుకువస్తుండగా కాలకృత్యాలు తీర్చుకునే పేపరు మరుగుదొడ్డి గొట్టం ద్వారా సముద్రలోకి జారిపోయి ఈదుకుంటూ రేవుకు చేరాడు. బ్రిటీషు పోలీసులు తుపాకీ గుండ్లతో ఆయనను అతికష్టం మీద పట్టుకోగలిగారు. ఆయనే ప్రఖ్యాత సంఘసంస్కర్త వీరసావర్కారు.

### సంఘటన-2

1921నాటి సంగతి. వారణాసిలో సందులలో కొందరు బాలురు ఆకాశం చిల్లులు పడేలా 'ఇంక్విలాబ్ – జిందాబాద్' అనే నినాదంతో ఒక 15 ఏండ్ల బాలుడి నాయకత్వంలో అరవసాగారు. పోలీసులు వారిని వెంబడించగా కొందరు బాలురు అటూ ఇటూ పరిగెత్తసాగారు. నాయకుడైన బాలుడు మాత్రం అలాగే నిలబడ్డాడు. అతనిని కోర్టులో ప్రవేశపెట్టారు. ఆంగ్లేయ మెజిస్ట్రేట్ కఠిన స్వరంతో 'నీపేరేమిటి?' అన్నాడు. ఆ బాలుడు 'ఆజాద్' అని బదులిచ్చాడు. 'నీ తండ్రిపేరు?' – అని అడగగానే 'స్వాతంత్ర్యం' అని బదులిచ్చాడు. జడ్జిగారు ఏమిటి వదరుతున్నావు? నీ ఇల్లు ఎక్కడ? అన్నారు. అప్పుడు ఆ యువకుడు 'జైలుగది లేదా భారతమాత చరణాలు' అని అన్నాడు. వెంటనే కొరడా అతని శరీరంపై నాట్యం చేసింది. ప్రతి దెబ్బకూ అతడు 'వందేమాతరం' అంటూ నినదించసాగాడు. అతడే ప్రఖ్యాత విప్లవ వీరుడు చంద్రశేఖర్ ఆజాద్.

### సంఘటన-3

అది బ్రిటీషువారు మనలను పాలిస్తున్నరోజులు. అది కోర్టు ఆవరణ. చుట్టూ అనేకమంది పోలీసులు మొహరించి ఉన్నారు. ముగ్గురు ఖైదీలకు సంకెళ్ళు వేసి కోర్టు హాల్‌కి తీసుకువచ్చారు. వారు "విప్లవం వర్ధిల్లాలి" అంటూ నినదిస్తూ వచ్చారు. "మీరు ఎందుకు ప్రయోగం చేశారు? ఎందుకు అధికారులను చంపాలనుకున్నారు" అని అడిగాడు. అప్పుడు అందులో ఒక యువకుడు మేం బాంబులు విసిరింది ఎవరినీ హత్య చెయ్యడానికి కాదు. మీ నిరంకుశ ఆంగ్లప్రభుత్వాపై విసిరాం. ఆంగ్లేయులు మా దేశాన్ని విడిచి పోవాలి. అని ధైర్యంగా పలికాడు. మెజిస్ట్రేట్ అతనికి ఉరిశిక్ష విధించాడు. అతడే భగత్‌సింగ్ మిగిలినవారు సుఖ్‌దేవ్, రాజ్‌సరు. భారతమాత సేవలో తమ జీవితాలు ధన్యమయ్యాయని ఆనందంగా ఉరికంబాన్నెక్కారు. తామే ఉరితాళ్ళను బిగించుకొని 'భారత్‌మాతాకి జై' అంటూ చిరునవ్వుతో ప్రాణాలర్పించారు.

## VI. (అ) ఆలోచించడం - ప్రతిస్పందించడం

1. పై కథలలో 'అందరి లక్ష్యసాధనే ఒకటే' అని మీరనుకుంటున్నారా? ఎలా?
2. వీర సావర్కార్ సంఘ సంస్కర్త అని ఎందుకంటారు?
3. పేరు, తండ్రిపేరు అడిగిన మెజిస్ట్రేట్‌తో చంద్రశేఖర్ ఆజాద్ ఏమని సమాధానమిచ్చారు? ఎందుకు అలాంటి సమాధానం ఇచ్చారు?
4. నాయకులందరూ శిక్షను ఎలా స్వీకరించారు? ఎందుకు?
5. వారు ఏమి ఆశించి ఈ పనులను చేసారు. ఎందుకు?

## (ఆ) ఆచరించడం - అనుభవాలు చెప్పడం

1. మీకు తెలిసిన గొప్ప నాయకులెవరు? వారి గురించి ఆసక్తికరమైన విషయాలను సేకరించి చెప్పండి.
2. మనం మన గ్రామానికి, ప్రాంతానికి ఏమైనా చేయగలమా - చర్చించండి.
3. మీకు తెలిసిన ఇతర మహనీయుల త్యాగాలను చెప్పండి. చర్చించండి.

## తెలుసుకోండి

తల్లిని మించిన దైవం లేదు. తల్లిలాంటిదే జన్మించిన దేశం. మనది భారతదేశం. మన జననితో పాటు జన్మించిన దేశాన్ని కూడా ప్రేమించాలి. గౌరవించాలి. పూర్వజన్మ సుకృతం వలన ఈ పవిత్ర భూమిలో మనం జన్మించాం. ఈ పుణ్యభూమిలో ప్రతి అణువు మనకు అత్యంత పవిత్రమైనది. మన కర్తవ్యాన్ని విస్మరించకుండా ఎవరి బాధ్యతలను వారు సక్రమంగా నిర్వహించడం ద్వారా మనదేశభక్తిని చాటుకొనవచ్చు. బాధ్యతగల పౌరులవలె మనం ప్రవర్తించాలి. దేశ పురోభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలి. ప్రముఖ కవి రాయప్రోలు సుబ్బారావుగారు యువతను ప్రభోదిస్తూ దేశభక్తి గురించి చెప్పిన సాహిత్యాన్ని కొంత తెలుసుకుందాం.

‘ఏ దేశమేగినా ఎందుకాలిడినా

ఏ పీఠమెక్కినా ఎవ్వరెదురైనా

పొగడరా నీ తల్లి భూమిభారతిని

నిలుపరా నీ జాతి నిండుగౌరవము’

“లేరురా ఇటువంటి భూదేవియెందు

లేరురా మనవంటి ధీరులింకెందు

అవమానమేలరా అనుమానమేలరా

భరతపుత్రుడనంచు భక్తితో పాడరా”

ఎక్కడికి వెళ్ళిన మన జాతి, మన దేశం గర్వించదగ్గ పనులే మనం చేయాలి. దేశ పురోభివృద్ధికి అహర్నిశలూ శ్రమించాలి.

**సూక్తి :** **నాపదల ముందు ధైర్యము, సంపదలున్నప్పుడు తాలిమి, సభలలో వాక్చాతుర్యము, యుద్ధములో పరాక్రమము, కీర్తి సంపాదించుటలో ఆసక్తి, విద్యలయందు వ్యసనము ఈ గుణములు మహాత్ములకు ప్రకృతి సహజములు.**

# 17 మతసారం

**I. ప్రధాన విలువ** : మతసామరస్యం – లౌకికత్వం

**II. ఉపవిలువ** : వ్యక్తి సన్మార్గానికి తోడ్పడేది మతం. అని గ్రహించడం

**III. లక్ష్యాలు / ఆశించే ఫలితాలు** :

- మతం అనేది మనుష్యులను మంచి దారిలో నడిపించేదని తెలుసుకొంటారు.
- అన్ని మతాలను గౌరవించడం అలవరచుకొంటారు.

**IV. ఉపోద్ఘాతం** : పిల్లలూ! మతం అంటే ఒక అభిప్రాయంతో కూడిన నమ్మకం. దేవుణ్ణి ప్రార్థించడానికి, సక్రమ జీవన విధానానికి మనిషి రకరకాల మార్గాలను ఎన్నుకొన్నాడు. అవే “మతం” పేరుతో రూపాంతరం చెందాయి. ఈనాడు మనకు హిందూ, ముస్లిం, క్రైస్తవ, బౌద్ధ, జైన, సిక్కు వంటి అనేక మతాలు కనిపిస్తున్నాయి. ఇవన్నీ బాహ్యంగా పరిశీలిస్తే పరస్పరం భిన్నాలుగా కన్పించినా అవి బోధించే పరమార్థం ఒక్కటే. మానవులను అజ్ఞానం నుండి జ్ఞానంవైపు, ధర్మ బద్ధమైన జీవనంవైపు, ఉత్తమ వ్యక్తిత్వం వైపు మళ్ళించేవి మతాలు. వాటిని గూర్చి తెలుసుకుందాం.

**V.**

**కింది వాక్యాలు చదవండి.**

### హిందూ మతం

- సర్వేజనాః సుఖినో భవంతు

  (జనులందరూ సుఖముగా ఉందురు గాక)

- సత్యం వద, ధర్మం చర

  (సత్యమునే పలుకవలెను, ధర్మాన్ని ఆచరించవలెను)

- శీలం పరం భూషణం

  (మంచి నడవడి మనిషికి అలంకారం)

- పరోపకారార్థం మిదం శరీరం

  (ఇతరులకు ఉపకారం చేయాలి)

- లోకాస్సమస్తా స్సుఖినోభవంతు

  (అన్ని దేశాలు సుఖంగా ఉండాలి)

- సర్వే సంతు నిరామయాః

  (అందరూ ఆరోగ్యంగా ఉండాలి)

- సర్వే భద్రాణి పశ్యంతు

  (అందరికీ శుభాలు కలగాలి)

- మాకశ్చిత్ దుఃఖ భాగ్భవేత్

  (ఎవరికీ దుఃఖం కలుగరాదు)

## ఇస్లాం మతం

- దాన గుణం కలిగి ఉండాలి.
- ఇతరులకు సహాయం చేయాలి.
- సహనాన్ని పాటించాలి.
- మంచి ప్రవర్తన లేక నడవడిక కలిగి ఉండాలి.
- శాంతి, దయా గుణాలు ఉండాలి.
- అందరిపట్ల సహృదయతతో ఉండాలి.

## క్రైస్తవ మతం

- నీ పొరుగు వారిని ప్రేమించుము.
- సర్వభూతముల పట్ల దయ కలిగి ఉండుము.
- ఎవరినీ దూషించరాదు. బాధపెట్టరాదు.
- ఇతరులలో తప్పులు వెతికేముందు నీ తప్పులు నీవు తెలుసుకో.
- మంచి పనులు చేయండి.

## బౌద్ధ మతం

- సమస్త ప్రాణుల పట్ల దయ కలిగి ఉండాలి.
- అహింస గొప్ప ధర్మము
- జీవహింస చేయరాదు, అసత్యము పలుకరాదు, దొంగతనం చేయరాదు.
- ధర్మబద్ధంగా సంపాదించాలి.

## సిక్కు మతం

- అన్నింటి కంటే సత్యం గొప్పది. సత్యమార్గంలో నడవండి.
- నీ మనస్సును నిర్మలంగా ఉంచుకో.
- గురూపదేశాన్ని మననం చేస్తే శిష్యుడి అజ్ఞానం పోతుంది.
- అహంకారాన్ని విడనాడాలి.

### VI. (అ) ఆలోచించడం - ప్రతిస్పందించడం

1. పైన చెప్పిన వివిధ మతాలలోని సారాంశం ఏమిటి?
2. ఏ మతం కూడా ఇంకొకరిని ద్వేషించమని చెప్పలేదు కదా! మరి మతాల పేరుతో గొడవలు ఎందుకు జరుగుతున్నాయి? దానిని ఎలా అరికట్టవచ్చు?
3. అన్ని మతాలు మనిషిని ఏవిధంగా జీవించమని చెప్పాయి? దాని వల్ల మానవ సమాజం ఎలా ఉంటుందో చెప్పండి.
4. "మతం" అనేది ఎందుకున్నది? దానివల్ల మనుష్యులకు జరిగే ప్రయోజనం ఏమిటి?
5. ఇతర మతస్థులతో సామరస్యంగా ఉండడానికి మీరేమి చేస్తారు?

### (ఆ) ఆచరించడం - అనుభవాలు చెప్పడం

1. మీరు అనుసరిస్తున్న మతంలోని ధర్మాలను తెలుసుకొని, వాటిని పాటించండి. అవి పాటించేటప్పుడు మీకు కలిగిన భావనలను చెప్పండి.
2. ఇతర మతాలలోని గొప్ప విషయాలను గౌరవించండి. దాని వలన మీకు కలిగిన ఆలోచనలను, అనుభవాలను చెప్పండి.

## తెలుసుకోండి

మతం అనేది వ్యక్తిని సన్మార్గంవైపు నడిపించేది. అజ్ఞానపు చీకటి నుండి వెలుగులోనికి తెచ్చేది. ఒక నియమబద్ధమైన, ఉన్నతమైన జీవన విధానానికి మూలం మతం. సంఘంలో మనిషి ఇతరులతో మెలగవలసిన విధానం, సంఘజీవిగా అతడు నిర్వర్తించవలసిన బాధ్యతలు, మొదలైన వాటిని నిర్దేశించేది మతం.

అలాంటి మతం మానవుని శారీరక, మానసిక, ఆధ్యాత్మిక అభివృద్ధికై రకరకాల మార్గాలను సూచిస్తూ వివిధ మతాలుగా అవతరించింది. ఒక చెట్టుకు ఎన్నో కొమ్మలున్నట్లు సన్మార్గ వ్యక్తిత్వాన్ని నిర్దేశించడానికి అనేక బోధనలు చేస్తూ కాలక్రమంలో ఆయా మతాల పేరుతో స్థిరపడ్డాయి.

నిజానికి అన్ని మతాల మూలం మనిషిని మంచి నడవడితో తీర్చిదిద్ది ఆదర్శవంతులు తద్వార ఆదర్శ సమాజం నిలబెట్టడమే.

అయితే మతాలలోని మూలభావనలను అర్థం చేసుకోలేని అజ్ఞానులు కేవలం మతం పేరుతో చలామణి అవుతూ పరమత ద్వేషం నేర్పుతున్నారు. నిజానికి వారు తమ మతంలో చెప్పిన దానిని అర్థం చేసుకోలేని వారు. అటువంటి వారు తమ మతంపైన విశ్వాసం లేనివారే. మతంలోని విషయాలను అర్థం చేసుకున్నవారు సన్మార్గంలో నడుస్తుంటారు. ప్రేమ, కరుణ, జాలి, దానగుణం, త్యాగం వంటి లక్షణాలను కలిగి ఉంటారు.

అన్ని మతాల సారం ఒక్కటే అని గ్రహించిన ఆది శంకరులు, కబీరుదాస్, వివేకానందుల వంటివారు నిజంగా మతాన్ని అర్థం చేసుకున్నవారు కాబట్టే సత్పురుషులుగా ఇప్పటికీ కొనియాడబడుతున్నారు. వారు విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడానికి కారకులయ్యారు.

ఎవరైనా పరమతాన్ని ద్వేషించారంటే వారు తమ మతాన్ని అర్థం చేసుకోనివారు. వారు మతం మారణహోమాన్ని సృష్టించేదిగా తయారుచేస్తున్నారు. ఏ మతాన్ని తరచి చూసినా, మానవతా విలువలు, ఉత్తమ సాంఘిక జీవన విధానాలను బోధిస్తున్నాయి. వాటిని తెలుసుకొని పాటిస్తే నిజంగా దేశంలో, ప్రపంచంలో ఎక్కడా మత ఘర్షణలుండవు. అధర్మం, అసత్యం, అన్యాయం, రాక్షసత్వం అనేది ఉండవు. మనిషి వ్యక్తిత్వ నిర్మాణానికి మతం అవసరమే. దానిని అర్థం చేసుకొన్నవాడే సద్గుణ సంపన్నుడు, సన్మార్గశీలి.

**సూక్తి :** ఆచారమే ధర్మమునకు లక్షణము. సత్పురుషులకన్న ఆచారమే లక్షణము. సాధుపురుషుల నడవడికయే ఆచారమునకు ఒరవడి.

## మతం – సామాజిక హితం

*మతం అంటే 'కలిపేది' అని అర్థం. ఆత్మను పరమాత్మలో కలిపేది మతం. వ్యక్తుల మధ్య పరస్పర అవగాహనను పెంచి తమ ఆత్మస్వరూపాన్ని తెలుసుకునేందుకు మతం సహకరిస్తుంది. ఆలోచనలను, బుద్ధిని ప్రక్షాళన చేసుకొనే విధంగా మనిషిని పరమాత్మ లేదా భగవంతునివైపు మరల్చగలిగినదే నిజమైన మతం. మతం నైతిక, మానసిక, ఆధ్యాత్మిక సంస్కృతికి సంబంధించిన ఒక వ్యవస్థ. మానవాళిని మత ప్రాతిపదికన విభజించటం, వర్ణాలు ఏర్పరచటం లాంటివి విశ్వవ్యాప్తమైన సత్యాన్ని మర్చిపోయి ఒక విశ్వాసానికి పరిమితం కావడమే అవుతుంది. మన మార్గం సరైనదనే నమ్మకం కలిగి ఉండటంలో తప్పులేదు. కాని ఇతరుల ఆలోచనలను, భావాలను మన్నించగలిగే సహనం, విశాలత్వం ఉండాలి. అలా ఉండకపోతే నిరంకుశ ధోరణి చోటు చేసుకుంటే అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయి. లోకానికి ఎన్ని మతాలు అయినా అవసరమే. అయితే ఆ మతం అందరికీ సమ్మతమవుతూ ఆత్మసాక్షాత్కారానికి ఉపకరించాలి గాని, మూఢత్వానికి దారి తీయకూడదు.*

*సర్వమతాలు, మార్గాలు విశ్వవ్యాప్తమైన సత్యాన్ని తెలుసుకునేందుకు ఉపకరించే మార్గాలని భావిస్తే అప్పుడు మతం ప్రపంచ శాంతికి దోహదకారి అవుతుంది. అన్ని మతాలు విశ్వజనీన అంశాల ఆధారంగా ఏర్పడ్డవే. ఆద్యంతాలు లేని భగవంతుని, ఆధ్యాత్మిక సత్యాన్ని అన్ని మతాలూ ప్రవచిస్తాయి.*

*ఈ లోకంలో శాశ్వత సత్యాన్ని ప్రచారం చేయాల్సిన బాధ్యత మతానిదే. విశ్వజనీనమైన ఆధ్యాత్మికం పరమసత్యం మీద ఆధారపడి ఉంటుంది తప్ప, కొందరు వ్యక్తులకు చెందింది కాదు, మతాల మధ్య భేదాలను పక్కనపెట్టి, అందరిలో ఆత్మస్వరూపం ఒక్కటేననే సత్యాన్ని గ్రహించగలిగితే – మతం లక్ష్యం నెరవేరినట్లవుతుంది. మత విద్వేషాలు వెలిగక్కి ఈ లోకం ఎంత అజ్ఞానంతో ప్రవర్తించిందో చరిత్ర పుటలు తెలుపుతున్నాయి. మత విద్వేషాలతో ఒకరి మందిరాన్ని మరొకరు కూల్చుకున్నారు తప్ప పరమత సహనాన్ని కలిగి ఉండాలనే మార్పును మాత్రం పొందలేకపోయారు. బుద్ధిగా ప్రేమించుకోక యుద్ధాలెందుకు చేసుకుంటున్నారో తనకు అర్థంకావడం లేదన్నారు ఇస్మాయిల్ అనే కవి. చెరువులో నీరు ఒకటే రేవులు మాత్రం వేరు. దర్శనాలు వేరు దైవమొక్కటే అన్నారు రామకృష్ణ పరమహంస. 'ప్రపంచానికి కావాల్సింది మతం కాదు. జ్వలిస్తున్న ప్రేమ, నిస్స్వార్థ జీవన విధానం' అనేవారు స్వామి వివేకానంద. మతం పట్ల మహనీయుల హితాల్నీ, సందేశాల్నీ ఆచరణలోకి తేవాల్సిన అవసరం ఎంతో ఉందిప్పుడు. చీమలోను పరబ్రహ్మలోను ఒకే ఆత్మతత్వాన్ని చూసిన జాతి మనది.*

*సకల చరాచర ప్రపంచ సృజన ఒక్కటే. ఇన్ని కులాలు, మతాలు, సంఘాలు లోకానికి క్షేమాన్ని కలిగించాలేగాని, హాని కాదు. పరమాత్ముడు ఒక్కడైనా అనేక మూర్తిభేదాలను పూజించటం వల్ల ఇబ్బంది లేదు. అన్ని మతాలకు భగవంతుడొక్కడే. ఇది భారతీయ సంస్కృతికి కీలకమైంది. సమస్త మానవాళిని హారంలో మణుల్లా కలిపిఉంచే సూత్రంగా భగవంతుడు ఐక్యతను దివ్య సూత్రం. అందుకోసమే మతం. అదే మతం లక్ష్యం. సామాజిక హితం.*

**– డాక్టర్ తలారి వాసు**

# 18 ప్రజల భాగస్వామ్యం

**I. ప్రధాన విలువ** : ప్రజాస్వామ్యం విలువల పట్ల గౌరవం.

**II. ఉపవిలువ** : గ్రామ పరిపాలనలో ప్రజాస్వామ్య పాత్ర

**III. లక్ష్యాలు / ఆశించే ఫలితాలు** :

- గ్రామ పరిపాలనలో ప్రజల భాగస్వామ్యం పట్ల అవగాహన చేసుకుంటారు.
- గ్రామ అభివృద్ధిలో తమ కర్తవ్యాన్ని పాటిస్తారు.

**IV. ఉపోద్ఘాతం** : ప్రజాస్వామ్యం అంటే ప్రజల భాగస్వామ్యంతో ప్రజల కోసం పరిపాలన సాగించే విధానం. గ్రామాలు దేశాలకు పట్టుకొమ్మలు అన్నారు. గ్రామాభివృద్ధి సరిగ్గా జరిగినప్పుడే దేశం పటిష్టంగా ప్రగతిపథంలో నడుస్తుంది. గ్రామ పరిపాలన సజావుగా సాగాలంటే ప్రజల అవసరాలు తెలుసుకోవాలి, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలి, నిర్ణయాలు సమిష్టిగా తీసుకోవాలి, నిధులను పారదర్శకంగా ఖర్చుచేయాలి. అప్పుడే గ్రామాభివృద్ధి జరుగుతుంది. గ్రామపరిపాలనలో ప్రజాస్వామ్యం ఎలా ఉందో ఈ రెండు గ్రామాలను చూడండి.

**V.**

**గ్రామం - 1**

అది ఒక గ్రామం. ఆ గ్రామానికి వెళ్ళాలంటే రోడ్లన్నీ గతుకులు, పెద్ద పెద్ద గుంటలు. రాత్రి అయితే భయం. వీధి దీపాలు ఉండవు. నీళ్ళు రెండు మూడు రోజులకు ఒకసారి వస్తుంది. ఒక్కోసారి వాళ్ళు పక్క గ్రామానికి వెళ్ళి నీళ్ళు తెచ్చుకుంటారు. గ్రామానికి వచ్చే నిధులు ఎన్ని వస్తాయో గ్రామస్థులకు తెలీదు. సర్పంచి ఏమి ఖర్చుపెడుతున్నాడో ఎవరికీ తెలీదు. ఆ గ్రామప్రజలకి సర్పంచిని అడగాలంటే భయం. సర్పంచి మాటకు తిరుగులేదు. సర్పంచి ఏమి చెబితే అదే చెల్లుబాటు అవుతుంది. దీంతో గ్రామంలో అభివృద్ధి అనేదే కనబడలేదు. అక్కడక్కడ వేసిన రెండు మూడు రోడ్లు అవి కూడా వార్డు మెంబర్లు నివసిస్తున్న వీధులలో మాత్రమే సిమెంట్ రోడ్లు ఉన్నాయి. గ్రామసభలు జరిగినా సర్పంచి

వార్డు మెంబర్లు కలిసి నిర్ణయాలు తీసుకుంటారే తప్ప ప్రజల భాగస్వామ్యం ఉండదు. ప్రజలకు ప్రశ్నించాలన్నా అభిప్రాయాలు చెప్పాలన్నా అవకాశమే ఉండదు.

### గ్రామం -2

ఈ గ్రామం కూడా మారుమూలకున్న పల్లెటూరు. ఆ గ్రామంలో ఎక్కడ చూసినా చెట్లు, శుభ్రమైన రోడ్లు అన్ని వసతులు ఉన్నాయి. ఆ గ్రామ సర్పంచి ఎన్నికైన వెంటనే గ్రామసభను నిర్వహించాడు. వార్డు మెంబర్లతో బాటు గ్రామస్థులందరినీ పిలిచాడు. గ్రామంలో ఏ ఏ సమస్యలున్నాయో అడిగాడు. గ్రామాభివృద్ధికై గ్రామానికి వచ్చిన నిధుల గురించి చెప్పాడు. దేనికి ఎంత ఖర్చు పెట్టాలో తీర్మానం చేశారు. ఎవరెవరు ఏ ఏ బాధ్యతలు తీసుకోవాలో నిర్ణయించారు. పనులను అనుకున్న సమయానికి పూర్తి చేశారు. ఆ గ్రామంలో ప్రజలు మంచి నీటికి గాని, ఇతర సౌకర్యాలకు కాని ఎటువంటీ కొరత లేకుండా బతుకుతున్నారు. అక్కడ గ్రామంలో ఏం జరిగినా ప్రజలకు తెలుస్తుంది. ప్రజలు కూడా అన్నింటిలో భాగస్వామ్యం అవుతారు. ఆ గ్రామం ఉత్తమగ్రామంగా అవార్డు కూడా పొందింది.

## VI. (అ) ఆలోచించడం - ప్రతిస్పందించడం

1. ఏ గ్రామంలో ప్రజాస్వామ్యం ఉంది. ప్రజాస్వామ్యం ఉన్నదని ఎలా చెబుతావు?
2. మీ గ్రామంలో గ్రామపరిపాలన ఎలా ఉంటుంది?
3. మన గ్రామంలోని సమస్యల గురించి మనమేం చేయాలి?
4. గ్రామ పరిపాలనలో ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజలు పాల్గొనకపోతే ఏం జరుగుతుంది?
5. గ్రామ పంచాయితికి ఎటువంటి వారిని ఎన్నుకోవాలి?

## (ఆ) ఆచరించడం - అనుభవాలు చెప్పడం

1. మీ గ్రామంలో ఏ ఏ అభివృద్ధి పనులు జరిగాయో పరిశీలించండి. ఎక్కడెక్కడ సమస్యలున్నాయో తెలుసుకోండి. సమస్యలపై ప్రాతినిధ్యపు లేఖ రాసి సర్పంచికి సమర్పించండి.
2. కింది అంశాలను చదవండి. మీరు చేసేవాటికి '✓' పెట్టండి. చేయని వాటికి '✗' పెట్టండి.
   1) మా ఊరి సమస్యల గురించి తెలుసుకుంటాం. (  )
   2) మేము గుర్తించిన సమస్యల గురించి పెద్దవాళ్ళతో మాట్లాడుతాం. (  )
   3) మేము చిన్న పిల్లలం మాకెందుకివన్నీ అని అనుకుంటాం. (  )
   4) రోడ్డుపై చెత్త ఉన్నా, నీళ్ళు రాకపోయినా వెంటనే పంచాయితీ వారికి చెప్తాం. (  )

5) సర్పంచిని కలిసి మాట్లాడుతాం. పరిస్థితులు తెలియజేస్తాం. ( )

6) ఒక్కరమే కాకుండా అందరు కలిసి సమస్యను పరిష్కరించేలా చూస్తాం. ( )

7) ఒకసారి వెళ్ళి అడిగి చూస్తాం. చేస్తే చేశారు. లేకపోతే లేదని వదిలేస్తాం. ( )

8) ఊరి బాగుకోసం ఎవరెవరు ఏమి చేయాలో ఆలోచిస్తాం. ( )

9) మీటింగులు జరిగేటప్పుడు మేమూ వెళ్తాం. ఏమి చర్చిస్తున్నారో గమనిస్తాం. ( )

10) చేస్తామన్నపని చేయలేకపోతే ఎవరినైనా ప్రశ్నిస్తాం, నిలదీస్తాం. ( )

3. మీ ఊరిలో ఏ ఏ సమస్యలున్నాయో గమనించండి. రాయండి. మీరు ఏ మార్పులు కోరుకుంటున్నారో రాయండి.

| మీ ఊరి సమస్యలు | మీరు కోరే మార్పులు |
|---|---|
| | |

## తెలుసుకోండి

### గ్రామ పరిపాలనలో ప్రజాస్వామ్యం పాత్ర తెలుసుకోండి

ప్రజాస్వామ్యం అనే పదానికి మూలాలు డెమోస్ మరియు క్రేషియా అనే గ్రీకు పదాలు డెమోస్ అంటే ప్రజలు క్రేషియా అంటే పరిపాలన. అంటే ప్రజా పరిపాలన అని అర్థం.

అబ్రహాంలింకన్ నిర్వచనం ప్రకారం "ప్రజల చేత, ప్రజల కొరకు నిర్వహించబడు ప్రజల యొక్క ప్రభుత్వ వ్యవస్థ"ను ప్రజాస్వామ్యమని వ్యవహరించారు.

ఏ సమాజంలోనైతే ప్రజలు సంఘటితమై స్వేచ్ఛగా, సమాన హక్కులతో ఉమ్మడి నిర్ణయాలు తీసుకొనే స్వేచ్ఛ కలిగి ఉంటారో ఆ సమాజాన్ని ప్రజాస్వామ్య సమాజంగా భావించవచ్చు. రాజకీయ ధోరణిననుసరించి ప్రజలకు జవాబుదారీ

వహించే పరిపాలనను నిర్వహించడానికి ప్రతినిధులను ఎంపిక చేయు వ్యవస్థ కల్గి ఉండుట ప్రజాస్వామ్యము ముఖ్య లక్షణం. ఈ ఎంపిక ప్రక్రియలో వయోజనులందరికీ ఓటువేయడానికి, ఎన్నికలలో పోటీ చేయడానికీ హక్కు ఉంటుంది. అంతేగాక పౌర, న్యాయ హక్కులన్నీ అమలుచేయబడతాయనే హామీ కూడా ప్రజాస్వామ్యంలో లభిస్తుంది.

**సమన్యాయ పాలన**

ప్రజాస్వామ్యంలలో పౌరులందరూ సమానులే జన్మవల్లగాని, సంపదవల్లగానీ ప్రత్యేక హక్కులను శాసనాలు అనుమతించవు. ప్రజలందరికీ రాజకీయ ప్రక్రియలో పాల్గొనడానికి హక్కు ఉంది. ప్రజాస్వామ్యంలో చట్టాలు అందరికీ సమానంగా వర్తిస్తాయి అన్నమాట. దీనినే "సమన్యాయపాలన" అంటున్నారు. ఇంతేగాక ప్రజాస్వామ్యంలో వ్యక్తులకన్నా చట్టాలదే ఆధిక్యత.

**భిన్నాభిప్రాయ ప్రాముఖ్యత**

గ్రామ పరిపాలనలో స్వేచ్ఛగా చర్చల్లో పాల్గొనే హక్కు కలిగి ఉండుటయే గ్రామపరిపాలనలో ప్రజాస్వామ్యం యొక్క ముఖ్య లక్షణం. చర్చల్లో భిన్నాభిప్రాయాలకు తగిన గుర్తింపు లభించకపోతే ప్రజాస్వామ్యంలో తన విధులను నిర్వర్తించలేదు. అందువల్ల భిన్నాభిప్రాయాలను గుర్తించడం ప్రాతిపదికగా ప్రజాస్వామ్యం పని చేస్తుంది. భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేయడం అంటే అధికారంలోగల అత్యధిక సంఖ్యాకుల పార్టీ అభిప్రాయాలు విభేదించడం అన్నమాట. అధికారంలో ఉన్నవారికి, భిన్నాభిప్రాయం వ్యక్తం చేసినవారి నోరునొక్కే హక్కులేదు. ఐతే అల్పసంఖ్యాకులు తాము భిన్నాభిప్రాయం వ్యక్తీకరించినా, అత్యధిక సంఖ్యాకుల అభిప్రాయాలను మన్నించాల్సి ఉంటుంది. అత్యధిక సంఖ్యాకులకు సంబంధించిన ఈ సూత్రాన్ని ప్రజాస్వామ్యంలో తప్పని సరిగా పాటించాలి. వీరు తమ అభిప్రాయాలను అనుసరించమని అల్ప సంఖ్యాకులను నిర్బంధించకూడదు. ఇంతేకాక వీరికి అల్ప సంఖ్యాకుల అభిప్రాయాలను ఉపేక్షించే అధికారం లేదు. మారుతున్న పరిస్థితుల్లో కొన్ని పర్యాయాలు అల్పసంఖ్యాకుల కూడా అత్యధిక సంఖ్యాకులు అయ్యే అవకాశముంది. ఈ విధంగా వ్యక్తులు లేదా అల్ప సంఖ్యాకులు స్వేచ్ఛగా తమ తమ అభిప్రాయాలను వ్యక్తీకరించే స్వేచ్ఛ ప్రజాస్వామ్యం ప్రసాదించింది.

**జాగరూకులైన ప్రజావళి ఆవశ్యకత**

ప్రజాస్వామ్యం విజయవంతంగా అమలు పరచడానికి జాగరూకులైన ప్రజావళి కూడా అవసరమే. చాలా పర్యాయాలు ప్రజాస్వామ్య ప్రభుత్వాలు విస్తృతమైన

**ప్రజాభిప్రాయం పాత్ర**

ఐదేళ్ళకొకసారి తన ప్రతినిధులను ఎంపిక చేసుకోవడానికి ఓటు హక్కును వినియోగించుకొన్నంత మాత్రాన్నే పౌరుని బాధ్యత తీరిపోదు. పౌరులు తమ ప్రతినిధుల కార్యకలాపాలను నిరంతరం సమీక్షిస్తూ సరిచేయాల్సిన అవసరం ఉంది. ప్రజాస్వామ్యంలో ప్రజాభిప్రాయానికి ప్రముఖ పాత్ర ఉంది. అధికారులకు, ప్రజాప్రతినిధులకు మహజర్లు

(memoranda) సమర్పించుట ద్వారా, ఊరేగింపులు నిర్వహించుట ద్వారా, సమావేశాలు ఏర్పాటుచేయుట ద్వారా, పౌరులు తమ అభిప్రాయాలను వ్యక్తీకరించవచ్చు. ఇంతేగాక ప్రజాభిప్రాయ వ్యక్తీకరణకు మరెన్నో మార్గాలున్నాయి.

**నాయకత్వ స్వభావం**

ప్రజాస్వామ్యంలో సహనశీలత, విజ్ఞాన సంపదగల బాధ్యతాయుత నాయకత్వం అవసరం. ఆధునిక కాలంలో అభివృద్ధి చెందుతున్న ప్రజాస్వామ్య సమాజంలో నాయకుల పాత్ర ప్రత్యేక ప్రాధాన్యత కల్గి ఉంది. అక్కడక్కడా కొన్ని ప్రదేశాల్లో నాయకులు ప్రజాస్వామ్య భావనలనూ, సంస్థలనూ, విలువలనూ బలహీన పరచ ప్రయత్నించారు. అందువల్ల ప్రజలందరికీ నాయకత్వం వహించే సక్రమ నడవడిక గలవారిని జాగ్రత్తగా నాయకులుగా ఎంపిక చేయాల్సిన అవసరం ఉంది.

**సామాజిక, ఆర్థిక సమానత్వం**

అత్యున్నత స్థాయిలోని సామాజిక, ఆర్థిక సమానత్వం కూడా నిజమైన ప్రజాస్వామ్యానికి అవసరం. కొంత మంది ధనవంతులు చాలా మంది నిరుపేదలుగా విభజింపబడిన జాతి ప్రజాస్వామ్యానికి తగినది కాదు. ఈ లక్షణం రాజకీయ క్షేత్రంలో కూడా ధనవంతుల పెత్తనానికి దారి తీస్తుంది. ధనవంతుల పెత్తనానికి లోబడిన సమాజంలో రాజకీయ స్వేచ్ఛ, రాజకీయ సమానత్వాలు పూర్తి అర్థాన్నీయవు. అంటే ఏ సమాజంలో సామాజిక, ఆర్థిక వివక్షలు తక్కువ స్థాయిలో ఉంటాయో ఆ సమాజంలోనే ప్రజాస్వామ్యం వికాసం పొందుతుంది. ప్రజాస్వామ్య ప్రధాన లక్షణాలైన ఎన్నికలు, రాజకీయ పక్షాల గురించి కింద వివరించబడింది.

**ఎన్నికల ప్రక్రియ**

ఆధునిక ప్రజాస్వామ్యం ప్రాతినిధ్య భావనపై ఆధారపడి ఉంది. విశాలమైన భూభాగం, అత్యధిక జనాభాగల దేశాల్లో ప్రజాప్రాతినిధ్య భావనలు లేకుండా ప్రజాస్వామ్య వ్యవస్థను నిర్వహించడం కష్టతరం. ప్రజలంతా సమావేశం కావడం, చర్చించడం, గ్రామ పంచాయితీ సభ్యులంతా కలసి సమస్యలపై చర్చిస్తూ ప్రజల అవసరాలను తీరుస్తూ పంచాయితీ నిర్వహణా కార్యక్రమాలను చేపడతారు.

**గ్రామపరిపాలన – ప్రజాస్వామ్య విలువలు**

గ్రామ స్థాయిలో పరిపాలనా బాధ్యతలు గ్రామపంచాయితీ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహిస్తారు. వార్డుమెంబర్‌లు వారి వారి వార్డుల నిర్వహణా కార్యక్రమాలను చూస్తారు. గ్రామ సర్పంచ్ గ్రామంలోని నిర్వహణా కార్యక్రమాలను చూస్తాడు. గ్రామంలోని మురుగునీటి పారుదల, విద్యుత్తు, ఇండ్ల నిర్మాణాలు, మంచినీటి వ్యవస్థ మొదలైన ప్రజల కనీస అవసరాలను గురించి గ్రామ పంచాయితీ సభ్యులు సమావేశాలు నిర్వహించి ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ వారి అవసరాలను తీరుస్తారు. ఈ విధంగా వార్డు మెంబర్లు, ఉపసర్పంచ్, సర్పంచ్ మొదలైన వారినందరినీ ఎన్నికల ప్రక్రియ ద్వారా ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజలు ఎన్నుకుంటారు.

కాబట్టి గ్రామ పరిపాలనలో ప్రజాస్వామ్య వ్యవస్థ చాలా కీలకమైంది.

ప్రజాస్వామ్యంలో ముఖ్యంగా ప్రజల అభిప్రాయాలకు విలువ ఇవ్వడం, ప్రజాసమస్యల గురించి చర్చించడం. ప్రాధాన్యతా క్రమంలో సమస్యలను పరిష్కరించడం ముఖ్యమైనవి. ఇందుకోసం గ్రామస్థాయిలో ఈ కింది విధంగా ప్రజాస్వామ్యయుతంగా చర్చించి చర్యలు చేపట్టాలి. అవి –

- కనీసం రెండు మూడు నెలలకొకసారి గ్రామంలోని సమస్యల గురించి చర్చించాలి. ప్రజాభిప్రాయాలను తెలుసుకోవాలి.
- సమస్యలను ప్రాధాన్యతాక్రమంలో జాబితా రూపొందించాలి.
- ప్రభుత్వం నుంచి వచ్చిన నిధుల వివరాలను ప్రజలకు తెలియచేయాలి.
- ప్రాధాన్యతాక్రమంలో సమస్యలను పరిష్కరించడానికి ప్రజలతో చర్చించి నిధుల ఖర్చు విధివిధానాలను రూపొందించాలి.
- ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి పనులను నిర్వహించాలి.
- అవసరమైతే ప్రజల నుండి ఆర్థిక సహకారాన్ని శ్రమదానాన్ని వస్తుసేవలను పొందాలి.
- పనుల్లోని నాణ్యతను పరిశీలించడానికి పర్యవేక్షక కమిటీలను ఏర్పరచుకొని ప్రజల భాగస్వామ్యం ద్వారా అభివృద్ధి కార్యక్రమాలను నాణ్యంగా నిర్వహించాలి.
- గ్రామంలోని వనరులను గుర్తించి ఆర్థికాభివృద్ధికోసం స్వయం ఉపాధి మార్గాలను అన్వేషించాలి.
- గ్రామాభివృద్ధికి సంబంధించిన కనీస లక్ష్యాలను నిర్ధారించుకొని వాటి అభివృద్ధికి పాటుపడాలి.

  ఉదా : గ్రామంలోని బడిఈడు పిల్లలందరూ బడికి వెళ్ళేలా చూడడము, గ్రామంలో అన్ని ప్రభుత్వ సంస్థలు సక్రమంగా పనిచేసి ప్రజలకు సేవలందించేలా చూడడం.
- గ్రామంలోని వారందరికీ ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి లబ్ధిపొందేలా చూడడము. అవినీతి రహితంగా లబ్ధిదారులకు సేవలందేలా చూడడం గ్రామంలోని ప్రతి ఇంటిలో మరుగుదొడ్డి సౌకర్యం ఉండేలా చూడడం. ఆరుబయట మల, మూత్ర విసర్జనలు జరుగకుండా చూడడం. గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించడం. ప్లాస్టిక్ నిషేధాన్ని అమలుపరచడం, గ్రామంలో మొక్కలునాటే కార్యక్రమం చేపట్టి అవి సక్రమంగా పెరిగేలా (Greencarpet) చూడడం. వర్షపునీరు వృథా కాకుండా ఇంకుడు గుంటలను ఏర్పరచి భూగర్భజలమట్టం పెరిగేలా చర్యలు చేపట్టడం మొదలగునవి.
- చేపట్టాల్సిన కార్యక్రమాలు : గ్రామంలోని అభివృద్ధి కార్యక్రమాల వివరాలను, ఆదాయ వివరాలను పారదర్శకంగా గ్రామ కూడళ్ళలో గోడలపైన రాయించి పెట్టడం.

పైన తెల్పిన విధంగా ప్రజాస్వామ్యయుతంగా అనగా ప్రజలందరూ గ్రామ అభివృద్ధిలో భాగస్వాములయ్యేలా గ్రామ పరిపాలన ఉండాలి. గ్రామాలు అభివృద్ధి చెందడం అంటే మహాత్మాగారన్నట్లు స్వయం పోషకత్వాన్ని కలిగి

యుండి స్వయం సమృద్ధితో విరాజిల్లాలి. అందరి అభిప్రాయాలను గౌరవించడమూ చర్చల ద్వారా అవసరాలను గుర్తించడమూ ప్రజల భాగస్వామ్యంతో సమస్యలను పరిష్కరించుకోవడమూ సమిష్టిగా నిర్ణయాలు గైకొనడమూ వాటికి బద్ధులై వ్యవహరించడము వంటివి గ్రామ పరిపాలనలో ప్రజాస్వామ్యయుతమైన అంశాలుగా పేర్కొనవచ్చు. ప్రజాస్వామ్యమనేది కేవలం ఎన్నికలకు సంబంధించిన అంశం కాదు. ప్రజాస్వామ్యమనేది ఒక జీవన విధానము, ప్రతి ఒక్కరిలో కూడా ఇందుకు సంబంధించిన విలువలు పెంపొందాలి. అనగా సహనంతో వినడము, ఎదుటి వారి అభిప్రాయాలను గౌరవించడము, తన అభిప్రాయాలను నిర్భయంగా వ్యక్తపరచడము, విచక్షణతో, విశ్లేషణతో తగిన నిర్ణయాలను గైకొనడము, సమిష్టి నిర్ణయాలను గౌరవించడము వంటి మొదలగు విలువలను ప్రతి ఒక్కరు కలిగి ఉండాలి.

ఇలాంటి పైన తెలిపిన విధంగా ప్రజాస్వామ్య విలువలను కల్గియున్న వ్యక్తులు ఉన్నచోట ఉద్రేకాలు, ఉద్వేగాలు చోటుచేసుకోవు. కుటుంబంలోని సభ్యులందరూ కూడా ప్రజాస్వామ్య విలువలతో కూడిన విలువలను అలవరచుకుంటే ఆ కుటుంబము ఆదర్శ కుటుంబంగా విరాజిల్లుతుంది. ఆ కుంటుంబంలో సుఖశాంతులు వెల్లివిరుస్తాయి.

**సూక్తి :**

1. **జీవితంలో ప్రతి పనికి ఒక సమయమంటూ ఉంటుంది. ఆ సమయంలో ఆపని సక్రమంగా చేయాలి. అప్పుడే మనిషికి ప్రశాంత జీవనం లభిస్తుంది.**
2. **ప్రజలపనియే పాలకుని పని; ప్రజల సుఖమే పాలకుని సుఖము; ప్రజల ప్రియమే పాలకుని ప్రియము; ప్రజల హితము పాలకుని హితము.**

# అనుబంధాలు

1. శ్లోకాలు
2. పద్యాలు
3. పాటలు, గేయాలు
4. కథలు
5. స్ఫూర్తిదాతలు

# 1. శ్లోకాలు

1) నాస్తి విద్యాసమం చక్షుః నాస్తి సత్య సమం తపః ।
నాస్తి రాగ సమం దుఃఖం, నాస్తి త్యాగసమం సుఖమ్ ॥

**భావం :** విద్యను బోలిన నేత్రమును, సత్యమును పోలిన తపస్సు, కోరిక వంటి దుఃఖకరమైనది, త్యాగమును పోలిన సుఖము లోకమున వేరే లేవు.

2) శీలం శౌర్యమనాలస్యం, పాండిత్యం మిత్ర సంగ్రహః ।
అచోరహరణీయాని పంచైతాన్యక్షయో నిధిః ॥

**భావం :** శీలము, శౌర్యము, చురుకుతనము, పాండిత్యము, స్నేహశీలత ఈ ఐదు దొంగల పాలుగాని అక్షయనిధులు.

3) అహింసా పరమో ధర్మః తథాఽహింసా పరం తపః ।
అహింసా పరమం జ్ఞానం, అహింసా పరమార్జవమ్ ॥

**భావం :** అహింసయే పరమధర్మము. అదియే గొప్ప తపస్సు, అహింసయే జ్ఞానము. ఋజుత్వము అవుతుంది. (అనగా మానవులు తమ జీవితములో ఏదో ఒక ఉత్తమ గుణమునే ప్రధానముగా చేసికొని, దానిని ఉపాసించిన ఇతరసుగుణములన్నీ తప్పక పట్టుపడునని అర్థం.)

4) చింతనీయా హి విపదా, మాదావేవ ప్రతిక్రియా ।
న యుక్తం కూపఖననం, సందీప్తే వహ్నినా గృహే ॥

**భావం :** ఆపదలకు ప్రతిక్రియ ముందుగనే ఆలోచించి ఉంచుకొనవలెను. అంతేగాని ఇల్లు తగుల బడుతూంటే నూతిని త్రవ్వుటకు యత్నించుట బుద్ధిమంతుల లక్షణము గాదు.

5) ధర్మో జీవ దయాతుల్యో, నక్వాపి జగతీతలే ।
తస్మాత్ సర్వ ప్రయత్నేన కార్యా జీవదయా నృభిః ॥

**భావం :** భూతదయను పోలిన ధర్మము ఇంకొకటి ఈ లోకములో లేదు. అందుచేత మానవులు సర్వదా యత్నించి, సర్వ జీవ కారుణ్య భావముతో ప్రవర్తించవలెను.

6) వృత్తం యత్నేన సంరక్ష్యం, విత్తమేతి చ యాతి చ ।
అక్షీణో విత్తతః క్షీణో, వృత్త తస్తు హతో హతః ॥

**భావం :** మానవులు తమ నడవడిని యత్నముతో చక్కబరచుకోవలెను. ధనము ప్రధానము గాదు. అది వస్తూ పోతూ ఉంటుంది. ధనహీనుడుగాడు, కాని, చరిత్రహీనుడు యెన్నటికిని హీనుడే సుమా!

7) దీపనం వృష్యమాయుష్యం, స్నానమోజో బలప్రదమ్ ।
కండూమల శ్రమ స్వేద, తంద్రాతృడ్దాహపాసుత్ ॥

**భావం :** స్నానము వలన జఠరాగ్ని దీపనము, ధాతుపుష్టి, దీర్ఘాయువు, తేజస్సు, బలముకలుగును. దురదలు, మురికి, బడలిక, చెమట, సోమరితనము, దప్పిక, పాపచింతలు నశించును.

8) అనాత్మ వంతః పశువత్ భుంజతే యేఽ ప్రమాణత ।
రోగానీ కన్యతే మూలమ్, అజీర్ణం ప్రాప్నువంతి హి ॥

**భావం :** ఎవరైతే మితమనేది లేకుండా యెల్లప్పుడూ యేదో ఒకటి నములుతూ ఉంటారో వారు అజీర్ణ వ్యాధికి గురి అవుతారు. అజీర్ణమే సర్వరోగములకును మూలము.

9) అభ్యాసానుసరీ విద్యా, బుద్ధిః కర్మాను సారిణీ ।
ఉద్యోగానుసరీ లక్ష్మీః ఫలం భాగ్యాను సారిణీ ॥

**భావం :** అభ్యాసము వల్ల విద్యలు, కర్మను బట్టి బుద్ధి, యత్నమునను సరించి ధనము. భాగ్యము వలన ఫలితము లోకమున కలుగుతున్నాయి.

10) జ్ఞాతిభిర్వంచ్యతేనైవ, చోరేణాపిన నీయతే ।
దానేన న క్షయం యాతి, విద్యారత్నం మహాధనమ్ ॥

**భావం :** జ్ఞానము పెన్నిధి వంటిది. అది జ్ఞాతులు వంచించి తీసుకోడానికి వీలులేనిది, దొంగలు అపహరించ జాలనిది. దానముచేసినా తరుగులేనిది, అది ఒక అనర్ఘరత్నము.

# 2. పద్యాలు

1) విద్య నిగూఢ గుప్తమగు విత్తము, రూపము పూరుషాళికిన్
విద్య యశస్సు, భోగకరి, విద్యగురుండు, విదేశబంధుడున్
విద్య విశిష్ట దైవతము, విద్యకుసాటి ధనంబులేదిలన్,
విద్య నృపాల పూజితము విద్య నెరుంగని వారు మర్త్యులే!

*– ఏనుగు లక్ష్మణకవి*

2) అ ఆ లు కనిపెట్టి అంకెలు నేర్పించి
విద్యకు తొలిమెట్టు పెట్టె నెవడు?
చక్రభ్రమణమునే శకట ప్రయాణమ్ము
సాధించి పెట్టిన శాస్త్రి ఎవడు?
అడవుల పడగొట్టి పుడమిని దున్నిన
ప్రథితుడైన మొదటి రైతు ఎవడు?
అగ్గిని రగిలించి అన్నము నుడికించు
పద్ధతి నేర్పిన ప్రాజ్ఞుడెవడు?

ఎందరెందరో కృషిచేత ఎదిగి ఎదిగి
విశ్వ విజ్ఞాన యాత్రకు విజయ మబ్బె
త్యాగ భావ సేవా పరతంత్రులయ్యు
వాసికెక్కని వారికి వందనములు

*– ఏరాసు అయ్యపురెడ్డి*

3) ఒక్క సంగీతమేదో పాడునట్లు భా
షించునప్పుడు వినిపించు భాష
విస్పష్టముగ నెల్ల విన్పించునట్లు స్ప
ష్టోచ్ఛారణంబున నొనరు భాష
రసభావముల సమర్పణ శక్తి యందున
సమర భాషకు దీటైన తెలుగుభాష
జీవులలో నున్న చేవ యంతయు చమ
త్కృతి పల్కులన్ సమర్పించు భాష

భాషలొక పది తెలిసిన ప్రభువు చూచి
భాషయన నిద్దియని చెప్పబడిన భాష
తనర ఛందస్సులోని యందమ్ము నడక
తీర్చి చూపించి నట్టిది తెలుగుభాష.

*– విశ్వనాథ సత్యనారాయణ*

4) ఎవ్వరేమిచ్చినా ఎంగిలి చేయక
కొంగు చాటున దెచ్చి కుడువబెట్టి
జ్వరము నాకున్నచో జాగరణము జేసి
పత్యంబు నీవుండి స్వస్థపరచి
గాయంబు నాకైన కన్నీరు నువుగార్చి
కంటికి రెప్పవై వెంట నుండి
పస్తులు నీవుండి పాలను నాకిచ్చి
దీర్ఘాయురస్తుని దీవెనిచ్చి

నాల్గుమాటలు నేర్పించి నడత నేర్పి
తోలు బొమ్మను సంఘ జీవాలయమున
మనిషిగా నిల్పినట్టి నీమమత కేను
వందనము జేతునమ్మ నీ పదములంటి

*– కోట పురుషోత్తం*

## కళలు

5) చిన్న చీమలు నోట మన్నును గొని తెచ్చి
కట్టిన అందాల పుట్ట చూడు!
మిలమిల మిరిసెడు జిలుగు దారములతో
అల్లిన సాలీని ఇల్లు చూడు!
గరిక పోచలు తెచ్చి తరు శాఖకు తగల్చి
గిజిగాడు కట్టిన గృహము చూడు
తేనెటీగలు రూపుదిద్ది వృక్షాగ్రాన
పెట్టిన తెనియ పట్టు చూడు!

చీమ వంటి మూగ జీవులె తమ నిత్య
జీవనమున కళలు సృష్టిచేయ
మహిత బుద్ధిశాలి – మానవుడుండేరీతి
కళలు లేక బ్రతుకు గడప గలడు!

*– ఉందేల మాలకొండారెడ్డి*

## గురువు

6) జాతికి కడుగొప్ప ఖ్యాతి నందించెడు
వ్యక్తుల దీర్చెడు శక్తి గురువు
మట్టిమనుషులందు దిట్ట తనంబును
స్థాపించ గల్గిన శక్తి గురువు
బరువుగా మారిన బ్రతుకుల యందున
సంతోషమును నిల్పు శక్తి గురువు
ఉరిత్రాడు నవ్వెడు తరుణంబు నందున
స్థైర్యము నిచ్చెడి శక్తి గురువు

నల్లజాతికి అందాల నవ్వు పులిమి
ఎద ఎడారులలో జీవ నదులు నింపి
మోడు పూయించి పండించి బీడులెల్ల
జవము సత్వము నింపెడి శక్తి గురువు

*– ఆముదాల మురళి*

7) ఒక్కడైనను మిత్రుడుండాలి లేనిచో
పెద్ద జగజ్జెట్టి పేదవాడె
నిజమైన చెలిమికి నిండు మనసు నుండు
ఆదుకొనెడివాడె యసలు మిన్న
నిస్వార్ధపరునికి నిండాదరణ నుండు
చెలిమి కంటెను మించిన కలిమిలేదు
ఎంత బలంబున్న నితరులతో పగ
పెట్టుకో కూడదు పెంచవలదు

వైద్యుడున్నాడు నాకేమి భయమని యెవ
రైన గరళాన్ని మింగరాదు మీరి
మంచి మైత్రి భావన నుండ మాన్యుడగును
నిత్యసత్యంబు లివినేడు నిక్కమార్య

*– సమ్మెట గోపాలకృష్ణ*

8) నీధర్మమును నీవు నెరవేర్చుకొనుచును
దిద్దుకొనుటలోనె నొద్దికుండు
నియమ పూర్వకముగా నిండు మనస్సుతో
సరియగు సమయాన సహకరించు

విధుల నిర్వహణను విధిగాను చేయుచు
బ్రతుకు భరోసాకు వితరణివ్వు
జీవితం సుఖముగా చిరుదివ్వెలా వెల్గ
బ్రతుకులో బంగారు పండుతుంది

అదును పదును జూచియు రైతరకనుదున్ను
సంఘజీవిగ యజమాని, సాటిమనిషి
కష్టసుఖముల గమనించి కావవలయు
నిత్య సత్యంబులవి నేడు నిక్క మార్య

9) అన్నదానము గొప్పదనవచ్చునే గాని
అన్నంబు జాములో నఱిగి పోవు
వస్త్ర దానము గూడ భవ్య దానమె కాని
వస్త్ర మేడాదిలో పాతదగును
గృహ దానమొకటి యుత్కృష్టదానమెకాని
కొంప కొన్నేండ్లలో కూలిపోవు
భూమి దానము మహా పుణ్యదానమె కాని
భూమి యన్యుల జేరిపోవచ్చు

అరిగిపోక, ఇంచుకయేని చిఱిగిపోక
కూలిపోవక, యన్యుల పాలుగాక
నిత్యమయి, వినిర్మలమయి, నిశ్చలమయి
యొప్పు చుండు విద్యాదానమొకటి జగతి

*– చిలకమర్తి లక్ష్మీనరసింహం*

10) త్యాగాన్ని డబ్బుతో త్రాసులో తూచలేము
ప్రాణాన్ని కొనలేము పసిడితోను
వైడూర్యములు మణుల్ వజ్రములును కోట్లు
కన్నీటి చుక్కకు కావు సమము
దేశ రక్షణకయి దీక్షతో సైనికు
లమరులై లెందరో యంకితముగ
సరిహద్దున జవాను, సాగుచేసేరైతు
కంటి పాపలనుచు కావవలయు

త్యాగధనులైన వీరుల తలచుకుంటు
ప్రాణమాన ధనముల ఫణముపెట్టె
ఎందరో మహాత్ములకునూ వందనములు
నిత్యసత్యంబు లివి నేడు నిక్కమార్య

*– సమ్మెట గోపాల కృష్ణ*

# 3. పాటలు / గేయాలు

## 1. కోయిలా – కోయిలా

కోయిలా కోయిలా కోయిలా – కొండకోన తిరిగేటి కోయిలా
క్రొత్త పాటపాడాలీ ఈ వేళా – సరిక్రొత్త కబురు చెప్పి నీవు రావాలా

కొండ కొండపైన కురిసేటి వాననీరు
ఉరికి ఉరికి ఉప్పుటేరు చేరకుండా ॥ కొండ ॥
కొండ చుట్టుకందకాలు తప్పుకోండనీ
నేల గుండెలోనే నీళ్ళన్నీ ఉండగలమనీ

మంచిమాట చెప్పిరావె కోయిలా
మంచి రోజు లొస్తాయి మనకు చాలా ॥ కోయిలా ॥

వాన చుక్కరాలలేదంటే ఎలా ఎలా
నరికేశాంగద అడివంతా చాలా చాలా ॥ వాన ॥
నికనైనా ఆ తప్పు చేయొద్దనీ
అడవంటే అందరికీ అమ్మేననీ

మంచిమాట చెప్పిరావె కోయిలా
మంచి రోజు లొస్తాయి మనకు చాలా ॥ కోయిలా ॥

## 2. జెండా పండుగ

జెండా పండుగరా నేడే జెండా పండుగరా
స్వాతంత్ర్యం గుండెల నిండా నిండిన పండుగరా
మన జెండా పండుగరా ॥ జెండా ॥

కోడికూత పొద్దుకాడ – నిదుర లేచే ఊరువాడ
మగవారు చిందులేదు – మగువలంత ముగ్గుబోయ
ఆడపిల్లలే యాడా – జాతిగీతమును పాడా

మూడు రంగుల జెండా నెతు&త్తరి -
ఊరి రచ్చ బండ కాడా ॥ జెండా ॥

ప్లైటు మీద చూడు జెండా - రైలు మీద చూడు జెండా
ఓడమీద చూడు జెండా - మేడ మీద చూడు జెండా
బడిలోన జెండా - గుడిలోన జెండా
ఎదెదలో ఎగిసిన జెండా
ఎగురుతోంది ఎర్రకోట నిండా ॥ జెండా ॥

కులంపండుగ కాదురో - మతం పండుగసలు కాదురో
కోళ్ళమేక బలి ఒద్దురో - కోరిపస్తులుండొద్దురో
కులమంత ప్రాంతీయ భేదము విడిచి
భరత ఖండమంత కలిసి కట్టుగ
జరుపుకొనే ఏకైక పండుగ ॥ జెండా ॥

అమర వీరులు ఎందరో - అందించారో స్వేచ్ఛరో
అరాచకుల నుండిలో - ఆదుకొనుట మన విధిరో

ఆంగ్లేయుల పీడ - అంతమైనది నేడే
ఆగస్టు 15 అందరి గుండెల ఉరకలేసే పండగ

## 3. స్నేహమేరా జీవితానికి

స్నేహమేరా జీవితానికి వెలుగునిచ్చే వెన్నెలా
స్నేహమేరా బ్రతుకు బాటకు నీడనిచ్చే మల్లెరా॥

1. తప్పటడుగులు వేసినపుడు పిచ్చి గీతలు గీసినపుడు
ఆశయముకై సాగినపుడు అసువులొడ్డి నిలిచినపుడు ॥ స్నేహ ॥

2. రామచిలుకల పలుకులై జంటకెగిరి గువ్వలై
బోయవాని వలలో చిక్కి ఎగిరిపోయిన పావురాలై ॥ స్నేహ ॥

3. పేదవాని స్నేహము పెరుగుబువ్వ చందము
కష్టజీవుల బంధము కలిసి నడిచే మార్గము ॥ స్నేహ ॥

4. కులము అడ్డుకాదురా - ఏ మతమూ ఎదురూలేదురా
కులము మతము లేనెలేదని సమతకోసం సాగిపోరా ॥ స్నేహ ॥

## 4. సమైక్యగీతం

భిన్నత్వంలోనే ఉంది ఏకత్వమూ – ఇది
భారతీయుల సమైక్య గీతమూ
మతమేదైనా – కుల మేదైనా
అందరం భారతీయులం – మనమందరం – భారతీయులం ॥ భిన్నత్వం ॥

మతాలన్ని వేరైనా మానవత్వమొకటేగా
కులాలన్నీ వేరైనా గుణాలన్నీ ఒకటేగా
భాషలన్నీ వేరైనా భావాలు ఒకటేగా
ప్రాంతాలు వేరైనా దేశమంత ఒకటేగా ॥ భిన్నత్వం ॥

జీవనదులు వేరైనా జలాలన్నీ ఒకటేగా
శిల్పాలు వేరైనా – శిలలన్నీ ఒకటేగా
పొలాలన్నీ వేరైనా ఫలాలన్నీ ఒకటేగా
పేర్లన్నీ వేరైనా పరమాత్మ ఒకటేగా ॥ భిన్నత్వం ॥

కళ్ళు రెండు వేరైనా కంటి చూపు ఒకటేగా
పశువురంగు వేరైనా పాల రంగు ఒకటేగా
సంస్కృతులు వేరైనా భరతజాతి ఒకటేగా
జన్మస్థలం వేరైనా జన్మభూమి ఒకటేగా ॥ భిన్నత్వం ॥

## 5. గురువులకిదె మా వందనం

చదువు నేర్పే గురులకిదె మా వందనం
జ్ఞాన దాతల చరణధూళికి వందనం

శాంతమూర్తులు – స్వచ్ఛకీర్తులు
సుజన చంద్రులు – సుగుణసాంద్రులు
గురులు – సురతరులు ॥ చదువు ॥

రామునికి – విలువిద్య నేర్పెను
మౌని విశ్వామిత్రుడు
కృష్ణునీ చదివించే
సాందీప జ్ఞాని పవిత్రుడు

ఎంత ఘనులకునైన గాని
గురువులే ప్రత్యక్ష దేవులు ॥ చదువు ॥

రాధాకృష్ణులు – రామకృష్ణులు
విశ్వకవులు – వివేకానందులు
శంకరులు – వేదవ్యాసులు
ఎందరెందరో జగద్గురువులు ॥ చదువు ॥

కోటి సూర్యులున్న – కోటి చంద్రులున్న
గురువు మాట లేకుండా – ఎదచీకటి పోతుందా?
జ్ఞానజ్యోతి వెలిగింది – మము ప్రగతికి నడిపించె
గురువే బ్రహ్మ గురువే విష్ణువు – గురువే మహేశ్వరుడు

ఆ త్రిమూర్తి రూపునకిదె వందనం
ఆ దయాంతరంగున కిదె వందనం ॥ చదువు ॥

*– డాక్టర్ ఆచార్య తిరుమల*

## 6. సుశ్యామల మనతల్లి స్వర్ణభారతి

*(కలిసి పాడుదాం గేయ సంపుటి, రచయిత : అమృతకూరి)*

సుశ్యామల మనతల్లి స్వర్ణభారతి
రత్నగర్భ మనతల్లి రమ్యభారతి
వేదాలను వెలయించిన విజ్ఞానసినీ
విశ్వశాంతి కోరే విశాల హృదయినీ ॥ సుశ్యామల ॥

1. ఉన్నతమౌ హిమగిరులూ – ఉత్కృష్టపుజీవనదులు
సస్యశ్యామలచేలూ – చల్లనిపవనములు
ఎల్లవేళలా కలిగిన చల్లని తల్లీ
ఎదురులేని వీరభూమి మన కల్పవల్లీ ॥ సుశ్యామల ॥

2. దిగంతాల తన కీర్తిని దేదీప్యమానంగా
వెలయించిన వీరులను కన్నతల్లీ
వసుధైక కుటుంబమన్న వాదనతో
సమతా, మమతా, మానవతా చాటిన తల్లీ
సాటిలేని కర్మభూమి మన కల్పవల్లీ ॥ సుశ్యామల ॥

## 7. అడివమ్మా...!!

అడివమ్మ మాయమ్మ అతి పేదదమ్మా...
మాయ్య కున్నది ఒక్కదే చీర... ఒక్కటే చీర
ఆ చీర రంగేమో ఆకుపచ్చనిదీ...
ఆ తల్లి మనసేమో... రామసక్కనిదీ... రామసక్కనిదీ ॥ అడివమ్మా ॥

1. భుజములా మీదేమో రాళ్ల గుట్టలు కొన్ని
పాటముల పక్కనే పాముపుట్టలు అన్ని – 2
అడుగడుగున ముల్లకంపా – అయిన అడివంటేనే పళ్ల గంపా ॥ అడివమ్మా ॥

2. నీటి తొనుకుల తీరు చిరుగాలి మీటంగ
లేడి పిల్లలు చెంగు చెంగునా ఎగురంగా
నెమలి పాటలు నేర్పే ఒక పంతులమ్మా... –2
అడివంటె ఆకుపచ్చని కోయిలమ్మా... ఒక కోయిలమ్మా ॥ అడివమ్మా ॥

## 8. పచ్చని చెట్టు

పల్లవి : పచ్చని చెట్టును నేనురా...
పాలుగారె మనసూనాదిరా...
కొమ్మనూ నే రెమ్మనూ నీకు తోడుగ ఉండే అమ్మనూ ॥ పచ్చని ॥

మీ పొలమును దున్నిన నాగలై
మీ పంటను మోసిన బండినై
అమ్మమ్మ చేతిలో కవ్వమై
తాతయ్య చేతిలో కర్రనై
అమ్మ పాటతో ఊగిన ఊయలై
ఆ పాడేటి పిల్లన గ్రోవినై

నింగి మబ్బుల్ని వానలా మలిచినం
చేను చెలుకల్ని నీళ్లతో తడిపినం
చెడ్డ గాలి పీల్చి మంచినిడిసినం
మీకు ప్రాణవాయువుల్ని పోసినం
మీకు కనువిందు చేసిన పువ్వులం
మీ కడుపాకలి తీర్చె పండులం ॥ పచ్చని ॥

అలసిపోతె నీడనిచ్చినమ్
చల్లగాలితో ఒళ్లంత తడిపినమ్
ఎగిరె పక్షుల్ని ముద్దాడి పెంచినమ్
లేడి పిల్లల్ని ఒళ్లోనదాచినమ్
అడవికొచ్చిన మునులను సాదినమ్
బోధి వృక్షమై బుద్ధున్ని చేసినమ్ ॥ పచ్చని ॥

మీరు కూర్చుంటె కుర్చీ పీటలం
మీరు పడుకుంటె పందిరి మంచాలం
మిమ్ము కంటికి రెప్పలా కాసినం
మీ ఇంటికి ముందర గడపలం
మీరు రాసుకున్న తెల్లకాగితం
మీకు తెవినిచ్చినట్టి పుస్తకం
మీ రోగాల నొప్పుల్ల మందులం
మిమ్ము కడసారి కాల్చే కట్టెలం ॥ పచ్చని ॥

## 9. శక్తికోసమే నడు

*(శ్రీశ్రీ)*

శక్తికోసమే నడు!
ముక్తికోసమేమను!
విముక్తికోసమేమను!
విశ్వశాంతి క్రాంతికోసమే
మనస్సులేకమై
నడూ! నడూ! భయంగియం విడు!

చ : వేగుచుక్క వెలిగె మింటిపై
వెలుగురేఖలదిగో కంటివా?
ఉదయమెంతొలేదు దూరము
వదలిపోవునంధకారము
జీవితాశలే - భావిజాడలోయ్
ప్రపంచశాంతి శాంతిక్రాంతి బాటసారివై ॥ నడూ ॥

చ : విరోధించువారు లేరులే
విరోధించువారు రారులే
ఆస్తి నాస్తి భేదమేలరా?
వాస్తవం ఎరింగి సాగరా!
విశాలాంధ్రలో – ప్రజారాజ్యమే
ఘటించగ శ్రమించరా – పరాక్రమించరా

## 10. పాడుదమా!

*(గంటేడ గౌరు నాయుడు)*

పల్లవి : పాడుదమా స్వేచ్ఛాగీతం
ఎగిరేయుదమా జాతిపతాకం
దిగంతాలనినదించి – విశ్వ
విఖ్యాతినొందగా జాతిగౌరవం

చ : జలియన్ వాలాబాగ్ దురంతపు
నెత్తుటిధారల గొత్తుకుని
ఉరికొయ్యల చెరసాలలగోడల
దారుణాలు తలకెత్తుకుని
పొగిలిన కాలం – పోరాడినకాలం
మరిమరి ఒకపరి తలచుకుని
మృతవీరుల నెదనిడి కొలుచుకునీ.....

చ : వందేమాతరమని నినదించిన
వీరుల శౌర్యమునలదికొని
స్వాతంత్ర్యం నాజన్మ హక్కని
గర్జించిన గళమందుకుని
పోరాటబలం – స్వాతంత్ర్యఫలం
కలకాలం కాపాడుకుని
కడు గర్వంగా కొనియాడుకొని.....

చ : మన్నెంగుండెల మంటై రగిలిన
విప్లవజ్యోతి స్ఫూర్తియని
గుండుకెదురుగా గుండెను నిలిపిన

తెలుగు సింగముల తెగువగని
చీకటి గుండెల - బాకై మెరిసిన
గరిమెళ్ళను గురుతుంచుకుని
మన తెలుగుతేజమును నింపుకునీ
జనగణమనముల జాగృతి నింపిన
జండా గాథలు చెప్పుకుని
జయహే జయజయహే జననీయని
జయగీతమ్ములు పాడుకుని
పావన చరితం - పరిమళ భరితం
అఖండ భారత ఖండమని
అది అక్షయ అమృతభాండమనీ

# 4. కథలు

## 1. కాటువేయకు... బుసకొట్టు

ఒకానొక సాధువు దేశమంతా పర్యటిస్తూ అనగనగా ఓ గ్రామానికి చేరుకున్నాడు. ఆ ఊరి పొలిమేరలోకి రాగానే దూరంగా ఆటలాడుకుంటున్న పిల్లలందరూ ఆ సాధువు దగ్గరకు పరుగెత్తుకుంటూ వచ్చి 'సాధువుగారూ! ఆ వైపునకు వెళ్ళకండి. అక్కడ పెద్ద పాముంది. తన పుట్టకు దగ్గరకు ఎవరు వెళ్ళినా, కాటేస్తుంది' అని చెప్పారు.

ఆ సాధువుగారు వెంటనే 'నాకు పాములంటే ఏం భయం లేదు. నాకు కొన్ని మంత్రాలు తెలుసు. వాటిని ఉపయోగిస్తే పాములు నన్నేమీ చేయలేవు' అంటూ ఆ పామున్న పుట్ట వైపే నిర్భయంగా సాగిపోయాడు. సాధువు ఆ పుట్ట దగ్గరకు వెళ్ళగానే 'బుస్సుమంటూ పాము బయటకు రానే వచ్చింది. కాటువేయటానికి తల ఎత్తగానే ఇంతలో సాధువు కొన్ని మంత్రాలు చదివాడు. వెంటనే అంత ఎత్తుకు లేచిన పాము వానపాములా ఆయన కాళ్ళ దగ్గర పడిపోయింది. అప్పుడు ఆ సాధువు పాముతో 'ఎందుకు నీవలా అమాయకులైన ప్రజలకు హాని తలపెడుతున్నావు? నీకు నేను ఓ మంత్రాన్ని ఉపదేశిస్తాను. దానిని జపిస్తూ ఉండు! నీకు అది ఎంత మేలు కలిగిస్తుంది. హింసా ప్రవృత్తి నుంచి నీవు బయటపడతావు' అంటూ మంత్రాన్ని ఉపదేశించాడు. ఇక నుంచి ఎవరికీ అపకారం చేయకూడదని, సరిగ్గా సంవత్సరం తరువాత నేను ఇక్కడికి మళ్ళీ వస్తానని సాధువు వెళ్ళిపోయాడు.

పవిత్రమైన ఆ మంత్రాన్ని వల్లెవేసుకుంటూ, ఆ పాము పూర్తిగా సాధుజీవిగా మారిపోయింది. అప్పటి నుంచి ఆ పాము ఎవరినీ ఏమీ చేయటంలేదు. తన దగ్గరకు వచ్చిన ప్రజలను చూసి బుస కూడా కొట్టటం లేదు. పాము అలా ఎవరినీ ఏమీ చేయకుండా ఉంటున్న విషయాన్ని అక్కడ రోజూ ఆడుకునే పశువులు కాసే పిల్లలు గమనించారు. దాంతో వారు ఆ పామును ఆట పట్టించటం మొదలుపెట్టారు. రాళ్ళతో కొట్టటం, కర్రలతో పట్టి విసిరి వేయటంలాంటివి చేస్తూ ఉన్నారు. ఆ సర్పం పరిస్థితి ఒక వానపాములా మారిపోయింది. ఒకసారి దాని తోకను కర్రకు కట్టి గిరాగిరా తిప్పి పిల్లలు నేలకేసి కొట్టారు. దాంతో ఆ పాము శరీరమంతా గాయమైంది. చివరకు రక్తం కక్కుకొని కృశించి, అచేతనంగా మారిపోయింది. అది చచ్చిపోయిందనుకొని, పిల్లలందరూ వెళ్ళిపోయారు.

స్పృహ వచ్చాక మెల్లిగా పాకుకుంటూ తన పుట్టలోకి వెళ్ళిపోయింది. ఎటూ కదలలేక రోజుల తరబడి పుట్టలోనే ఉంటూ ఉంది. ఆహారం లేక బలహీనంగా తయారైంది. పిల్లల భయానికి పగలంతా పుట్ట విడిచి బయటకు రావటం లేదు. రాత్రి సమయాల్లో పుట్ట బయటకు వచ్చి, దొరికిందేదో తింటూ, కాలం గడుపుతోంది. ఆకులు, అలములు తింటూ ప్రాణాలు నిలుపుకుంటోంది.

అలాంటి పరిస్థితుల్లో సరిగ్గా సంవత్సరం తరువాత, సాధువు అదే మార్గం గుండా రావటం తటస్థించింది. ఆయన రావటంతోనే అక్కడ కనిపించిన పిల్లలను పాము గురించి వాకబుచేశాడు. వాళ్ళు ఎంతో ఉల్లాసంగా, అదెప్పుడో చనిపోయిందని సమాధానమిచ్చారు. కాని పాము అంత త్వరగా చనిపోదని సాధువుకు తెలుసు. అందుకే ఆ పాము ఉండే పుట్ట దగ్గరకు

వెళ్ళి పిలిచాడు. తన గురువులాంటి సాధువు మాట వినేసరికి ఆ పాము వెంటనే బయటకు వచ్చింది. ఎంతో వినమ్రంగా ఆయన కాళ్ళకు ప్రణామం చేసింది.

'నీవు ఎలా ఉన్నావు?' అని సాధువు పామును అడిగాడు.

'మీ దయ వల్ల బాగానే ఉన్నాను' అంది పాము.

కాని సాధువుకు ఆ పాము పరిస్థితిని చూసి అనుమానం కలిగింది. సన్నగా, బలహీనంగా మారిపోయిన దాన్ని చూసి 'నీ పరిస్థితిపై నాకేదో అనుమానంగా ఉంది. ఎందుకలా అయిపోయావు' అని ప్రశ్నించాడు.

అప్పుడు ఆ పాము సమాధానం చెబుతూ 'గురువుగారూ! మీరే కదా ఎవరికీ హాని చేయవద్దని చెప్పారు. అందుకే ఎవరినీ కాటువేయకుండా, ఏ క్రిమినీ తినకుండా ఆకులు, అలములు తింటూ బతుకుతున్నాను. అందుకే బలహీనమైపోయాను' అంది.

అప్పుడు ఆ సాధువు 'కేవలం ఆహారం సరిగ్గా లేకపోవటం వల్ల నీవు ఇలా మారిపోయి ఉండవు. ఇంకేదో కారణం ఉండి ఉంటుంది; గుర్తు చేసుకో' అన్నాడు.

అప్పుడు వెంటనే పాముకు గోపబాలురి విషయం గుర్తొచ్చింది; వాళ్ళు తనను తాడులా కట్టి విసిరేసిన సంగతి స్ఫురించింది. వెంటనే 'అవును! గురువుగారూ! నాకు ఇప్పుడు గుర్తొస్తోంది. మొన్న ఒక రోజు ఆ బాలలంతా నన్ను తాడులా తిప్పి నేలకేసి కొట్టారు. ఆ గాయాల వల్ల నేను రక్తం కక్కుకున్నాను. వాళ్ళు అమాయకులు, నేను మారిపోయినట్లు తెలీదు కదా! నేను కాటువేయటం లేదని వాళ్ళకు తెలీక, భయపడి అలా చేశారు' అంది పాము హీనస్వరంతో!

వెంటనే ఆ సాధువు ఆశ్చర్యంగా 'ఎంత సిగ్గుచేటు! నీవు ఎంత అమాయక ప్రాణివి. నిన్ను నీవు రక్షించుకోవటం తెలియకపోతే ఎలా? నిన్ను కాటువేయవద్దని చెప్పానే కాని, బుసకొట్టవద్దని అనలేదు కదా! బుసకొట్టి వాళ్ళను ఎందుకు భయపెట్టలేదు? నీకు అపకారం చేయాలని వచ్చిన వాళ్ళను బుసకొట్టి బెదిరించాలి. లేకపోతే, వాళ్ళు ఇదుగో, ఇలా నీకే ప్రమాదాన్ని తెచ్చిపెడతారు. ఇకనైనా కాటు వేయకుండా, బుసకొడుతూ నిన్ను నీవు రక్షించుకో' అన్నాడు సాధువు.

ఇలా మనం అందరితో మర్యాదగా, వినయంగా, ప్రేమగా మసలుకోవసిందే! కాని అదే సమయంలో మీకు ఎవరైనా అపకారం తలపెట్టే ప్రయత్నం చేసినప్పుడు, కళ్ళ ముందు అన్యాయం జరుగుతున్నప్పుడు తప్పకుండా ఎదిరించే తీరాలి.

## 2. నరేంద్రుడి నిజాయితీ

ఓ పాఠశాల ఏడవతరగతిలో ఉపాధ్యాయుడు సాంఘికశాస్త్రాన్ని బోధిస్తూ ఉన్నాడు. భూగోళశాస్త్రంలో ముఖ్యమైన పాఠాన్ని ఆ మాష్టారు చెబుతున్నారు. ఇంతలో చివరి వరుసలో కూర్చున్న ఓ బాలుడు తోటి మిత్రులతో ఏదో మాట్లాడుతూ ఉన్నాడు. దీంతో తరగతికి అంతరాయం కలగటాన్ని ఉపాధ్యాయుడు గమనించారు. వెంటనే వెనక బెంచీ పిల్లలందరినీ నిలబడమన్నారు. అందులో ఒక బాలుడిని ఉద్దేశించి ఆ రోజు చెప్పిన పాఠానికి సంబంధించి కొన్ని ప్రశ్నలు వేశారు.

మాటల్లో పడి ఆ బాలుడు పాఠం విని ఉండడని ఆ ఉపాధ్యాయుడు ఆ ప్రశ్న వేశారు. సమాధానం చెప్పకపోతే, తగిన శిక్ష విధించవచ్చుని అనుకున్నారు. కాని ఈ అబ్బాయి మాష్టారు అడిగిన ప్రశ్నలన్నింటికీ చక్కగా, సరైన సమాధానం చెప్పాడు.

ఆ ఉపాధ్యాయుడు బాలుడి విషయంలో పొరపాటు పడి ఉంటానని అనుకున్నారు. అందుకే వెంటనే 'సరే! నీ విషయంలో నేను పొరపాటు పడ్డాను. వెనక బెంచిలో ఉండి, మాట్లాడుతున్నది నీవే అనుకున్నాను. వేరెవరో మాట్లాడుతూ ఉండి ఉంటారు. నీవే మాట్లాడి ఉంటే సరిగ్గా సమాధానాలు చెప్పి ఉండేవాడివి కాదు. నీవు కూర్చో' అన్నారు. తరువాత ఆ ఉపాధ్యాయుడు తరగతి గదినంతా తరచి, తరచి చూస్తూ, అల్లరి చేసిన అ అబ్బాయి ఎవరో కనిపెట్టే ప్రయత్నం చేశారు.

ఇంతలో అంతకు ముందు ఆ మాష్టారి ప్రశ్నలకు సరిగ్గా సమాధానాలు చెప్పిన బాలుడే లేచి నిలబడ్డాడు. 'మాష్టారుగారు! మీరు నా విషయంలో ఏమీ పొరపాటు పడలేదు. ఆ అల్లరి చేసిన బాలుడిని నేనే! మీ ప్రశ్నలన్నింటికీ సరైన సమాధానాలు చెప్పిన నేనే, ఇందాక అందరితో మాట్లాడుతూ మీ పాఠానికి అంతరాయం కూడా కలిగించాను' అన్నాడు.

ఆ విద్యార్థి నిజాయితీకి ఆ ఉపాధ్యాయుడు కదలిపోయాడు.

మరోమారు...

తరగతిలో ఉపాధ్యాయుడు భూగోళశాస్త్రాన్ని బోధిస్తూ ఉన్నారు. మధ్యలో ఆ విద్యార్థినే మాష్టారు ఆ రోజు పాఠానికి సంబంధించి ఓ ప్రశ్న వేశారు. ఆ బాలుడు సమాధానం చెప్పాడు. కాని ఆ ఉపాధ్యాయుడు ఆ విద్యార్థి చెప్పిన జవాబు తప్పని అభిప్రాయపడ్డాడు. కాని ఆ బాలుడికి తను చెప్పిన సమాధానంపై గట్టి నమ్మకముంది. అందుకే ఆ ఉపాధ్యాయుడితో 'మాష్టారు! నేను చెప్పిన జవాబు సరైనదే' అన్నాడు. దాంతో మాష్టారికి కోపం వచ్చి, ఆ విద్యార్థి చెంపపై చేయిచేసుకున్నాడు. అయినా ఆ విద్యార్థి తన అభిప్రాయాన్ని మార్చుకోలేదు. ఆ రోజు తరగతిలో జరిగిన సంఘటన గురించి ఆ విద్యార్థి ఇంటికి వెళ్ళాక వాళ్ళ అమ్మతో చెప్పి మథనపడ్డాడు. కాని వాళ్ళ అమ్మ 'బాబు! ఫరవాలేదు. జరిగిందేదో జరిగింది. మాష్టారు కొట్టారని బాధపడకు. నువ్వు ఎప్పుడూ మాట తప్పని విద్యార్థిగానే ఉండాలి. సత్యాన్నే నమ్ముకొని జీవించాలి. నీవు చెప్పింది సత్యమైంది, సరైనదని నీవు అనుకుంటే మిగిలిన విషయాల గురించి పట్టించుకునే అవసరం లేదు. కాలం నీవైపే నిలుస్తుంది' అని దగ్గరకు తీసుకొని ఓదార్చింది.

ఆ విద్యార్థిపై చేయిచేసుకున్న ఆ ఉపాధ్యాయుడు ఇంటికి వెళ్ళాక తన తప్పు తెలుసుకున్నారు. ఆ బాలుడు చెప్పిందే సరైన సమాధానమని గుర్తించారు. ఉదయం అందరి ముందు ఆ విద్యార్థి చెప్పిన జవాబు సబబైనదేనని ఆయన అంగీకరించారు. ఇలా బాల్యం నుంచే సత్యవచనాలకు, నైతిక విలువలకు కట్టుబడిన ఆ బాలుడు వేరెవరో కాదు భారతజాతి ఖ్యాతిని ప్రపంచమంతా మారుమోగించిన స్వామి వివేకానంద.

పిల్లలూ! పొరపాట్లు చేయటం తప్పుకాదు. కాని వాటిని ధైర్యంగా అంగీకరించి, సరిదిద్దుకునేవారే నిజమైన విద్యార్థులు. ఇంట్లోకాని, పాఠశాలలో కాని, మరెక్కడైనా కాని మన వల్ల తప్పు జరిగితే తప్పించుకోకుండా ఒప్పుకోవాలి. మరొకసారి తప్పు చేయకుండా జాగ్రత్తపడాలి. అలా నిర్భయంగా తన తప్పును ఒప్పుకున్నవారే భవిష్యత్తులో గొప్పవారవుతారు. పేరుప్రఖ్యాతలు సంపాదిస్తారు. ఇలా ఈ రోజు నుంచి మీ పొరపాట్లను మీరు ఒకరు వేలెత్తిచూపకముందే ఒప్పుకుంటారు కదూ!

## 3. గాడిద ఆత్మవిశ్వాసం

ఒకానొకసారి ఒక రైతు యొక్క ముసలి గాడిద పాడుబడిన నుయ్యిలో కాలుజారి పడిపోయింది. మొదట్లో ఆ రైతు గాడిదను రక్షించడానికి ప్రయత్నించాడు. తర్వాత ఈ పని కష్టమనిపించి ఇలా ఆలోచించాడు.

- ఈ ముసలి గాడిదను రక్షించడంవల్ల ఒరిగేదేమీ లేదు.
- ఈ పాడుబడిన నుయ్యిని పూడ్చివేయాల్సిన అవసరం ఉంది. దీనివల్ల ఇతరులు ఇందులో పడే ప్రమాదం తప్పుతుంది.

వెంటనే ఆ రైతు తోటి వారిని సహాయానికై పిలిచి, ఆ నూతిలోకి మట్టిని తొయ్యడం ప్రారంభించాడు. జరుగుతున్న ప్రమాదాన్ని పసిగట్టిన ముసలి గాడిద నిస్సహాయంగా మొరగటం మొదలు పెట్టింది. మొరగటంవల్ల ఏ ప్రయోజనం కలగకపోవడంవల్ల ఆ ముసలి గాడిద ప్రస్తుత పరిస్థితుల్లో ఉన్న అవకాశాన్ని మానసిక ధైర్యంతో ఎదుర్కోవాలని దృఢనిశ్చయానికి వచ్చింది. పార నుండి తనపై మట్టి పడగానే విదిలించుకొని ఆ మట్టి పైకెక్కి నిలబడసాగింది. ఈ విధంగా రైతులు పారతో మట్టి పడవేసినప్పుడల్లా విదిలించుకొని ఆ మట్టి పైకెక్కుతూ చివరకు నూతిలో నుంచి బయటకు వచ్చి నిర్భయంగా తప్పించుకు పారిపోయింది.

**అన్వయం :**

ఈ కథలో నూతి ఉన్న ముసలి గాడిదపై రైతులు పడవేసిన మట్టిలాగే మన జీవితంలో మనపై అనేక కష్టాలు, సవాళ్ళు దూకుతుంటాయి. ఇక్కడ ముసలి గాడిద తనపై పడిన మట్టిని విదిలించి దానిపైకి ఎక్కినట్లుగా, మనకు జీవితంలో ఎదురయ్యే సవాళ్ళు మనం ఉన్నత దశలకు ఎదిగేందుకు ఉపయోగపడే పునాది రాళ్ళుగా తీసుకోవాలి. మానసిక ధైర్యంతో ప్రస్తుత పరిస్థితుల్లో ఉండే అవకాశాలను వినియోగించుకోవాలే తప్ప నిస్సహాయులుగా మిగలకూడదు.

## 4. భయమే మృత్యువు

ఒకానొక రాజ్యంలో ప్లేగు విజృంభించి అపార జననష్టం సంభవిస్తూ ఉంటుంది. దాంతో ఆ రాజ్యాధినేత తీవ్ర ఆందోళనకు గురై, రాజగురువు సలహామేరకు శివయజ్ఞాన్ని ఆచరిస్తాడు. ఎంతో భక్తి శ్రద్ధలతో ఆ రాజు చేస్తున్న క్రతువుకు పరమశివుడు సంతసించి ప్రత్యక్షమవుతాడు; ఆ రాజు అభీష్టాన్ని అడుగుతాడు. మహారాజు ఎంతో ఆర్తితో 'భగవాన్! మా రాజ్యంలో ప్లేగు వ్యాపించి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు; ఆ వ్యాధి బారి నుంచి వారిని రక్షించలేకపోతున్నాను. నీవే ఆ బాధ్యతను తీసుకొని ఎలాగైనా మమ్మల్ని రక్షించాలి' అంటూ వేడుకుంటాడు. భక్తుడి విన్నపానికి స్పందించిన, ఆ ముక్కంటి తన భంటు నందికి ఆ బాధ్యతను అప్పగించాడు. ఎలాగైనా ప్లేగును నియంత్రించమని ఆదేశిస్తాడు. స్పందించిన ఆ నంది హుటాహుటిన రాజ్యానికి వెళతాడు. రాజ్యంలోకి అడుగిడిన వెంటనే, ఆ ప్లేగుకు కారకుడైన రాక్షసుడిని తక్షణమే తన సమక్షంలో హాజరుకమ్మని ఆదేశిస్తాడు. వెంటనే నంది వద్ద ప్రత్యక్షమైన ప్లేగు, విషయమేంటని ప్రశ్నిస్తాడు. ఈ రాజ్యప్రజలను పీడించడం తగదని, వెంటనే రాజ్యం విడిచి వెళ్ళమని ఆదేశిస్తాడు. సరేనని అంగీకరిస్తూ, ఇంత దూరం వచ్చాను కనుక ఒక్కరినైనా వెంట తీసుకువెళతానని అర్థిస్తాడు. దానికి అంగీకరించిన నంది, ఈ రాజ్యం నుండి ఒకే

ఒక్కరిని ప్లేగువ్యాధి బాధితుడిగా, ఆ పైలోకానికి తీసుకువెళ్ళు, అంతకు మించి ఒక్కరికి వ్యాధిసోకినా నీ అంతం తప్పదని నంది స్పష్టంగా ఆదేశిస్తాడు. సరేనంటూ వెళ్ళిపోతాడు ప్లేగు.

కొన్నాళ్ళకు ఆ రాజ్యంలో ప్లేగు వ్యాధి పీడితులుగా వందలాది మంది కన్నుమూస్తారు. విషయం తెలిసిన నంది, ఆగ్రహోదగ్రుడై ప్లేగును తక్షణమే తన సమక్షానికి హాజరుకమ్మని కబురు పంపుతాడు. ఆగమేఘాల మీద నంది ముందు హాజరవుతాడు ప్లేగు. 'ఏంటి! అంత ధిక్కారమా? నీవు నాకిచ్చిన మాట సంగతి ఏమిటి? ఒక్కరినే పీడిస్తానని చెప్పి, అంతమందిని ఎలా పొట్టనబెట్టుకున్నావు? అంటూ నంది ఆగ్రహిస్తాడు. అప్పుడు ప్లేగు "మహాప్రభూ! ఇందులో నా తప్పేమీ లేదు; నిజానికి నేను మీకు మాట ఇచ్చినట్లు ఒక్కరికే సోకాను; కానీ మిగతా అందరూ ఆ భయంతోనే కన్నుమూశారు" అంటాడు ఎంతో వినయంగా!

## 5. నైపుణ్యం... ఆచరణ

శ్రీరామకృష్ణ పరమహంస వివిధ సందర్భాలలో వారు నీతికథల రూపంలో చెప్పిన కథలు జీవనవ్యవహారాల్లో సునిశితమైన నైపుణ్యాన్ని, ప్రావీణ్యాన్ని పెంచుకోవడానికి సహాయపడతాయి. ఏ మార్గాన్నీ తృణీకరించకుండా, వాటన్నింటినీ జీవితానికి అన్వయించుకుంటూ ముందుకు సాగిపొమ్మనేవారు.

ఏ విద్యలోనైనా కేవలం ప్రావీణ్యం, కౌశలం ఉంటే సరిపోదు. దానిని ఆచరణలో పెట్టగలిగే సామర్థ్యం ఉన్నప్పుడే ఆ నైపుణ్యానికి సార్థకత! ఈ రోజు వ్యక్తిత్వ వికాసం పేరుతో వల్లెవేసే ఎన్నో పాఠాలను ఆనాడే భగవాన్ శ్రీరామకృష్ణులు తన నీతికథారూపంలో బోధించారు. స్వామి ఈశాత్మానంద మాటల్లో చెప్పాలంటే 'వేలాది సంవత్సరాలకు పూర్వమే ఆరంభమైన వ్యక్తిత్వ వికాస అన్వేషణ, శ్రీరామకృష్ణుల అవతారంలో పరిపూర్ణంగా ఆవిష్కృతమైంది'. కేవలం సిద్ధాంతాలు, సూత్రాలు వల్లెవేయడం వల్ల ఎలాంటి లాభం లేదని, వాటిని ఆచరించి చూపినప్పుడే విలువ ఉంటుందని ఆ గురువరేణ్యులు తరచూ స్పష్టం చేస్తూ ఉండేవారు. అందులో భాగంగా పడవలో ప్రయాణిస్తున్న ఓ పండితుడిని ఉదాహరణగా చూపుతూ నీతికథ రూపంలో ఏది నిజమైన విద్యో? చెప్పకనే చెప్పారు.

ఓసారి కొందరు ప్రయాణికులతో సహా ఓ పండితుడు గంగానదిపై పడవలో వెళుతూ ఉన్నాడు. పడవ ప్రారంభమైంది మొదలు. ఆ పండితుడు తన పాండితీ ప్రకర్షను ప్రదర్శించేందుకు ప్రయత్నం చేస్తూనే ఉన్నాడు. తాను చదివిన వేదాలు, వేదాంతం; తను చేస్తున్న ఆధ్యాత్మిక సాధనలకు అహంకరిస్తూ తోటి ప్రయాణికులను అవహేళన చేయసాగాడు. అందులో భాగంగా తోటి ప్రయాణికుడితో సంభాషిస్తూ 'ఏమోయ్! నీవు ఎప్పుడైనా వేదాంతం చదివావా?' అని అడిగాడు; తోటి ప్రయాణికుడు 'అయ్యో! లేదండి' అంటూ సమాధానమిచ్చాడు. 'పోనీ! కనీసం సాంఖ్యయోగం, పతంజలియోగసూత్రాలు తదితరాలైనా తెలుసా?' అని ప్రశ్నించాడు పండితడు. 'అయ్యో! వాటి గురించి కూడా తెలీదు పండితులు గారు!' అంటూ తలదించుకున్నాడు. అప్పుడు పండితుడు వెటకారంగా 'నీ జీవితం వృథా చేసుకున్నావయ్యా! ఇవేమీ తెలియంది, నీవు ఎలా బ్రతుకుతావయ్యా?' అంటూ ఎగతాళి చేశాడు. ఇంతలో ఆకాశంలో ఉరుములు, మెరుపులు! భోరున వర్షం! నదిలో తుపాను ఛాయలు పొడచూపాయి. ఒక్కసారిగా పడవ మునిగిపోసాగింది. అప్పుడు తోటి ప్రయాణికుడు, పండితుడిని అడిగాడు 'గురువుగారు! మీకు ఈత వచ్చా?' అని! అప్పుడు పండితుడు ఆందోళనగా 'అయ్యో! నాకు ఈతరాదు' అంటూ

ఆందోళన పడసాగాడు. అప్పుడు ఆ ప్రయాణికుడు తాపీగా 'నాకు సాంఖ్య, పతంజలి సూత్రాలు ఏవీ రావు! కాని ఈత వచ్చు!' అంటూ తాపీగా నదిలో దూకి ఈదుకుంటూ వెళ్ళిపోయాడు. ఇలా పండితుడికి వేదాలు, శాస్త్రాలు అన్నీ తెలుసు! కాని ఇవన్నీ చదివానన్న అహంభావం ఆ తుపాను సమయంలో ఆయనను కాపాడలేకపోయింది. శ్రీరామకృష్ణులు చెప్పిన ఈ కథ ఆధునిక నిత్యజీవితంలో వ్యక్తిత్వ వికాసానికి కూడా న్వయించుకోవచ్చు. కేవలం పుస్తక పరిజ్ఞానంతో వర్తమానవ్యవహారాలలో విజయం సాధించలేము. వాటిని జీవితానికి అన్వయించుకొని, ఆచరణలో పెట్టి ముందుకు సాగిపోవాలి.

## 6. స్వాభిమానము

స్వాభిమానము అంటే ఆత్మగౌరవం. ఇది నాది అని అనుకున్న దాని యెడల ప్రేమ. వినయ శీలుడైన వ్యక్తి స్వాభిమానం కలిగి ఉంటాడు. స్వాభిమానం అంటే ఆధిక్య భావనకాదు. అలా అని ఆత్మన్యూనతా భావన కూడా కాదు. ఇది నా దేశం. ఇది నా ధర్మం. ఇది నా సంస్కృతి, ఇది నా జాతి, ఇది నా భాష ఇది నా చరిత్ర అనే భావన స్వాభిమానాన్ని పెంచుతుంది.

ఈశ్వర చంద్ర విద్యాసాగర్ సంస్కృత విద్యాలయంలో ప్రధానాచార్యులుగా ఉన్నారు. ఒకసారి ఒక ముఖ్యమైన గవర్నమెంటు పనిమీద ప్రెసిడెన్సీ కాలేజికి వెళ్ళారు. అక్కడ ఆంగ్లేయ ప్రధానాచార్యుడైన "కార్"ను కలవాలి. లోపలికి చీటి పంపి పిలవగానే లోపలికి వెళ్ళారు. లోపల "కార్" తన రెండు కాళ్ళు టేబుల్ మీద పెట్టి విశ్రాంతిగా వెనుకకు వ్రాలి, కాళ్ళు ఆడిస్తూ, విద్యాసాగర్‌ను నిల్చోబెట్టి మాట్లాడాడు. విద్యాసాగర్‌కు మనస్తాపం కలిగింది. ఇది భారతీయులకు అవమానంగా ఆయన భావించాడు. కొంత కాలం తరువాత "కార్" విద్యాసాగర్ సలహా కోసం వారి దగ్గరకు వెళ్ళాడు. అప్పుడు విద్యాసాగర్ లోగడ తనతో "కార్" ఎలా వ్యవహరించాడో అలాగే చేశాడు. ఒక భారతీయుడు ఇలా ప్రవర్తించినందుకు ఆగ్రహించిన "కార్" ఆనాటి విద్యాశాఖాధిపతికి ఫిర్యాదు చేశాడు. విచిరణ జరిగింది. విద్యాసాగర్ జరిగినదంతా పూసగ్రుచ్చినట్లు రాసి పంపారు. ఆ కింద ఇలా రాశారు. సభ్యత బాగా తెలియని భారతీయులు ఐరోపావారి శిష్టాచారాన్ని అశ్రీనుకరించాలేమో అని అనుకున్నాను. నాతో 'కార్' వ్యవహరించిన తీరులోనే నేనూ ఆయనతో వ్యవహరించాను." ఇలా స్వాభిమానధీనుడైన విద్యాసాగర్ వినయంగానే కుక్కకాటుకు చెప్పుదెబ్బ కొట్టాడు.

## 7. ఆలోచనతో ముందుకు నడువు

పూర్వం, కాశీనగరంలో ఇద్దరు వ్యాపారులు ఉండేవారు. ఒకని పేరు మయూఖుడు మరొకని పేరు ఉపగుప్తుడు. మయూఖుడు దుర్బుద్ధి కలవాడు. ముంచుచూపు లేనివాడు. ఉపగుప్తుడు శాంత స్వభావుడు, ముందుచూపు కలవాడు.

ఒకసారి ఉపగుప్తుడు వ్యాపారం చేసుకురావడానికి దూరదేశం వెళ్ళాలని అనుకున్నాడు. మయూఖుడు కూడా అటువైపే వ్యాపారానికి వస్తానన్నాడు. ఇది ఉపగుప్తునికి ఇబ్బంది కలిగించినా శాంతంగా 'ముందు నువ్వు వెళతావా? నన్ను వెళ్ళమంటావా?' అని మయూఖుణ్ణి అడిగాడు. ఇద్దరూ ఒకేసారి వెళితే ఇద్దరికీ లాభం ఉండదని స్పష్టంగా చెప్పాడు.

మయూఖుడు మనసులో ఇలా అనుకున్నాడు "ముందు నేనే వెళతాను. ఆ ప్రాంతంలో నా కొత్త సరుకు ఎక్కువ గిరాకీకి అమ్ముడుపోతాయి. నా పరివారానికి, దారిలో మంచి మంచి కూరలూ, పళ్ళూ లభిస్తాయి. ఎడ్లకు మంచి మేత సిద్ధంగా ఉంటుంది. వాగుల్లో, బావుల్లో తేటనీరు లభిస్తుంది. అన్నింటికంటె ముఖ్యంగా నా సరుకులకు ఎక్కువ గిరాకీ లభిస్తుంది". ఉపగుప్తుడు ఈ విధంగా అనుకున్నాడు. "సరే నేను తర్వాత వెళ్ళితేనే మంచిదేమో! ఒకసారి పశువులు తొక్కి మేసిన గడ్డి రెండవసారికి బాగా ఉంటుంది. నీళ్ళకొరకు ముందు వెళ్ళినవాళ్ళే బావులు తీయిస్తారు. కొత్త ప్రదేశంలో ధరలు ఎలా ఉంటాయో తెలియదు. కాబట్టి, మొదట వెళ్ళిన వాళ్ళు నిర్ణయించిన ధరకే సరుకులు అమ్ముకోవచ్చు.

ముందు నేనే వెళ్తానన్నాడు మయూఖుడు. సరేనన్నాడు ఉపగుప్తుడు. చేరవలసిన కొత్తప్రదేశం చాలా దూరంలో ఉంది కాబట్టి తినుబండారాలు, నీళ్ళు కావలసిన సదుపాయాలతో బయలుదేరాడు మయూఖుడు.

మయూఖుడు ప్రయాణం చేసీ చేసీ ఒక పెద్ద ఎడారిలోకి వచ్చాడు. ఎడారి మధ్యలోకి పోగానే అతనికి ఒక అపురూప రథం ఎదురయింది. తెల్లని గుర్రాలు పూన్చిన ఆ రథం చుట్టూ కొందరు సైనికులున్నారు. ఆ రథం, జనం, గుర్రాలు అన్నీ వర్షంలో తడిచినట్లు, రథ చక్రాలు బురదలో ఉన్నాయి.

ఆహోహోహ్హా! ఏం వర్షమయ్యా మిత్రమా! కుంభవృష్టనుకో! ఆ కనుచూపు మేరలో ఒక అడవి ఉంది. ఆ అడవిలో విపరీతమైన వర్షం. ఎక్కడ చూసినా సరే. వాగులు, సెలయేళ్ళూ, నూతులూ, గోతులూ, కొలనులు, చెరువులు నిర్మలమైన నీటితో నిండిపోయాయనుకో. మీరటే గదా వెళ్తున్నారు. మరింత కష్టపడి ఇన్ని బళ్ళ నిండా ఇంతింత పీపాలలో నీళ్ళు పట్టుకు వెళ్ళడం ఎందుకు చెప్పండి. అసలే ఇసుకలో బళ్ళు లాగలేక ఎడ్లు చస్తుంటే! చూడగా మీరెవరో తెలివి తక్కువ దద్దమ్మల్లా ఉన్నారే!" అని ఎగతాళి చేస్తూ వెళ్ళిపోయారు వాళ్ళు.

మయూఖుడు ఆ మాటలన్నీ విని అతని పరివారం అంతా అది నిజమేనని అనుకుని మోత దండిగ కాకపోతే మరెందుకనుకొని. నీళ్ళన్నీ ఇసుకలో పారబోసారు. తేలిగ్గా బళ్ళను తోలుకొని యెంత దూరం ముందుకు పోయినా నీటిచుక్క కనబడలేదు. అడవీ రాలేదు. ఆ ఎడారిలో 'దాహం దాహం' అంటూ మయూఖుడు, అతని పరివారం, ప్రాణాలు వదిలారు. ఇందాక దారిలో కనిపించిన సైనికులు వారి దగ్గర ప్రత్యక్షమై బ్రహ్మరాక్షసులుగా మారి వారిని తినేశారు. దూరాలోచన లేని మఖుడు ఆ విధంగా మరణించాడు.

మరి కొన్నాళ్ళకు ఉపగుప్తుడు బయలుదేరాడు. మునుపు మయూఖుడు వెళ్ళిన దారినే వస్తూ ఎడారి మధ్యకు వచ్చేసరికి లోగడలాగానే రాక్షసులు సైనికుల రూపంలో ఎదురై నీరు పారబోసి పొమ్మన్నారు.

ఉపగుప్తుడు ముందు చూపు గలవాడు. సేవకులు నీటిని పారబోయపోతే వారిని ఆపి ఇలా అన్నాడు.

"ఆగండి. తొందరపడకండి. వాళ్ళు నరరూప రాక్షసులు, వాళ్ళ పాదాలు కింద ఆనడంలేదు, గుర్రాల డెక్కలూ అంతే. రథ చక్రాలూ అంతే. నేను పరిశీలనగా చూశాను. రథ చక్రాలు బురదలో ఉన్నాయి. ఇసుక ఎడారిలో బురద ఎక్కడ? ఎడారిలో అడవులుంటాయని విన్నారా? ఒక్క వాన దెబ్బకే కొలనులూ, చెరువులూ, నూతుతూ, గోతులూ, వాగులూ, సెలయేళ్ళు నిండుతాయా? సరే నిండినా వాననీరు తేటగా ఉంటుందా? ఆకాశం చూడండి. ఒక్క మేఘమైనా కనిపించిందా? వీరి మాటలు నమ్మి మనం నీళ్ళు పారబోస్తే మరల నీరు దొరకక గొంతు ఎండి చస్తాం. మనం చచ్చాక వీరు వచ్చి మనల్ని తింటారు. కొత్త నీరు కనిపిస్తే ఈ నీళ్ళు పారబోద్దాంలే! పదండి?" అనగానే అంతా ముందుకు కదిలారు.

ఎంత దూరం వెళ్ళినా నీటిజాడ కనబడలేదు. మయూఖుని పరివారం తాలూకూ అస్థిపంజరాలు కనబడ్డాయి. నిజానిజాలు అర్థమయ్యాయి. ముందుచూపుగల ఉపగుప్తుని వల్ల అంతా ప్రాణాలతో బయటపడ్డారు. కాబట్టి ఏ విషయాన్నైనా సహేతుకంగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి.

*– బుద్ధుని నీతి కథలు – 'ధర్మాన్ని విడువకు'*

## 8. అహింస

ఒక పట్టణంలో "దయా సాగరుడు" అనే ఒక ధనవంతుండేవాడు. దయ ఆయన స్వభావం. దానం ఆయన ప్రవృత్తి. అహింస ఆయనలోని సద్గుణం. ఈ సద్గుణములను ఆచరణ ద్వారా చూపించే వాడు కనుకనే ఆయనను "దయాసాగరుడు" అని ప్రజలు పిలిచేవారు. ఒకనాడు ఒక బెస్తవాడు ఒక చెరువులో కొన్ని చేపలను పట్టి అమ్ముకోవడానికి వస్తాడు. వలలో చిక్కుకొని గిలగిలలాడుతున్న చేపలను చూచి బాధపడి వాటికి వెలఇచ్చి అన్నిటినీ కొని, వాటిని తీసుకొని వెళ్ళి అదే చెరువులో వదిలిపెడతాడు దయాసాగరుడు. తిరగకుండా డబ్బు వస్తున్నదని భావించిన బెస్తవాడు మరునాడు కూడా చేపలను దయాసాగరుని ఇంటికి తీసుకొనివస్తాడు. దయాసాగరుడు వాటిని కూడా కొని డబ్బు ఇచ్చి ఆ చేపలను చెరువులో వేయమని పంపుతాడు. బెస్తవాడిని ఉండమని చెప్పి కొన్ని నీతులు బోధిస్తాడు.

"నిన్ను ఎవరైనా కొడితే ఏం చేస్తావ్?" తిరిగి కొడుతావా? 'ఎందుకు?' 'నన్ను బాధించాడు కాబట్టి', అయితే నీవు చేపలను బాధిస్తున్నావు గదా! "వాటికి మాటలు రావు, నిన్ను కొట్టలేవు గదా?" నిజమే! వాటికి ప్రాణం ఉన్నది గదా? బాధపడతాయి గదా!" "అది నా ప్రవృత్తి, భుక్తినిస్తున్నాయి".

"నీ భుక్తి కోసం, ఇతరులను బాధించడం ఎంత తప్పో! ఇతర జీవరాసులను కూడా బాధించడం అంతే తప్పు. హింస చేయడం మహాపాపం! సమస్త ప్రాణికోటిని పుట్టించింది ఆ భగవంతుడే. "సర్వజీవ తిరస్కారః కేశవం ప్రతిగచ్ఛతి" ఏ జీవిని తిరస్కరించినా, బాధించినా భగవంతుని బాధించినట్లే, సర్వ జీవులలో భగవంతుడున్నాడు. కనుక ఏ జీవిని బాధించరాదు, హింసించరాదు" అని హితబోధ చేస్తాడు దయాసాగరుడు.

*– మూలం : నీతి సుధ పంచమభాగం 54వ పేజీ*

## 9. విచక్షణ

ఒక ఊళ్ళో రామశర్మ అనే ఆసామీ ఉండేవాడు. అతనికున్నది ఆ కుటుంబంలో తరతరాలుగా సంక్రమిస్తూ వస్తున్న ఏకైక సంపద – ఒక విలువైన రత్నం. రామశర్మకు వయసు పైబడడంతో కాశీ, రామేశ్వరం వంటి పుణ్యతీర్థాలకు వెళ్ళి వద్దామనిపించింది. అందువల్ల తన మిత్రుడు, పక్కింటి శ్రీమంతుడైన శ్రీనివాసులుకు ఆ రత్నాన్ని ఇచ్చి, తాను తిరిగి వచ్చే వరకూ భద్రంగా ఉంచమన్నాడు.

రామశర్మ తీర్థయాత్రలు ముగించుకుని వచ్చి, తన రత్నాన్ని తిరిగి ఇమ్మని శ్రీనివాసుల్ని అడిగాడు. "అదేమిటి? శర్మా! దాన్ని ఎప్పుడో నీకు తిరిగి ఇచ్చేశాను కదా... ఎలా మరిచిపోయావు?" అని అన్నాడు శ్రీనివాసులు. పచ్చి అబద్ధం తీర్థయాత్రల నుంచి వచ్చాక నేను మీ ఇంటికి రావడం ఇదే మొదటిసారి. రత్నాన్ని నాకెప్పుడిచ్చాడు?" అని గట్టిగా కేకలేశాడు. రామశర్మ. "నువ్వలా అంటావని' నాకు తెలుసు. అందుకే క్షురకుడు, తాపీ పనివాడు, బట్టలు ఉతికేవాడు ఈ ముగ్గురినీ సాక్షులుగా పెట్టుకుని, ఆ రత్నాన్ని నీకు తిరిగి ఇచ్చేశాను" అని అన్నాడు శ్రీనివాసులు అతని కంటే గట్టిగా అరుస్తూ.

తక్కిన అన్ని తగాదాల్లాగే ఇదీ మర్యాద రామన్న న్యాయస్థానానికి వచ్చింది. మర్యాద రామన్న ఇద్దరు చెప్పినదీ శ్రద్ధగా విన్నాడు. ఆ ముగ్గురు సాక్షులను ప్రవేశపెట్టమన్నాడు. ముగ్గురూ వచ్చాక వాళ్ళను విడివిడిగా మూడు గదుల్లో ఉంచాడు. ముందుగా క్షురకుడిని "శ్రీనివాసులు రత్నాన్ని రామశర్మకు ఇవ్వడం నువ్వు చూశావా?" అని అడిగాడు మర్యాదరామన్న. "చూశానండీ" అని ఎంత మాత్రం తొణక్కుండా సమాధానం చెప్పాడు క్షురకుడు.

"అయితే, నువ్వు ఆ వెనుక ప్రాంతానికి వెళ్ళి, ఆ రత్నం పరిమాణంలో ఉన్న ఒక రాయిని తీసుకురా" అన్నాడు మర్యాదరామన్న తక్కిన ఇద్దరు సాక్షుల్ని అదే విధంగా పురమాయించాడు. మరి కొంతసేపయ్యాక, తీర్పు సిద్ధంగా ఉందని తెలియజేశాడు. న్యాయస్థానంలో అందరూ నిశ్శబ్దంగా వినసాగారు. "శ్రీనివాసులు రామశర్మ రత్నాన్ని కాజేశాడు. అతనికి మూడు ఏళ్ళు కఠిన కారాగార శిక్ష విధిస్తున్నాను. క్షురకుడు, తాపీపనివాడు, బట్టలుతికేవాడు దొంగ సాక్ష్యాలు చెప్పారు. అందువల్ల ఒక్కొక్కరూ రెండేసి సంవత్సరాలు చొప్పున కారాగార శిక్ష అనుభవించాలి" అన్నాడు.

అక్కడున్న ప్రముఖులు ఈ సమస్యను ఎలా పరిష్కరించిందీ చెప్పమని మర్యాదరామన్నను కోరారు.

"రత్నం ఆకారంలో ఉండే రాళ్ళు తీసుకురమ్మని ఆ దొంగ సాక్షులకు చెప్పాను. కత్తిని పదును పెట్టుకోవడానికి అనువైన ఆకారంలో ఉన్నరాయిని క్షురకుడు తీసుకువచ్చాడు. బట్టలు ఉతికేవాడు బండరాయిని, తాపి పనివాడు ఇటుక లాంటి రాయిని తెచ్చాడు. మూడు వేర్వేరు పరిమాణాల్లో ఉన్నాయి. రత్నం వాటి ఆకారంలో ఉండదు కదా! దీన్ని బట్టే వారు తప్పుడు సాక్షమిచ్చారని అర్థమైనది" అన్నాడు మర్యాదరామన్న.

మర్యాదరామన్న విచక్షణకు అందరు ఆనందపరవశులయ్యారు.

## 10. ఓటమిలోనూ గెలిచిన యోధుడు

భారతదేశ చరిత్ర క్రీ.పూ. 326వ సం॥లో కొత్త మలుపు తిరిగింది. రాజ్యకాంక్షాపూరితుడైన యువవీరుడూ, సాహసప్రియుడూ అయిన గ్రీకుదేశం మెసిడోనియా రాజు అలెగ్జాండర్ (356-323) మన దేశంపై దండయాత్ర చేసిన సంవత్సరం అది. తక్షశిల పాలకుడైన అంభి ఆయనకు సాదర స్వాగతం పలక కుండా ఉన్నట్టయితే, అలెగ్జాండర్‌ను భారత భూభాగంపై పాదం మోపకుండా తరిమి కొట్టి ఉండవచ్చు.

అంభి ఆ చర్యకు కారణం అతిథుల పట్ల ఆదరభావం కాదు. జీలం నదీ తీరంలో సిరి సంపదలతో, శాంతి భద్రతలతో రాజ్యమేలుతూన్న తన పొరుగు రాజు పురుషోత్తముణ్ణి ఓడించాలన్న దురాశే అందుకు కారణం! పరాయి

చక్రవర్తికి పాదాక్రాంతుడై, తాను దాసోహం అనడమే గాక, అంబి ఇరుగు పొరుగు రాజులనుసైతం, తన సభకు రప్పించి, అలెగ్జాండర్ ఆధిపత్యాన్ని అంగీకరించేలా చేయడానికి ప్రయత్నించాడు. చిన్నా చితక పాలకులు అందుకు సమ్మతించి తలలు ఒగ్గారు.

అయితే, ధైర్యశాలీ, మానధనుడూ అయిన పురుషోత్తముడు మాత్రం అందుకు అంగీకరించలేదు! ఆ కాలంలో మనరాజులు యుద్ధాలలో గజబలాన్ని, అంటే ఏనుగులను ఉపయోగించేవారు. శిక్షణ పొందిన బ్రహ్మాండమైన ఆ జంతువులను ఎలా ఎదుర్కోవాలో గ్రీకుసైనికులకు తెలియదు. అయితే, అంబి వారికి ఏనుగులను ఎదుర్కొనే పద్ధతులను, మెళకువలను నేర్పి సాయపడ్డాడు. అలెగ్జాండర్ జీలంనదీ కేసి సేనలను నడిపించి నదీ తీరం చేరాడు. నదిని దాటడం అంత సులభంగా తోచలేదు. సైనికులు పడవలలో వెళ్ళినప్పుడు పురుషోత్తముడి సేనలు ఎదుర్కోవచ్చు.

అలెగ్జాండర్ కొన్నాళ్ళు అక్కడే బసచేసి తీవ్రంగా ఆలోచించసాగాడు. అంతలో అంభి అంతగా లోతులేని నదీ ప్రాంతాన్ని చూపాడు. వెంటనే అలెగ్జాండర్ ఒక పథకం ఆలోచించాడు. కొందరు సైనికులను పడవలలో నదిని దాటమని ఆజ్ఞాపించాడు. పడవలలో వస్తూన్న సైనికులను ఎదుర్కోవడంలోనే పురుషోత్తముడు గురిగా ఉన్న సమయంలో, అలెగ్జాండర్ సేనలు మరోవైపు నీళ్ళు తక్కువగా ఉన్న చోట నదిని దాటి ఆవలి తీరం చేరాయి.

అనూహ్యమైన ఈ పరిణామానికి దిగ్భ్రాంతి చెందిన పురుషోత్తముడు, మరుక్షణమే శత్రుసేనలను ధైర్యంగా ఎదుర్కొన్నాడు. ఆ రోజంతా తన కన్నా ఎంతో బలమైన శత్రుసేనలతో సాహసోపేతంగా పోరాడాడు. ఇరవై వేలకు పైగా సైనికులు హతులయ్యారు. సూర్యాస్తమయ సమయానికి పురుషోత్తముడు గుర్రంపై ఒంటరిగా మిగిలాడు. అయినా, తనను బంధించడానికి వచ్చే శత్రుసైనికులను తెగ నరకడానికి సిద్ధమయ్యాడు. ఆయన అనుపమాన ధైర్య సాహసాలను ప్రత్యక్షంగా చూసిన అలెగ్జాండర్ ముగ్ధుడయ్యాడు. లొంగిపొమ్మని అంభి ద్వారా సందేశం పంపాడు. భయం భయంగా తనను సమీపించిన అంభిని చూగానే, “దేశద్రోహీ! నీ ముఖం నాకు చూపకు. పారిపో, పిరికి పందా,” అని పురుషోత్తముడు గర్జించాడు. మరికొంత సేపటికి పురుషోత్తముడు తీవ్రంగా గాయపడ్డాడు. నుదుటితో సహా శరీరమంతా నెత్తురోడుతున్న తొమ్మిది గాయాలు. అయినప్పటికీ బాధనూ, విషాదాన్నీ ఆయన ఏమాత్రం బయట పెట్టలేదు. అలెగ్జాండర్ దళనాయకులు ఆయన్ను చుట్టుముట్టి తమ రాజు వద్దకు నడిపించారు. క్షమాగుణం నలుసంత కూడాజూప లేని తమ రాజు పురుషోత్తముణ్ణి వెంటనే శిరశ్ఛేదం చేయగలడనే గ్రీకు సైనికులు భావించారు. ఎందుకంటే శత్రువులను ఏమాత్రం ఉపేక్షించని కఠిన స్వభావం ఆయనది.

ఆయన రాజ్యకాంక్ష కలవాడు మాత్రమే కాదు; పరమ కోపిష్ఠి. ఒకసారి ఆయన మిత్రుడు అనారోగ్యం పాలయ్యాడు. శీతల మద్యపానం, మాంసాహారం ముట్టుకోకూడదని వైద్యులు సలహా ఇచ్చారు. వైద్యుల సలహాను పెడచెవిని పెట్టడంతో అతడు మరణించాడు. మిత్రుడి మరణాన్ని భరించలేని అలెగ్జాండర్, ఆగ్రహంతో వైద్యులందరికీ మరణశిక్ష విధించాడు!

అంతేకాదు, మరణించిన తన మిత్రుడి ఆత్మకు ప్రేతాత్మల రూపంలో తోడుగా ఉంటారని ఆ గ్రామ ప్రజలందరినీ హతమార్చాడు. అలెగ్జాండర్ నిర్ధాక్షిణ్యమైన కర్కశ స్వభావాన్ని దాటే సంఘటనలు ఇవి! అలెగ్జాండర్ తన పర్షియన్ జైత్రయాత్రలో ఎందరో రాజులను ఓడించాడు. అయినా, ఈ స్థితిలోనూ తనతో ద్వంద్వ యుద్ధానికి సుముఖంగా ఉన్నట్టు కనిపించిన పురుషోత్తముడి వంటి వీరుణ్ణి ఆయన ఎన్నడూ చూడలేదు. బందీగా నిలబడ్డ అతన్ని ఒకసారి మెచ్చుకుంటున్నట్టు

చూశాడు. అంభి కుట్రలు, కుతంత్రాలు, ద్రోహ చింతనలు లేకుంటే అతడు ఓడేవాడు కాదని ఆయనకు తెలుసు! “పురుషోత్తమా! యుద్ధం ముగిసింది. నిస్సహాయుడుగా నిలబడి ఉన్నావు. నిన్నెలా చూడమంటావు?” అని అడిగాడు అలెగ్జాండర్.

“అలెగ్జాండర్, నువ్వు న్యాయబద్ధమైన చక్రవర్తివే గనక అయితే, సాటి చక్రవర్తిని ఎలా గౌరవించాలో నీకే తెలుసు!” అన్నాడు పురుషోత్తముడు గంభీరంగా. “అవును. చక్రవర్తికి తగ్గ గౌరవంతో నిన్ను నడిపించాలి. మరింకేదైనా కోరుకుంటున్నావా?” అని అడిగాడు అలెగ్జాండర్ మళ్ళీ. “లేదు. నువ్వు నన్ను సాటి చక్రవర్తిగా గౌరవిస్తే, నాకు అవసరమైనవి సమస్తం అందులోనే సమకూరుతాయి కదా!” అన్నాడు పురుషోత్తముడు నిస్సంకోచంగా, ఆ మాటకు అలెగ్జాండర్ ముగ్ధుడయ్యాడు. పురుషోత్తముడి రాజ్యాన్ని వశపరచుకోకుండా వదిలిపెట్టాడు.

పురుషోత్తముడు కనబరచిన అసమాన ధైర్యం, అచంచలమైన ఆత్మస్థైర్యం, అసాధారణ ఆత్మగౌరవం అలెగ్జాండర్‌ను అబ్బురపరచాయి. మనిషిలోని నిర్భీతి, ఉన్నత గుణాలు శత్రువులను సైతం ప్రభావితం చేస్తాయి! పరస్పర ఉదాత్త గుణాలతో పురుషోత్తముడు, అలెగ్జాండర్ ఉభయులూ పరమానందం చెందారు. అయితే, అంభి మాత్రం విషాదగ్రస్తుడయ్యాడు.

# 5. స్ఫూర్తి దాతలు

రామకృష్ణ
పరమహంస



మానవుడు నిత్యజీవితంలో ఎదురయ్యే ఎన్నో సమస్యలను పరిష్కరించుకుంటారు. కానీ 'నేనెవరు' అన్న చిన్న ప్రశ్నకు మాత్రము సరియైన సమాధానము తెలుసుకోలేకపోతున్నాడు.

ఎవరైనా మనలను 'నీవెవరు' అని అడిగితే వెంటనే మనపేరు, ఉనికి చెప్పగలము. నిజానికివి మన శరీరానికి సంబంధించిన చిరునామా మాత్రమే? ఈ 'ప్రేమ' అనేది ఆత్మకు, నాది అనేది శరీరానికి వర్తిస్తుందని తెలుసుకోలేకనే మానవుడు దేహాభిమానంతో దుఃఖానికి అశాంతికి లోనవుతున్నాడు. అంతేగాక, మన స్వార్థం కోసం పరులను మోసగించడం, అన్యాయం చేయడం, అబద్ధాలాడడం అప్రమాణాలు చేయడం చేస్తున్నాడు. దీనివలన కామక్రోధాది వికారములు హింస, అశాంతి, దుఃఖం మానవ జీవితంలో చోటు చేసుకున్నవి. ఫలితంగా మానవ జీవితం స్థిమితం స్థిరత్వం లేనిదయినది. తన దుర్గుణాది దుష్కర్మల వలన విషయలోలుడై మృగాల కంటే హీనంగా బ్రతికే స్థితికి మానవుడిలోని స్వార్థం తీసుకుని వెళుతుంది. విచక్షణాజ్ఞానం పూర్తిగా పోతుంది. ఆశ, మహావేశాలు పెరుగుతవి. సక్రమముగా సాగిపోవలసిన మానవజీవితం ఈ స్వార్థం వలన భయోత్సాహాలతో నడుస్తుంటుంది. క్రమేపీ మానవుడు రాక్షసుడౌతాడు. నరకంలో ప్రవేశిస్తాడు.

మానవుడు మానవుడుగా ఉంటేనే సంఘ జీవితం ఒడుదుడుకులు లేకుండా నడుస్తుంది. మానవుడు ఈ భూమిమీదనే స్వర్గాన్ని సృష్టించుకోవచ్చు. నిర్మల మనస్సులతో, నిశ్చితంగా జీవితం నడుపుకోవచ్చు. తన మంచి ప్రవర్తన వలన దైవత్వాన్ని పొందగలడు. సంఘజీవితం సాఫీగా నడిచేందకు మన పూర్వులు తమ అనుభవాలతో కొన్ని కట్టుబాట్లు, ఆచారాలు, నియమనిష్టలు పెట్టారు. అవి పాటించినంత కాలం మానవ జీవితాలు హాయిగా, ఆనందంగానే సాగిపోయినవి.. ముందు

తననుతాను తెలుసుకుంటే ఈ అనర్థాలుండవు అని మనకు తెలియచెప్పేందుకే అప్పుడప్పుడూ అక్కడక్కడా కొందరు కాలాతీతంగా, లోకాతీతంగా మనలో మన మధ్యలోనే పుడుతుంటారు. ఎవరు ఏమనుకున్నా వాడుచేసేది చేయదలచుకున్నదీ చేసి వెళ్ళిపోతారు. అలాంటి మహనీయులలో ఒకరు "శ్రీ రామకృష్ణ పరమహంస" అతి సామాన్యంగా పుట్టి, తన స్వయంకృషితో భగవంతుని సన్నిధానానికి వెళ్ళిన పరమ భక్తాగ్రేసరుడీయన.

అంతేకాదు, వివేకానందునిలాంటి శిష్యుని తయారుచేసి అనాధి ప్రసిద్ధమైన భారతీయ సంస్కృతిని, జీవనాన్ని నాగరికతను ప్రాక్పశ్చిమ దేశాలకు తెలియపరచేందుకు దోహదకారి అయినాడు.

వంగ (బెంగాలీ) బ్రాహ్మణ కుటుంబంలో ఫిబ్రవరి 18-1836, చంద్రమణి కుడీరాములను దంపతులకు కామారిపుష్కరమను బ్రాహ్మణపల్లెలో జన్మించాడు. ఈ మహనీయునికి రామకుమార్, రామేశ్వరుడు అను ఇద్దరు అన్నలు, ఒక అక్కగారు ఉండేది.

కుడీరాము కుటుంబం నిరుపేదకుటుంబం, అయినా అతిథి అభ్యాగతులకు దైవపూజలకు ఏలోటూ ఉండేదికాదు. రామకృష్ణుడు పుట్టకముందు ఆ ఊరిలోని ఓ ధనవంతుడు ఒక తగాదా విషయంలో రామకృష్ణుని తండ్రిని తనకనుకూలంగా కోర్టులో సాక్ష్యం చెప్పమన్నాడు. అది అన్యాయమని తను చెప్పవలసింది తప్పుడు సాక్షమని తెలిసి కుడీ రామ్ తానా సాక్ష్యం చెప్పనన్నాడు. అడిగినంత డబ్బు ఇస్తానని ఆ ధనవంతుడు కుడీరామ్‌ను ఆశపెట్టినా ఆయన వినలేదు. అందుకా ధనవంతుడు కోపగించి కుడీరామ్‌కు హానితలపెట్టు ఉద్దేశ్యం తెలుసుకుని భార్యపిల్లలతో సొంత ఊరు వదలి మరో గ్రామం చేరి, ఆ తర్వాత ప్రసిద్ధ గదాధర క్షేత్రమైన గయకు వెళ్ళాడు. హిందువులకు పవిత్ర పుణ్యక్షేత్రం గయ. పితృ దేవతలకు అక్కడ పిండ ప్రధానం చేసిన శాశ్విత పుణ్యలోక ప్రాప్తి జరుగుతుందని పెద్దలు చెపుతుంటారు.

కడీరామ్‌కు ఆ క్షేత్రం వెళ్ళి పిండ ప్రధానాలాచరించి నిద్రిస్తుండగా కలలో ఆ గయాక్షేత్రాధిపతియైన గదాధరుడు కనిపించి తానాతనకి పుత్రునిగా పుట్టబోతున్నట్లు చెప్పి అంతర్హితుడయ్యాడు. ఆ తర్వాత పుట్టిన శిశువుకు సాక్షాత్ గదాధరుడే పుట్టాడని గదాధరుడనే పేరు పెట్టారు. రోజుల నెలల పిల్లవాడికి ఆయన మహిమలు కన్పడటం ప్రారంభించినవి.. ఒకప్పుడు తేలికగా, మరొకప్పుడు బరువుగా ఉండేవాడు. ఏ విషయం విన్నా, వెంటనే ఆ విషయాన్ని చెప్పగలిగేవారు 'ఏకసందాగ్రహి' అని పేరు తెచ్చుకున్నాడు.

చిన్నతనంలో చూచిన నాటకాలన్నీ ఇంటికి రాగానే ఆ పద్యాలు, పాటలు, ఆయాపాత్రల సంభాషణలు, ఒక్కటీ వదలకుండా తల్లిదండ్రులకు చెప్పేవాడు. బాల్యం నుండే భక్తి ఎక్కువగా ఉండడం వలన ఆ ఊరిలో వారీయనను బాలప్రహ్లాదుడనేవారు. అంతటి చిన్నవయస్సులోనే గంటల తరబడి స్థిరమనస్సుడై ధ్యానము చేస్తుండేవాడు. మణిక రాముడనే కామారి పుష్కరిణి చెందిన ధనవంతుడు బాల రామకృష్ణుని గురించి మహిమలు గలవాడని అప్పుడప్పుడు వస్తూ వెళుతుండేవాడు.

శ్రీ రామకృష్ణునికి ఏడో ఏట తండ్రి కుడిరామ్ మరణించాడు. తొమ్మిదవ ఏట ఉపనయనము చేశారు. ఆ తర్వాత వదినగారయిన రామకుమారుని భార్య ఓ మగ శిశువుని కని మరణించినది.

రామకుమారుడు భార్యా వియోగముతో విరక్తి చెంది కలకత్తా చేరాడు. కొద్దిరోజులకు శ్రీరామకృష్ణ కూడా కలకత్తా వచ్చి ఓ ధనికుని ఇంట అమితభక్తి శ్రద్ధలతో పూజలు చేయడం వలన వారంతా ఈతని భక్తి ప్రవత్తులకు ఆశ్చర్యపోయేవారు. రామకృష్ణుడంటే వారికి అమిత భక్తి శ్రద్ధలు కలిగినవి.

ఈ సమయంలో కలకత్తాకు ఉత్తరదిశగా నున్న దక్షిణేశ్వరమని ప్రసిద్ధ పుణ్యక్షేత్రంలో రాణి రానమణియను ఓ జమిందారిణి కాళికాదేవి ఆలయాన్ని కట్టించినది. అప్పటికే అక్కడ ఆ క్షేత్రానికి అధి దేవతయిన భవతారిణీదేవి ఆలయం దేశాలయం రాధాకృష్ణాలయములు ఉన్నవి. రానమణి గొప్ప భక్తురాలు. భర్త మరణించాక ఆమె కాశీకి పోయి స్థిరపడాలని సన్నాహంలో ఉండగా జగన్మాత సాక్షాత్కరించి కాశీకి పోవలదని, దక్షిణేశ్వరములోనే ఆలయాన్ని కట్టించమని చెప్పినదని, రానమణి ఆలయాన్ని పూర్తి చేసినదిగానీ అర్చకులెవ్వరూ రాలేదు. ఇప్పుడు రామకుమారుడు ఆ దేవాలయాన్ని బ్రాహ్మణుల పేర రాసినవారు వచ్చి పూజలు చేయదురని చెప్పగా ఆమె ఆ విధముగా చేసినది. వెంటనే రామ కుమారుడు అర్చకునిగా వచ్చి పూజాదికాలు దివ్యంగా నిర్వర్తించాడు. కొద్ది కాలానికి వారు మృతి చెందడంతో కుటుంబ భారము రామకృష్ణునిపై బడింది.

రామకృష్ణునికి భగవధ్యానం ఎక్కువయింది. విశ్రాంతి దొరికినప్పుడల్లా ప్రక్కనే ఉన్న పంచవటి అను స్మశానానికి వెళ్ళి తపస్సు చేస్తుండెడివాడు. కొన్ని రోజులకు కాళికామాత ప్రత్యక్షమై అతనికి ఉపదేశము లిచ్చుచుండేది. రామ కృష్ణుని శక్తి సామర్థ్యాలు అందరికీ తెలిసినవి. స్మశానవాటిక చుట్టు తులసి మొక్కలు, పారిజాతపు చెట్లు పెంచారు భక్తులు. దానికి చుట్టూ ఆవరణ కట్టాలని రామకృష్ణుడికి సంకల్పము కలిగినది. గంగానది వరదలలో కలిసిన సామాగ్రి అంతా కొట్టుకు వచ్చినది. క్షణాలలో దానికి ప్రహరీ ఏర్పడింది.

రామకృష్ణుని దివ్య శక్తులు విని రెండవయన్న రామేశ్వరుడు తల్లి రాణి కామారి పుష్కరిణికి రమ్మని చెప్పిపంపారు. తల్లి ఆజ్ఞమేర స్వగ్రామము మరీ భక్తి పరుడయి సన్యాసిగా మారుతున్న కుమారుని చూచి ఆతనికి వివాహము చేసిన కొంత మార్పు వస్తుందని తలంచి ఆయనకీ విషయం చెప్పినది. జయరాంభట్ గ్రామములోని రామచంద్ర ముఖోపాధ్యాకు కుమార్తె శారదామణి తన భార్యగా భగవంతునిచే నిర్దేశింపబడినదని వారికి రామకృష్ణుడు చెప్పాడు. రామేశ్వరుడు ఆ ఊరు వెళ్ళి ముఖోపాధ్యాయకు ఈ విషయము చెప్పగా అతడు సంతోషముతో శారదా రామకృష్ణులకు 1859లో వివాహము చేశారు.

1861 వరకూ వారదా రామకృష్ణులు కామారి పుష్కరములోనే ఉన్నారు. ఆ సంవత్సరమే రానమణి స్వర్గస్థురాలై ఆ యాస్థికి ఆమె అల్లుడు మధురుడు వారసుడయినాడు.

రామకృష్ణునికి ఓరోజు కాశీమాత ధ్యానంలో ఉండగా కాళీమాత కనబడి ఒక యోగిని వచ్చి నీకు కొంత విద్య నేర్పుతుంది. నేర్చుకోమని చెప్పిని. ఆ ప్రకారమే భైరవీ బ్రహ్మణి అను యోగిని వచ్చి యోగశాస్త్ర రహస్యాలు తెలిపినది. ఆమె తాంత్రిక, వైష్ణవ సాధనా విధానాలు తెలిసి అనుభవపూర్వకంగా చూసిన మహనీయురాదు 64 తాంత్రిక సాధనాలు ఆయన చేత చేయించినది. రామకృష్ణుడు సాధారణ మానవుడు కాడని అవతారపురుషుడని చెప్పినది ఆమెయే.

ఈ విషయం కలకత్తాకేగాక దేశములో చాలా దూరం రామకృష్ణుడు గురించి తెలిసినది. ఈ విషయం విని అనేక మంది పండితులు, యోగులు గురువులు వచ్చి పరీక్షించి వెళ్ళారు. అందులో ముఖ్యుడు గౌరీకా తర్కభూషణుడు. రామకృష్ణుడికివేవీ పట్టలేదు. ఆయన దినచర్య ఆయనదే. ఈలోపు తోటపురియను ఒక సన్యాసి వచ్చి రామకృష్ణునికి వేదాంత విద్య బోధించారు. ఆయన చాలా కాలము తపస్సు చేసి ఈ లోకము మిధ్యయని బ్రహ్మమే సత్యమని తెలుసుకున్నవాడు. రామకృష్ణునికి సన్యాసమిచ్చినది ఆయనే!

ఆయనేకాదు, మనకవులు, పండితులు, మహాఋషులు అద్వైత నిగ్గుతేల్చిన సత్యమదే! గదాధరుడుగా ఉన్న రామకృష్ణునికి పేరు మార్చి సన్నిహితంగా ఉండి ఎంతో అభిమానించిన మధురుడు 1871లో మరణించి 1876లో రామకృష్ణుని తల్లి మరణించినది. అన్న రామేశ్వరుడు గతించాడు.

ఆనాటి బ్రహ్మ సమాజములోని పెద్దలు కొందరీయనకు శిష్యులయినా అప్పటివరకూ వారు సన్యాసం లేదని, విగ్రహారాధన కూడదని చెప్పినవారే విధముగానే ఎంతటి మహనీయుడు కనబడినా 'దేవుడ్ని చూపిస్తారా' అని అడిగే నరేంద్రునికి చూపుతాను రమ్మని తన చేతిని అతనికి తాకించి అతనిలో విపరీత మార్పు వచ్చింది! 'నీ కోసమే నేను చూస్తున్నాను ఎన్నాళ్ళకు వచ్చావని' అతనికి తన దివ్య వక్తులిచ్చాడు.

రామకృష్ణుని శిష్యులను ఈశ్వరకోటి అంటారు. ఈయన శిష్యులలో వివేకానందుడు ముఖ్యుడయినా, పూర్ణ చంద్రఘోష్, నాగమహాశయుడు, హరీశుడు, నిరంజనుడు, కాశీపాదుడు, బలరామ్‌బోస్, దేవేంద్రనాథ్ మజుందార్ తారాకానాథ గోపాలుడు, ఇంకా అనేక మంది స్త్రీలు ఉండేవారు.

1885 నాటికే రామకృష్ణ పరమహంస కంఠానికి కేన్సర్ వచ్చింది. ఆయన వైద్యం చేయించుకోలేదు. ఓ రోజు వివేకానందునికి తన సర్వశక్తులు ధారపోశాడు. నా సర్వస్వము నీకిచ్చి నేను ఫకీరునయ్యాను. ఈ శక్తితో లోకానికి మేలు చేకూర్చమని చెప్పి శ్రావణ బహుళ అమావాస్య అర్థరాత్రి రెండు గంటలకు మహాసమాధి చెందాడు.

ఆ తరువవాత వివేకానందుడు రామకృష్ణ మఠం అన్న పేరున ప్రపంచ వ్యాప్తముగా ఆ శ్రీకృష్ణుని బోధనలను ప్రచారము చేస్తున్నారు.

కులమత వర్గ వర్ణవివక్షతలేదు. భగవంతుని చేరే అనేక మార్గాలలో వీరిది ఒకటి. కాని వీరిలో ఒక్క పరమహంస తప్ప భగవంతుని చూచినవారెవరూలేరు. ఈయన సమకాలికులె వంగదేశానికి చెందిన లహరి, ముక్తేశ్వరగిరి, శ్రీసాయిబాబా, కాశీలో స్థిరపడిన తెలుగు మహాయోగి త్రిలింగస్వామి మొదలైనవారు ఉన్నారు.

# సర్దార్ వల్లభాయ్ పటేల్

ఇండోర్ రాజా మల్హరరావు హెూల్కార్ తన ఆస్థాన ప్రముఖునితో చదరంగమాడుతున్నారు. ఆయన తానోడిపోయే దశలో ఉండి చిరాకు పడుతున్నారు.

కొంచెం దూరంలో నిల్చుని ఉన్న ఒక వ్యక్తి ఆ ఆటను నిశితంగా పరిశీలిస్తున్నాడు. రాజావారిని ఆ సంకటం నుంచి తప్పించాలనే ఉద్దేశం అతనికి కలిగింది. సాహసించి "రాజా! పావు నాగడిలో కాదు, ఈ గడికి నడపండి" అని సూచించాడు. రాజు అలాగే చేసి విజయం సాధించారు.

రాజుగారి విజయానికి తోడ్పడిన వ్యక్తి ఝాన్సీ లక్ష్మీభాయి తరపున ఆంగ్లేయులతో పోరాడిన వీరుడు. అతణ్ణి శిక్షించవలసిందని ఇండోర్ రాజుకు ఆంగ్లేయులు అప్పగించారు.

విప్లవం విఫలమైనా ప్రజల్లో విప్లవ వీరులపట్ల గౌరవాదరాలు పెరిగాయి. ఆంగ్లేయులకు తోడ్పడి, విప్లవానికి వెన్నుపోటు పొడిచాడంటు తనపై విమర్శలు రావటం కూడ ఆయన వింటున్నారు. ఈ కారణాలవల్ల విప్లవకారులపట్ల ఆయన దృక్పథంలో మార్పు రాసాగింది. దానికితోడు ఆటలో సాయపడిన అతనిపట్ల రాజు ప్రసన్నులయ్యారు. అందుకే అతణ్ణి విముక్తుణ్ణి చేయవలసిందన్నారు.

ఆ వ్యక్తి కృతజ్ఞతతో రాజుగారికి నమస్కరించి కొలువు వెడలిపోయాడు. స్వగ్రామమైన కరంసద్‌కి వెళ్ళి వ్యవసాయ వృత్తిలో నిమగ్నుడయ్యాడు. అతని పేరు జవేరభాయి పటేల్.

లాడ్‌భాయి అతనికన్నివిధాల అనుకూలవతి అయిన ఇల్లాలు. ఆమె చుట్టాలకు సురభి; అతిథిజ, అభ్యాగతులకు అన్నపూర్ణ. ఆ దంపతులకైదుగురు మగపిల్లలు, ఒక ఆడపిల్ల. ఉక్కుమనిషిగా పేరొంది, రామునికి లక్ష్మణునిలా, కృష్ణునికి అర్జుననిలా గాంధీజీతో అనుబంధాన్ని పెనవేసుకున్న వల్లభభాయి పటేల్ వారిలో నాలుగవవాడు.

**విద్యాభ్యాసం :**

ఆరవ ఏట కరమ్‌సాద్‌లోని ఒక గుజరాతీ పాఠశాలలో పటేల్ విద్యాభ్యాసమారంభమయింది. కాని అక్కడి వాతావరణంగాని, బోధన పద్ధతులుగాని అతనికి నచ్చలేదు. ఆంగ్లవిద్యనభ్యసించాలనే ఉబలాటం ఉంది. కాని ఆ

పాఠశాల నడియాడ్‌లో మాత్రమే ఉంది. అప్పటికే నడియాడ్‌లో మేనమామల ఇంట్లో ఉంటు, అతని అన్న విఠల్‌భాయి విద్యాభ్యాసం చేస్తున్నాడు. పటేల్‌ను కూడ అక్కడకు పంపితే పొదుగు కోసుకొని పాలు తాగినట్లవుతుందని తండ్రి భావించాడు. వల్లభాయ్ నీరుగారిపోయాడు. ఆ పరిస్థితిలో అదృష్టం అతని ఇంటితలుపు తట్టినట్లయింది. తన ఊరిలోనే ఒక ప్రైవేట్ ఆంగ్లపాఠశాల స్థాపించబడింది. అతనికి ప్రాణం లేచివచ్చినట్లయింది. మూడు సంవత్సరాలు ఆ పాఠశాలలో విద్యార్జన చేశాడు. పిదప పెట్లాడ్ గ్రామంలో అతడు తన ఊరివారయిన ఆరుగురు విద్యార్థులతో ఒక వసతిగృహాన్నేర్పరుచుకొన్నాడు. మిగిలినవారిలా వారానికొకసారి ఇంటికివచ్చి సరుకులు తెచ్చుకొంటున్నాడు. రోజుకొకరు చొప్పున వంటచేస్తూ రెండు సంవత్సరాలలో ఐదవ తరగతి పూర్తిచేశాడు. ఇక్కడ చదువు పూర్తిఅయిన తరువాత అతడు నడియాడ్‌లో ఉన్నత పాఠశాలలో చేరాడు.

అన్యాయాన్నెదిరించడం, అందుకోసం ఎంతటివారితోనైనా తలపడడం పటేల్‌కు చిన్ననాటినుండి ఉన్న సుగుణాలు.

పురపాలక సంఘానికి ఒక ఉపాధ్యాయుడు అభ్యర్థిగా నిలబడ్డాడు. ఆయన ప్రత్యర్థి ఎన్నికలో తనకు గెలుపు తథ్యమన్న అహంకారంతో, "బడిపంతులు గెలిస్తే తాను మీసం గొరిగించుకుంటా" నని భీషణ ప్రతిజ్ఞ చేశాడు. అతని ప్రతిజ్ఞను పటేల్ సవాలుగా తీసుకొన్నాడు. తన తోటి విద్యార్థుల సహకారంతో ఆ ఉపాధ్యాయుని పక్షాన రేయింబవళ్ళు కృషిచేశాడు. అతని కష్టం ఫలించి, ఆ ఉపాధ్యాయుడు గెలిచాడు.

22వ ఏట అతనికి మెట్రిక్ పూర్తయ్యింది. న్యాయవాదిగా జీవితం సాగించాలనే కాంక్ష ఉంది. కాని యల్.యల్.బి. పూర్తి చేయాలంటే అధమం ఆరేళ్ళు పడుతుంది. అంతటి తీరికగాని, ఆర్థికమైన తాహతుగాని తనకు లేదు. పుస్తకాలను స్థానిక న్యాయవాదులవద్ద అడిగి తెచ్చుకొని, మూడేండ్లు నిర్విరామకృషి సల్పి, జిల్లా ప్లీడరు పరీక్ష ప్యాసైనాడు.

**లాయరుగా జీవితం :**

వకీలుగ ఆయన గోధ్రాలో రెండు సంవత్సరాలు ప్రాక్టీసు చేశారు. అటుతర్వాత ఆయన పెద్దపట్టణమైన బోర్సదుకు తన కాపురం మార్చారు. కొద్దిరోజుల్లోనే ఆయన క్రిమినల్ లాయరుగా మంచిపేరు సంపాదించారు. పోలీసులు తెచ్చే కేసుల్లో ఆయన ముద్దాయిల తరపున వాదించేవారు. వారు తెచ్చే దొంగసాక్షులను తన ప్రశ్నల పరంపరతో తికమకపెట్టి ముద్దాయిలను విడుదల చేయించేవారు. ఆయన న్యాయశాస్త్రపాటవాలకు తార్కాణంగా కింది కేసు నుదహరించవచ్చు.

ఒక పర్యాయం ఆబ్కారీశాఖ ఇన్‌స్పెక్టర్ దొంగ సారా తయారుచేసేవాణ్ణి పట్టుకొని కేసుపెట్టాడు. అతనివద్ద లభించిన రెండు సారాసీసాల్ని సాక్ష్యాలుగ మేజిస్ట్రేట్ ముందు దాఖలు చేశాడు. ఆ ముద్దాయితరపున పనిచేస్తున్న పటేల్ సీసాలోని ద్రవాన్ని పరీక్ష చేయించాలన్నారు. డాక్టరు పరీక్షవల్ల ఆ సీసాల్లోది సారాయి కాదని, మంచినీరని తేలింది. ఫలితంగా కేసు కొట్టివేయబడింది. చిత్రమేమంటే ఆ త్రాగుబోతు మేజిస్ట్రేట్ సారాయి త్రాగేసి, వాటిలో నీళ్ళు పోశాడు.

ఈవిధంగ పటేల్ చేతిలో కేసులు వీగిపోవటం పోలీసువారికి, ప్రభుత్వ న్యాయవాదులకు కంటకప్రాయమైంది. ఏవో కుంటిసాకులు చెప్పి మేజిస్ట్రేట్ న్యాయస్థానాన్ని ఆనంద్‌కు మార్పించాడు. పటేల్ కూడ అక్కడికే మకాం మార్చారు. మళ్ళీ కథ మొదటికే వచ్చింది. ఏ రాయి అయితేనేం పళ్ళూడగొట్టుకోవడానికన్నట్లయింది. ఇక లాభం లేదని సంవత్సరం తిరక్కుండానే కోర్టును బోర్సద్‌కే మార్చారు.

**భార్యా వియోగం :**

ఒకనాడు పటేల్ కోర్టులో వాదిస్తుండగా తంతి వచ్చింది. ఒకసారి దాన్ని చదువుకొని, మరల తన వాదన కొనసాగించారు. కోర్టు కార్యక్రమం పూర్తయింది. అటుతర్వాత ఆయన భార్య చనిపోయిందన్న వార్త తెలిసి లాయర్లు వల్లభభాయి గుండె నిబ్బరానికి, కార్యదీక్షకు విస్తుపోయారు.

ఆయనకు 16వ ఏటనే వివాహమయింది. వారి అన్యోన్య దాంపత్యానికి చిహ్నాలు కుమార్తె మణిబెన్, కుమారుడు దహ్యాభాయ్. భార్య మరణించేనాటికి పటేల్ వయసు 33 సంవత్సరాలే. మళ్ళీ పెళ్ళి చేసుకొమ్మని ఎందరో ఆయనకు సలహా ఇచ్చారు. కాని భార్యపై గల మమతానురాగాల్ని పురస్కరించుకొని, పునర్వివాహంపై ఆయన ఆసక్తి చూపలేదు.

బారిష్టరు చదువుకోసం సీమకు వెళ్ళేందుకు ఆయనకు అవకాశం వచ్చింది. కుమార్తెను, కుమారుని బొంబాయిలోని 'క్వీన్ మేరీస్ రెసిడెన్షియల్ స్కూల్' లో చేర్చి, 1910 లో ఇంగ్లండులో విద్యనారంభించారు. 'లా' పుస్తకాలు కొనడానికాయనవద్ద సొమ్ములు లేవు. అందుకే ప్రతిదినం తన బసనుండి దాదాపు 12 మైళ్ళ దూరమున్న 'మిడిల్ టెంపుల్' గ్రంథాలయానికి నడచివెళ్ళి, రోజుకు 10, 12 గంటలపాటు గ్రంథపఠనం సాగించారు. ఈవిధంగా రెండు సంవత్సరాలు అహోరాత్రాలు కృషిసల్పి, ప్రథమశ్రేణిలో అగ్రగణ్యుడుగా ఉత్తీర్ణులైనారు. ఏభై పౌన్లు బహుమానం అందుకొన్నారు. విద్యను పూర్తిచేసుకొని, భారతదేశానికి తిరిగివచ్చారు.

తన న్యాయవాద వృత్తిని ఆయన అహమ్మదాబాద్‌లో సాగించారు.

**గాంధీజీతో పరిచయం :**

గాంధీజీ అహమ్మదాబాదులో సబర్మతీ ఆశ్రమం స్థాపించారు. పురప్రముఖులకు కూడలియైన గుజరాత్ క్లబ్బు నొకటి రెండుమార్లు సందర్శించారు. తన ఆశ్రమ లక్ష్యాలను వివరించారు. కాని వల్లభాయ్ మాత్రం నన్నంటుకోవద్దన్నట్టు దూరంగా ఉన్నారు. పైగా గాంధీజీ ఉద్దేశాలను పరిహసించారు.

బీహార్‌లోని చంపారన్ జిల్లాలో ఆంగ్లేయులు నీలి తోటల యజమానులు. వారు భారతీయ రైతులను పీల్చి పిప్పిచేస్తున్నారు. గాంధీజీ అచ్చటి రైతుల సమస్యలను పరిష్కరింపబోయారు. మోతీహరి మేజిస్ట్రేట్ అది సహించలేక పోయాడు. గాంధీజీని ఆ జిల్లాలో అడుగుపెట్టరాదంటు నిషేధాజ్ఞలు జారీచేశాడు. గాంధీజీ ఆ ఆజ్ఞను ధిక్కరించి అరెస్టయారు. తన రాకలోని ఆంతర్యాన్ని మేజిస్ట్రేట్ ముందు వాఙ్మూలమిచ్చారు. దానితో ప్రభుత్వం తన కేసు నుపసంహరించుకొన్నది. ఆ నీలి తోటల వ్యవహారం కూలంకషంగ విచారించేందుకు తన సంసిద్ధతను వ్యక్తం చేసింది.

ఈ వార్త దేశాన్ని ఆసేతు సీతాచలం కదిలించింది. ప్రజలలో రాజకీయ చైతన్యం కల్గించాలనే లక్ష్యంతో 'గుజరాత్ సభ' అనే ప్రజాసంస్థ వెలిసింది. దానికి గాంధీజీ అధ్యక్షస్థానం అలంకరించారు. కార్యదర్శిగ పటేల్ ఆయనకు తోడ్పడడానికుద్యుక్తులయారు. ఆ సంస్థ గోద్రాలో 1917 లో మొదటి రాజకీయసభ నిర్వహించింది. వెట్టిచాకిరీ దురాచారాన్ని నిర్మూలించాలని తీర్మానించి, అది ఆచరణలో విజయం కూడ సాధించింది.

**కైరా సత్యాగ్రహం :**

1918వ సంవత్సరంలో కైరా జిల్లాలో అతివృష్టివల్ల పంటలు నాశనమయ్యాయి. ఆ కారణంచేత శిస్తులు నిలుపు చేయండని రైతులు, శాసనసభ్యులు ప్రభుత్వానికి ఎన్నో విన్నపాలు చేసుకున్నారు. కాని కలెక్టర్ కైరా జిల్లాలోని 603 గ్రామాల్లో కేవలం 104 గ్రామాల్లో మాత్రం శిస్తు నిలుపుచేశాడు. మిగిలినవారివద్ద కఠినచర్యలు తీసుకుని శిస్తులు వసూలుచేయండని ఉత్తర్వులు పంపాడు.

రైతుల బాధల్ని పరిష్కరించేందుకు గాంధీజీ పటేల్ సాయం తీసుకొన్నారు. పంటనష్టం వివరాలను తెలిపేందుకు పటేల్‌తో కలిసి గవర్నరును సందర్శించారు. ప్రభుత్వం తాను పట్టిన కుందేలుకు మూడేకాళ్ళన్నట్లుగా వ్యవహరించింది.

గాంధీజీ అధ్యక్షతన నడియాడులో సభ జరిగింది. ఆయన సత్యాగ్రహానికి ప్రజలను సమాయత్తుల్ని చేశారు. ఎట్టి పరిస్థితుల్లోను శిస్తులు చెల్లించరాదంటు నిర్ణయించబడింది. పటేల్ ఆ ప్రాంత ప్రజలందరిని ఒకే తాటిపై నడిపారు.

శిస్తులు చెల్లించని రైతుల భూముల్ని, పశువుల్ని ప్రభుత్వం స్వాధీనపరుచుకుంది. ఉద్యమం ఆరు నెలలపాటు సాగింది. రైతులు వెనక్కు తగ్గలేదు. ప్రభుత్వానికి పైసా వసూలు కాలేదు.

ఇక తప్పనిసరి పరిస్థితుల్లో ప్రభుత్వమే వెనుకంజ వేసింది. శిస్తులు చెల్లించగల్గిన వారినుండే వసూలు చేయండని ఉత్తర్వులు పంపింది. స్వాధీనపరచుకొన్న భూముల్ని, పశువుల్ని తిరిగి ఇచ్చివేసింది.

ఈ ఉద్యమం సందర్భంగా వల్లభభాయి గాంధీజీకి మరింత చేరవయ్యారు.

### రౌంట్ చట్టం :

దేశ ప్రజల్లో నానాటికి స్వరాజ్య కాంక్ష పెచ్చుపెరుగుతున్నది. దాన్ని అణచివేయాలని ప్రభుత్వం 1919 లో రౌంట్ చట్టం ప్రవేశపెట్టింది. పోలీసులకు విశేషాధికారాలిచ్చింది. ప్రజల వాక్స్వాతంత్ర్యాన్ని హరించింది. గాంధీజీ ఈ చట్టాన్ని రచ్చకీడ్వాలని భావించారు. పటేల్ మొదలైన నాయకులతో సమాలోచనలు జరిపారు. సత్యాగ్రహానికి నాందీ సూచకంగా ఏప్రిల్ 6న హర్తాళ్ చేశారు. 24 గంటలుపవాసదీక్ష వహించారు. పనులు మానివేయాలని దేశ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. భారతీయులందరు తమ మధ్యగల వైషమ్యాలను విస్మరించి, ఒకే బాటలో నడిచారు.

వల్లభభాయి అహమ్మదాబాద్‌లో ఊరేగింపు నిర్వహించి, ప్రభుత్వాన్ని దుయ్యబడుతూ ఉపన్యసించారు. నిషిద్ధమైన గాంధీ సాహిత్యాన్ని విక్రయించారు. ఢిల్లీ, అమృత్‌సర్, లాహోర్ పట్టణాలలో ఊరేగింపులపై పోలీసులు కాల్పులు జరిపారు. ఈ పరిస్థితుల్ని పరిశీలించేందుకు బయలుదేరిన గాంధీజీని మార్గమధ్యంలోనే అరెస్ట్ చేశారు. ఈ వార్త కార్చిచ్చులా దేశమంతటా వ్యాపించింది. దానితో రెచ్చిపోయిన అమృత్‌సర్, అహమ్మదాబాద్ పట్టణాల ప్రజలు దౌర్జన్య చర్యలకు పూనుకొన్నారు. అహమ్మదాబాద్‌లో ప్రశాంత పరిస్థితులు నెలకొనేందుకు పటేల్ ఎంతగానో పాటుపడ్డాడు.

అల్లర్లు సద్దుమణిగాయి. కాని ప్రభుత్వం మాత్రం ప్రతీకార చర్యలకు పూనుకొంది. అహమ్మదాబాద్ పట్టణ ప్రజలపై 9 లక్షల అపరాధపు పన్ను విధించింది. అది చెల్లించటానికి నిరాకరించిన పటేల్ సోఫాను ప్రభుత్వం వేలంవేసి వచ్చిన సొమ్ము జమకట్టుకొంది. అంతేకాక పెక్కుమందిపై అక్రమ కేసులు బనాయించింది. వల్లభాయ్ ముద్దాయిల తరపున వాదించి ఎందరినో విడుదల చేయించారు. ప్రభుత్వం చడిచప్పుడు కాకుండ గాంధీజిని బొంబాయికి తెచ్చి విడిచింది.

### సహాయ నిరాకరణం :

బ్రిటీష్ ప్రభుత్వం పంజాబ్‌లో సైనిక శాసనాన్ని ప్రకటించింది. ప్రభుత్వాధికారులు తీసుకునే చర్యలనే కోర్టులోను సవాలు చేయరాదని శాసించింది. జలియన్ వాలాబాగ్‌లో ప్రశాంతంగ వైశాఖ ఉత్సవాలను జరుపుకొంటున్న ప్రజలపై డైయర్ సేనాని నిర్దాక్షిణ్యంగా కాల్పులు జరిపించాడు. కనీసం వేయిమంది మరణించారు; కొన్ని వేలమంది క్షతగాత్రులయ్యారు. ఇంతటి దారుణానికి కారణభూతుడైన ఆ సేనానిచే ప్రభుత్వం కేవలం రాజీనామా చేయించి వదిలిపెట్టింది. అది భారత ప్రజలకు తీరని మనస్తాపం కల్గించింది.

కలకత్తా, నాగపూర్‌లలో జరిగిన కాంగ్రెస్ సమావేశాలు 'సంపూర్ణ స్వరాజ్యమే ధ్యేయం' అని నిర్ణయించాయి. అందుకు 'సహాయ నిరాకరణమే' శరణ్యంగా నిర్ణయింపబడింది. సహాయనిరాకరణంలో భాగంగా ప్రభుత్వం వారిచ్చిన పతకాలను, బిరుదులను త్యజించారు. ఖద్దరు వస్త్రాలు ధరించారు. బ్రిటీష్‌వారి పాఠశాలలు, న్యాయస్థానాలు వదిలివేశారు. స్వదేశీ పాఠశాలలు స్థాపింపబడ్డాయి. పటేల్ గుజరాత్ కాంగ్రెస్ సంఘానికధ్యక్షుడై, స్వరాజ్య నిధికి 15 లక్షల రూపాయలు సేకరించారు.

1921 లో అహమ్మదాబాద్‌లో జాతీయ కాంగ్రెసు సమావేశం జరిగింది. దానికి పటేల్ ఆహ్వానసంఘాధ్యక్షులు. ప్రజలను త్యాగాలకు సిద్ధం కమ్మని గాంధీజీ ఉద్బోధించారు. శాసనోల్లంఘన కార్యక్రమానికి బార్డోలి తాలూకా ప్రజలను సమాయత్తుల్ని చేశారు.

ఇంతలో ఉత్తరప్రదేశ్‌లోని చౌరీచౌరాలో ఒక ఊరేగింపుపై పోలీసులమానుషంగా ప్రవర్తించారు. ప్రజలావేశపూరితులై పోలీస్‌స్టేషన్‌ను తగులబెట్టారు. ఆ మంటలలో 21 మంది పోలీసులు, ఒక సబ్‌ఇన్‌స్పెక్టరు కుమారుడు కాలి మసి అయ్యారు. గాంధీజీ ఈ వార్త విన్నవెంటనే శాసనోల్లంఘన ప్రయత్నం విరమించారు.

ప్రభుత్వం ఆయనకారేండ్ల జైలుశిక్ష విధించింది. పటేల్ బాపూజీ ఆజ్ఞానుసారం నిర్మాణ కార్యక్రమాలను చేపట్టారు. గుజరాత్ విద్యాపీఠానికి 10 లక్షల రూపాయలు సేకరించి సొంత భవనమేర్పరిచారు. ఆ విద్యాలయాభివృద్ధికి ఎంతగానో పాటుపడ్డారు. గుడ్డల దుకాణాలవద్ద పికెటింగ్‌లు నిర్వహించారు. ఆ వర్తకులు తాము విదేశీ వస్త్రాలు తెప్పించబోమని ఆయనకు వాగ్దానం చేశారు.

**జెండా సత్యాగ్రహం :**

కాంగ్రెస్ పెద్దలైన హకీం అజ్మల్‌ఖాన్, రాజాజీలు వేర్వేరు సందర్భాల్లో జబల్‌పూర్‌ను సందర్శించారు. ఆయా సమయాల్లో మున్సిపల్ భవనంపై జాతీయ జండా ఎగురవేయబడింది. ఆ చర్యను నిషేధిస్తూ జిల్లా మేజిస్ట్రేట్ ఉత్తర్వులు జారీచేశారు.

జాతీయవారం సందర్భంగా నాగపురంలో స్వచ్ఛంద సేవకులు జాతీయపతాకాలతో యూరోపియన్లు నివసిస్తున్న సివిల్‌లైన్స్ వైపు ఊరేగింపు జరిపారు. పోలీసులు వారి నటకాయించి చితకబాదారు. ఈ దారుణాన్ని ఎదుర్కోవాలని జిల్లా కమిటీ నిర్ణయించింది. ఈ ఉద్యమానికి నాయకత్వం వహించి జమునాలాల్ బజాజ్ అరెస్టయ్యారు. అటుపిమ్మట ఈ ఉద్యమం పటేల్‌కు అప్పగించబడింది. ఆయన అక్కడకు చేరుకొనేసరికి సాటి ఉద్యమకారులందరు జైళ్ళలో నిర్బంధించబడి ఉన్నారు. నాగపురానికి స్వచ్ఛంద సేవకులను పంపవలసిందిగా పటేల్ ప్రతి రాష్ట్ర కాంగ్రెస్‌ను కోరారు. ఆయన విజ్ఞప్తి మేరకు తండోపతండాలుగ తరలివస్తున్న సత్యాగ్రహులతో జైళ్ళు నిండాయి. అయినా ఉద్యమం ఆగలేదు. చివరకు ప్రభుత్వం నాగపురానికి రైలుటిక్కెట్లివ్వడం నిలిపివేసింది. ఇది ముసలమ్మ కుంపటి సామెతయింది. స్వచ్ఛంద సేవకులు కాలినడకన వస్తున్నారు. ప్రభుత్వానికేం చెయ్యటానికి పాలుపోలేదు. చివరకు తానే ఒక మెట్టు దిగింది. సివిల్ లైన్సుగుండా జాతీయ పతాకంతో ఊరేగింపు ననుమతిస్తానంది. ఖైదీల్ని విడుదల చేసింది. విజయోత్సాహంతో పటేల్ సత్యాగ్రహాన్ని నిలిపివేశారు.

**బార్డోలి విజయం, పటేల్‌కు సర్దార్ బిరుదం :**

1928 లో బార్డోలీ ప్రాంతంలో బొంబాయి ప్రభుత్వం భూమి శిస్తు విపరీతంగా పెంచేది. శిస్తు చెల్లించని రైతుల పొలాలను, పశువులను ప్రభుత్వం జప్తుచేయించింది. రైతులు పటేల్‌ను తమ నాయకునిగా ఎన్నుకొన్నారు. బార్డోలి సమస్య యావద్భారత సమస్యగా మారింది. పటేల్ రైతుల పక్షాన నిలిచి ప్రభుత్వాన్ని ఎదిరించారు. ఆ ప్రతిఘటనకు ప్రభుత్వం లొంగిరాక తప్పలేదు. శిస్తు భారం తగ్గించక తప్పలేదు.

బార్డోలీ విజయం పటేల్ విజయమే. అందుకే గాంధీజీ పటేల్‌ను 'బార్డోలీ సర్దార్!' అని సంభోధించి సత్కరించారు. అప్పటినుంచీ 'వల్లభాయ్ పటేల్' 'సర్దార్ వల్లభాయ్ పటేల్' అయినారు.

**ఉప్పు సత్యాగ్రహం :**

1929 డిసెంబర్‌లో లాహోర్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో 'సంపూర్ణ స్వరాజ్య' మే కాంగ్రెస్ లక్ష్యంగా తీర్మానింపబడింది. గాంధీజీ ఉప్పుచట్టాన్ని ధిక్కరింపదలచారు. స్వరాజ్య సమరంలో ప్రజానీకం కావించవలసిన త్యాగాలను గుర్చి పటేల్ ప్రచారం చేస్తున్నారు. అది సహించలేక 'రాసు' ఉద్యమంలో ఆయనను అరెస్టుచేసి, 3 నెలలు జైలుశిక్ష విధించింది. ఏప్రిల్ 6న గాంధీజీ "దండి" వద్ద ఉప్పుచట్టాన్ని ఉల్లంఘించారు. ప్రభుత్వం ఆయనను, పలువురు కాంగ్రెస్ నాయకులను అరెస్ట్‌చేసింది. ఇంతలో పటేల్ శిక్షాకాలం పూర్తియై విడుదలయ్యారు. నేడు కాంగ్రెస్‌కు సమర్థుడైన సారథి లేడన్న విషయం ఆయన గమనించారు. ఆ భారాన్ని తన తలపైకెత్తుకున్నారు. ఉప్పు సత్యాగ్రహంతోపాటు కైరా, బోర్సద్‌లలో పన్ను నిరాకరణోద్యమం కూడ సాగుతున్నది. ప్రభుత్వం మళ్ళీ తన దమన చర్యలు ప్రారంభించింది.

తిలక్ వర్ధంతి సందర్భంగా జూలై 31న బొంబాయిలో గొప్ప ఊరేగింపు జరిగింది. ఆ ఊరేగింపుకు ఆధ్వర్యం వహించిన కారణంగా పోలీసులు పటేల్‌ను మరో మూడునెలలపాటు జైలులో నిర్బంధించారు. ఆ శిక్షాకాలం కూడ పూర్తిచేసుకొని ఆయన బయటకు వచ్చారు. రాజద్రోహ నేరం మోపి ఆయనకు మరో తొమ్మిదినెలలపాటు జైలుశిక్ష విధించారు.

మొదటి రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రధాన రాజకీయపక్షమైన కాంగ్రెస్ పాల్గొనలేదు. అందువల్ల దానికి ప్రాధాన్యత లేకపోయింది. కనీసం రెండవ రౌండ్‌టేబుల్ సమావేశంలోనైనా కాంగ్రెస్‌ను పాల్గొనేట్లు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. అందుకే బాపూజీ, పటేల్ మొదలైన నాయకులను విడుదల చేసింది. గాంధీజీ, రాజప్రతినిధి ఇర్విన్‌లకు మధ్య ఒక ఒప్పందం కుదిరింది.

1931వ సంవత్సరంలో పటేల్ అధ్యక్షతన కారాచీలో కాంగ్రెస్ మహాసభ జరిగింది. ఈ సమావేశంలో పౌరుల ప్రాథమిక హక్కులనుగూర్చి తీర్మానం జరిగింది. ముస్లింలతో సమైక్య సహకారాలు సాధించటానికి ఒక కమిటీ ఏర్పాటయింది.

ఇర్విన్ స్థానంలో విల్లింగ్టన్ రాజప్రతినిధిగా ఢిల్లీ కోటలో పాగావేశాడు. అతడు కాంగ్రెస్ ఎడల శత్రుత్వ వైఖరిని, ప్రజాఉద్యమాలపట్ల నిరంకుశధోరణిని ప్రదర్శిస్తున్నాడు. ఈ పరిస్థితుల్లో తాను రౌండ్‌టేబుల్ సమావేశానికి హాజరు కావడం నిరర్థకమని గాంధీజీ ప్రకటించారు. అవసరాన్ని గుర్తించి ప్రభుత్వం ఒక్కసారిగా సాధుజంతువుగా మారింది. గాంధీ–ఇర్విన్‌ల ఒప్పందం సక్రమంగా అమలు జరుపబడుతుందని హామీ ఇచ్చింది. దానిపై సంతృప్తిపడి గాంధీజీ లండన్ వెళ్ళారు.

ప్రభుత్వం తన వాగ్దానాలను నిలబెట్టుకోకపోగా మరింత క్రూరంగా ప్రవర్తిస్తున్నది. అధ్యక్షుని హోదాలో పటేల్ ఈ దారుణాలను ప్రతిఘటిస్తున్నారు.

రౌండ్‌టేబుల్ సమావేశం బెడిసికొట్టింది. సీమనుండి తిరిగి వచ్చిన గాంధీజీ దేశం అగ్నిగుండంగా మారిపోవడం గమనించారు. పటేల్ అధ్యక్షతన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశమయింది. తిరిగి శాసనోల్లంఘనం చేయాలని తీర్మానించింది. ప్రభుత్వం ఈ విషయం తెలిసి ఆఘమేఘాలమీద పోలీసుల్ని పంపి గాంధీ, పటేల్ మొదలైన కాంగ్రెస్ పెద్దలను అరెస్టు చేయించింది. కాంగ్రెస్ కమిటీల సక్రమ సంఘాలుగా ప్రకటించి ఆ కార్యాలయాలకు సీళ్ళు వేయించింది. పాశవికంగా ప్రజలపై విరుచుకుపడింది.

ఈ సందర్భంగా పటేల్ గాంధీజీతోపాటు పదహారు నెలలపాటు ఎరవాడ జైలులో గడిపారు. ఆకాలంలో ఆయన గాంధీజీకి నీడలా తోడుండి, సమస్త సేవలు చేశారు. పటేల్‌తో తన ఈ సాహచర్యం ఒక అదృష్టంగా గాంధీజీ భావించారు. ఆయనలో తన మాతృమూర్తిని దర్శించానని ప్రశంసించారు.

జైలులో గాంధీజీ అస్పృశ్యతా నిర్మూలనోద్యమ విజయానికై ఉపవాసదీక్ష ప్రారంభించారు. ప్రభుత్వం ఆయనను ఆనాడే విడుదల చేసింది.

వల్లభాయ్ ముక్కుకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నారు. ఆ వ్యాధికి శస్త్రచికిత్స చేయవలెనని, అందుచే ఆయనను విడుదల చేయవలసిందని ప్రభుత్వానికి వైద్యులు సలహా ఇచ్చారు. ఆ పరిస్థితుల్లో ఆయన గాంధీజీ విడుదలైన 7 మాసాలకు విడుదలయ్యారు.

ఆయన తన అస్వస్థతకు తాత్కాలిక చికిత్స పొందారు. వైద్యులాపరేషన్ అవసరమన్నారు. కాని అంతటి వ్యవధి తనకు లేదని ఆయన తిరిగి సేవాకార్యక్రమాల్లో నిమగ్నులయ్యారు. గుజరాత్ విద్యాపీఠాన్ని క్రమబద్ధంచేసి, అందులో గాంధీజీ బోధనలకు ప్రాధాన్యం కల్పించారు. బోర్సద్ తాలూకాలో విజృంభించిన ప్లేగు వ్యాధి నివారణకెంతో కృషి చేశారు. ప్రభుత్వపు దోపిడిచే క్రుంగిపోయిన గుజరాత్ రైతులకోసం 10 లక్షల రూపాయలు పోగుచేసి ఆయన వారి నాదుకొన్నారు.

**కాంగ్రెస్ పాలన :**

1935 ఇండియా చట్టం అమలులోకి వచ్చింది. దాని ప్రకారం రాష్ట్ర శాసనసభలకు జరిగే ఎన్నికలలో పోటీచేయడానికి కాంగ్రెస్ నిశ్చయించింది. ఈ కార్యకలాపాలను నిర్వహించడానికి, అభ్యర్థులను నిర్ణయించటానికి కార్యవర్గం ఒక పార్లమెంట్ సబ్‌కమిటీనేర్పరిచింది. దానికి పటేల్ అధ్యక్షుడు. ఈ సందర్భాన కమిటీ నిర్వచించిన మౌలిక సూత్రాలను ఆయన అక్షరాల అమలుజరిపారు. ఎవరి విమర్శలను లెక్కచేయలేదు. ఎన్నికలలో కాంగ్రెస్ ఘనవిజయం సాధించింది. 8 రాష్ట్రాలలో కాంగ్రెస్, 2 రాష్ట్రాల్లో ముస్లింలీగ్ ప్రభుత్వాలేర్పడ్డాయి.

వల్లభాయ్ కాంగ్రెస్ పార్లమెంటరీ బోర్డులో ప్రముఖస్థానం వహించారు. క్రమశిక్షణ విషయంలో కఠినంగా వ్యవహరిస్తున్నారు. కొన్ని విషయాలలో కె.ఎఫ్.నారిమన్ (బొంబాయి), ఎన్.బి.ఖరే (మధ్యప్రదేశ్), సుభాష్ చంద్రబోస్ (బెంగాల్) మొదలైన వారితో ఆయన తలపట్లు పట్టవలసి వచ్చింది.

కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజాశ్రేయస్సుకు, హరిజనోద్ధరణకు ఎంతగానో పాటుపడ్డాయి. వాటి కనుగుణంగా సంస్కరణలు కూడ ప్రవేశపెట్టాయి. ఈవిధంగా ఈ ప్రభుత్వాల పాలన ప్రజారంజకంగా రెండు సంవత్సరాలు సాగింది.

రెండవ ప్రపంచ యుద్ధమేఘాలు ఐరోపా ఖండాన్నావరించాయి. బ్రిటీష్ ప్రభుత్వం కాంగ్రెస్‌ను సంప్రతించకుండానే భారతదేశాన్ని కూడ యుద్ధంలోకి ఈడ్చింది. అందుకు నిరసనగా కాంగ్రెస్ మంత్రివర్గాలు రాజీనామా చేశాయి.

జర్మనీకి జపాను కూడ తోడుకావటంతో మిత్రరాజ్యాల పరిస్థితి మరింత దిగజారిపోయింది. బ్రిటీష్ ప్రభుత్వం భారతదేశంనుంచి సైన్యాల్ని, ధనాన్ని సమీకరిస్తున్నది. దీన్ని వ్యతిరేకించినా నెహ్రూ ప్రభృతులను నిర్బంధించింది. గాంధీజీ ఈ అక్రమాలను సహించలేక 'వ్యక్తి సత్యాగ్రహా'న్ని ప్రారంభించారు. రెండవ సత్యాగ్రహిగా నిర్ణయింపబడిన పటేల్ యార్వాడ జైలులో నిర్బంధించబడ్డారు.

ప్రభుత్వ కూటనీతి కారణంగా దేశంలో మతకలహాలు చెలరేగాయి. అందువల్ల గాంధీజీ సత్యాగ్రహాన్ని నిలిపివేశారు. జైలులో పటేల్ ఆరోగ్యం క్షీణించింది. ఆ కారణంగా ప్రభుత్వం ఆయనను విడుదల చేసింది.

ప్రపంచ యుద్ధంలో బ్రిటన్ పరిస్థితి మరింత క్లిష్టమయింది. భారతీయుల సహకారం పొందాలనే ఉద్దేశంతో జరిపిన క్రిప్స్ రాయబారాన్ని కాంగ్రెస్ తిరస్కరించింది.

### క్విట్ ఇండియా :

1942 ఆగష్టు 8న బొంబాయిలో కాంగ్రెస్ కమిటీ సమావేశం జరిగింది. 'ఆంగ్లేయులు తమ మూట, ముల్లె సర్దుకుని దేశాన్ని విడిచిపోవాలంటు' ఉద్యమం ప్రారంభమయింది. బాపూజీ గర్జనలకు జడిసిన ప్రభుత్వం ఆయనతోపాటు ప్రముఖ కాంగ్రెస్ నాయకులను జైళ్ళలో నిర్బంధించింది. ఈ సందర్భంగా పటేల్‌ను అహమ్మద్‌నగర్ కోటలో 34 నెలలు నిర్బంధించింది. ఈ దీర్ఘకాలపు జైలు శిక్షలో ఆయనకు ప్రేవుల తాలూకు వ్యాధి మళ్ళీ తిరగబెట్టింది. అయినా ప్రభుత్వం ఆయనను విడిచిపెట్టదలచుకోలేదు.

భారత వైస్రాయి కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులతో జూన్ 25న సిమ్లాలో చర్చలు జరపాలని నిశ్చయించారు. ఆ అవసరం గుర్తించి పటేల్‌ను మిగిలిన కాంగ్రెస్ నాయకులతోపాటు ప్రభుత్వం విడుదల చేసింది. పటేల్ ఆ సమావేశంలో గాంధీజీని కలిశారు. ముస్లింలీగ్ వారి మడత పేచీలతో సిమ్లా చర్చలు విఫలమయ్యాయి.

### స్వాతంత్ర్య భానూదయం :

1945 లో బ్రిటన్‌లో భారతదేశంపై సానుభూతిగల అట్లీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. రెండవ ప్రపంచ యుద్ధం ముగిసి, మిత్రరాజ్యాలకు విజయం లభించింది. భారతదేశంలో 1946 లో ఎన్నికలు జరిగాయి. కేంద్ర శాసనసభలో నూటికి 91 సీట్లను కాంగ్రెస్ గెల్చుకొన్నది. అంతేకాక 8 రాష్ట్రాల్లో మంత్రివర్గాలు స్థాపించగల్గింది. రెండురాష్ట్రాలలో ముస్లింలీగ్, ఒక రాష్ట్రంలో మిశ్రమ మంత్రివర్గం ఏర్పడ్డాయి. ముగ్గురు సభ్యులతో ఉన్నతాధికార మంత్రివర్గం భారతదేశానికి అట్లీ రాయభారం పంపాడు. ఫలితంగా అర్థాంతర ప్రభుత్వమేర్పడింది. అందులో నెహ్రూ, పటేల్, రాజాజీలున్నారు.

తమకు ప్రత్యేక రాజ్యం కావాలని ముస్లింలీగ్ తమ పాలనలోని రాష్ట్రాల్లో మతకలహాల్ని సృష్టిస్తోంది. ఎందరో హిందువులు ప్రాణాలు కోల్పోయారు. మరెందరో ఆ ప్రాంతాల్ని విడిచి ఇతర రాష్ట్రాలకు వలస వచ్చారు. దుష్టాంగాన్ని ఖండించి శేష శరీరానికి రక్షణ కల్పించవలసిన పరిస్థితి ఏర్పడింది. ఆ కారణంగా అనిష్టమైనా దేశ విభజనకు తల ఒగ్గవలసివచ్చింది. 1947 ఆగష్టు 15న దేశం పాకిస్థాన్, భారత్ అనే రెండు ముక్కలుగా విడిపోతు స్వాతంత్ర్యాన్ని సముపార్జించుకొన్నది. అధ్యక్షులు బాబు రాజేంద్రప్రసాద్, ప్రధాని నెహ్రూ, ఉపప్రధాని పటేల్.

దేశ విభజనానంతరం కూడ ఆశించిన ఫలితాలు సమకూడలేదు. పాకిస్థాన్ నుండి లక్షలమంది హిందువులు, సిక్కులు భారతదేశానికి తరలి వస్తున్నారు. వారందరి పునరావాసాలకు పటేల్ అహర్నిశలు పాటుపడ్డారు.

### స్వదేశ సంస్థానముల విలీనం :

బ్రిటీష్ పాలనా కాలంలో దేశం రెండు భాగాలుగా ఉండేది. వానిలో 'బ్రిటీష్ ఇండియా' అనబడే భాగం బ్రిటీష్ ప్రభుత్వంచే పాలింపబడేది. 'నేటివ్ ఇండియా' అనబడే భాగం ఆంగ్ల ప్రభుత్వానికి లోబడి స్వదేశ సంస్థానాధీశులచేత పరిపాలింపబడుతుండేది. ఈ సంస్థానాలు 562. వీటిపై బ్రిటీష్ సార్వభౌమత్వం 1947 జూన్ 3 నాటికి అంతమవుతుంది. ఇవి ఇండియాలోగాని, పాకిస్థాన్‌లోగాని కలియవచ్చు. లేదా స్వతంత్రంగానైనా ఉండవచ్చునని వారు ప్రకటించారు. వీటిలో 550 సంస్థానాలు భారత భూభాగంలోను, మిగిలినవి పాకిస్థాన్‌లోను ఉన్నాయి.

ఈ దేశం గతంలో చిన్నచిన్న రాజ్యాలుగా విడిపోయి ఉంది. అంతఃకలహాల కారణంగా వేయి సంవత్సరాలు పరాయి పాలనలో మ్రగ్గి బలహీనపడింది. ఇంత శ్రమపడి స్వతంత్రత సంపాదించుకొని ఈనాడు కూడ వాటినలాగే వదిలివేస్తే ఈనగాచి నక్కలపాలు చేసినట్లవుతుంది. అందువలన ఈ సంస్థానాలన్నిటిని భారతదేశంలో విలీనం చేసి, దేశాన్ని శక్తిమంతం చేయాలనే ఉద్దేశంతో సంస్థానాలశాఖ ఒకటి ఏర్పడింది. దానికి మంత్రి పటేల్. ఆయన సంస్థానాధీశుల్ని సమావేశపరిచారు. వారికెన్నోవిధాల నచ్చజెప్పి వారి భయాల్ని తీర్చారు. వారు కూడ ఆయనగారి ప్రతిపాదనలకు సమ్మతించి, తమ సంస్థానాలను ఇండియన్ యూనియన్‌లో విలీనం చేశారు. కాని జునాగడ్, కాశ్మీర్, హైదరాబాద్ సంస్థానాల దగ్గరే సమస్యలెదురయాయి. కాని పటేల్ తన అచంచల ధైర్యసాహసాలతో, పట్టుదలతో వాటిని కూడ ఇండియన్ యూనియన్‌లో విలీనం చెయ్యగలిగారు.

దేశ విభజన కారణంగా మనదేశం 3.6 లక్షల చదరపు మైళ్ళ విస్తీర్ణం కోల్పోయింది. కాని పటేల్ రాజనీతివల్ల తిరిగి 5 లక్షల చదరపు మైళ్ళ ప్రాంతం మనకు సమకూడింది.

**అస్తమయం :**

వయోభారం వల్ల, అనారోగ్యం వల్ల, కార్యభారం వల్ల పటేల్ క్రుంగిపోయారు. బొంబాయి వాతావరణం ఆయనకు ఉపశాంతి నిస్తుందన్న వైద్యుల సలహా మేరకు ఆయన అక్కడకు చేరారు. కాని ప్రయోజనం లేకపోయింది. మహౌషధాలు సైతం ఆ సమయానికి ఓడిపోయాయి. నవభారత నిర్మాత, సుస్థిర రక్షకుడు, మకుటంలేని మహారాజు, భారతజాతి ప్రియతమ నాయకుడు, ఉక్కుమనిషి, కార్యశూరుడునైన పటేల్ తన 75వ ఏట, 1950 డిసెంబర్ 15న స్వర్గస్థులయ్యారు. ఆయన చివరి కోర్కెప్రకారం బొంబాయిలోని 'క్వీన్స్ మేరీ' శ్మశానవాటికలో ఆయన పవిత్ర దేహాన్ని దహనం కావించారు. అగ్నిదేవుడా శరీరాన్నాహుతిగొనేవేళ లక్షోపలక్షల ప్రజలు కన్నీరు మున్నీరుగా విలపించారు. నెహ్రూ తన కుడిభుజం పడిపోయినట్లుగా ఎంతగానో వాపోయారు.

నేటికయినా దేశం ఏదైనా క్లిష్ట పరిస్థితి నెదుర్కొన్నపుడు 'ఈ సమయంలో పటేల్ ఉంటే ఎంత బాగుండేదో!' అనే మాట ప్రజల నాలుకలపై ఆడుతుంటుంది.

# మోక్షగుండం విశ్వేశ్వరయ్య

హైదరాబాదు నగరం మధ్యలో మూసీ నది ఉంది. ఇప్పుడు మూసీ నదిలో ప్రవాహం లేదు. ఉన్నదల్లా మురుగు నీరే. కాని ఒకప్పుడు ఇది మంచి నీళ్ళతో ప్రవహిస్తూ ఉండేదట. 1908వ సంవత్సరంలో అధికంగా వర్షాలు కురిశాయట. అందువల్ల మూసీనదికి పెద్ద వరదలు వచ్చాయి. ఆ వరదలు హైదరాబాదులోని లోతట్టు ప్రాంతాల్ని జలమయం చేశాయి. ఎన్నో ఇళ్ళు కూలిపోయి, ఎంతమందో నిలువ నీడ లేకుండా అయిపోయారు. వరద ప్రవాహంలో చాలామంది తమ ప్రాణాలుకూడా పోగొట్టుకొన్నారు. అంతకు ముందు కూడా మూసీనదికి అప్పుడప్పుడు వరదలు వస్తుండేవి. దానివల్ల ప్రజలు కొంత ఇబ్బందిపడుతుండేవారు. కాని 1908లో వరదలు మాత్రం హైద్రాబాదు ప్రజలకు చాలా నష్టం కలిగించాయి. ప్రజల బాధలు చూచిన నాటి నవాబు దీనికి ఇకముందు వరదల బాధ లేకుండా చేయాలని ఆలోచించి, పరిష్కారంకోసం ఒక మేధావి అయిన ఇంజనీరును ఆహ్వానించాడు. ఆ ఇంజనీరు చక్కగా అధ్యయనం చేసి ఒక మంచి ప్రణాళికను రూపొందించాడు. ఆ ప్రణాళికను నిజాం నవాబు అమలుపరిచాడు. అందువలన మూసీ నదికి వరదల ప్రమాదం తప్పింది. అలానే ఆ నది నీటిని మళ్ళించి చెరువులు నిర్మించి, నగరానికి తాగునీటి సౌకర్యం కల్పించారు. ఇలా హైదరాబాదుకేగాదు, మన దేశంలోని ఎన్నో నగరాలకు తాగునీటి వసతులు కల్పించిన ఆ మేధావి ఎవరో గాదు – మన మోక్షగుండం విశ్వేశ్వరయ్య.

**బాల్యం – విద్యాభ్యాసం :**

పందొమ్మిదవ శతాబ్దం ఉత్తరార్ధంలో మన దేశంలో గొప్ప మేధావులు జన్మించారు. రాజకీయ, సాంఘిక, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ప్రకాశించారు. ఇంజనీరింగులో మహాప్రశస్తి గాంచిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య అలాంటి వారిలో అగ్రగణ్యుడు. మన రాష్ట్రంలోని ప్రకాశం జిల్లాలో కంభం, గిద్దలూరు రోడ్డులో మోక్షగుండం అనే గ్రామం ఉంది. ఆ గ్రామంలో ఉండే ఒక సామాన్య కుటుంబం కొన్ని ఏళ్ళకిందట కర్నాటక రాష్ట్రానికి వెళ్ళింది. బెంగుళూరు దగ్గరున్న 'ముద్దన హళ్ళి' అనే గ్రామంలో వాళ్ళు స్థిరపడ్డారు. ఆ కుటుంబంలోనే మన విశ్వేశ్వరయ్య 1861 సం౹౹ సెప్టెంబరు 15వ

తేదీన జన్మించాడు. ఆయన తండ్రి శ్రీనివాస శాస్త్రి, తల్లి వెంకటమ్మ. శ్రీనివాస శాస్త్రి సంస్కృత పండితులు, ఆయుర్వేద వైద్యులు కూడా. విశ్వేశ్వరయ్య ప్రాథమిక విద్య ముద్దన హళ్ళిలో తల్లిదండ్రుల వద్దనే జరిగింది. తర్వాత మేనమామ రామయ్యవద్ద చిక్ బళ్లాపూర్‌లో జరిగింది. విశ్వేశ్వరయ్య మంచి విద్యార్థిగా గురువుల ప్రేమానురాగాలు పొందాడు. అక్కడ నాదముని నాయుడు అనే ఉపాధ్యాయుడు విశ్వేశ్వరయ్యను గుర్తించి, బాగా ప్రోత్సహించాడు. మంచి మంచి పుస్తకాలు ఇచ్చి చదివించాడు.

ఉన్నత విద్య కోసం విశ్వేశ్వరయ్య బెంగుళూరు వెళ్ళాడు. అక్కడే బి.ఎ. డిగ్రీ మొదటి శ్రేణిలో పాసైనాడు. ఐతే చదివే రోజుల్లో ఎన్నో ఇబ్బందులు ఎదురైనాయి. ఖర్చులకు డబ్బులేదు. ఒక్కోసారి తినడానికి తిండి కూడా దొరికేదిగాదు. ట్యూషన్‌లు చెప్పి కొద్దిగా డబ్బు సంపాదించి, చదువు సాగించాడు. ఎంతో దూరం కాలినడకనే వెళ్ళేవాడు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఆయన పట్టుదల, కృషి సడలలేదు. చదువులో అందరికంటే ముందే ఉండేవాడు. ఒక్కోసారి తోటి విద్యార్థులకు కూడా పాఠాలు చెప్పేవాడు. అప్పుడు సెంట్రల్ కాలేజీ ప్రిన్సిపాలు చార్లెస్ వాటర్స్. ఆయనకు విశ్వేశ్వరయ్య అంటే ఎంతో అభిమానం. ఆ ప్రిన్సిపాలు తాను వాడుకొనే, 'వెబ్‌స్టర్ డిక్షనరీ' విశ్వేశ్వరయ్యకు బహుమతిగా ఇచ్చాడు. వాటర్స్ లండన్‌లో ఉండి కూడా ఈ శిష్యుణ్ణి మరవలేదు. ఆయన తన మరణానంతరం తన బంగారు కోటు గుండీలను విశ్వేశ్వరయ్యకు ఇవ్వవలసిందిగా తన భార్యకు చెప్పాడు. ఆమె అందుకోసమే భారతదేశం వచ్చి ఆ గుండీలను విశ్వేశ్వరయ్యకు ఇచ్చింది. విశ్వేశ్వరయ్య వాటిని చిరకాలం తన గురువుకు గుర్తుగా ఉంచుకొన్నాడు. ఇలా గురుశిష్యుల సంబంధం ఎంతమందికి లభిస్తుంది?

1880 సంιιలో బి.ఎ.లో విశ్వేశ్వరయ్య సర్వ ప్రథముడుగా వచ్చాడు. గణితంలో ప్రతిభ కలిగి ఉన్న విశ్వేశ్వరయ్యను మైసూరు రాజ్యపు దివాను రంగాచార్యులు గుర్తించాడు. ప్రభుత్వానికి సిఫార్సుచేసి ఉపకార వేతనం ఇప్పించాడు. ఆ ఉపకార వేతనంతో విశ్వేశ్వరయ్య పూనాలో ఇంజనీరింగ్ పూర్తిచేశాడు. ఇంజనీరింగ్‌లో ప్రప్రథముడుగా నెగ్గాడు. అందుకు పరిష్కారంగా బొంబాయి ప్రభుత్వం ఆయనను 'ప్రజాపనుల' శాఖలో ఇంజనీరుగా నియమించింది. ఆమేయ ప్రతిభ ఉన్న చోటికి ఉద్యోగాలు వెతుక్కుంటూ వస్తాయి.

**ఉద్యోగం – ప్రజాసేవ :**

బొంబాయిలో ఉద్యోగం చేసేప్పుడు స్వాతంత్ర్య సమరయోధులైన బాలగంగాధర తిలక్, గోపాలకృష్ణ గోఖలే, మహాదేవ గోవిందరానడే మొదలగు వాళ్ళతో పరిచయం ఏర్పడింది. ఆయనకు పని అంటే ఇష్టం. అంకితభావంతో పనిచేసేవారు. 'వర్క్ ఈజ్ వర్‌షిప్' అనే ఆంగ్ల సామెతను నమ్మేవారు. ఇంజనీరుగా ఆయన చేసిన ప్రజాసేవ, సాధించిన విజయాలు లెక్కలేనన్ని.

సింధు రాష్ట్రంలోని సుక్కూరుకు మంచినీటి సరఫరా, మురుగునీటి పారుదల బాధ్యతలు ఆయనపై మోపారు. ఆయన సింధూనది నీళ్ళు సుక్కూరుకు చేరేట్లు చేశాడు. ఆ నది నీళ్ళు వడకట్టడానికి ఒక నూతన విధానం రూపొందించాడు. నది మధ్యలో, లోతైన బావి త్రవ్వి ఆ నీరు భూమి లోపలి నుంచి ప్రవహించే ఏర్పాటుచేశాడు. అక్కడి నుండి సుక్కూరుకు నీరు సరఫరా జరిగేది. ఇలా నీళ్ళు నది అడుగున భూమిలో నుండి రావడం వలన సహజంగానే వడపోత జరిగినట్లయింది. ఈ కృషిని గుర్తించిన బొంబాయి ప్రభుత్వమూ సుక్కూరు పురపాలక సంఘమూ ఆయనను అభినందించాయి. ఆయన ప్రజ్ఞాపాటవాలకు ఇదొక నిదర్శనం.

విశాఖపట్నం ఓడరేవు సహజసిద్ధమైనది. ఓడలన్నీ రెండు కొండల మధ్య నుండే కాలువలాంటి సముద్రపు పాయలో నుండి అలా తిరిగి కొండవెనుకకు వెళ్ళి దాగినట్లుగా, భద్రంగా ఉండిపోతాయి. ఆ కాలువ ముఖంలో సముద్రపు ఆటుపోటు లెక్కువ. ఎత్తయిన అలలు తమతోపాటు ఇసుకను తెచ్చి కాలువను పూడుస్తూ ఉండేవి. ఆ విధంగా మెట్టవేసిన ఇసుకను తవ్వోడ (డ్రడ్జరు) సహాయంతో ప్రతిరోజూ తొలగించవలసి వచ్చేది. ఇది వ్యయప్రయాసలతో కూడుకొన్నపని. విశ్వేశ్వరయ్యను పిలిపించి చూపించారు. ఆయన సముద్రాన్నీ, అలల వేగాన్నీ బాగా పరిశీలించి, పాత పడవలను తెచ్చి అలలకడ్డంగా నిలిపి, వాటిని రాయీ రప్పలతో నింపి, అలల దూకుడును అరికట్టాడు. అంతే, అలలు మోసుకొచ్చే ఇసుక అక్కడే ఆగిపోయేది. కాలువలోకి వచ్చిపడేదిగాదు. ఈ విధంగా హార్బరులోకి వెళ్ళే ఓడలకు అంతరాయం తొలగిపోయింది. వ్యయప్రయాసలు తగ్గిపోయాయి. ఈనాటికి కోటల్లాగా ఉండే పడవలు విశ్వేశ్వరయ్య ప్రతిభకూ, మేధకూ, ప్రతీకలుగా ఉన్నాయి.

ఆనకట్టలు నిర్మించి నీటిని నిల్వచేస్తారు. అయితే నీరు అధికంగా చేరినప్పుడు ఆనకట్టకు ప్రమాదం ఏర్పడుతుంది. కనుక కావలసినంత నీటిని మాత్రమే ఉంచి, అవసరానికి మించిన నీటిని బైటికి వదలాలి. ఎలా? ఈ సమస్య చాలాకాలం వేధించింది. విశ్వేశ్వరయ్య మేధకు ఇది ఒక పరీక్ష. ఆయన రూపొందించిన ఆటోమేటిక్ గేట్లు ఈ సమస్యకు ఒక పరిష్కారం. ఇప్పటికీ చాల గొప్ప, గొప్ప, ఆనకట్టలలో ఇలాంటి గేట్లు వాడుతున్నారంటే, ఆయన ఎంతో ముందుచూపుగలిగిన ఇంజనీరని స్పష్టం కదా!

1909 సంవత్సరంలో నైజామ్ నవాబు ఆహ్వానం మేరకు హైదరాబాదుకు వచ్చి మూసీనదీ పరివాహక ప్రదేశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాడు. ఒక చక్కని నివేదిక తయారుచేశాడు. మూసీనదిపైన ఒక ఆనకట్ట, రెండు చెరువుల నిర్మాణం సూచించాడు. హైదరాబాదు మురికినీటి పారుదలకు కూడా ఆయనే ప్రణాళిక తయారుచేశాడు. ఇప్పటికీ ఆయన రూపొందించిన రెండు చెరువుల నీరు హైదరాబాదు నగరవాసులకు మంచినీళ్ళందిస్తున్నాయి. మూసీ నదిపై ఉన్న ఆనకట్ట వ్యవసాయానికి ఉపయోగపడుతుంది.

**విద్యారంగంలో కృషి :**

అందరికీ విద్య అవసరం అని ఆయన చెప్పేవారు. వెనుకబడినతనం, సాంఘిక దురాచారాలు విద్య లేనందువలననే మనల్ని పీడిస్తున్నాయని తలచాడు. కొన్ని ప్రాంతాలలో నిర్బంధ విద్యను కూడా ప్రవేశపెట్టాడు. విద్యా వ్యాప్తికి పాఠశాలల స్థాపన, భవన నిర్మాణం, నిధుల మంజూరు చేశారు. బాలికల విద్యకు ప్రత్యేక పాఠశాలలు స్థాపించారు. హాస్టళ్ళు ఏర్పరిచారు. ముఖ్యంగా మైసూరు రాష్ట్రానికే ఒక ప్రత్యేక విశ్వవిద్యాలయాన్ని స్థాపించారు. విశ్వవిద్యాలయం అనేది అజ్ఞానాంధకారం తొలగించి, పారిశ్రామికవేత్తల్ని, వాణిజ్యవేత్తల్ని, న్యాయవాదుల్ని, విజ్ఞానశాస్త్ర వేత్తల్ని, రాజనీతిజ్ఞుల్ని తయారుచెయ్యాలి అని ఆయన ఆశయం.

స్వతంత్రంగా బతికేట్లు చేసే వృత్తి విద్య ప్రధానం అని గుర్తించాడు. అందుకే సాంకేతిక విద్యను ప్రోత్సహించారు. 1913 సంవత్సరంలో బెంగుళూరులో వృత్తిశిక్షణ సంస్థను స్థాపించి, దానికి మైసూరు మహారాజావారి పేరు పెట్టారు. ఆయన వ్యవసాయ విద్యకు కూడా తగిన స్థానం ఇచ్చారు. ముఖ్యంగా వ్యవసాయ రంగంలో పరిశోధనలకు తోడ్పడ్డారు. రైతులకు స్వల్పకాల శిక్షణ తరగతులు ఏర్పరిచారు.

విద్యా వ్యాప్తికి గ్రంథాలయాలు అవసరం. అందుకే ఆయన అనేక గ్రంథాలయాలు, పఠనాలయాలు ఏర్పరిచారు. పేదవారికి ఉపకారవేతనాలిచ్చి ప్రోత్సహించారు. బాల్యంలో ధనాభావంవల్ల ఎంత కష్టపడవలసి వచ్చిందో ఆయనకు ఎప్పుడూ జ్ఞాపకంలో ఉంటున్న కారణంగానే, బీద విద్యార్థులకు ఎక్కువ మేలు జరిగేలా చూచేవాడు.

**ప్రజాహిత కార్యక్రమాలు :**

ఆయన దివానుగా తనకున్న అధికారంతో అనేక సంఘ ప్రయోజన కార్యక్రమాలు చేపట్టారు. సంఘ సంస్కారానికీ కూడా నడుం బిగించారు. వర్ణవ్యవస్థ రద్దుకు కృషిచేశారు. బాల్య వివాహాలు కూడదన్నారు. వరకట్నం వద్దని చెప్పారు. వివాహాలలో ఆడంబరం తగదన్నాడు.

'దేవాలయాలను పరిశుభ్రంగా ఉంచాలి. ఇది అందరి బాధ్యత' అని నొక్కి చెప్పారు. ఆయన పారిశుద్ధ్యానికీ, ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇచ్చేవారు. ఆయన ఎప్పుడూ శుభ్రమైన వస్త్రాలనే ధరించేవారు. ఆఖరుకు ముసలితనం వచ్చి, మంచంలో లేవలేని స్థితిలో ఉన్నప్పుడు కూడా ఆయన మంచి దుస్తులే ధరించారు.

మైసూరు రాష్ట్రంలోని పలు పరిశ్రమలకు ఆయన కృషే కారణం. మైసూర్ శాండల్ సబ్బుల తయారీ, గంధపునూనె కర్మాగారం, సిల్క్, వస్త్ర పరిశ్రమలు మొదలగు పలు పరిశ్రమలకు పునాది ఆయన ఆలోచనలే. ఇప్పటికీ విశ్వేశ్వరయ్య పేరుమీద ఉన్న పారిశ్రామిక ప్రదర్శనశాల ఆయన ప్రతిభకూ ప్రజల విశ్వాసానికీ ప్రతీక.

ఒకసారి ఆయన మిత్రులతో కలిసి 'జోగ్ జలపాతం' చూడ్డానికి వెళ్ళారు. అది అందమైన జలపాతం. ఎంతోమంది యాత్రికుల్ని ఆకర్షిస్తుంది. అక్కడి ప్రకృతి అందాలను చూచి తీరవలసిందే. విశ్వేశ్వరయ్య ఆ జలపాతపు అందానికి ముగ్ధుడైనాడు. ఐతే మరుక్షణమే ఆయనలో ఒక మెరుపులాంటి ఆలోచన వచ్చింది. "ఎంత నీరు ఇలా వృథాగా పోతోంది? ఈ నీటి వనరుల్ని సరిగా వినియోగిస్తే? ఎంత విద్యుచ్ఛక్తి ఉత్పత్తి చేయవచ్చు? ఆ విద్యుచ్ఛక్తి ఎన్ని పరిశ్రమలకు పనికివస్తుంది? ఆ నీటిని వ్యవసాయానికి మళ్ళిస్తే ఎంత భూమి సస్యశ్యామలం అవుతుంది? –" అని సాగింది ఆయన ఆలోచన, అందరిలా అందాన్ని ఆస్వాదించడమేగాదు, వనరుల వినియోగాన్ని గురించి కూడా రచించాడు. మనకున్న వనరుల్ని సరిగా వాడుకొంటే మనం ఎంతో అభివృద్ధిని సాధించవచ్చు.

మీరు మైసూర్‌లోవున్న బృందావన్ గార్డెన్స్ చూశారా? ఆ పేరు విన్నారా? ఇప్పటికీ దేశీయ, విదేశీ పర్యాటకుల్ని ఆ గార్డెన్స్ ఆకర్షిస్తున్నాయి. అక్కడ ఎన్నో సినిమాల చిత్రీకరణ జరిగింది. రాత్రిపూట రంగు రంగుల బల్బుల కాంతిలో ఆ గార్డెన్స్ చూస్తుంటే స్వర్గం ఇలానే ఉంటుందా? అనిపిస్తుంది. అటువంటి అందమైన బృందావన్ గార్డెన్స్ ఎలా ఏర్పాటు అయ్యాయో తెలుసా?

కావేరీనది కర్నాటక రాష్ట్రం గుండా ప్రవహిస్తున్న ఒక పెద్ద నది. దానికి ఆనకట్ట కట్టి ఆ నీటి ద్వారా విద్యుచ్ఛక్తిని ఉత్పత్తిచేయవచ్చు. పంటలు పుష్కలంగా పండించవచ్చు. అందువలన పరిశ్రమలు, పాడిపంటలు అభివృద్ధి అయి, ప్రజలు సుఖపడతారు. ఈ ఆలోచనతో విశ్వేశ్వరయ్య ఒక చక్కని ప్రణాళికను రచించాడు. ఖర్చు ఎక్కువని కొంతమంది, కష్టమైన పని అని కొంతమంది అభ్యంతరపెట్టారు. ఐనా పట్టుదలగల విశ్వేశ్వరయ్య ఆనాటి పరిపాలకులకు నచ్చజెప్పి ఈ ప్రాజెక్టు పనిని చేపట్టాడు. ఎన్నో అడ్డంకులు వచ్చినా, ధైర్యంగా ముందుకు సాగాడు. అనేక కష్ట నష్టాలకు ఓర్చి రాత్రింబవళ్ళు కష్టించి 'కృష్ణ రాయ సాగరం' అనే ఆనకట్టను నిర్మించాడు. దాని నిర్మాణంలో ఆయన చూపిన నైపుణ్యం పాశ్చాత్య శాస్త్రజ్ఞుల్ని సైతం ఆశ్చర్యపరిచింది. ఇప్పటికి గూడా కర్నాటక రాష్ట్రంలో పరిశ్రమల అభివృద్ధికీ, పంటల దిగుబడికి ఈ

ప్రాజెక్టే కారణం అనడంలో అతిశయోక్తి లేదు. ఆ ఆనకట్ట దిగువన మనం చెప్పుకొన్న బృందావన్ గార్డెన్స్ విశ్వేశ్వరయ్య రూపొందించాడు. ఆ రచనా చమత్కారం అలాంటిది. ఇప్పటికీ అవి అందర్నీ ఆకర్షిస్తున్నాయి. విశ్వేశ్వరయ్య ప్రతిభా పాటవాలను జ్ఞప్తికి తెస్తున్నాయి. మనిషి కీర్తికి ఇవే గదా సజీవ సాక్ష్యాలు!

**ఫరక్కా బ్యారేజి నిర్మాణం :**

గంగానది మీద వంతెన నిర్మించాలని తలంపు వచ్చింది.. ఐతే బెంగాల్, అస్సాం, బీహార్ రాష్ట్ర ప్రభుత్వాలు ఒకదానితో మరొకటి పోటీపడ్డాయి. ఎవరి కారణాలను వాళ్ళు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఇరుకున బడింది. ఎవరికి వంతెన ఇస్తే ఎవరికి కోపం వస్తుందో ఎలా? అనే ఆలోచన వచ్చింది. నాటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ సున్నితమైన ఈ సమస్యను సామరస్యంగా పరిష్కరించడానికి ఒక సంఘాన్ని నియమించాడు. దానికి విశ్వేశ్వరయ్య అధ్యక్షుడు. ఆ సంఘం సిఫార్సు మేరకు వంతెన నిర్మాణం జరుగుతుంది. అప్పుడు పండిట్ జవహర్ విశ్వేశ్వరయ్యను గురించి చెప్పిన మాటలు స్వర్ణాక్షరాల్లో రాయదగినవి. "ఆయన నిజాయితీపరులు, శీలసంపన్నులు, విశాలజాతీయ దృక్పథంగలవారు. పైగా స్థానికమైన ఒత్తిడులకు లొంగకుండా నిష్పక్షపాతంగా నిర్ణయంచేయగల ఇంజనీరు. అందువల్ల ఆయన అభిప్రాయాలను గౌరవంగా అంతా ఆమోదించేవారు.

ఆయన నూరేళ్ళకు పైబడి జీవించాడు. ఆరోగ్యంగా ఉండేవాడు. ఆయన ఆరోగ్యానికి కారణం అడిగితే – 'మితభోజనం, క్రమశిక్షణ, ఆత్మ నిగ్రహం' అన్నారు.

'కృషిచేస్తూ కృశించడం – తుప్పుపట్టి నశించడంకన్నా చాలా మేలు' అనేవారు.

'శ్రమించి చేసే ఏ పనీ మనిషిని చంపదు – మనోవ్యధే మరణానికి కారణం' – అంటుండేవారు.

ఆయన భావాలకు అద్దంపట్టే ఆయన ముఖ్య రచనలు రెండు 1.'ప్లాన్డు ఎకానమీ ఆఫ్ ఇండియా', 2.'మెమొరీస్ ఆఫ్ మై వర్కింగ్ లైఫ్'.

మంచి దేశాన్ని నిర్మించాలంటే ముందు మనం మంచి పౌరుల్ని తయారుచెయ్యాలి. సమర్థులు, శీల సంపన్నులు, సేవాభావంగల జనులు ముఖ్యం అని చెప్పేవారు. 'వ్యక్తి సాధించే విజయం వెనుక మంత్రదండం ఉండదు – కష్టపడి అంకితభావంతో పనిచెయ్యడమే' అనేవారు.

ఒకసారి కొందరు పత్రికా విలేఖరులు ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ మనదేశపు పేదరికానికీ కారణాలు ఆయన్ను అడిగారట. దానికి ఆయన – "స్తబ్ధత, మందకొడితనం, ఆశావాదం మన దౌర్భాగ్యానికి కారణాలు. పరిస్థితుల్ని మనం గమ్యంవైపు మళ్ళించుకోవాలి. ప్రయత్నంలో లోపం ఉండకూడదు. దీనికి నైతిక శక్తి కావాలి. మతాచారంమీద, వర్ణతత్వంమీద, అదృష్టంమీద ఆధారపడడం తగదు. ఆర్థికశక్తికోసం, స్వశక్తికోసం కృషిచెయ్యాలి.. అంతా కష్టపడి పనిచెయ్యాలి" అని చెప్పారట.

మోక్షగుండం విశ్వేశ్వరయ్య బహుముఖ ప్రజ్ఞాశాలి. వారి వ్యక్తిత్వాన్ని హిమాలయంతో పోల్చవచ్చు. దాన్ని పరిశీలించడం, వర్ణించడం చాల కష్టం. ఆయనకు ప్రవేశంలేని రంగం లేదనడం అతిశయోక్తిగాదు. ఆయన ఎప్పుడూ భారతదేశాన్ని గురించే కలలుగనేవారు. దేశభక్తిగల అటువంటి మేధావి, నిరాడంబరుడు, ప్రజా సంక్షేమ కారకుడు అయిన ఇంజనీరు పుట్టిన రోజును మనం 'ఇంజనీర్సు డే' గా చేసికోవడం సమంజసంగానే ఉంటుంది.

---

## దేవులపల్లి రామానుజరావు

దేవులపల్లి రామానుజరావు యావదాంధ్రులకు సుపరిచితులు. వీరు పాత్రికేయులు. పత్రికా సంపాదకులు. ఆంధ్ర సాహిత్య, సాంస్కృతిక ఉద్యమ నిర్మాత. జాతీయ పునరుజ్జీవన మహోద్యమ కార్యకర్త. ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమి ప్రథమ కార్యదర్శి. ఆంధ్ర సాహిత్య పరిషత్తు రథసారథి.

రామానుజరావు వరంగల్లు పట్టణానికి సమీపాన గల దేశాయిపేట గ్రామంలో 1917 వ సంవత్సరం ఆగష్టు ఇరవై అయిదున జన్మించారు. తండ్రి వేంకట చలపతిరావు. తల్లి ఆండాళమ్మ. చిన్నతనంలోనే వంగపాడుకు దత్తతగా వచ్చారు. ప్రాథమిక విద్యాభ్యాసం ఇంటివద్దనే పూర్తి చేసుకొని తొమ్మిదవ తరగతిలో మాత్రమే హనుమకొండ హైస్కూలులో చేరారు. కలిగిన ఇంటిలో పుట్టిన కారణంగా గారాబంగా పెరిగారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టాంగాలో పాఠశాలకు వెళ్ళి వచ్చేవారు.

1929-49 మధ్య కాలంలో తెలంగాణా ప్రాంతంలో పాఠశాలల సంఖ్య. కళాశాలల సంఖ్య చాలా తక్కువగా ఉండేది. తెలుగులో విద్యాబోధన లేదు. ఇంగ్లీషు, ఉర్దూ భాషలలో మాత్రమే పాఠశాలల్లో విద్యాబోధన ఉండేది. రామానుజరావు విద్యాభ్యాసం ఇంగ్లీషులో జరిగింది. ఐచ్ఛికంగానైనా సంస్కృత భాష నేర్చుకోవాలని చిన్నతనం నుండి కోరిక. హనుమకొండ ఇంగ్లీషు మీడియం స్కూల్లో దూపాటి వేంకట రమణాచార్యులు సంస్కృతాన్ని బోధిస్తుండేవారు. సంస్కృతం బోధించే తరగతిలో చేరారు, రెండు మూడు పాఠాలు జరిగాయి. రామ శబ్దాన్ని కంఠస్థం చేయమని ఆచార్యుల ఆదేశం. వీరు కంఠస్థం చేయలేకపోయారు. ఆచార్యులు బెంచీపైన నిలబెట్టారు. వెంటనే రామానుజరావు గురువుగారికి నమస్కారం చెప్పి సంస్కృతం తరగతి నుండి గణితం తరగతికి మారిపోయారు.

మదరాసు విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న నిజాం కాళాశాల నుండి 1939లో బి.ఎ. పట్టా పుచ్చుకున్నారు. 1942 -44 మధ్య కాలంలో నాగపూర్ విశ్వవిద్యాలయం నుండి న్యాయశాస్త్రంలో డిగ్రీ సంపాదించారు.

**పాత్రికేయుడుగా - పత్రికా సంపాదకుడుగా :**

1939 వ సంవత్సరం డిగ్రీ పూర్తి చేసుకొని రెండు సంవత్సరాలపాటు పొలం పనులు చూసుకుంటూ ఇంట్లో కాలక్షేపం చేశారు. ఆ సమయంలోనే గోలకొండ పత్రికకు కొన్ని వ్యాసాలు వ్రాసేవారు. మొదటి వ్యాసమే ఆంధ్రపితామహ మాడపాటి హనుమంతరావుగారి ప్రశంసకు పాత్రమైంది. ఆనాటి వారి ప్రోత్సాహంతో శ్రీరామానుజరావుగారు సాంస్కృతిక కార్యక్రమాలకూ, సాహిత్య వ్యాసంగానికీ తన కాలాన్ని పూర్తిగా వినియోగించారు.

తెలంగాణాలో సాహిత్య పత్రికలు లేనిలోటు తీర్చాలని సంకల్పించారు. సురవరం ప్రతాపరెడ్డి, మాడపాటి హనుమంతరావూ మొదలగు పెద్దల ఆశీస్సులతో నల్లగొండ మిత్రుల తోడ్పాటుతో 1946లో 'శోభ' అనే సాహిత్య మాసపత్రికను ప్రారంభించారు. తానే ఆ పత్రికకు సంపాదకుడు. 1950 తరువాత ఆ పత్రిక నిలిచిపోయింది.

తెలంగాణాలోని ఆంధ్రుల ఉద్యమాలకు 'తెలంగాణా' అనే దినపత్రిక ప్రతిబింబంగా ఉండేది. నవ్యసాహిత్యాన్ని గూర్చి యీ పత్రికలో ప్రతివారం వీరు వ్యాసాలు వ్రాస్తుండేవారు. ఒకవారం వేయిపడగలు నవలపై వ్యాసం రాశారు. పత్రికలో వ్యాసాన్ని విశ్వనాథ సత్యనారాయణ చదివారు. తన నవలను అంత చక్కగా విశ్లేసించిన రామానుజరావును అభినందిస్తూ, లేఖ వ్రాశారు. ఆ తరువాత కొన్ని నెలలకు వరంగల్‌లో ఒక గ్రంథాలయ వార్షికోత్సవ సభకు విశ్వనాథ వచ్చారు. ఆనాటి సభలో పట్టణంలోని ప్రముఖ న్యాయవాది ఒకరు విశ్వనాథకు స్వాగతం చెబుతూ వారి కవిత్వాన్ని ప్రస్తావించారు. ప్రస్తావనలో వారి కవిత్వం సరళం, సుబోధకమై ఉంటుందని సర్వసాధారణమైన పరిచయ వాక్యాలు పలికారు. ఈ పరిచయ వాక్యాలు విశ్వనాథకు కోపాన్ని తెప్పించాయి. తరువాత విశ్వనాథ ఉపన్యసించే సమయం వచ్చింది. వారు తన ఉపన్యాసంలో "నా కవిత్వము సభాధ్యక్షులనుకున్నంత సరళమైంది కాదు. వారు నా పుస్తకాలను చదివినట్లు కనిపించదు. నా రచనలు కొందరికి మాత్రమే అర్థము కాగలవు. ఆ కొందరిలో మీ ఊరివారైన దేవులపల్లి రామానుజరావుగారొకరు" అని తన ఉపన్యాసాన్ని పూర్తిచేశారు. రామానుజరావు రచనా వ్యాసంగానికి ఈ సంఘటన పెద్ద ప్రోత్సాహమిచ్చింది.

ఆనాటి తెలంగాణ ప్రజల రాజకీయ, సామాజిక, సాంస్కృతిక అవసరాల దృష్ట్యా ఒక దినపత్రిక వెలువడవలసిన అవసరం ఎంతగానో ఉన్నది. అంతకు ముందే ఉన్న రెండు దినపత్రికలలో ఒకటి 'మీజాన్' పత్రిక ప్రజకు, ప్రజా ఉద్యమాలకు దూరంగా ఉండేది. రెండవదైన 'తెలంగాణ పత్రిక' రెండు సంవత్సరాలు నడచి ఆగిపోయింది. ఈ లోటును 'గోలకొండ పత్రిక' తీర్చింది.

ఆ రోజుల్లోని ఉర్దూ పత్రికలు నిజాం రాజుకు అనుకూలంగా వార్తలు వ్రాసేవి. ఇండియన్ యూనియన్‌లో రాజు చేరకూడదని వ్రాసేవి. దీనికి భిన్నంగా 'గోలకొండ పత్రిక' ప్రజల పక్షాన నిలిచింది. ప్రజాభిప్రాయాలకు అనుకూలంగా వార్తలనూ, వ్యాఖ్యానాలనూ, సంపాదకీయాలనూ ప్రకటించింది. నిజాం నవాబుకు వ్యతిరేకంగా పత్రికల్లో వ్రాసిన షోయబుల్లాఖాన్‌ను రజాకార్లు హత్యచేశారు. ఇలాంటి దౌర్జన్య సంఘటనలు జరిగినప్పటికీ గోలకొండ పత్రిక ఏమాత్రం చలించలేదు. ప్రాణాలకు తెగించి ఈ పరిస్థితుల్లో కూడా పత్రికను నడిపిన ఖ్యాతి రామానుజరావుకు దక్కింది.

1962-64 సంవత్సరాల మధ్యకాలంలో 'గురజాడ శతవార్షికోత్సవ సంచిక' తెలుగు, ఆంగ్ల భాషల్లో వెలువడింది. 1960-61వ సంవత్సరం రవీంద్రనాథ ఠాగూర్ శతవార్షికోత్సవ సంచిక వెలువడింది. ఈ రెంటికి వీరే సంపాదకులు. మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లో జరిగిన ద్వితీయ ప్రపంచ తెలుగు మహాసభల ప్రత్యేక సంచికకు కూడా వేరే సంపాదకులు.

**ఆంధ్ర సారస్వత పరిషత్తు :**

1937వ సంవత్సరం నిజామాబాదులో జరిగిన ఆంధ్ర మహాసభలో భాషాసమస్య ప్రాధాన్యం వహించింది. తెలుగు భాషా ప్రచారానికి ఒక సాహిత్య సంస్థ వుండవలెనన్న కోరిక ఆనాటి నుండీ అందరిలోనూ బలపడింది. ఈ అభిప్రాయం కార్యరూపం దాల్చింది. 1943వ సంవత్సరం మే నెలలో ఆంధ్ర సారస్వత పరిషత్తు స్థాపన జరిగింది.

ఇది ఒక విశిష్టమైన సంస్థ. ఏ ప్రత్యేక సాహిత్య సంప్రదాయానికీ కట్టుబడదు. పాత కొత్తలకు స్వాగతమిచ్చి ప్రోత్సహించింది.

సారస్వత పరిషత్తు స్థాపన సందర్భంలో వీరికి ఈ సంస్థతో ఏర్పడిన సంబంధం క్రమక్రమంగా ధృఢపడింది. 1944లో కార్యవర్గ సభ్యుడిగా, 1949లో ఉపాధ్యక్షులుగా యీ సంస్థకు ఎన్నికయ్యారు. పరీక్షా నిర్వహణ కార్యదర్శిగా పరిషత్తు కార్యక్రమాల్లో నిమగ్నులయ్యారు. చిన్న వయసులో ఆంధ్ర సారస్వత పరిషత్తు కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికైన కొద్దిమందిలో వీరొకరు. వీరు రాజకీయ, వైజ్ఞానిక, సాంస్కృతికాది అనేక ఉద్యమాల్లో పనిచేశారు. ఏ ఉద్యమంలో పనిచేసినా వీరి జీవితంతో పూర్తిగా పెనవేసుకున్నది సారస్వత పరిషత్తు మాత్రమే. ఈ పరిషత్తును శాఖోపశాఖలుగా విస్తరింపజేశారు. రాష్ట్రేతర ప్రాంతాల్లో పరీక్షలు నిర్వహించారు. ఉత్తమ గ్రంథాలను ప్రచురించారు. సాహిత్య సమావేశాలు ఏర్పాటు చేశారు. అనేకుల దగ్గర విరాళాలు పోగుచేసి రాష్ట్ర రాజధాని నగరంలో సువిశాలమైన, సుందరమైన వసతి భవనాలు సమకూర్చారు. మంచి గ్రంథాలయం ఏర్పాటు చేశారు. వీటన్నిటిలో వీరి కృషి చిరస్మరణీయమైనది. న్యాయశాస్త్ర పట్టభద్రుడై గూడా ఆ వృత్తిపై శ్రద్ధ చూపలేదు. వ్యవసాయాన్ని విస్మరించారు. సులభంగా సంపాదించగలిగిన ప్రభుత్వ ఉద్యోగాల జోలికి పోలేదు. సారస్వత పరిషత్తుతో ప్రారంభించి పూర్తిగా సాహిత్య, సాంస్కృతిక కార్యకలాపాల్లో మునిగిపోయారు.

సారస్వత పరిషత్తు ఆరవ మహాసభలు అలంపూర్‌లో 1953లో జరిగాయి. అంతపెద్దసభలకు వీరు అధ్యక్షత వహించారు. డాక్టర్ రాధాకృష్ణన్ గారు ప్రారంభించారు. 1952-54 మధ్య కాలంలో సారస్వత పరిషత్తుకు అధ్యక్షులుగా పనిచేశారు. 1954నుండి వారు మరణించే వరకు ఈ పరిషత్తుకు ఉపాధ్యక్షులుగా ఉన్నారు. దీని ద్వారా కేవలం సాహిత్య వికాసాలకు మాత్రమే తన సేవలు పరిమితం చేయక సాంస్కృతిక పునరుజ్జీవనానికి కూడా ఎంతో సేవ చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని హిందీ విశ్వవిద్యాలయంగా మార్చడానికి జరిగిన ప్రయత్నాలన్నింటినీ వమ్ముచేశారు. తెలుగు భాషను నిర్బంధ భాషగా ప్రవేశపెట్టడంలోనూ వీరి కృషి మరవరానిది.

తెలుగులో విద్యాబోధన సమర్థంగా చేయగల ఉపాధ్యాయుల కొరత ఉండేది. విద్వాన్ పరీక్షలో ఉత్తీర్ణులైనవారే ఆ రోజుల్లో తెలుగు పండితులుగా పాఠశాలల్లో నియమింపబడేవారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు కూడా సిలబస్

తయారు చేయించి తెలుగులో విశారద పరీక్షలు నిర్వహించింది. ఈ విశారద పరీక్షలో ఉత్తీర్ణులైన వారిని ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులుగా నియమించ వచ్చునని ప్రభుత్వ ఉత్తరువులు తెచ్చుటలో వీరి కృషి శ్లాఘనీయమైనది.

1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడింది. కేంద్ర ప్రభుత్వము అఖిల భారత స్థాయిలో మూడు అకాడమీలను ఏర్పరిచింది. ఆ మాదిరిగానే రాష్ట్ర ప్రభుత్వం కూడా సాహిత్య, సంగీత నాటక, లలిత కళా అకాడమీలను పేరుతో మూడు అకాడమీలను నెలకొల్పింది. 1957 ఆగష్టు తొమ్మిదవ తేది ఆంధ్ర సాహిత్య అకాడమి ప్రారంభించబడింది. ప్రారంభకులు నాటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ గారు. ఆ అకాడమీకి అధ్యక్షులు డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డిగారు. రామానుజరావుగారు కార్యదర్శి. నాటి నుండి 1979వరకు అనగా స్వచ్ఛందంగా తానే ఆ పదవి వదిలేవరకు, అకాడమి కార్యదర్శిగా పనిచేశారు. ఈ అకాడమి సుమారు మూడు వందలకు పైగా గ్రంథాలు ప్రచురించింది. పుస్తక ప్రచురణలకు ఎందరికో ఆర్థిక సహాయమందించింది. ఈ మొత్తము కృషికి ప్రధాన సూత్రధారిగా వీరు ప్రశంసనీయులు.

రామానుజరావుకు సారస్వత పరిషత్తు ప్రధాన బాధ్యుడుగా, సాహిత్య అకాడమి కార్యదర్శిగా ఎంతోమంది రచయితలతో ప్రత్యక్ష పరిచయముంది. ఈ పరిచయంతో వారి మనస్తత్వాలను చక్కగా మదింపు చేశారు. ఒకానొక సభలో రచయితలను గూర్చి యిలా చెప్పారు. రచయితల రచనలకూ వారి నిజ జీవితాలకూ పెద్ద వ్యత్యాసం ఉంది. తాము సామాన్య జనానికి అతీతులుగా భావిస్తూ సమాజంలో తమకొక ప్రత్యేక స్థానాన్ని కోరుకుంటున్నారు. రచయిత తాను నిర్మించుకొన్న పంజరం నుండి బయట పడాలి అని నిస్సంకోచంగా తన అభిప్రాయాలు వెలిబుచ్చారు.

**రచయితగా రామానుజరావు :**

నిజాం కళాశాలలో వీరు విద్యార్థిగా ఉన్నప్పుడే తెలుగుభాషపై అభిరుచిని పెంచుకున్నారు. రాయప్రోలు గారి కవిత్వం వీరికి ఇష్టం. ముద్దుకృష్ణ గారి సంపాదకత్వంలో వెలువడిన "వైతాళికులు" వీరిని బాగా ఆకర్షించింది. 1939 ప్రాంతంలో కవిత్వం ప్రారంభించారు. నాగపూర్ న్యాయకళాశాలలో దీనికి ప్రాణం పోశారు. ఈ ఖండికలే 1953 లో "పచ్చతోరణం" కావ్యరూపంలో వచ్చాయి.

వీరి 'సారస్వత నవనీతం' ఉత్తమ సాహిత్య విమర్శకు నిదర్శనం. కేంద్ర సాహిత్య అకాడమి కౌన్సిలు సభ్యులుగా వీరి ఎన్నికకు కారణమైంది ఆ గ్రంథమే. వీరికి అమితమైన కీర్తి ప్రతిష్టలు తెచ్చి పెట్టింది కూడా ఈ గ్రంథమే. "చదివింది న్యాయశాస్త్రం – సాహిత్య విమర్శలో ఇంత అపారమైన జ్ఞానం ఎలా సాధ్యం?" అని ఎవరైనా ప్రశ్నిస్తే తనకు సాహిత్యం మరీ నవ్యసాహిత్యమంటే యిష్టమని చెప్పేవారు. వ్యాకరణ, అలంకార శాస్త్రాలు తాను పెద్దగా చదవలేదని సవినయంగా ఒప్పుకొనేవారు.

"మా ఊరు ఓరుగల్లు" అనే వ్యాసంలో శిథిలావస్థలో ఉన్న వరంగల్లు గత చరిత్రను మనముందు సాక్షాత్కరింపజేశారు. "కదనరంగమె కాదు మా ఊరు కళాక్షేత్రము కూడా. కాకతీయ రాజుల పోషణలో సంగీత సాహిత్యాది లలిత కళలు అద్వితీయంగా అభివృద్ధి చెందినవి. వరంగల్లు కోటలో కట్టడాలు, వేయి స్తంభాల గుడి ఆనాటి కలల గొప్పతనానికి సాక్షీభూతంగా, సజీవ నిదర్శనాలుగా నిలిచి ఉన్నవి" అని ఈ వ్యాసంలో అంటారు.

పచ్చతోరణం, సారస్వత నవనీతం, ఉపన్యాస తోరణం, తెనుగు సాహితి; వేగు చుక్కలు మొదలుగా గల యిరవై కావ్యాలను వీరు వెలువరించారు. ఆంధ్రదేశంలోని అనేక మంది కవి పండితులకు ఆప్తుదయ్యారు. కృతి కర్తగానే గాక ప్రసిద్ధ కవుల కావ్యలకు కృతిభర్తగా కూడా ఉన్నారు. చాలామంది కవులు నుండి అంకితం తీసుకున్నారు. దాశరథి గారి కవితా పుష్పకం, డా. సి నారె గారి ఉదయం నా హృదయం, డాక్టర్ జ్ఞానానంద కవిగారి 'అక్షరగుచ్ఛం' వాటిలో కొన్ని.

**గ్రంథాలయ ఉద్యమం :**

ఆ రోజుల్లో తెలంగాణా ప్రజలను మేల్కొలిపిన ఉద్యమాలు నాలుగు. 1. ఆంధ్రోద్యమం 2. గ్రంథాలయోద్యమం 3. ఆర్యసమాజ ఉద్యమం 4. పత్రికారంగం. వీటిలో గ్రంథాలయోద్యమం ప్రజలను మేలుకొల్పి జాతీయోద్యమం వైపు మరల్చిన గొప్ప ఉద్యమం. అందువలన ఈ ఉద్యమానికి నిజాం ప్రభుత్వం అనేక అడ్డంకులు కల్పించేది. గ్రంథాలయ సభల అధ్యక్షుల, వక్తల ఉపన్యాసాలను ప్రభుత్వం ముందుగానె చదివి ఆపైనే అనుమతినిచ్చేది. ఆర్యసమాజ ఉద్యమంతో తప్పమిగిలిన ఉద్యమాల్లో రామానుజరావు పాత్ర విశిష్టమైంది.

యువకుడుగా రామానుజరావు వరంగల్లు శబ్దాను శాసన గ్రంథాలయానికి కార్యదర్శిగా ఉండేవారు. గ్రంథాలయ సంఘాధ్యక్షులు గ్రంథాలయ ఉద్యమ పితామహ గాడిచర్ల హరిసర్వోత్తమరావుతో పరిచయాన్ని పెంచుకొని వారిని తెలంగాణా ప్రాంతానికి ఆహ్వానించారు. 1944వ సంవత్సరంలో శబ్దశాసన గ్రంథాలయ రజతోత్సవ సభలు వరంగల్లులో జరిగాయి. ఈ సభలకు రాయప్రోలు సుబ్బారావు అధ్యక్షత వహించారు. హరిసర్వోత్తమరావు ప్రారంభించారు ఈ సభలు యావదాంధ్ర సభలను గుర్తుకు తెచ్చే విధంగా రామానుజరావు గారు నిర్వహించారు. దీనితో వీరి శక్తి నిరూపితమైంది. కీర్తి ఆకాశమంత ఎత్తుకు ఎదిగింది.

నైజాం ప్రభుత్వ ప్రధానిగా సర్ మీర్జా యిస్మాయేలు గారు పరిపాలిస్తున్న రోజులవి. మీర్జాగారికి విద్యావ్యాప్తి పైనా, గ్రంథాలయాల అభివృద్ధిపైనా, ఆసక్తి ఎక్కువ. వీరు హైదరాబాదులోని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ వున్న ఎత్తయిన కోటగోడలు పడగొట్టించి చిన్నగోడలను పెట్టించారు. కార్యాలయాలను సులభంగా గుర్తుపట్టడానికి వీలుగా పసుపు రంగువేయించేవారు. ఒక పర్యాయం వీరు వరంగల్లు వస్తున్నారనే వార్త వచ్చింది. వారిని దర్శించాలనీ, తమ గ్రంథాలయ పరిస్థితి వివరించాలనీ రామనుజరావుగారు అభిప్రాయ పడ్డారు. ప్రధానిని కలుసుకోవడానికి అనుమతి లభించదని తెలిసింది. గ్రంథాలయం వరంగల్లు కోటనుండి హనుమకొండకు వెళ్ళేదారిలో ఉంది. వెంటనే వీరికి ఒక ఆలోచన వచ్చింది. గ్రంథాలయం గోడలకు పసుపు రంగు వేయించి నలుగురైదుగురు యువకులను వెంట బెట్టుకొని ప్రధాని వెళ్ళేదారిలో గ్రంథాలయం ముందు నిలుచున్నారు. సర్ మీర్జా యిస్మాయేలుగారు కారులో దూరం నుండి పసుపు రంగు భవనాన్నీ, వీరిని గమనించారు. కారు ఆపి లోనికి వచ్చారు ప్రధాని. గ్రంథాలయ నిర్వహణకు సంతోషించి రిజిష్టరులో తన అభిప్రాయం వ్రాసి పెట్టి వెళ్ళారు. ఆ మరునాడు రూ. 116/- చెక్కును జిల్లా కలెక్టరు గారి ద్వారా పంపి, గ్రంథాలయ భవన నిర్మాణానికి అవసరమై స్థలం ఉచితంగా ఇచ్చే ఏర్పాట్లు చేస్తున్నట్లు వార్త పంపారు.

**నిర్వహించిన పదవులు :**

రామానుజరావుగారు సాహితీ రంగంలో గానీ, రాజకీయ రంగంలోగానీ, విద్యారంగంలోగానీ నిర్వహించిన పదవులు అనేకం. ఏ బాధ్యత అప్పజెప్పినా చిత్తశుద్ధితో ఆ పదవికి న్యాయం చేకూర్చడం వీరి చిత్తశుద్ధికి, పట్టుదలకూ తార్కాణం. ఏ పదవి తానుగా కోరుకోలేదు. తనకు అప్పజెప్పిన బాధ్యత దేనిని వద్దనలేదు. ఇదే వారి గొప్పతనం.

ఆంధ్ర సారస్వత పరిషత్తులో 1944 నుండి 47 వరకూ, కార్యవర్గ సభ్యుడుగా 1952 నుండి 54 వరకూ అధ్యక్షుడుగా, 1954నుండి 1981 వరకు ఉపాధ్యక్షుడుగా ఉన్నారు. ఆంధ్ర సాహిత్య అకాడమి కార్యదర్శిగా 1957 నుండి 79 వరకు ఉపాధ్యక్షుడుగా 1979 నుండి 81 వరకు పనిచేశారు.

రాష్ట్ర కేంద్ర గ్రంథాలయ పుస్తక ఎన్నిక కమిటి సభ్యుడుగా 1965 నుండి 75 వరకు పదేళ్ళు పనిచేసి మంచిపేరు తెచ్చుకున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం సెనెట్ మెంబరుగా సిండికేట్ మెంబరుగా ఉన్నారు. తాత్కాలిక ఉపాధ్యక్షులుగా మూడు పర్యాయాలు పనిచేశారు.

రాజకీయ రంగంలో రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ సభ్యుడుగా యువజన కాంగ్రెస్ అధ్యక్షులుగా రాజ్యసభ మెంబరుగా రాణించారు. సామాన్యుడిగా కనిపిస్తూనే అసమాన కీర్తి శిఖరాలధిరోహించాడు. సాహిత్య పరిషత్తులోని ఒక మూలగదిలో ఉంటూనే హైదరాబాదు నగరం మూల మూలల్లో జరిగే ప్రతి సాహితీ, సాంస్కృతిక కార్యకలాపాల్లో ముఖ్య వ్యక్తిగా దర్శనం ఇస్తుండేవారు.

## ఎ.యస్.రావు

ఆంధ్రజాతి గర్వించదగిన ప్రముఖులు అన్ని రంగాల్లో ఉన్నారు. అలాంటి వారిలో ప్రముఖ ఇంజనీరుగా పేరెన్నికగన్న డాక్టర్ కె.యల్.రావు ఒకరు. వీరి పూర్తిపేరు కానూరి లక్ష్మణరావు. ఈయన బెజవాడ సమీపాన గల కంకిపాడు గ్రామంలో 1902 లో జన్మించారు. వీరి తండ్రి గ్రామ కరణం. చిన్నతనం నుండే రామకృష్ణ పరమహంస, మహాత్మాగాంధీ, వివేకానందుడు మొదలైన మహాపురుషుల జీవితచరిత్రలు చదివి వారిలాగా ఆదర్శంగా జీవించా లనుకొనేవారు. వీరికి చిన్నతనంలోనే తండ్రి చనిపోవటం జరిగింది.

హైస్కూలు చదువు బెజవాడో జరిగింది. ఈ తరంవారు నమ్మలేనంత చౌకరోజులవి. ఆరోజుల్లో నెలకు ఎనిమిది రూపాయలతో ముప్పూట భోజనం టిఫెనూ పెట్టేవారు. అక్కడ మంచి మార్కులతో యస్.యస్.యల్.సి. పాసయ్యారు.

మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో లెక్కల గ్రూపులో సీటు లభించింది. బాగా చదివి ఇంటర్మీడియట్ కూడా డిస్టింక్షన్‌లో పాసయ్యారు.

మెడిసిన్‌లోనూ, గణితశాస్త్రం బి.ఎ. ఆనర్సులోనూ ఇంజనీరింగులోనూ సీటువచ్చింది. తన కోరిక ఇంజనీరు కావాలని, గిండీ ఇంజనీరింగు కళాశాలలో చేరారు. సివిల్ ఇంజనీరింగులో శ్రద్ధ ఎక్కువ. అయినా ఇంజనీరింగులో అన్ని విభాగాలు అధ్యయనం చేశారు. ఇంజనీరు కోర్సు పూర్తిచేశారు.

విశాఖపట్నం జిల్లా బోర్డులో సహాయ ఇంజనీరుగా ఉద్యోగం దొరికింది. సాధారణంగా ఇంజనీర్లకు పైసంపాదన ఉంటుంది. కాంట్రాక్టర్లు తమ లబ్ధికోసం లంచాలిస్తుంటారు. ఒక సందర్భంలో ఒక కాంట్రాక్టరు తన లోపం కప్పిపుచ్చుకోవడం కోసం ఈయనకు లంచం ఎర చూపాడు. రావుగారు మండిపడి ఆ కాంట్రాక్టు రద్దుచేస్తానని హెచ్చరించాడు. అతడు భయపడి పారిపోయాడు బయటికి. అదీ రావుగారి నిజాయితి. ఈ నిజాయితీ జీవితమే ఆయన ఆఖరివరకు కొనసాగించారు. తన జీవిత చరిత్రలో యిలా వ్రాశారు. "ఎవరైనా లంచం ఇవ్వజూపితే వారిపై అసహ్యభావం కలుగుతుంది. అది పాపకార్యమనీ, అతిహీనమైన పని అనీ నా మనసులో పాతుకొని పోయింది. ఆ భావమే నన్ను ఆ దశలో రక్షించింది. "ఎంత నిజాయితీ! గాంధీజీ వివేకానందుల ప్రభావం ఊరికే పోలేదు.

ఈయన మిత్రుడు డాక్టర్ యం.వి. కృష్ణారావు. వీరిద్దరూ ఆదర్శభావాలు కలవాళ్ళే. ప్రపంచమంతా తిరిగి విజ్ఞానం సంపాదించాలనే కోరిక ఉన్నవారు. ఇద్దరూ బర్మాదేశం వెళ్ళాలని నిర్ణయించుకున్నారు. కృష్ణారావుగారెందుకో వెళ్ళలేకపోయారు. రావుగారొక్కరే వెళ్ళారు.

రంగూన్‌లో కార్మికసంఘ నాయకుడు నారాయణరావనే తెలుగువాడు. రావుగారు రంగూన్ వచ్చినందుకు నిరుత్సాహపరిచాడు. అయినా ఈయన అధైర్యపడలేదు. స్వశక్తితో నీటిసరఫరా శాఖలో ఉద్యోగం సంపాదించాడు. కొన్నాళ్ళకు ఆ ఉద్యోగం వదిలేసి కాంట్రాక్టర్ల కంపెనీలో చేరాడు. మరికొన్నాళ్ళకు దాన్ని కూడా వదిలేసి సిలోన్ ఇంజనీరింగ్ కళాశాలలో సహాయ ప్రొఫెసర్‌గా చేరారు. ఆ ఉద్యోగం కూడా వదిలేసి ఇండియాకు తిరిగివచ్చి మెట్టూరు ప్రాజెక్టులో జూనియర్ ఇంజనీరుగా చేరాడు.

గాంధీ అన్నా, కాంగ్రెస్‌పార్టీ అన్నా ఈయనకు చాలా ఇష్టం. అయ్యదేవర కాళేశ్వరరావుగారూ, కొమర్రాజు అచ్చమాంబగారూ మొదలైన బంధువులందరూ కాంగ్రెస్‌లో ఉన్నారు. తాను కూడా చేరాలన్న సంకల్పంతో ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా యిచ్చారు. అధికార్లు అంగీకరించలేదు. గిండీ ఇంజనీరింగు కాలేజీకి బదిలీ చేశారు. లెక్చరర్‌గా చేరాక ఇంజనీరింగ్‌లో రీసెర్చి (పరిశోధన) చేయాలని కోరిక కలిగింది. అది చాలా కష్టమని అందరి భావన. రీసెర్చి కోసం ఇంజనీరింగు ఎం.యస్సీ.లో చేరాడు. గొప్ప న్యూటన్ బయలుదేరాడురా అని మిత్రులు ఎగతాళి చేశారుకూడా.

పరిశోధనా విభాగం (రీసెర్చి) డైరెక్టరు కె.సి.చాకో అనే గొప్ప ఇంజనీరు. లండన్ విశ్వవిద్యాలయంలో పరిశోధన చేసిన వ్యక్తి. వీరి సలహా సహకారాలతో సిద్ధాంత వ్యాసం సమర్పించారు రావుగారు. ఆ సిద్ధాంతవ్యాసాన్ని ఇంగ్లాండు పంపారు. అక్కడ ఇంజనీరింగ్ నిపుణులైన ఆండ్రూస్, ఆస్కార్, ఫేజర్, బెట్టో అనేవాళ్ళు దాన్ని చదివి ఆశ్చర్యపోయారు. ఇంజనీరింగ్‌లో పరిశోధన సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించి డిగ్రీపొందిన భారతీయుల్లో రావు ప్రథములు.

### మేధాశక్తికి తొలి విజయం :

మద్రాసు సెంట్రల్ రైల్వేస్టేసన్ కూవంనది గట్టున ఉంది. మద్రాసునగరం ఉత్తరం, దక్షిణ ప్రాంతాలను కలిపే కీలకమైన బ్రిడ్జి యీ నదిపై నిర్మింపబడి ఉంది. సముద్రం ఉప్పు గాలి ప్రభావం వలన బ్రిడ్జి కిందిభాగం కాంక్రీటు పూడిపోయి ఇనుపకమ్ములు బయటపడ్డాయి. బ్రిడ్జి బలహీనపడిందన్న భావంతో ప్రభుత్వం ఆ బ్రిడ్జిపై రాకపోకలు నిలిపివేసింది.

ప్రత్యామ్నాయపు ఏర్పాట్లు పరిశీలించవలసిందిగా ఛీఫ్ ఇంజనీరు రావును కోరారు. రావుగారు బ్రిడ్జిని పరిశీలించి పథకం ఆలోచించాడు. అప్పుడప్పుడో కాంక్రీటు విద్యలో ప్రజ్ఞను సంపాదించుకుంటున్న రావుగారు సన్నకంకరతో కాంక్రీటు తయారుచేయించి తుపాకి గొట్టం లాంటి గొట్టాలతో కిలుమును గీకేసిన కమ్ములపై పిచికారీ చేయించాడు. సిమెంటు బాగా మెత్తుకొనేలా చేశాడు. ఇంకే! బ్రిడ్జీ బాగుపడింది. రాకపోకలు నిర్భయంగా జరిగాయి. రావు కీర్తి దేశమంతా వ్యాపించింది.

ఈ విజయంతో కాంక్రీటు కట్టడాలపైనా ఆ విద్యపైనా శ్రద్ధ పెరిగింది రావుగారికి. ఈ విద్యలో ప్రపంచ ప్రసిద్ధులైన ఫ్రెస్సియోనెట్ అనే ఇంజనీరు ఫ్రాన్సులో ఉన్నాడు. ఆయన దగ్గర ఈ విద్య చదవాలని రావులో పట్టుదల కలిగింది. అధికారులు అందుకు అనుమతించలేదు. అయినా వెళ్ళడానికే నిశ్చయించుకున్నాడు. భార్య వరలక్ష్మితో ఫ్రాన్సు బయలుదేరాడు.

చాలామంది విద్యార్థి భక్తులు బొంబాయి వరకు వచ్చి వీడ్కోలిచ్చారు. ఫ్రాన్సు చేరి ఫ్రెస్సియెనెట్‌ను కలిశారు. తన కోరిక కొంతవరకు నెరవేరింది. 1939 లో ఫ్రాన్సు నుండి లండన్ చేరాడు. నేర్చుకున్న కాంక్రీటు విద్యలో అనుభవం సంపాదించాలని "కాంక్రీటు ఇంజనీరింగు" సంస్థలో చేరాడు. అక్కడ ఛీఫ్ ఇంజనీరు రెనాల్డ్స్. మరొక ఇంజనీరు టర్నరు. అది శిక్షణా కేంద్రంగదా! డబ్బు కట్టి శిక్షణ పొందవలసి వచ్చింది. ఈ డబ్బుకోసమూ, తన కుటుంబ పోషణకోసమూ సాయంకాల సమయాల్లో కాలేజిల్లో లెక్చర్లు ఇచ్చి డబ్బు సంపాదించేవాడు.

మద్రాసులో ప్రతి నెలా జీతం తీసుకుంటూ, పదోన్నతి కలిగే ఉద్యోగంలో ఉండి కూడా ఇండియా వదలి లండను వచ్చాడు రావుగారు. లండన్‌లో సంసారం గడవడానికి చిల్లర ఉద్యోగాలు చేస్తున్నాడు. కాంక్రీటుపై పరిశోధనే తన ధ్యేయం. కష్టాలను లెక్కించదలంచలేదు.

1939 వ సంవత్సరం హిట్లర్ యుద్ధాన్ని ప్రకటించాడు. యుద్ధ వాతావరణంతో నిర్మాణ కార్యక్రమాలు కుంటుబడ్డాయి. బాంబులనుండి రక్షించుకోవడం కోసం నేలను త్రవ్వి షెల్టర్స్ (Shelters) కట్టడం అధికమైంది. ఈ కట్టడాలకు సంబంధించి కాంక్రీటుపై పరిశోధన ఎక్కువైంది.

రావు లెక్కల్లో ఘటికులు. కానీ డిజైన్స్ వేయడంలో అంత మేధావి కాదు. ఇది పెద్ద లోటు అనిపించింది రావుగారికి. లండన్ ప్రక్కనేగల థేమ్స్ నదిపై ప్రత్యేక తరహాలో కట్టబడిన బ్రిడ్జీని ప్రతిరోజూ పరిశీలించి (డిజైన్స్) రూపకల్పన చేయడం నేర్చుకున్నాడు.

ఈ సమయంలో ఈయనకు లండన్ ప్రక్కనేగల ఒక పట్టణంలోని కళాశాలలో సీనియర్ లెక్చరర్ ఉద్యోగం లభించింది. ఈ పట్టణంలో, వీరికి అద్దెకు ఇల్లు చిక్కలేదు. రంగుజాతులవారికి వీళ్ళు ఇల్లు ఇవ్వరు. రావుగారికి మద్రాసు జీవితం గుర్తుకు వచ్చింది. తన మిత్రులైన కొందరు తక్కువ కులస్తులని అగ్రజాతులవారు వారికి ఇల్లు యివ్వడానికి నిరాకరించడం ఆయనకు జ్ఞాపకం వచ్చింది. అక్కడ నల్లవాళ్ళే నల్లవాళ్ళకు ఇల్లు ఇవ్వనప్పుడు ఇక్కడ తెల్లవాళ్ళు రంగుజాతివారికి ఇల్లు ఇవ్వకపోవడంలో ఆశ్చర్యపడవలసినదేదీ లేదనుకున్నాడు. ఈ అద్దెయింటి వేట ఆ దంపతులకు కన్ను తెరిపించింది. కుల, మత, వర్ణ వివక్ష ఎంత చెడ్డదో అప్పుడు బాగా అర్థమైంది. అతికష్టంమీద ఒక చిన్న ఇల్లు అద్దెకు లభించింది. ఈ అనుభవం మనసులో హత్తుకొని ఉందేమో, తరువాత తమ సంతానమంతా తమ కులంకాని వారితో వివాహం చేసుకున్నప్పుడు మారు మాట్లాడకుండా ఒప్పుకోవడం జరిగింది. సంతోషమూ కలిగింది.

ఈ కళాశాలలో రావు విద్యార్థులను బాగా ఆకట్టుకున్నారు. తాను పైన గ్రంథం వ్రాశాడు. ఒక ప్రముఖ కంపెనీ ప్రచురించింది. కంపెనీ ప్రచురించిందంటే అది ఒక ప్రత్యేకత అన్నమట. పుస్తకంపై మంచి రాయల్టీ కూడా వచ్చింది. మద్రాసులో కూడా ఈయన కీర్తి వ్యాపించింది. ఆయనపై మరింత గౌరవం పెరిగింది.

రావు అమెరికా వెళ్లి "సెల్యులార్ కాఫర్ డ్యాం" విషయమై వివరాలు సేకరించాలని మద్రాసు నుండి ఛీఫ్ ఇంజనీరుగారు ఉత్తరం వ్రాశారు.

**"సెల్యులర్ కాఫర్ డ్యాం" అంటే ఏమిటి? :**

జల ప్రవాహంతో ఉన్న నదులకు ఆనకట్ట లేదా వంతెన కట్టాలంటే నదిలో ఒకవైపున ముందు నీరు లేకుండా చేసుకోవాలిగదా! కాఫర్ డ్యాంలు కట్టి మధ్యలోనుండి నీరు తీసేసి పునాదులు వేస్తారు. ఒకవైపు పూర్తికాగానే మరోవైపు

కాఫర్‌డ్యాం కట్టి నీరు తీసేసి అక్కడ కూడా పునాదులు వేస్తారు. పునాదులపై గోడగానీ, స్తంభాలుగానీ కట్టడం పూర్తిఅయినాక వీటిని తొలగించి వేస్తారు.

యుద్ధం రోజుల్లో అమెరికా వెళ్ళడానికి ఇంగ్లండు ప్రభుత్వం అంగీకరించలేదు. ఎలాగో ఇండియా ప్రభుత్వం జోక్యంతో ఇంగ్లాండువారి అనుమతి సంపాదించి అమెరికా వెళ్లాడు. అమెరికాలోని అన్నిరకాల నిర్మాణాలను నిశితంగా పరిశీలించాడు. అమెరికాలోని కొలరెడో నదిపై కట్టిన డ్యాం ప్రపంచంలోకెల్లా ఎత్తయినది. ఎక్కువ కాంక్రీటు ఉపయోగించి కట్టిన మరొక డ్యాం గ్రాండ్ లవ్‌లీ డ్యాం. ఈ రెండింటిని రూపకల్పన చేసినవాడు (డిజైనర్) విశ్వవిఖ్యాత ఇంజనీరు జె.యల్. సాలేజ్‌గారు. రావుకు వీరి సలహాలూ, సహకారమూ లభించాయి. అన్ని విషయాలు కూలంకషంగా అధ్యయనం చేసి మంచి రిపోర్టు తయారుచేశారు రావుగారు. దాన్ని మద్రాసు పంపించారు. తాను ఇంగ్లాండు వచ్చేశారు.

**శ్రీరాంపాదసాగర్ ప్రణాళిక :**

గోదావరి నదిపై పోలవరం దగ్గర ప్రాజెక్టు కట్టాలని మద్రాసు ప్రభుత్వం ఆలోచించింది. ప్రభుత్వ చీఫ్ ఇంజనీర్ గోవిందరాజ అయ్యంగారు తెలుగువారు కాదు. గవర్నరు సలహాదారు యస్.పి. రామమూర్తి ముఖ్యమైన ప్రాజెక్టులను పరిశీలించడానికి ఛీఫ్ ఇంజనీరును అమెరికా వెళ్ళమని ప్రభుత్వం కోరింది. ఆయన అమెరికా వెళ్తూ ఇంగ్లండులో ఆగి రావుగారిని తనతో కూడా రమ్మన్నారు. తన కుటుంబ పరిస్థితి అనుకూలించకపోయినా అనుకోకుండా వచ్చిన అవకాశాన్ని వదలుకోదలంచలేదు రావుగారు. అదే ఆయన ప్రత్యేకత.

రెండవసారి అమెరికా వెళ్ళారు. ఛీఫ్ ఇంజనీరు అయ్యంగారితో కలిసి అనేక ప్రాజెక్టుల రూపకల్పనను (డిజైన్‌లను) అధ్యయనం చేసి రిపోర్టు తయారుచేశారు. అయ్యంగారు ఇండియా వచ్చారు. రావు ఇంగ్లండు వెళ్లిపోయారు.

తరువాత కొన్నిరోజులకు రావుగారికి ఒక ఉత్తరం వచ్చింది. అందులో తాను ఇండియాకు వచ్చి పోలవరం ప్రాజెక్టు పనులు చూడవలసిందనీ త్వరలో మద్రాసు రావలసిందనీ ఉంది. రావుగారు సంతోషంగా బయలుదేరారు. ఏడేళ్ళ తరువాత ఇండియాలో కాలుమోపారు. అంటే 1946 లో అన్నమాట.

వచ్చిందే తడవుగా శ్రీరాం పాదసాగర్ డ్యాం డిజైన్ చేసే పని ప్రారంభించారు. ఈ పని ఒక్క సంవత్సరంలోనే ముగించారు. రూపకల్పన ప్రకారము దాన్ని నిర్మిస్తే హైదరాబాద్ రాష్ట్రంలో కొంతభాగం నీటిముంపుకు గురిఅవుతుంది. ఈ కారణంగా ఈ ప్రాజెక్టు ఇచ్చంపల్లి దగ్గర కట్టడం మంచిదని హైదరాబాదు ప్రభుత్వం అన్నది. ఛీఫ్ ఇంజనీరు అయ్యంగారు మాత్రం పోలవరం దగ్గరే కట్టాలన్నారు.

ప్రాథమికమైన పనులు పూర్తి అయ్యాక ప్రఖ్యాత నిపుణుడు వై.యల్.సాలేజ్‌గారితో సంప్రదించడానికి అమెరికా వెళ్ళాడు మళ్ళీ రావుగారు. ఇండియాకు సంబంధించిన అనేక ప్రాజెక్టులపై పరిశీలన జరుగుతున్న అమెరికాలోని అంతర్జాతీయ ఇంజనీరింగు కంపెనీలో, సాలేజ్‌గారిని కలిసి డిజైన్ ఖరారు చేసుకొని భారతదేశం తిరిగి వచ్చారు. అయితే రాజకీయంగా ఆనాడు వచ్చిన మార్పుల కారణంగా ఆ నిర్మాణం ఆగిపోయింది.

**ఖోస్లా కమిటి - రావుగారి పాత్ర :**

లోయర్ భవానీ, మలంపూరా, ఇంకా మరికొన్ని డ్యాంల 'డిజైన్' చేయవలసిందిగా రావుగారిని ప్రభుత్వం కోరింది. కృష్ణానదిపై పులిచింతల, సిద్ధేశ్వరం నిర్మాణానికి సంబంధించిన పనులను గూడా పర్యవేక్షించమని కోరింది.

ఇవి కేవలం ఆంధ్రులకు సంబంధించిన ప్రాజెక్టులు కాబట్టి మద్రాసువాడైన చీఫ్ ఇంజనీరు గోవిందరాజు అయ్యంగారికి నచ్చలేదు. రావును బదిలీ చేయించాలని ప్రయత్నించాడు.

ఈ సమయంలోనే సెంట్రల్ వాటర్ అండ్ పవర్ కమిషన్‌లో డైరెక్టరుగా నియమిస్తూ రావుగారికి ఉత్తర్వులందాయి. వెంటనే ఢిల్లీ వెళ్ళిపోయారు. కేంద్రప్రభుత్వం ఒరిస్సాలోని హీరాకుడ్ ప్రాజెక్టు పర్యవేక్షణ వారికి అప్పజెప్పింది. భారతదేశమంతటా నీటిపారుదల ప్రాజెక్టులూ, జలవిద్యుత్ ప్రాజెక్టులూ పరిశీలించారు. పులిచింతల ప్రాజెక్టు కోసం మొదటినుండి ఆందోళన చేస్తున్న ముక్త్యాలరాజాతోపాటు ఆ ప్రాంతాన్ని సందర్శించి నందికొండ సరియైన స్థలం అని నిర్ణయించారు.

ఈ సమయంలో ప్రాజెక్టుల పరిశీలనకు ఖోస్లా కమిటి, ఆంధ్ర ప్రాంతానికి వచ్చింది. పులిచింత ప్రాజెక్టువల్ల మద్రాసు ప్రాంతానికి ఏరకంగానూ లాభం లేదన్న దృష్టితో ఆనాటి ముఖ్యమంత్రి రాజగోపాలచారి సైతం ఈ ప్రాజెక్టుకు అడ్డుచెప్పారు. రావు తన మేధాశక్తితో ఆ ప్రాజెక్టు అన్నివిధాల తగినదని నిరూపించి ఖోస్లా కమిటీచేత అంగీకరింపజేశారు. కాని స్థలం పులిచింతలకు మారుగా నందికొండకు మార్చారు. అదే నాగార్జునసాగర్. ఇవేగాక కాటన్ బ్యారాజు, ప్రకాశం బ్యారాజు, శ్రీశైలం, ఇడుక్కీ, కొయ్నా, భీమా, యున్‌యీ, కోసీ బ్యారాజు, గండక, నర్మదా, బలికుల, భాక్రానంగల్ మొదలయిన అనేక నదీలోయ ప్రాజెక్టుల రూపకల్పనలోనూ, నిర్మాణంలోనూ రావుగారికి ప్రమేయం వుంది.

1954 లో సెంట్రల్ వాటర్ అండ్ పవర్ కమిషన్‌కు చీఫ్ ఇంజనీరుగా పదోన్నతి పొంది ఆతరువాత 1956 లో ఆ కమీషన్‌లోనే సభ్యుడుగా కూడా అయ్యారు.

**అవార్డులు - రివార్డులు :**

తన కృషికి గుర్తింపుగా 1947-48 లోనూ, 1953-54 లోనూ రావుగారు రాష్ట్రపతి అవార్డు పొందారు.

1951-61 మధ్యలో ఒక అంతర్జాతీయ సదస్సుకు ఉపాధ్యక్షుడయ్యాడు.

1959-60 లో విద్యుశ్చక్తి మరియు నీటిపారుదల కేంద్రమండలికి అధ్యక్షుడయ్యాడు.

1960 లో ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ ఆఫ్ సైన్స్ బిరుదు ఇచ్చి సత్కరించింది.

తరువాత హైదరాబాదు జవహర్‌లాల్ టెక్నాలాజికల్ విశ్వవిద్యాలయం డాక్టరేట్ యిచ్చింది.

ఇన్ని గౌరవాలు పొందినా రావుగారికి రావలసినంత ఖ్యాతి రాలేదు. దానికి కారణాలు అనేకం. ఇతర దేశాల్లో అయితే ఊహించరానంత గౌరవం పొందిఉండేవారు. ఇక్కడ ఉత్తర, దక్షిణ భేదాలూ, ప్రాంతీయ భేదాలూ, కులభేదాలూ ఇవన్నీ ఎవరి ఔన్నత్యానికైనా అడ్డుతగిలేవే.

**రాజకీయ జీవితం :**

ప్రపంచంలోని ఇతర దేశాల్లో ఉన్న మేధావులూ, శాస్త్రవేత్తలూ, ఇంజనీర్లూ, స్వతంత్రులు, రాజకీయాల్లో వుండాలనుకుంటే వారికి ఆటంకాలుండవు. పార్లమెంటు మెంబర్లుగానూ మంత్రులుగానూ గూడా ఉంటున్నారు. ఇలాంటి మేధావులు రాజకీయాల్లో ఉంటే దేశాభివృద్ధికి దోహదంగా ఉంటుందని ఒక సభలో రావుగారన్నారు. ఆనాటి సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన నెహ్రూగారు ఆ మాట విన్నారు.

ఈ సంఘటన జరిగిన కొన్నాళ్లకే పార్లమెంటు ఎన్నికలు రానే వచ్చాయి. అది 1961వ సంవత్సరం. రాజకీయాలు తెలుసుగాని స్వార్థపూరిత రాజకీయాల్లో అంతవరకూ ప్రవేశం లేదు రావుగారికి. విజయవాడ పార్లమెంటు సీటుకు కాంగ్రెస్ పార్టీ టికెట్ యిప్పించాడు సంజీవరెడ్డిగారు. రావుగారి బంధువే అయిన ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు ప్రసాదరావుగారు ఈయనకు ప్రత్యర్థి.

కమ్యూనిస్టుపార్టీ కార్యకర్తలు క్రమశిక్షణాయుతంగా ప్రచారం చేశారు. అయ్యదేవర కాళేశ్వరరావుగారూ, కొమఱ్ఱాజు అచ్చమాంబగారూ రావుగారి పక్షాన విశేషంగా కృషిచేశారు. మొత్తానికి ఇరవైవేల ఓట్ల మెజార్టీతో రావు గెలిచారు.

పార్లమెంటులో 'ఎస్టిమేషన్ కమిటి మెంబరు'గా నియమింపబడ్డారు. అభివృద్ధి పొందుతున్న దేశాలకు సంబంధించిన బెర్లిన్‌లో ఏర్పాటుచేసిన ఒక అంతర్జాతీయ సమావేశానికి భారతదేశ ప్రతినిధిగా హాజరయ్యారు రావుగారు.

1963 జూలై నెలలో నెహ్రూగారి నుండి నాగార్జునసాగర్‌లో వున్న రావుగారికి ఫోను వచ్చింది. నీటిపారుదల, విద్యుత్ శాఖలకు మంత్రిగా నియమిస్తున్నానని నెహ్రూగారు చెప్పారు. ప్రమాణస్వీకారానికి ఎప్పుడు వస్తావని నెహ్రూగారు అడిగారు. నియోజకవర్గానికి వెళ్లి నింపాదిగా వస్తానన్నారు రావు. మరొకరయితే ఆ మంత్రిపదవిని ఇంకెవరైనా తన్నుకుపోతారేమోనని మరుక్షణమే పరుగెత్తేవారు. రావుగారికి పదవే ప్రాణం కాదుగదా!

19-7-63వ తేదీ మంత్రిగా ప్రమాణం చేశారు. 1964 లో నెహ్రూగారు చనిపోయి శాస్త్రిగారు ప్రధాని అయినపుడూ, శాస్త్రిగారు మరణించి ఇందిరాగాధి ప్రధానిగా వచ్చినపుడూ కూడా వీరు మంత్రివర్గంలో కొనసాగారు. మంత్రిగా కొనసాగడమే కాదు వీరి శాఖ ఎవరూ మార్చలేదు. అదీ వీరి ప్రాముఖ్యం. తిరిగి 1967 ఎన్నికల్లో రావుగారు విజయవాడ నియోజకవర్గం నుండి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇది వారి మంచితనానికీ, గొప్పతనానికీ, నియోజకవర్గ అభివృద్ధికీ వారు చేసిన కృషికీ తార్కాణం.

కృష్ణా, గోదావరి నదీజలాల పంపకంలో కొన్ని తగాదాలు వచ్చాయి. మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య ఈ విషయంలో వైషమ్యాలు రాసాగాయి. రావుగారు న్యాయం మాట్లాడినా ఆంధ్రేతర రాష్ట్రాల ముఖ్యమంత్రులూ, నిపుణులూ వీరిని అనుమానంగా చూడసాగారు. ప్రాంతీయ దురభిమానం లేకుండా దేశక్షేమాన్ని మాత్రమే కాంక్షించి నిరంతరం నిష్పాక్షికంగా కృషిచేస్తున్నప్పటికీ నిందలు తప్పలేదు.

ఈ పరిస్థితులలో పదవి కొరకు ప్రాకులాడటం రావుగారికి నచ్చలేదు. తనకు తానే రాజీనామా యిచ్చి ఇంటికి వచ్చారు. "నిరంతర కృషితో కార్యదీక్షతో అలసిపోయారు కాబట్టి ఇక విశ్రాంతి తీసుకోండి" అని సహధర్మచారిణి వరలక్ష్మమ్మ సంతోషంగా పలికింది.

ఈ మహనీయుడు తన 85వ యేట 1986 లో మరణించారు. గతంలో కాటన్ ప్రభువూ, మెకంజీ లాంటి వాళ్లు సూచించిన విధంగా, గంగా కావేరీ కలపాలన్న రావుగారి వాంఛ నెరవేరకుండానే పోయారు. భౌతికంగా ఆయన లేకపోయినా, జలవిద్యుత్ ప్రాజెక్టులు ఉన్నంతకాలం ఆయన ప్రజాహృదయాల్లో జీవించే వుంటారు.

# కొమరం సోంబాయి

---

ఒక జర్నలిస్టు కిచ్చిన ఇంటర్వ్యూలో అడిగిన పై మాటలు సోంబాయి మనసులోని కోపాన్నీ బాధనూ చెబుతాయి.

భారతదేశంలోని ఆదివాసులలో గోండు జాతి ఒకటి. ఆంధ్రప్రదేశ్‌లోని అదిలాబాద్ ప్రాంతాల్లో నివసించే గోండుల నాయకుడు కొమురం భీం భార్య సోంబాయి. ఈమె కొమురం భీంతో పాటు గిరిజనులకు భూమి మీద హక్కు కావాలని నిజాం నవాబుతో యుద్ధం చేశారు. అడవిబిడ్డలైన గోండు ప్రజలమీదా, వారి భూమి మీదా అధికారం కోసం బ్రిటీష్ సైన్యాలు, నైజాం సైన్యాలూ దాడి చేసేవి. వాళ్ళ గూడాలను తగులబెట్టేవారు. వాళ్ళమీద కేసులు పెట్టేవారు.

కొమురం భీం తన వారితో కలిసి అరవై ఎకరాల అడవిభూమి సాగులోకి తెచ్చి జోడెన్‌ఘాట్, పట్నాపూర్ మొదలైన పన్నెండు గ్రామాలుగా ఏర్పరిచారు. ఆ గ్రామాలూ, మిగిలిన గోండు గ్రామాలూ తన అధీనంలోకి రావాలని నిజాం మిలటరీని పంపాడు. గోండులకూ నిజాం పోలీసులకూ జరిగిన యుద్ధాలలో చాలాసార్లు కొమురం భీం నాయకత్వంలో గోండులు నిజాం సైన్యాన్ని తిప్పికొట్టారు.

1940లో జోడెన్‌ఘాట్‌ని తుపాకులతో చుట్టుముట్టిన సైనికులు భీంనీ, అతని సహచరులనూ పట్టాలిస్తామని పిలిచి కాల్పులు మొదలుపెట్టారు. గిరిజనులు కూడా యుద్ధం చేశారుగానీ తుపాకుల ముందు బరిసెలు, బాణాలూ ఆగలేదు. సోంబాయి ఆసమయంలో బాలెంతరాలు. నెలవయసున్న కొడుకుని నడుముకి బిగించి కట్టుకుని యుద్ధంలోకి దిగి ఆయుధాలు అందిస్తూ పోరాటంలో భాగమయ్యారు. కొమురం భీం కాల్పుల్లో మరణించాక గోండులు సోంబాయిని అక్కడ నుంచి అడవి లోపలికి తప్పించారు.

'నా భర్త శరీరం ఎక్కడ మళ్ళీ జీవం పోసుకుంటుందోనన్న భయంతో నిజాం పోలీసులు మరీ మరీ కాల్చారు. పది బండ్ల కర్రతో తగలబెట్టారు. కానీ... నా భర్త మరో రూపంలో కత్తికంటే కొచ్చెగా, పలుగు కంటె పదునుగా, బల్లెం కంటే

బలంగా అడవినంతా ఆక్రమించుకుంటాడన్న సంగతిని వాళ్ళు పసిగట్టలేకపోయారు" అనే సోంబాయి మాటలు అతిశయోక్తి కాదు. ఇప్పటికీ అదిలాబాద్ ఆదివాసులు భీం తమతో ఉన్నట్టే భావిస్తారు.

ఆ యుద్ధం ముగిసిన ఇన్ని సంవత్సరాలకు కూడా గిరిజనులకు ఒరిగిందేమీ లేదంటారు. సోంబాయి. అప్పటి నిజాం ప్రభువు జోడెన్ఘాట్ మొదలైన పన్నెండు గ్రామాలను కొమురం భీముకి ఇచ్చేస్తానన్నాడనీ, కానీ మొత్తం గిరిజన తెగలకు స్వేచ్ఛ కావాలని భీం కోరటంతో యుద్ధం తప్పలేదనీ, తన భర్త కోరిక నిజాం నవాబు కొంతవరకైనా మన్నించాడు గానీ ఈ ప్రజా ప్రభుత్వాలు గిరిజనులకు చేసినదేమీ లేదన్న సోంబాయి గిరిజన స్త్రీల పోరాట స్ఫూర్తికి నిదర్శనం.

---

# రామానుజాచార్యుడు

రామానుజాచార్యుడు విశిష్టాద్వైతమును ప్రతిపాదించిన గొప్ప తత్వవేత్త. ఆస్తిక హేతువాది, యోగి, రామామజించార్యుడు త్రిమతాచార్యులలో ద్వితీయుడు కర్తవ్యదీక్షలో ప్రదర్శించవలసిన ధైర్యానికి, దేవునిపై చూపవలసిన అనన్యసామాన్యమైన నమ్మకానికీ, సాటిలేని భక్తికీ రామానుజాచార్యుని జీవితం ఒక ఉదాహరణ.

రామానుజాచార్యులు (1) బౌద్ధ, జైన, శైవ, వైష్ణవ సాంప్రదాయాలన్నీ అనాదిగా వస్తున్న వైదిక మతాన్ని అనుసరించి వచ్చినవేననీ. ఈ మతాలు దేవుడిని కొలవడానికి వచ్చిన వేర్వేరు మార్గాలేకానీ, వైదికమతానికి బదులుగా పాటించవలసినవికాదని నిరూపించాడు. (2) ఆదిశంకరుని అద్వైత సిద్ధాంతంలోని సొగసులను సరిదిద్ది విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు (3) ప్రస్థాన త్రయాన్ని సాధారణ జనానికి అందించారు. వేదవ్యాసుని అభిమతానుగుణంగా బ్రహ్మసూత్రానికి పరిపూర్ణ వ్యాఖ్యగా శ్రీభాష్యాన్ని అందించిన శ్రీ సంప్రదాయ ప్రవర్తకులు. శ్రీ రామానుజాచార్యులు. గీతాభాష్యము, తర్కభాష్యము, వేదార్థ సంగ్రహము, వ్యాయామృతము, వేదాంత ప్రదీపము, వేదాంత తత్త్వసారము, నారదీయ పంచరాత్రాగమము, రంగనాథస్తవము, గద్యత్రయము మరియు పెక్కు స్వరూప గ్రంథములను రచించారు. కనుక ఈయనకు భాష్యకారులు అని ఎంచెరు మానారు అని పేర్లు వచ్చాయి. ఈయన శేషాంశసంభూతులు అని చాలామంది అభిప్రాయము.

మద్రాసుకు 30 మైళ్ళ దూరంలో ఉన్న శ్రీ పెరుంబుదూరులో శ్రీమాన్ ఆసూరి, 'సర్వక్రతు' కేశవ సోమయాజు దీక్షితాల్ మరియు కాంతిమతి అను పుణ్యదంపతులు ఉండేవారు. వేదాలలో చెప్పబడిన అన్ని యజ్ఞాలనూ పూర్తిచేసి 'సర్వక్రతు' బిరుదును పొందిన కేశవ సోమయాజి, ఎంతకాలానికీ తమకు సంతానం కలుగక పోవడంతో, భార్య కాంతిమంతితో కలిసి తిరువళ్ళిక్కేణి ఒడ్డున ఉన్న పార్థసారథి స్వామి దేవాలయంతో యజ్ఞాల ద్వారా ఆ స్వామిని తెప్పించి సంతానం పొందే ఉద్దేశ్యంతో శ్రీ పెరుంబుదూరును వదలివెళ్ళారు. ఆ స్వామి అనుగ్రహంవల్ల వీరిరువురికి రామానుజాచార్యులు జన్మించారు.

శ్రీవైష్ణవ ఆచార్య పరంపర అను సాంప్రదాయక గ్రంథం ప్రకారం ఈ పుణ్యదినం కలియుగ సంవత్సరం 4118, పింగళవర్షం, చైత్రమాసం, తరువాదిరై రాశి (ఆరుద్ర నక్షత్రం) శుక్లపక్ష పంచమి శుక్రవారం. ఆంగ్ల కాలమానం ప్రకారం ఈ తేది క్రీ.శ.1017 ఏప్రిల్ 13. శిశువు యొక్క జనన మాసం మరియు రాశి దశరథ పుత్రులైన లక్ష్మణ శత్రుఘ్నుల జన్మ రాశులతో సరితూగడంవల్ల రామానుజాచార్యుల మేనమామ అయిన పెరియ తిరుమలనంబి ఈయనను ఆదిశేషుని అవతారమని భావించి 'ఇళయపెరుమాళ్' అని నామకరణం చేశారు.

ఇళయపెరుమాళ్ చిన్నతనంలో 'కంచిపూర్ణుడు' అనే భక్తుడు రోజూ కాంచీపురం నుంచి శ్రీ పెరుంబుదూరు మీదుగా పూణమ్మెల్లె అను గ్రామంలో ఉన్న దేవాలయానికి పూజకై వెళ్ళేవాడు. అతడి శ్రద్ధాభక్తులు చిన్న ఇళయ పెరుమాళ్‌ను ఎంతగానో ఆకర్షించేవి. ఒక రోజు పూజ పూర్తి చేసుకుని తిరిగివెళ్తున్న కంచిపూర్ణుని ఇళయపెరుమాళ్ తన ఇంటికి సాదరంగా ఆహ్వానించి భోజనానంతరం అతడికాళ్ళు పట్టడానికి ఉద్యుక్తుడైనాడు. కానీ నిమ్నకులానికి చెందిన కంచి పూర్ణుడు ఉత్తమ బ్రాహ్మణకులంలో జన్మించిన ఇళయపెరుమాళ్ సేవను నిరాకరించాడు. భగవంతునిపై అతడి భక్తిశ్రద్ధలు ఉన్నతమైనవని అందుచేత 'కంచిపూర్ణుడు' తనకు గురుసమానుడని వాదించి అతడిని ఆకట్టుకున్నాడు. ఆనాటి నుంచి వారిద్దరి మధ్య పరస్పర గౌరవమర్యాదలు, ప్రేమ ఏర్పడ్డాయి. భక్తిలోని మొదటిపాఠాలు ఇళయపెరుమాళ్ కంచిపూర్ణుని వద్దనే అభ్యసించాడు. ఇళయపెరుమాళ్ (రామానుజాచార్యులు) పదహారవ ఏట తంజమాంబ (తంజమ్మాళ్)తో వివాహం జరిగింది. వివాహానంతరం తండ్రి కేశవ సోమయాజి పరమపదించటంతో, కుటుంబ సమేతంగా రామానుజాచార్యులు కాంచీ నగరానికి తరలివెళ్ళారు. నాటికి కంచిలో పేరుపొందిన యాదవ ప్రకాశకుల వద్ద విద్యాభ్యాసం చేయసాగాడు. యాదవ ప్రకాశకులు అద్వైతంలోనూ, భేదాభేద వేదాంతంలోనూ పాండిత్యాన్ని గడించి అనేక మంది శిష్యులకు విద్యను నేర్పేవాడు. రామానుజుల వంటి అసామాన్య ప్రతిభగల శిష్యుడు దొరికినందుకు పరమానందభరితుడైన యాదవ ప్రకాశకుడు అనతికాలంలోనే రామానుజుల 'భక్తి' పరమైన ఆలోచనా విధానాన్ని గమనించాడు. యాదవ ప్రకాశుని ఉపనిషద్వ్యాఖ్యలు అకర్మికము, అనాస్తికములుగా ఉండటం రామానుజులను బాధించేది. అకారణంగా అతడు తన గురువుతో తరచుగా వాగ్వాదానికి దిగేవాడు.

ఒకనాడు ఛాందోగ్యోపనిషత్తుపై ఆదిశంకరుని వ్యాఖ్యానంలో 'కప్యాసం పుండరీకమేవ మక్షిణి' అనే వాక్యాన్ని ఆదిశంకరుడు, 'ఎర్రనైన కోతి పిదురులను పోలిన (కప్యాసం) కమలాల వంటి కన్నులు గలవాడు అని అనువదించినట్లుగా యాదవ ప్రకాశకులు తన శిష్యులకు చెప్పాడు. అది విన్న రామానుజుల కన్నులలో ధారగా నీరుకారసాగింది. యాదవ ప్రకాశకులు కారణమడుగగా అది సరైన వ్యాఖ్యకాదని బదులిచ్చాడు. ఆగ్రహించిన యాదవ ప్రకాశకులు వేరొక వ్యాఖ్యను చేయమని హేళన చేయగా 'కప్యాసం' అనే పదానికి 'కం జలం పిబతి ఇతి కపిః' (నీటిని గ్రహించువాడు, అనగా సూర్యుడు అని నూతన అర్థాన్ని ఎప్పి 'కప్యాసం పుండరీకమేవమక్షిణి' అనే వాక్యానికి 'నీటిని గ్రహించిన సూర్యుని కిరణాలతో పుష్పించిన కమలాలవంటి కన్నులు కలవాడు అని భావాదిక్యతనూ, ఆస్తికత్వాన్ని ఉటంకించే అర్థాన్ని చెప్పాడు. మరొకమారు 'సత్యం జ్ఞానం అనంతంబ్రహ్మ' అనే మహావాక్యంపై జరుగుతున్న వాదంలో సత్యం, జ్ఞానం, అనంతం బ్రహ్మ యొక్క గుణాలనీ, అవే బ్రహ్మకాదనీ వాదించాడు.

ఈ వాదోపవాదాలలో రామానుజుల యొక్క పాండిత్యం, ఆస్తికత్వంతో కూడిన ఆర్ద్రతాభావం మరియు భక్తిపూరితమైన వ్యాఖ్యానం యాదవ ప్రకాశుడికి కంటకింపు కాసాగింది. అహంకారపూరితమైన మనస్సుతో, ఈర్ష్యతో రామానుజులను హతమార్చడానికి పన్నాగం పన్నాడు. గోవిందుడనే శిష్యునిద్వారా ఈ విషయాన్ని తెలుసుకున్న రామానుజులు సమయానికి తప్పించుకోగలిగాడు. సాంప్రదాయ గ్రంథాల ప్రకారం ఈ తరుణంలో కంచిలో వెలసిన 'వరదరాజస్వామి దంపతులు మారువేషంలో వచ్చి అతడిని రక్షించారని తెలుస్తుంది. తరువాత కొంతకాలానికి రామానుజుల వాదనలను అంగీకరించలేని యాదవ ప్రకాశకులు అతడిని తన శిష్యరికం నుండి విముక్తుణ్ణి చేస్తాడు.

'ఆళవందార్' అను నామధేయంతో ప్రసిద్ధుడైన యమునాచార్యుడు, వైష్ణవ సాంప్రదాయంలో పేరుగాంచిన గురువు. ఈయన తిరుచినాపల్లి జిల్లాలో ఉన్న శ్రీరంగంలో శ్రీరంగనాథస్వామి దేవాలయంలో సేవలందించేవారు. యాదవ ప్రకాశుని శిష్యరికంలో నున్న రామానుజుని గొప్పదనాన్ని తెలివితేటలను, భక్తిపరమైన వ్యాఖ్యలను చూసి అతడిని తన శిష్యునిగా చేసుకోవాలనుకున్నాడు. ఈ విషయంగా రామానుజులను కలుసుకోవాలని కాంచీపురాన్ని సందర్శించాడు. కానీ కారణాంతరాలవల్ల కలవలక వెనుదిరిగాడు. యాదవ ప్రకాశుడు తన శిష్యగణం నుంచి రామానుజులను తొలగించిన విషయం తెలియగానే అతడిని తన శిష్యునిగా చేసుకోవాలనే ఉద్దేశ్యంతో ఆయనని తీసుకొని రావల్సిందిగా 'మహాపూర్ణుడు' అనే శిష్యుని పంపాడు.

మహాపూర్ణుడు రామానుజులను కలుసుకొని శ్రీరంగం తీసుకువెళ్ళేలోపు యమునాచార్యులు పరమపదించారు. వీరు వచ్చేసరికి యమునాచార్యుల భౌతికకాయం అంత్యక్రియలకు సిద్ధపరచబడి ఉంది. కాని ఆయన కుడి చేతి మూడు వేళ్ళు మడుచుకొని ఉండటం రామానుజులు గమనిస్తాడు. ఆ మూడు వేళ్ళూ తాను చేయవలసిన మూడు పనులకు సంకేతమని భావించిన రామానుజులు మీ మనసు నాకు తెలిసింది. బ్రహ్మ సూత్రములకు శ్రీ భాష్యము రాసి విశిష్టాద్వైత స్థాపన చేస్తాను అన్నారు. యమునాచార్యుల చేతివేలు ముడిచినది కాస్తా పొడుగ్గా సాగింది. శ్రీవైష్ణవ సిద్ధాంతానికి ఆధారంగా ఉన్న విష్ణుపురాణాన్ని లోకానికి అందించిన మహనీయులు పరాశరులు, వేదసారాన్ని ద్రావిడ వేదంగా మలచిన మహానుభావులు నమ్మాళ్వారు వారి పేర్లను ఎవరికైనా పెట్టి కొన్ని శాస్త్రాలు రచించి వారి ఋణం తీరుస్తాను అంటున్నారు ఇంతలో రెండోవేలు సాగింది. శ్రీవైష్ణవాన్ని ఈ భూమిపై స్థాపిస్తాను. పంచ సంస్కారాలు అత్యంత ఆవశ్యకములని చాటి చెప్తాను. భక్తి సిద్ధాంతం గొప్పదనాన్ని చాటి శరణాగతి వైశిష్ట్యాన్ని అందరికి తెలిసేటట్లు చేస్తాను అన్నారు. మూడోవేలు తెరచుకుంది. ఈ విచిత్రాన్ని చూసి పులకించిపోయారు అక్కడివారు. యమునాచార్యులు తమకొక మహనీయుని చూపించారని పరవశించిపోయారు.

యమునాచార్యుని శిష్యుడైన పెరయనంబి రామానుజులతో తిరుక్కొట్టియూర్‌లో గోష్ఠీపూర్ణులు అనే గొప్ప పండితుడున్నారు. వారి వద్ద నువ్వు తిరుమంత్రం, చరమశ్లోకం వీటి అర్థవిశేషాలను తెలుసుకోవాలని చెప్పడంతో రామానుజులు తిరుకొట్టయూర్ అనే ప్రసిద్ధమైన గోష్ఠీపురిచేరి అక్కడ ఉన్న గోష్ఠీపూర్ణులకు సాష్టాంగ దండ ప్రమాణం చేశారు. ఆచార్య! నేను మీ దాసుణ్ణి మీవలన తిరుమంత్ర, చరమశ్లోకాలను ఉపదేశంగా పొందాలని వచ్చాను. కటాక్షించండి' అన్నారు.

వారి వినయసంపద గోష్ఠీపూర్ణుల్ని ఎంతో ఆనందపరచింది. అయినా ఏ భావాన్ని ఆయనపైకి ప్రదర్శించలేదు. వారిదొక సిద్ధాంతం. అదేమంటే మంత్రంకోసం వచ్చినవారు నిజంగా తపనతో, ఆర్తితో వచ్చారా లేక సామాన్యంగా

అందరిలా మంత్రోపదేశం పొందుదాం అనుకొని వచ్చారా? అత్యంత ఆర్తిలేని వారికి పరమ పవిత్రమైన మంత్రాన్ని ఉపదేశించకూడదు. అందుకే కఠిన పరీక్షలు పెట్టి అందులో నెగ్గితే అప్పుడు చూద్దాం అనుకున్నారు. 'రామానుజా! ఆ మంత్రోపదేశానికి కొన్ని అర్హతలుండాలి అవి నీలో ఉన్నాయో లేదో చూసి అప్పుడు చెప్తాలే అన్నారు. అలాగే ఆయన పెట్టిన పరీక్షలకు ఎదురొడ్డి నిలబడ్డారు రామానుజులు. ఒకానొక పవిత్ర సమయంలో ఆచార్యులు రామానుజుల కుడిచెవిలో మంత్రోపదేశంగావించారు. దివ్యమంత్ర స్వీకారంతో పులకించిపోయింది రామానుజుల దేహం. ఆయన ముఖపద్మం మంత్రభాస్కర కాంతులతో ప్రఫుల్లమైంది నెమ్మదిగా లేచి ఆచార్యులకు నమస్కరించి బయలుదేరారు. ఆయన మనస్సు అనేక రకాలుగా ఆలోచిస్తోంది. నేను ఈ మంత్రాన్ని పొందడానికి ఎంతో కాలం ఎదురుచూశాను. ఇంత ఆర్తితోఉన్న నాకు ఈ మంత్రం లభించడం ఇంత కష్టమైందే మరి సామాన్యుల మాటేమిటి? వారికీ మంత్రం ఎలా లభిస్తుంది? ఏ పవిత్ర మంత్రం మోక్షానికి రాచబాట వేస్తుందో ఆ మంత్రం దొరకడం ఇంతకష్టమైతే ఎలా? ఇలా కాదు నేను ఈ మంత్రాన్ని ఆర్తికలవారందరినీ పిలిచి చెపుతాను. ఎప్పుడోకాదు ఇప్పుడే, అనుకున్న వెంటనే రామానుజులు మార్గంలో ఉన్న స్వామి ఆలయగోపురం ఎక్కి అందరికీ ఉపదేశిస్తాడు. ఆ గురువు వచ్చి ఆచార్యుల ఆజ్ఞను ధిక్కరించినందుకు నీవు నరకానికి పోతావు అంటే. దానికి రామానుజులు నేను ఒక్కడినే నరకానికి పోతాను. కాని అతి పవిత్రమైన ఈ మంత్రాన్ని వినడంవల్ల ఇన్నివేల మంది మోక్షానికి వెళతారు. అంతమందికి పరమపదం లభిస్తుంటే నేనొక్కడిని నరకబాధలు అనుభవిస్తే మాత్రమేమిటి ఆచార్యా అని బదులిచ్చాడు. ఎంతటి ఔదార్యం. ఎంతటి త్యాగం. పరసమృద్ధిలో ఎంత ఆనందం.

శ్రీ రామానుజులు ఒక ఆచార్యుడే గాక దయావరుడు. ప్రేమమూర్తి ఆశ్రితులను ఆదరించేవాడు. మల్లుడు అనే శిష్యుడిని తత్త్వజ్ఞునిగా చేసి, భాగవతునిగా తయారుచేశారు. కులము కంటే గుణము ముఖ్యమని భావించారు. అందరూ దాన్ని ఆచరించాలని తను ప్రతిరోజు కావేరీ నదిలో స్నానంచేసి వస్తూ మెట్లు ఎక్కేటప్పుడు మాలధనుర్దాసుని భుజం ఆసరాచేసుకొని ఎక్కేవారు. ఈ విషయం శిష్యులందరూ గ్రహించేవారు. ఇలాగే ఒక చాకలివాడు స్వామికి ధరింపచేసే ధోవతులను చక్కగా ఉతికి తెచ్చేవాడు. శ్రీ రామానుజులు అతని సేవ, భక్తితత్పరత గమనించి, స్వామి సేవకు తనతోపాటు అతడిని కూడా గర్భాలయంలోనికి తీసుకువెళ్ళి రంగనాథుని దర్శనం చేయించారు. రామానుజుల వారు సత్త్వగుణ సంపన్నులు, కరుణాసముద్రులు, పరుల దుఃఖాన్ని దయతో పోగొట్టేవారు. వారిలో అనుగ్రహశక్తి, అశేషమైనటువంటి జ్ఞానం, అపార భక్తిప్రపత్తులు, వినయవిధేయతలు ఉండేవి.

రామానుజులు తన జీవితకాలంలో విశిష్టాద్వైతాన్ని బలంగా ప్రతిపాదించడం. పలు ఆలయాల్లో మూర్తులను విష్ణుసంబంధమైన విగ్రహాలుగా నిరూపించడం. ఎన్నో ఆలయాలకు సుస్పష్టమైన ఆగమవిధానాలు, పరిపాలన పద్ధతులు ఏర్పరచడం వంటివి చేశారు. క్రమంలో విస్తృత పర్యటనలు, వాద ప్రతివాదాలు చేశారు.

కాంచీపురంలోని శ్రీరంగంలో తమ జీవితాన్ని ఎక్కువ భాగం గడపిన రామానుజులు శ్రీరంగనాథుని చేరి తమను రప్పించుకోమని ప్రార్థించారు. కాదనలేకపోయాడు శ్రీరంగనాథుడు. అది 1137వ సంవత్సరం మాఘ శుద్ధ దశమి శనివారం 120 సం॥ల దీర్ఘాయుష్మంతుడైన రామానుజులు శిష్యులందరిని తృప్తిగా చూశారు. శ్రీ రంగనాథా... అనుగ్రహించారా తండ్రీ... దాసోహమ్ అంటూ బ్రహ్మరంధ్రమార్గం ద్వారా పరమపదం చేరారు భగవద్రామానుజులు.

రామానుజాచార్యులు తన జీవితం ద్వారా మానవాళికి ఇచ్చిన సందేశాలు :

- ప్రస్తుతం సాంప్రదాయంగా కొనసాగుతున్న ఆచార్య వ్యవహారాలు ఛాందసంగా మారి సామాజిక పురోగతికి అడ్డురాక మునుపే వాటిని గుర్తించి సహజ శ్రేయస్సుకై వాటిని మానడమో, మార్చటమో చేయడం ఆచార్యుని ప్రథమ కర్తవ్యం.
- దేవుని పూజించటం, మోక్షాన్ని సాధించటం మానవునిగా జన్మించిన ప్రతి ఒక్కరి హక్కు. ఆ హక్కుని ధిక్కరించే అధికారం ఎవ్వరికీ లేదు. దేవుని దృష్టిలో అందరూ సమానమే. కుల, మత తారతమ్యాలను పరిశీలించి అర్థం చేసుకోవడం మహత్వం, వైషమ్యాలను పెంచుకోవడం మూర్ఖత్వం.
- పూర్వం గురువులు చెప్పినదంతా నిజమేనని గుడ్డిగా నమ్మవలసిన అవసరం లేదు. వారు చెప్పినదాన్ని తర్కానికి గురిచేసి అది తప్పో, ఒప్పో నిర్ణయించుకోవడం పాపం కాదు. ఈ విషయంలో అధైర్యపడవలసిన పనిలేదు.
- ఒక పనివల్ల పదిమందికి మేలు జరుగుతున్నప్పుడు, తమకు కీడు జరిగినా పదిమందికి జరిగే మేలుకై తమ కీడును లెక్కచేయవలసిన అవసరం లేదు. సమాజ శ్రేయస్సు ముఖ్యం కానీ వ్యక్తిగత శ్రేయస్సు కాదు.

# ఉన్నవ లక్ష్మీబాయి

చాలాకాలం క్రితం విజయవాడలో జరిగిన ఒక సాహిత్యసభలో ప్రసిద్ధ కవి ఒకరు. కవి, గాయక, పండిత శిల్పులను ప్రస్తుతిస్తూ ఉపన్యాసం చేసి ముగించాక లక్ష్మీబాయమ్మ పట్టరాని కోపంతో ఊగిపోతూ "ఏమి ఉపన్యాసమయ్యా ఇది? ఒక్క స్త్రీ పేరైనా చెప్పావుకాదేం? తెనుగు స్త్రీలలో పండితులు లేరా? చిత్రకారిణులు లేరా? ఆంధ్రనారీలోకం అంత గొడ్డుపోయి లేదు. ఆ స్త్రీలలో ఒక్కరిపేరైనా చెప్పావు కాదేమరి" అని అడిగి, "ఈ తెలుగు జనాభాలో చెరిసగంగా ఉన్న స్త్రీలను గురించి ఒక్క ముక్కయినా చెప్పకపోతే ఇది తెలుగువారి సమగ్ర సభ ఎట్లా ఔతుందని" అధ్యక్షుని మందలించి, "స్త్రీలనింత చిన్నచూపు చూసిన ఈ సభలో పాల్గొనటం మాకు మర్యాద కాదని" సభ నుంచి బైటికి వచ్చేశారట.

లక్ష్మీబాయమ్మ గుంటూరు జిల్లా సత్తెనపల్లి తాలూకాలోని అమీనాబాద్ అనే గ్రామంలో జన్మించారు. పదేళ్ళ వయసులోనే ఉన్నవ లక్ష్మీనారాయణగారితో వివాహం జరిగింది. ఈ దంపతులు గుంటూరు జిల్లాలో వితంతు వివాహాలు జరిపించటంలో చొరవ తీసుకున్నారు. ఊరంతా వెలివేసినా, పుట్టింటి వారు ఒత్తిడి తెచ్చినా లక్ష్మీబాయమ్మ భయపడలేదు. ఎంతో మంది బాలవితంతువులు వీరింటికి వచ్చేవారు. లక్ష్మీబాయమ్మ వారిని ఆదరించి, రవికెలు తొడిగి, పెళ్ళి ప్రయత్నాలు చేసి, వివాహాలు జరిపించేవారు. క్రమంగా జాతీయోద్యమం వీరిని ఆకర్షించింది. సహాయ నిరాకరణోద్యమం, విదేశీ వస్తు బహిష్కారం, ఖాదీ ఉద్యమం – అన్నింటిలోనూ ముందు నిలబడ్డారు. పల్నాడు సీమలో పన్నులు కట్టకుండా రైతాంగాన్ని కూడగట్టినందుకు పోలీసులు లక్ష్మీనారాయణగారిని అరెస్టు చేసి జైలులో నిర్బంధించారు. లక్ష్మీబాయమ్మ సహాయ నిరాకరణోద్యమ బాధ్యతంతా తన భుజాల మీద వేసుకుని ఇల్లూ, వాకిలీ వదిలి, పల్లెపల్లెకూ తిరుగుతూ కాంగ్రెస్ ప్రచారాన్నీ, జాతీయోద్యమ ప్రచారాన్నీ చేస్తూనే ఉన్నారు. కాంగ్రెస్‌కు మహిళా వాలంటీర్లను తయారుచేసి వారిచేత జాతీయోద్యమ గీతాలు పాడిస్తూ ప్రచారం చేశారు.

లక్ష్మీనారాయణ గారు జైలు నుండి బైటకు రాగానే ఇద్దరూ కలిసి బాలికల కోసం శారదానికేతన్ అనే గురుకుల పాఠశాలను గుంటూరులో ప్రారంభించారు. విదేశీపాలన వల్ల ప్రజలలో పాతుకుపోయిన పాశ్చాత్య భాషా వ్యామోహాన్నీ,

పాశ్చాత్యులను గుడ్డిగా అనుకరించే తత్త్వాన్నీ పోగొట్టటం ఈ పాఠశాల లక్ష్యాలలో ఒకటి. మామూలు చదువుతోపాటు జీవనోపాధికి పనికివచ్చే వృత్తులు, కళలు నేర్పేవారు. సంగీతం, చిత్రలేఖనం, కుట్లు, అల్లికలు, జరీ నగిషీ పనులు, నూలు వడకటం, నేతపని, నవారు నేయటం, బుట్టల అల్లిక మొదలైనవి నేర్పేవారు. ప్రభుత్వ సహాయం లేకపోయినా ప్రజల ఆదరణ వల్ల శారదానికేతన్ వేగంగా అభివృద్ధి చెందింది. లక్ష్మీబాయమ్మ పూర్తిగా ఈ పాఠశాల పనులలో మునిగిపోయారు. పిల్లల చదువు, ప్రవర్తన, పనితనం అన్నిటినీ ఆమె స్వయంగా చూసుకునేవారు. ఈ బాలికలను శిక్షణ పూర్తి కాగానే ప్రభుత్వ పరీక్షలకు పంపేవారు. స్త్రీలు ఒకరిమీద ఆధారపడకుండా స్వతంత్రంగా బ్రతకగలగాలని లక్ష్మీబాయమ్మ ఆశించేవారు. వితంతు వివాహాలు, విద్యాబోధన, అనాథ బాలికలకు ఆశ్రయం, వీటన్నిటితో విశ్రాంతి లేకుండా పనిచేస్తూ కూడా లక్ష్మీబాయమ్మ స్వతంత్ర పోరాటానికి దూరం కాలేదు. ఉప్పు సత్యాగ్రహ సమయంలో అరెస్టయి జైలుకి వెళ్ళారు.

ఈమె "గృహలక్ష్మి స్వర్ణకంకణాన్ని" గ్రహించారు. జాతీయోద్యమంలో పాల్గొనే సమయంలో బంగారు నగలు ధరించనని ప్రమాణం చేసిన ఆమె స్వర్ణ కంకణం తీసుకునేటప్పుడు అది తాను ధరించనని చెప్పి మరీ తీసుకున్నారు. శారదా నికేతన్ రజతోత్సవ సమయంలో ఆమె అనారోగ్యంగా ఉన్నా, ఆ సంస్థవల్ల జీవితాలను మార్చుకోగలిగిన స్త్రీలందరినీ మళ్ళీ చూడగలిగానని సంతోషించారు. తర్వాత కొద్ది కాలానికే ఆమె మరణించారు.

## ఈశ్వరీబాయి

---

భారత రాజకీయాలలో, తాత్త్విక ఆలోచనలో అంబేద్కర్ ప్రత్యేకతను గుర్తించి, ఆ ప్రభావంతో రాజకీయాలలోకి వచ్చారు. ఈశ్వరీబాయి. అంబేద్కర్ రచనలు శ్రద్ధగా అధ్యయనం చేసి, ఆయన సిద్ధాంతాలతో ఆశయాలతో దళితుల జీవితాలు బాగుపడతాయని నమ్మి పనిచేసిన తొలితరం మహిళ ఈశ్వరీబాయి. చిన్నతనం నుంచీ, అంబేద్కర్ నాయతకత్వంలో పనిచేసే ప్రజాసంఘాలు జంటనగరాలలో ఏ సభ ఏర్పాటుచేసినా, ఈశ్వరీబాయి తప్పక హాజరయ్యేవారు. తన చుట్టూ సమాజంలో పేద ప్రజలు, కింది కులాల ప్రజలు అనుభవిస్తున్న కష్టాలు చూస్తూ, అగ్రవర్ణాలు చూపే ఆధిక్యత, బడుగువర్గాలపై జరిగే అత్యాచారాలు, దౌర్జన్యాలూ చూసి, ఆమె స్పందించి, న్యాయం కోసం పోరాడాలనుకునేవారు.

ఈశ్వరీబాయి సికింద్రాబాదులో నివసించే సామాన్య "హరిజన" కుటుంబంలో పుట్టారు. తండ్రి బల్లెపు బలరామస్వామి. తల్లి రాములమ్మ. కీస్ హైస్కూలులో చదువుకున్నారు. పదమూడేళ్ళకే పూనాకు చెందిన డాక్టర్ లక్ష్మీనారాయణతో వివాహం జరిగింది. ఐతే వైవాహిక జీవితంలో కలతలు రావడంతో సికిందరాబాద్‌కి తిరిగివచ్చి తన ఆత్మాభిమానాన్నీ, ధైర్యసాహసాలనూ నమ్ముకుని జీవితం ప్రారంభించారు. సికిందరాబాద్‌లోని ఒక ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయినిగా కొంత కాలం పనిచేశారు.

1951లో హైదరాబాదు, సికిందరాబాదు నగరాలలో పురపాలక సంఘ ఎన్నికలు మొదటిసారిగా ప్రజాస్వామ్యరీతిలో, వయోజన ఓటింగ్ పద్ధతిపై జరిగాయి. ఆ ఎన్నికలలో ఈశ్వరీబాయి చిలకలగూడా వార్డు నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. ఆమెకు అంగబలం, అర్థబలం లేకపోయినా, రాజకీయాలకు కొత్తయినా, విజయం సాధించారు. అధికారంలో ఉన్నకాలంలో మురికి వాడల్లో మంచినీటి పంపులు. వీథి దీపాలు, మరుగుదొడ్లు ఏర్పాటుచేయించి, మొదటిసారి ఆ వాడలలోకి అభివృద్ధి కార్యక్రమాలను తీసికెళ్ళారు. హైదరాబాదుకు పొట్టచేతబట్టుకుని వచ్చిన వందలాది గ్రామీణ కార్మికులకు ఇండ్ల స్థలాలు ఇప్పించారు.

1960లో ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ కులాల ఫెడరేషన్‌కు ఈశ్వరీబాయి ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 1967లో ఆమె నిజామాబాద్ జిల్లా యల్లారెడ్డి నియోజక వర్గం నుంచి రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసి గెలిచారు. రిపబ్లికన్ పార్టీలో చీలిక వచ్చినప్పుడు మొదట కాంబ్లెవర్గం (అంబేద్కరైట్)లో, తర్వాత కోబర్‌గడ్ వర్గంలో చేరి పనిచేశారు.

శాసనసభలో ప్రతిపక్ష నాయకురాలిగా ఎంతో బాధ్యతతో పనిచేశారు. ఆనాటి శాసనసభలో ప్రతిపక్ష నాయకులుగా ఉన్న తరిమెల నాగిరెడ్డి, వావిలాల గోపాలకృష్ణయ్య, జి.శివయ్య వంటి వారితో సమానంగా ఆమె ప్రభుత్వాన్ని ప్రతి విషయంలోనూ ప్రశ్నించేవారు. నిలదీసేవారు. ప్రతి చిన్న సమస్యనూ ప్రభుత్వ దృష్టికి తీసుకొచ్చేవారు. తెలంగాణా ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాల గురించి, ఆమె ఎన్నోసార్లు శాసనసభలో ఉదాహరణ సహితంగా పేర్కొన్నారు. హరిజనుల నివాస స్థలాల గురించి ఆందోళన చేశారు. ప్రత్యేక తెలంగాణా ఉద్యమంలో పనిచేసి తెలంగాణా ప్రజాసమితి కార్యవర్గ సభ్యులుగా ఉన్నారు. తెలంగాణా ఉద్యమం ఆగిన సందర్భంలో ఇందిరాగాంధీ చేసిన రాజీ ప్రతిపాదనను ఈశ్వరీబాయి అంగీకరించలేదు. తన ఆలోచనలతో ఏకీభవించే మరికొందరు నాయకులతో కలిసి సంపూర్ణ ప్రజాసమితి ఏర్పాటుచేసి అందులో ముఖ్యపాత్రను నిర్వహించారు.

బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాల సాఫల్యానికి ఎనలేని కృషిచేసిన రాజకీయ నాయకురాలిగా ఈశ్వరీబాయి చరిత్రలో నిలుస్తారు.

---

# క్రీడాకారిణి - అశ్వని

బీజింగ్ ఆసియా క్రీడలకు క్రీడాకారులను ఎంపికచేసే ప్రయత్నాలు న్యూఢిల్లీలో జరుగుతున్నాయి. రెండు వందల మీటర్ల పరుగు పందెం ప్రారంభం కాబోతున్నది. పెద్ద ఎత్తున ప్రజలు, వివిధ దేశాల పత్రికా విలేఖరులు, దూరదర్శన్ బృందాలవారు తరలివచ్చారు. అందరికీ ప్రత్యేక ఆకర్షణ పి.టి. ఉష, 'ఆమె గెలుస్తుంద'ని అందరి విశ్వాసం. వేటకు దూకబోయే కొదమసింహాల్లా వేచి ఉన్నారు క్రీడాకారిణులు.

గన్‌పేలి పరుగు ప్రారంభమయింది. మిగిలిన క్రీడాకారిణులనందరిని దూసుకుంటు ఉష 100 మీటర్లు దాటింది. 150 మీటర్లు దాటింది. మరొక 50 మీటర్లు ముందుకు వెళితే విజేత ఆమెయే. 'కమాన్ ఉష!' అన్న ప్రేక్షకుల కేకలు మిన్ను ముట్టుతున్నాయి. కాని వారందరిని విస్మయపరుస్తు సరిగా అదే సమయంలో వింటి నుంచి సారించి వదలిన బాణంలా ముందుకు దూసుకుపోయింది వేరొక క్రీడాకారిణి. రాకెట్‌లా ముందుకు వెళ్ళి 24.07 సెకన్లలో గమ్యం చేరింది. 24.12 సెకన్లలో అక్కడికి చేరిన ఉష రెండవ స్థానం పొందింది.

స్టేడియం మొత్తం నిశ్చేష్టమయింది. అరక్షణం నిశ్శబ్దం రాజ్యమేలింది. తమ అంచనాలు తలక్రిందులు చేసిన ఆ క్రీడాకారిణి వంక వింతగా చూశారందరు. ఆ పబ్లిక్ ఎరీనాలోని ఫోటో గ్రాఫర్ల కెమేరాలు తళుక్కుమంటున్నాయి. వందలమంది అభినందనల వర్షంలో ముంచెత్తారు. 'రన్నింగ్ క్రేన్' ఆమె కైవసమయింది. తాను పడిన శ్రమ ఫలించినందుకు ఆమె శిక్షకుడు 'సునల్ అబ్రహాం' ఆనంద బాష్పాలు రాల్చాడు. ఆమె ఎవరోకాదు - అశ్వని. ఈ సన్నివేశం జరిగింది 1990వ సంవత్సరంలో.

ఇండియన్ లేడీ రన్నర్స్ అందరిలోను ఎలాగైనా ఉషను అధిగమించాలనే ఆకాంక్ష బలవత్తరంగా ఉన్న రోజులవి. ఎందుకంటే ఉష ప్రభ పట్టపగటి సూర్యుడిలా వెలిగిపోతున్నది. కాని ఆ ఆకాంక్షను నిజం చేయగల్గింది మాత్రం అశ్వనియే! ఆమెను గురించిన వివరాలను తెలిసికొందాము.

**జననం – బాల్యం :**

విభిన్న భాషా మత సంప్రదాయాలతో ఉపఖండంగా పేరొందింది ఈ భారతమాత. ఆమె పవిత్ర దేహంలో కర్ణాటక రాష్ట్రం ఒక భాగం. ఆ భాగంలో 'కూర్గ్' ప్రాంతం కూడ పేరెన్నికగన్నదే. అందు 'విరాజ్ పేట' గ్రామం అశ్వని జన్మస్థానమై దేశమంతట, అదే విధంగా క్రీడా ప్రపంచమంతట గుర్తింపు పొందింది. ఈమె క్రీ.శ. ది.21-10-1967న పార్వతి, అప్పచా నాచప్ప దంపతులకు కుమార్తెగా, పుష్పకు చెల్లెలుగా జన్మించింది. తన ముద్దు ముద్దు మాటలతోను, బుడి బుడి నడకలతోను అందరిని అలరిస్తు చిలిపిగా, చలాకిగా నవ్వుతు నవ్విస్తు 'ఆనందరాజ్ఞి' గా వెలిగిపోయింది. తండ్రి ఉద్యోగరీత్యా కన్నడ భాషా సంస్కృతులకు దూరంగా కలకత్తా నగరంలోని 'బిర్లా రేయాన్స్' లో పనిచేస్తున్నాడు. ఎదుగుతున్న పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని తల్లి పార్వతి బెంగుళూరులో ఉంటున్నది. వారికి విద్యాబుద్ధులు నేర్పించే బాధ్యతలను తన భుజస్కంధాలపై వేసికొన్నది.

శుక్లపక్ష చంద్రునిలా దినదినాభివృద్ధి చెందుతున్న అశ్వని తన ఎనిమిదవ ఏటనుండే స్కూల్ పోటీల్లో పాల్గొన్నది. వందమీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్ రెండు ఆమెకిష్టమైనవే. క్రమేపి లాంగ్ జంప్‌కు స్వస్తిచెప్పి, పరుగు మీదనే తన దృష్టి కేంద్రీకరించింది. లేడిలా చెంగు చెంగున పరుగెత్తుతు స్కూలు ఆటల పోటీల్లో మెదటి బహుమతినెప్పుడూ ఆమే గెల్చుకుంటున్నది.

బెంగుళూరులో ఆమె ఇంటి కెదురుగానే 'కంఠీరవా స్టేడియం' ఉంది. అక్కడే ఆమె బాల్యదశనుండే గాలిని చీల్చుకుపోతు పరుగెత్తడంలో మెలకువలు నేర్చుకున్నది. గారాల బాలయైన ఆమెకు శిక్షణ నిస్తున్న 'మొహిందర్ సింగ్' ఒక రౌండ్ చుట్టి వస్తే ఒక చాక్లెట్ ఇస్తానని లాలించి మరీ ట్రాక్ మీదికి తోలేవాడు. అప్పటి వరకు చిలిపిగా ప్రవర్తించిన అశ్వని అంతలోనే గాంభీర్యం సంతరించుకొని, శిక్షకునికి కూడ ఆశ్చర్యం కల్గించే వేగంతో గమ్యం చేరుకుంటుంది. ఆమె బెంగుళూరులోని 'మౌంట్ కర్మెల్'లో నున్న 'సేక్రెడ్ హార్ట్ గరల్స్ హైస్కూల్ & కాలేజి'లో మాధ్యమిక విద్యార్జన మారంభించింది. ఆ కాలంలోనే 11వ ఏట నుండి 17వ ఏటి వరకు 6 సంవత్సరాలపాటు 'విజేత'గా వచ్చింది. 1980-81లో తన 13వ ఏట తొలిసారిగ జాతీయ స్థాయి పోటీల్లో ఆమె అడుగుపెట్టింది. కర్ణాటక రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించి 'ఆల్ ఇండియా ఓపెన్ నేషనల్స్'లో జూనియర్ స్థాయిలో 100 మీటర్ల పరుగుపందెంలో బంగారు పతకాన్ని సాధించింది. అంతేకాక అన్ని జాతీయ స్థాయి పోటీలయందును 1980 నుండి 1991 వరకు 11 సంవత్సరాలపాటు ప్రాతినిధ్యం వహించింది. 1984 నుండి 1991 వరకు భారతదేశానికి ప్రాతినిధ్యం వహించింది.

**అశ్వని సాధించిన ఘన విజయాలు :**

- 1984లో నేపాల్‌లో జరిగిన 'తొలి దక్షిణ ఆసియా సమాఖ్య క్రీడ'ల్లో ఒక స్వర్ణపతకం, ఒక రజిత పతకం గెలుచుకొంది.
- 1985లో జకార్తాలో జరిగిన 'ఏషియన్ ట్రాక్ & ఫీల్డ్‌మీట్'లో ఒక కాంస్య పతకం గెలుచుకొంది.
- 1985లో బంగ్లాదేశ్‌లో జరిగిన 'రెండవ దక్షిణాసియా సమాఖ్య క్రీడ'ల్లో ఒక స్వర్ణపతకం, ఒక రజిత పతకం గెలుచుకొంది.
- 1986లో దక్షిణ కొరియాలో జరిగిన 'ఆసియా క్రీడ'ల్లోను పాల్గొన్నది.

- 1987లో రోమ్‌లో 'వరల్డ్ ఛాంపియన్ షిప్స్'లోను పాల్గొన్నది.
- అట్లాగే 1987లో సింగపూర్‌లో 'ఏషియన్ ట్రాక్ & ఫీల్డ్‌మీట్'లో ఒక స్వర్ణపతకం, ఒక రజిత పతకం సాధించింది.
- 1987 న్యూఢిల్లీలో 'ఇంటర్నేషనల్ పర్మిట్ మీట్'లో ఒక స్వర్ణపతకం, ఒక రజతపతకం సంపాదించింది.
- అట్లాగే 1988 దక్షిణ కొరియా 'ఒలింపిక్ క్రీడ'ల్లోను పాల్గొన్నది.
- 1989 పాకిస్తాన్‌లో 'నాల్గవ దక్షిణ ఆసియా సమాఖ్య క్రీడ'ల్లో 3 స్వర్ణపతకాలు గెల్చుకున్నది.
- 1989 న్యూఢిల్లీ 'ఏషియన్ ట్రాక్ & ఫీల్డ్ మీట్'లో 2 రజిత పతకాలు సాధించింది.
- 1990 బీజింగ్‌లో జరిగిన ఆసియా క్రీడల్లో పాల్గొన్నది.
- 1991 టోక్యోలో 'వరల్డ్ ఛాంపియన్ షిప్స్'లో ఒక స్వర్ణపతకం సాధించింది.
- 1991 మలేషియాలో 'ఏషియన్' ట్రాక్ & ఫీల్డు'లో ఒక స్వర్ణపతకం గెల్చుకుంది.

ఆమె 1988 నుండి 1991 వరకు 200 మీటర్ల పరుగు పందేల్లో జాతీయ స్థాయి ఛాంపియన్. అంతేకాదు 1990లో పి.టి. ఉషను 200 మీటర్ల పరుగు పందెంలో రెండుసార్లు ఓడించింది.

**అశ్విని అందుకొన్న అవార్డుల్లో ఎంతో విశిష్టమైనవి :**

- 1987లో కర్ణాటక ముఖ్యమంత్రి నుండి అందుకొన్న 'దసరా అవార్డు'.
- 1990లో భారతదేశాధ్యక్షుని నుండి అందుకొన్న 'అర్జున అవార్డు'.
- 1990లో కర్ణాటక రాష్ట్రం తరపున, ఇవ్వబడిన 'రాజ్యోత్సవ అవార్డు'.
- 1990లో శ్రీ శంకర్‌దయాళ్ శర్మ నుండి అందుకున్న 'స్పిరిట్' ఆఫ్ ఎక్సలెన్స్' అవార్డు.
- 1993లో కర్ణాటక గవర్నర్ నుండి అందుకొన్న 'శిరోమణి అవార్డు'.

వేగంగా పరుగెత్తే వాళ్ళకు అంటే – స్ప్రింటర్సుకు – ప్రతి క్షణం ప్రధానమైనదే. అందుకే పోటీలో కాళ్ళేకాదు, మెదడు కూడ పరుగు పెట్టాలని అశ్విని అభిప్రాయం. ఆ విధంగా పరుగుకనుగుణంగా మనసును మలచుకొనేందుకు మరో చక్కని హాబీని ఆమె అలవరచుకొన్నది. అదే మానసిక శిక్షణ (మైండ్ ట్రైనింగ్), ఏకాగ్రత, పట్టుదల పెరిగేందుకు 'రిలాక్సేషన్' ఎంతగానో ఉపకరిస్తుంది. శరీరంలోని కండరాల్ని పోటీకి సంసిద్ధంచేసి, టెన్షన్ తొలగించేందుకు ధ్యానం (మెడిటేషన్) చేస్తుంది. ఇందుకు 'రూపేన్‌దాస్' అనే శిక్షకుడు ఆమెకు సహకరిస్తున్నాడు. ధ్యానం వల్ల తన పరుగులో మార్పు వచ్చిందని ఆమె భావన.

**అభిరుచులు :**

ఆమెకు తానొక అంతర్జాతీయ స్థాయి క్రీడాకారిణినన్న గర్వం కించిత్తు కూడ కనిపించదు. ఎక్కడైనా, ఎప్పుడైనా, ఎవరితోనైనా ఎంచక్కా కబుర్లు చెప్తుంది.

'కైనెటిక్ హోండా' ఎక్కి హుషారుగా షికార్లు చేయడం ఆమెకు ఎక్కడలేని సరదా.

పుస్తకాలంటే ఆమెకు ప్రాణం. తీరిక చిక్కినపుడల్లా ఓ మంచి నవలను పఠించడంలో కాలం వెళ్ళబుచ్చుతుంది.

ఇక సంగీత మంటే చెప్పనే అక్కర్లేదు. క్యాసెట్స్, రికార్డ్సు సంపాదించి వాటి మాధుర్యాన్ని ఆస్వాదించడం, వీడియో చిత్రాలు తిలకించడం ఆమె అందమైన అభిరుచులు.

**విమర్శలు :**

క్రీడాకారిణిగా ఆమె ఎందరి అభిమానం చూరగొన్నదో అందరి విమర్శలకు కూడ గురికావలసి వచ్చింది.

ఢిల్లీలో ఉషను ఓడించినప్పుడు 'ఇది కేవలం యాదృచ్ఛికం, ఏదో గాలిపాటు గెలుపు' అంటు పెదవి విరుస్తు భాష్యాలు చెప్పారెందరో.

అంతేకాక ఉషను ఆమెకు ప్రత్యర్థిగా చిత్రించటానికి పూనుకున్నారు కొందరు. వారికి సమాధానంగా' ట్రాక్‌లో మేం తప్పకుండా ప్రత్యర్థులమే. పోటీ అంటేనే అది తప్పదు. అయితే మాది స్నేహపూర్వక శత్రుత్వం. దాన్ని బహిరంగపరచటంలో అర్థం లేదు' అందామె.

అంతేకాక అథ్లెట్లకు అరకొరగా సౌకర్యాలు కల్పించడం పట్ల ఆమె తీవ్రంగా ఆక్షేపణ తెల్పిన సన్నివేశంలో సంజాయిషీ ఇచ్చుకోవలసి వచ్చింది. 'మనవాళ్ళు ఒక క్రీడాకారిణి గెలుపొందినప్పుడు పొగడడం, లేనప్పుడు తెగడడం చేస్తారు. అంతేకాని ఆమెకు కావలసిన వాతావరణం, ప్రోత్సాహం గురించి ఆలోచించ' రంటుంది.

**ఉన్నత విద్య, ఉద్యోగం :**

ఆమె ఎంతగా క్రీడారంగంలో రాణిస్తున్నా విద్యా విషయంలో మాత్రం నిర్లక్ష్యం వహించలేదు. కర్ణాటక విశ్వవిద్యాలయం నుండి బి.ఏ. డిగ్రీని 'కరెస్పాండెన్స్ కోర్సు' ద్వార సాధించింది.

అంతేకాక బెంగుళూరు 'విజయా బ్యాంక్'లో ఆఫీసర్‌గా తన ఉద్యోగ బాధ్యతలకెటువంటి లోపాలు కలుగకుండగానే తన మిగిలిన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. 1993లో 'ఆస్ట్రియా'లో జరిగిన 'వరల్డ్ వింటర్ ఒలింపిక్స్'లో 'ఫ్లోర్ హాకీ'లో భారత్ జట్టు స్వర్ణపతకాన్ని గెలుచుకొన్నది. ఆ జట్టు కోచ్‌లలో అశ్విని కూడ ఒకరు!

'మానవుడు తనకోసం తాను జీవించడంలో గొప్పతనం లేదు. అంతకంటే తనకు చేతనైనంతలో వేరొకరికుపయోగపడడంలోనే జీవిత పరమార్థం ఇమిడి ఉంది. ఆమె ఆ విధమైన దృక్పథంతోనే మానసికంగా వికలాంగులైన పిల్లలకు ఒలింపిక్ క్రీడలకు శిక్షణ నిచ్చే సంస్థలో స్వచ్ఛందంగా పనిచేస్తోంది.